సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 273

మంగళవారం 24-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా అక్కలూ.. చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



హర్మన్‌ప్రీత్‌కు 'ఖేల్‌రత్న'!

భారత హాకీ జట్టు కెప్టెన్‌కు అత్యున్నత క్రీడా పురస్కారం - 14లో



యుగళధారతో మ్యూజిక్ థ'రఫీ'

రఫీతో డ్యూయెట్లు పాడి సరిజోడిగా నిలిచిన గాయనీమణులపై కథనం - 13లో



ఏడాదిన్నరలో రికార్డ్‌స్థాయి నియామకాలు

గడచిన ఏడాదిన్నర స్వల్పకాలంలోనే రికార్డుస్థాయిలో దాదాపు 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని ప్రధాని మోదీ ప్రకటించారు.

- వివరాలు 6లో ▶



హసీనాను అప్పగించండి

భారత్‌లో తలదాచుకుంటున్న తమ దేశ మాజీ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనాను అప్పగించాలని పొరుగుదేశం బంగ్లాదేశ్ మోదీ ప్రభుత్వాన్ని కోరింది.

- వివరాలు 6లో ▶

గ్రామాల్లో జేఆర్వోలు!

గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి అమల్లోకి తెచ్చేందుకు సర్కారు ఏర్పాట్లు

రాష్ట్రంలోని 10,911 రెవెన్యూ గ్రామాల్లో 'జూనియర్ రెవెన్యూ అధికారుల' నియామకానికి రంగం సిద్ధం



- పూర్వపు వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి ఆప్షన్లు కోరిన రెవెన్యూ శాఖ
- గ్రామ రెవెన్యూ అధికారి లేదా సర్వేయర్‌గా పనిచేయడంపై సుముఖత వ్యక్తం చేయాలని విజ్ఞప్తి... 15 అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ నింపాలని ఆదేశం
- దీనిపై కలెక్టర్లకు సర్క్యులర్ పంపిన సీసీఎల్ఏ..
- ఈ నెల 28 నాటికి అన్ని వివరాలు పంపాలని సూచన
- విద్యార్హతల ఆధారంగా తిరిగి రెవెన్యూలోకి తీసుకునే ప్రతిపాదన
- డిగ్రీ చదివిన 5,600 మందిని నేరుగా తీసుకునే అవకాశం
- మిగతావారి విషయంలో ఏం చేయాలన్న దానిపై సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తిరిగి గ్రామ రెవెన్యూ అధికారుల నియామకానికి రంగం సిద్ధమైంది. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తామన్న రాష్ట్ర సర్కారు... ఆ దిశగా చర్యలకు ఉపక్రమించింది. ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండేలా... 'జూనియర్ రెవెన్యూ అధికారి (జేఆర్ఓ)' పేరుతో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. రాష్ట్రంలో మొత్తం 10,911 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించనుంది. దీనిపై విధాన నిర్ణయం తీసుకునేందుకు వీలుగా.. గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి, ఇతర శాఖల్లోకి మార్చి న వారి నుంచి ఆప్షన్లు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్ సోమవారం జిల్లాల కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు.

కొత్త చట్టం మేరకు నియామకాలు: ఇటీవల అసెంబ్లీ ఆమోదం పొందిన భూభారతి చట్టం–2024 ద్వారా సంక్రమించే అధికారాల మేరకు గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. గతంలో మిగతా 3వ పేజీలో ▶

వీఆర్వోలు, వీఆర్ఏలను గూగుల్ ఫామ్‌లో ఏమడిగారంటే..

గ్రామ రెవెన్యూ అధికారి లేదా సర్వేయర్ పోస్టులలో పనిచేసేందుకు సుముఖంగా ఉన్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి వివరాలు తీసుకోవాలంటూ సీసీఎల్ఏ కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకోసం గూగుల్ ఫామ్ ద్వారా ప్రత్యేక ఫార్మాట్‌ను పంపారు. ఈ నెల 28లోగా జిల్లాల వారీగా వివరాలన్నీ సేకరించి, ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. అయితే ఈ ఫార్మాట్‌లో... వీఆర్వో/వీఆర్ఏ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగం, ప్రస్తుతం పనిచేస్తున్న శాఖ, ఎంప్లాయి ఐడీ, ఆ శాఖలో చేరిన తేదీ, రెవెన్యూ శాఖలో నియమితులైన తేదీ, విద్యార్హతలు, ఫోన్ నంబర్, సర్వేయర్‌గా పనిచేసేందుకు అంగీకారమా లేదా?, వారి సొంత జిల్లా, ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా, ప్రస్తుత చిరునామా వంటివి అడుగుతూ గూగుల్ ఫామ్‌ను రూపొందించారు. ఇందులో విద్యార్హతలపై ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ముఖ్యంగా మేథమేటిక్స్ సబ్జెక్టుకు ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తోంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారా? అనే అంశంలో మేథమేటిక్స్ సబ్జెక్టుతో గ్రాడ్యుయేటా? అని.. ఇంటర్ పూర్తి చేశారా అనే అంశంలో మేథమేటిక్స్ సబ్జెక్టు ఉందా? అని అదనపు ప్రశ్నలు అడిగారు. ఇక సర్వేయర్ పోస్టుకు సుముఖత వ్యక్తం చేసేవారిని కూడా గ్రాడ్యుయేషన్/ఇంటర్మీడియట్‌లో మేథమేటిక్స్ సబ్జెక్టు ఉందా? అని అడగటం గమనార్హం.



శ్యామ్ బెనగళ్ ఇక లేరు

అనారోగ్యంతో బాధపడుతూ ముంబైలో తుదిశ్వాస

- తెలంగాణలోనే పుట్టి పెరిగిన బెనగళ్
- 8 జాతీయ చలన చిత్ర అవార్డులు అందుకున్న లెజెండరీ దర్శకుడు
- 1976లో వరించిన పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్...
- ఆయన దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'ముజీబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్'
- శ్యామ్ మృతిపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం

స్త్రీ పాత్రల రూపశిల్పి

ఓల్డ్ అల్వాల్ పోరడు

శారదకు మిస్సయిన 'అంకుర్'

- వివరాలు 13లో

రూ.1,866.9 కోట్లు



ఒక్క ఏడాదిలో కొట్టేశారు

- రాష్ట్రంలో 18 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- గత ఏడాది కాలంలో 24,643 కేసులు నమోదు..
- సైబర్ నేరాల కేసుల్లో టాప్–5 రాష్ట్రాల్లో తెలంగాణ
- టీజీసీఎస్‌బీ 2024 నివేదికలో వెల్లడి

2లో

ఆర్ఆర్ఆర్‌కు త్వరలో టెండర్లు



- అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకం
- వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకర్లు వేగం పెంచాలి
- రైతులకు సకాలంలో రుణాలు అందకపోతే వృథా
- బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

2లో

అసలు రాదు.. వడ్డీకీ దిక్కులేదు!



- ఆర్టీసీలో దాదాపు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి
- డిపాజిట్లపై 9 నెలలుగా వడ్డీ చెల్లించని సీసీఎస్
- బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ దుస్థితి

2లో



రైతు ఖాతాల్లోకి సన్నాల బోనస్

- రూ. 530 కోట్లు జమ
- కొద్ది రోజుల్లో మరో రూ. 370 కోట్లు

- వివరాలు 5లో

క్లుప్తంగా...

రాజకీయాలు జోడించవద్దు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



శ్రీతేజ్ తండ్రికి రూ. 50 లక్షల చెక్కు ఇస్తున్న నిర్మాత నవీన్, మంత్రి కోమటిరెడ్డి

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట అంశానికి రాజకీయాలు జోడించవద్దని రాజకీయ పార్టీల నాయకులను సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి కోరారు. సోమవారం మైత్రీ మూవీ మేకర్స్ సినీ నిర్మాత నవీన్‌తో కలిసి సికింద్రాబాద్ కిమ్స్‌లో శ్రీతేజను పరామర్శించారు. నవీన్ అందించిన రూ.50 లక్షల చెక్కును శ్రీతేజ తండ్రికి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి పోలీసులు చెప్పిన సమాచారాన్ని చెప్పారని తెలిపారు. ఈ అంశంపై రాజకీయాలు జోడించి పార్టీలకు అంటగట్టి గోరంతను కొండంతలు చేసి చూపించడం తగదని అన్నారు. ఒక మనిషి ప్రాణం పోయి, మరో బాలుడు చికిత్స పొందుతున్న తరుణంలో దీనికి ప్రతిపక్షాల నాయకులు రాజకీయాలు జోడించడం బాలేదని చెప్పారు. జేఏసీల పేరుతో ప్రముఖుల ఇళ్లపై దాడులు చేయడం మానుకోవాలని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోవద్దని కోరారు. శ్రీతేజ త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన నిందితులకు బెయిల్

బంజారాహిల్స్ (హైదరాబాద్): జూబ్లీహిల్స్‌లోని సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసి పూలకుండీలు పగులగొట్టి బీభత్సం సృష్టించిన ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల నేతలను జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం ఉదయం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వీరందరికీ బెయిల్ మంజూరైంది. అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన నిందితులు సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతురాలు రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ రాళ్లు రువ్వి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. అల్లు అరవింద్ మేనేజర్ కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఓయూ జేఏసీ చైర్మన్ రెడ్డి శ్రీను, బి.నగేశ్, సి.మోహన్, బి.నాగరాజు, బి.ప్రేమ్‌కుమార్‌గౌడ్, పి.ప్రకాశ్‌గౌడ్‌లను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా వీరందరికీ బెయిల్ మంజూరైంది. ఇదిలాఉండగా అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసిన నిందితుల్లో ఒకడైన రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడని పోలీసులు గుర్తించారు.

అర్జున్ ఇంటిపై దాడి.. సీఎం అనుచరుల పనే..

ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ వీరబాబు



ఉస్మానియా యూనివర్సిటీ: హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసింది ఓయూ విద్యార్థులు కారని.. సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని ఓయూ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ బండారు వీరబాబు స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఓయూలో మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు కనుసన్నల్లో తెలంగాణ రాష్ట్ర పాలన కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. ఏపీలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి వ్యతిరేకంగా ప్రచారం చేసిన హీరోలు, నటులను లక్ష్యంగా చేసుకుని.. వారిపై సీఎం చంద్రబాబు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వీరబాబు ఆరోపించారు. తన శిష్యుడైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున ప్రచారం చేసిన నటులు అలీ, పోసాని కృష్ణ మురళిని గతంలో బెదిరించారని.. ప్రస్తుతం అల్లు అర్జున్‌ను అక్రమంగా అరెస్ట్ చేయించారన్నారు. హైడ్రా పేరుతో హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్‌ను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారని ఆరోపించారు.





ఒక్క ఏడాదిలో రూ. 1,866.9 కోట్లు కొట్టేశారు

రాష్ట్ర ప్రజలను టార్గెట్‌గా చేసుకుని సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. భారీ స్థాయిలో సొమ్ము దండుకుంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే 2024లో తెలంగాణలో సైబర్ నేరాల ఫిర్యాదులు 18 శాతం పెరిగాయి. నేరస్తులు ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా రూ.1,866.9 కోట్లు కొల్లగొట్టడం గమనార్హం. 2024 ఏడాదిలో రాష్ట్రంలో నమోదైన సైబర్ నేరాలు, బాధితులు పోగొట్టుకున్న డబ్బు, కేసుల దర్యాప్తు, నేరస్తుల అరెస్టు, నేరాల కట్టడి కోసం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో'2024 నివేదికను టీజీసీఎస్‌బీ ఎస్పీ దేవేందర్‌సింగ్, ఇతర అధికారులతో కలిసి శిఖాగోయల్ విడుదల చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి 2023లో 91,652 ఫిర్యాదులు రాగా.. 2024లో 1,14,174 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది మొత్తం 519 సైబర్ నేరాలకు సంబంధించి 186 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి కేసుల నమోదులో దేశంలోని టాప్–5 రాష్ట్రాల్లో రాజస్థాన్, ఢిల్లీ, తమిళనాడు, గుజరాత్‌లతోపాటు తెలంగాణ కూడా ఉన్నట్టు వెల్లడించారు.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో 18 శాతం పెరిగిన సైబర్ నేరాలు



- గత ఏడాది కాలంలో 24,643 కేసులు నమోదు..
- 519 తీవ్ర నేరాలకు సంబంధించి 186 మంది అరెస్టు
- సైబర్ నేరాల కేసుల్లో టాప్–5 రాష్ట్రాల్లో తెలంగాణ
- టీజీసీఎస్‌బీ 2024 నివేదికలో వెల్లడించిన డైరెక్టర్ శిఖాగోయల్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో 2024 నివేదికలోని ప్రధాన అంశాలివే..

2023లో సైబర్ నేరాలకు సంబంధించి 16,339 ఎఫ్‌ఐఆర్‌లు నమోదవగా.. 2024లో 24,643 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు.

2023లో 1,830 మంది బాధితులకు రూ.8.36 కోట్లు రీఫండ్ చేయగా.. 2024లో 17,411 మంది బాధితులకు రూ.176.71 కోట్లు రీఫండ్ చేయడంలో టీజీసీఎస్‌బీ అధికారులు సఫలీకృతమయ్యారు.


టీజీసీఎస్‌బీ 186 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. ఈ నిందితులకు టీజీసీఎస్‌బీ పరిధిలోని 94 కేసులతో, రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలో 823 కేసులతో, దేశవ్యాప్తంగా 3,637 కేసులతో సంబంధాలు ఉన్నాయి.

గత ఏడాది కాలంలో టీజీసీఎస్‌బీ 262 పీటీ వారెంట్లు అమలు చేసింది.

టీజీసీఎస్‌బీకి చెందిన సైకాప్స్ టూల్ ద్వారా గుర్తించిన క్రైం లింకులతో దేశవ్యాప్తంగా 1,057 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. పట్టుబడిన నేరస్తులకు దేశవ్యాప్తంగా 1,16,421 కేసులతో సబంధం ఉన్నట్టుగా గుర్తించారు.

కొత్తగా సైబర్ క్రైం పీఎస్‌లు..

రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడిలో భాగంగా ఈ ఏడాది వరంగల్, ఖమ్మం, కరీంనగర్, సిద్దిపేట, రామగుండం, నిజామాబాద్ కమిషనరేట్లలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరాల కట్టడితోపాటు ప్రజలు సైబర్ నేరాల బారినపడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌కు సైబర్ వారియర్‌గా శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం 850 మంది సైబర్ వారియర్స్ సైబర్ నేరాల దర్యాప్తు, నియంత్రణలో పనిచేస్తున్నట్టు వెల్లడించారు.



సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయిన వారు వృత్తుల వారీగా..			
ప్రైవేటు ఉద్యోగులు 56%	వ్యాపారస్తులు 9%	విద్యార్థులు 9%	స్వయం ఉపాధివారు 10%
ప్రభుత్వ ఉద్యోగులు 5%	గృహిణులు 5%		ఇతరులు 6%

సైబర్ నేరస్తులు వాడిన సిమ్‌లు, ఫోన్లు, వెబ్‌సైట్ల బ్లాకింగ్ ఇలా..



అంశం	2024	2023
సిమ్‌కార్డులు	14,984	24,227
ఐఎంఈఐలు	9,811	181
అనుమానాస్పద యూఆర్ఎల్‌లు, వెబ్‌సైట్లు	1,825	2,202

5 ప్రధాన సైబర్ నేరాలు: బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్-స్టాక్స్ | పార్ట్‌టైం జాబ్స్ | డిజిటల్ అరెస్టు | నకిలీ కస్టమర్ కేర్ | డెబిట్, క్రెడిట్ కార్డు మోసాలు

ఆర్ఆర్ఆర్‌కు త్వరలో టెండర్లు

- రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకం
- వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకర్లు వేగం పెంచాలి
- రైతులకు సకాలంలో రుణాలు అందకపోతే వృథా
- దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కార్యక్రమాలు
- బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అదే తరహాలో బ్యాంకర్లు సైతం తమ ప్రాధాన్యతా రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని, అప్పుడే రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనులకు అనుమతులు వచ్చాయని, త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు ప్రకటించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాబోయే రోజుల్లో వైబ్రెంట్ తెలంగాణను చూస్తారని, అప్పుడు దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలతో పాటు, పెద్దఎత్తున ఫార్మా కంపెనీల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఉజ్వల తెలంగాణ భవిష్యత్తు కోణంలో బ్యాంకర్లు దీర్ఘదృష్టితో రుణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. భట్టి సోమవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడారు.

వ్యవసాయ రుణాల వేగం పెంచండి

వ్యవసాయ రుణాల పంపిణీలో వేగం పెంచాలని, రైతులకు రుణాలు సకాలంలో ఇవ్వకపోతే ప్రయోజనం ఉండదని భట్టి పేర్కొన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌లో రూ.54,480 కోట్ల రుణాలు లక్ష్యం కాగా.. రూ.44,438 కోట్లు (81.57 శాతం) విడుదల చేశారని గుర్తు చేశారు. రబీ రుణాల పంపిణీకి నెల రోజుల సమయం ఉన్నందున వేగం పెంచాలని కోరారు. రాష్ట్రాభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకమని వ్యాఖ్యానించారు. జీడీపీ పెరుగుదలకు కీలక భూమిక పోషిస్తున్న బ్యాంకర్లను ఈ సందర్భంగా భట్టి అభినందించారు. రుణగ్రహీతల రుణాల చెల్లింపులు బాగా పెరిగినా... బ్యాంకులు ఇచ్చే అప్పులు తగ్గడం సహజత్వానికి భిన్నంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కింద రెండు నెలల వ్యవధిలోనే రూ. 21 వేల కోట్లు బ్యాంకులకు జమ చేసిందని.. బ్యాంకర్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణ ఎగ్జిబిషన్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని, యాంత్రీకరణ రుణాల విషయంలో బ్యాంకర్లు మరింత సరళంగా వ్యవహరించాలని కోరారు. ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెరగడానికి బ్యాంకర్లు సహకరించాలన్నారు.

ఉపాధిలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలే కీలకం

ఉపాధి కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలది కీలకపాత్ర అని, వాటికి రుణాలు ఇవ్వడంలో చొరవ చూపాలని భట్టి కోరారు. ఈ పరిశ్రమలు ఎక్కువ మందికి ఉపాధినివ్వడంతోపాటు, వస్తువుల ఉత్పత్తి.. జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలకు రుణాలివ్వడంతో కొద్దిమంది చేతిలో ఆర్థిక వ్యవస్థ కేంద్రీకృతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కింద రూ. 20 వేల కోట్లు ఇప్పించేందుకు కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాలతో 4000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం నిధులు ఇస్తున్నందున, అందుకు తగ్గట్టుగా బ్యాంకులు మ్యాచింగ్ గ్రాంట్‌గా రుణాలు ఇవ్వాలని కోరారు.

కొల్లగొట్టిన సొమ్మంతా 'క్రిప్టో' రూట్లో విదేశాలకు!

- సైబర్ నేర ముఠా కొత్త మార్గం గుట్టు తేల్చిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- దీనిలో భాగస్వాములైన 21 మందిని అరెస్టు చేసినట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సైబర్ కేటుగాళ్లు సొమ్మును తరలించుకుపోవడానికి కొత్త రూట్ పట్టారు. బాధితుల నుంచి కొల్లగొట్టిన డబ్బును గతంలో మ్యూల్ ఖాతాల (వేరొకరి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలు)ల్లోకి మళ్లించి, అక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ చేసుకునేవారు. కానీ పోలీసుల నిఘా, కఠిన చర్యలతో దొరికిపోతున్నారు. దీనితో 'క్రిప్టో' రూట్ పట్టారు. తమ ఖాతాల్లోకి వచ్చిన డబ్బును చెక్కులు ఉపయోగించి డ్రా చేసి, వాటిని సైబర్ ఏజెంట్లకు చేరవేస్తున్నారు. వారు ఈ సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌లోని కింగ్‌పిన్ ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) పోలీసులు ఈ వ్యవహారం గుట్టు రట్టు చేశారు.

అన్ని వృత్తుల వారూ మోసంలో..: క్రిప్టో రూట్లో సొమ్మును మళ్లిస్తున్న సైబర్ ముఠాలోని ఎనిమిది ఏజెంట్లు సహా 21 మందిని అరెస్టు చేసినట్టు బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. పట్టుబడిన నిందితులకు తెలంగాణలో 25 సైబర్ నేరాల్లో, దేశవ్యాప్తంగా 73 కేసులతో సంబంధం ఉందని తెలిపారు. నిందితులంతా సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లను వినియోగిస్తున్నారని గుర్తించామని చెప్పారు. ఇప్పటివరకు 13 మంది మొత్తం రూ.8.2 కోట్ల సొమ్మును చెక్కుల ద్వారా విత్‌డ్రా చేసి, వారిపైన ఉండే ఎనిమిది మంది ఏజెంట్లకు ఇచ్చినట్టు తేలిందని... ఆ ఏజెంట్లు ఈ నగదును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌కు తరలించారని గుర్తించామని వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ, కరీంనగర్, జగిత్యాలలోని వివిధ ప్రాంతాల్లో కలిపి మొత్తం 21 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. పట్టుబడిన వారిలో ప్రైవేటు ఉద్యోగులు, సివిల్ కాంట్రాక్టర్, బ్యాంకు ఉద్యోగి, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, జిమ్ ట్రైనర్, టైలర్ తదితర వృత్తుల వారు ఉన్నట్టు వివరించారు.

సినిమా స్పెషల్ షోల రద్దు హర్షణీయం

- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- సినిమా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్



సమావేశంలో ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్రంలో ఇక సినిమా స్పెషల్ షోలకు అనుమతి ఇవ్వరాదని, టిక్కెట్ రేట్లు కూడా పెంచకూడదన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సినిమా ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన ప్రకటనలపై హర్షం వ్యక్తంచేసింది. సోమవారం తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, సెక్రటరీ బాలగోవింద్ రాజ్, ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ టి.ఎస్.రామ్‌ప్రసాద్, ఒంగోలు ఎగ్జిబిటర్ గోరంట్ల వీరినాయుడు మాట్లాడారు. కొన్ని సినిమా టిక్కెట్ల ధర పెంచడంవల్ల సాధారణ సినిమాలకు కూడా పెంచిన ధరలే తీసుకుంటున్నారని ప్రేక్షకుల్లో సందేహాలు వస్తున్నాయని తెలిపారు. తొలి ముడునాలుగు రోజుల్లో మధ్యతరగతి వారు, విద్యార్థులు, చిన్నచిన్న పనులు చేసుకునే అభిమానులు ఎక్కువగా సినిమా చూస్తుంటారని, అలాంటివారి నుంచి అధిక ధరలు వసూలు చెయ్యడం బాధాకరమని అన్నారు. కొందరు నిర్మాతలు ఎక్కువ ఖర్చుపెట్టి సినిమా తీస్తున్నామని చెప్పి రేట్లు పెంచుతున్నారని.. దీనివల్ల థియేటర్లకు వచ్చే జనాలు తగ్గుతున్నారని, కలెక్షన్లపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. టిక్కెట్ రేట్లు ఏదైనా ఒక్కటే ఫిక్స్ చెయ్యాలని ఇటీవల దిల్ రాజును కూడా కలిసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ప్రకటన సినిమా థియేటర్లకు ప్రాణంపోసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోనూ ఇలాంటి నిర్ణయం తీసుకోవాలని అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని టి.ఎస్.రామ్‌ప్రసాద్ తెలిపారు.

అల్లు అర్జున్‌కు మళ్లీ నోటీసులు

నేటి ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హీరో అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్‌లో డిసెంబర్ 4న 'పుష్ప–2'బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు సంబంధించి ప్రశ్నించేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటికే 18 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు అల్లు అర్జున్‌ను ఏ–11 నిందితుడిగా చేర్చడంతోపాటు ఈ నెల 13న ఆయన్ను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించగా హైకోర్టు రూ. 50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో అల్లు అర్జున్‌కు మరోసారి నోటీసులు జారీ చేసినట్లు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపారు.

అమిత్‌షాను తప్పించాల్సిందే!

- అంబేడ్కర్‌పై షా వ్యాఖ్యలకు నిరసనగా పోరాటం: దీపాదాస్
- నేడు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు.. కలెక్టర్లకు వినతిపత్రాలు



సాక్షి, హైదరాబాద్: దేశంలోని అన్ని వర్గాల ప్రజలు దేవుడిలా భావించే బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో ప్రజల గుండెలకు గాయమైందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ విమర్శించారు. అమిత్‌షా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌తో వారంపాటు 'అంబేడ్కర్ సమ్మాన్ సప్తాహ్' పేరుతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మున్షీ మాట్లాడారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి.. కలెక్టరేట్లకు ప్రదర్శనగా వెళ్లి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ప్రధాని మోదీ అవినీతి గురించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యసభలో అంబేడ్కర్‌ను కించపరిచి అమిత్‌షా అసలు విషయాన్ని పక్కదారి పట్టించారని విమర్శించారు.

మోదీది మనుస్మృతి ఆలోచన

అమిత్‌షా వ్యాఖ్యలతో రాజ్యాంగాన్ని రద్దుచేయాలనే బీజేపీ కుట్ర బయటపడిందని దీపాదాస్ మున్షీ ఆరోపించారు. 'గతంలోనూ ప్రధాని మోదీ సామాజికవర్గాలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దేవుడి సేవలో భాగంగా మానవ వ్యర్థాలు శుభ్రపరిచే విధానం కొనసాగాలని చెప్పారు. సామాజిక్ సంరస్తా అనే పుస్తకంలో ఎస్సీలను మానసిక వికలాంగులుగా అభివర్ణించారు. రోహిత్ వేముల ఆత్మహత్య సమయంలోనూ అవమానకరంగా మాట్లాడారు. అంబేడ్కర్ విప్లవకారుడు కాదని వ్యాఖ్యానించారు. మోదీ ఆలోచన మనుస్మృతిని అమలు చేయాలన్న ఆర్ఎస్ఎస్ ఆలోచన ఒక్కటే. అమిత్‌షాను పదవి నుంచి తొలగించే వరకు కాంగ్రెస్ పార్టీ ఆందోళన కొనసాగుతుంది.'అని తెలిపారు. సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు మాట్లాడుతూ.. అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేదంటే కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. మీడియా సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

సీఎస్ శాంతికుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల మహిళల ఆధ్వర్యంలో తొలి విడతగా 231 ఎకరాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను 6 నెలల్లోగా ఏర్పాటు చేసేందుకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. మహిళా శక్తి కార్యక్రమంపై సోమవారం సచివాలయంలో ఆమె సమీక్షించారు. ఎస్‌హెచ్‌జీల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఖాళీగా ఉన్న దేవాదాయ భూములను లీజుకు తీసుకోవాలన్నారు. ఈ సంఘాల ద్వారా 150 ఎలక్ట్రిక్ బస్సులను సేకరించి వాటి నిర్వహణను ఆర్టీసీకి అప్పగించాలన్నారు.

క్రిస్మస్ రోజూ గురుకులాల్లోనే..!

క్రైస్తవ విద్యార్థులకు సెలవులివ్వని వైనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని క్రైస్తవ విద్యార్థులు క్రిస్మస్ పండుగ రోజు కూడా గురుకులాల్లోనే గడపనున్నారు. క్రైస్తవ విద్యార్థుల కోసం గతంలో క్రిస్మస్ పండుగ సెలవులకు సొసైటీ అనుమతించేది. దాదాపు వారం ముందే ఉత్తర్వులు జారీచేసి విద్యార్థుల వివరాలను సేకరించి, వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చేది. ఈసారి సొసైటీ పరిధిలో క్రిస్మస్‌కు సంబంధించి సెలవుల సమాచారం లేదు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు క్రిస్మస్ సెలవులు అడుగుతున్నప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదు.

అసలు రాదు.. వడ్డీకీ దిక్కులేదు!

- ఆర్టీసీలో అగమ్యగోచరంగా దాదాపు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి
- నిధుల్లేక డిపాజిట్లపై 9 నెలలుగా వడ్డీ చెల్లించని సీసీఎస్
- ఆర్టీసీ బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఈ దుస్థితి



సాక్షి, హైదరాబాద్: వారంతా ఆర్టీసీలో శ్రామిక్, డ్రైవర్, కండక్టర్ మొదలు అధికారి స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేసి రిటైరైనవారు. ఆర్టీసీలో పింఛన్ సదుపాయం లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం రిటైర్మెంట్ బెనిఫిట్ కింద వచ్చిన నగదును బ్యాంకులకన్నా ఎక్కువ వడ్డీ అందించే ఆర్టీసీలోని సహకార పరపతి సంఘం (సీసీఎస్)లో డిపాజిట్ చేసి తద్వారా ప్రతి నెలా వచ్చే వడ్డీతో కాలం గడుపుతున్నారు. కానీ ఇప్పుడు వారికి 9 నెలలుగా ఆ వడ్డీ అందట్లేదు. సీసీఎస్‌లో సరిపడా నిధులు లేకపోవడమే అందుకు కారణం. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చిరుద్యోగులు ఇప్పటివరకు సీసీఎస్‌లో రూ. 100 కోట్ల వరకు డిపాజిట్ చేశారు. ఇది దాదాపు 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన మొత్తం. వారికి ప్రతినెలా రూ. కోటిన్నరకుపైగా మొత్తాన్ని వడ్డీ రూపంలో సీసీఎస్ చెల్లించాల్సి ఉండగా ఇప్పుడు నిధుల్లేక ఆ మొత్తాన్ని సీసీఎస్ చెల్లించట్లేదు.

ఎందుకీ దుస్థితి?

ఆర్టీసీ ఉద్యోగులంతా సీసీఎస్‌లో సభ్యులుగా ఉంటారు. వారి జీతంలోంచి 7 శాతాన్ని కోతపెట్టి దాన్ని ఆర్టీసీ సీసీఎస్‌కు జమ కడుతుంది. అలా పోగైన మొత్తాన్ని ఉద్యోగులకు రుణాలిచ్చేందుకు వాడుతుంది. అలా సీసీఎస్‌కు ప్రస్తుతం ఆర్టీసీ ప్రతి నెలా రూ. 16 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. కానీ రోజువారీ నిర్వహణకు ఆర్థిక కష్టాలు ఎదురవడంతో సీసీఎస్‌కు ఆ నిధులను జమ చేయకుండా ఆర్టీసీ సొంతానికి వాడేసుకుంటోంది. ఇలా ఆర్టీసీ ఇప్పటి వరకు సీసీఎస్‌కు వడ్డీతో కలిపి దాదాపు రూ. 900 కోట్ల వరకు బకాయి పడింది. దీంతో సిబ్బంది రుణాలకు సంబంధించిన దరఖాస్తులు పేరుకుపోయాయి. ఇదే తరుణంలో రిటైర్డ్ ఉద్యోగులకు వడ్డీ చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయింది.

రూ. వందల కోట్ల నుంచి..

రాష్ట్రం విడిపోయాక తెలంగాణ ఆర్టీసీకి రిటైర్డ్ ఉద్యోగులు సీసీఎస్‌లో దాచుకున్న మొత్తం రూ. 400 కోట్లుగా లెక్కతేలింది. కానీ ప్రస్తుతం ఆ మొత్తం రూ. 100 కోట్ల లోపే ఉంది. సీసీఎస్ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో దాచుకున్న సొమ్ము భద్రతపై అనుమానాలు కలిగి చాలా మంది విత్‌డ్రా చేసుకున్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేకుండా పోయింది. అలాగే అసలు చెల్లింపు సీసీఎస్‌కు దాదాపు అసాధ్యంగా మారింది.

రూ. 300 కోట్లతో చెల్లింపులు..

ఆర్టీసీ బకాయిలు చెల్లించట్లేదంటూ సీసీఎస్ పాలకవర్గం గతంలో హైకోర్టును ఆశ్రయించింది. బకాయిల్లో కనీసం 10 శాతాన్ని వెంటనే చెల్లిస్తే ఉద్యోగులకు రుణాలు సహా ఇతర సెటిల్‌మెంట్లు చేసుకొనే వీలుంటుందని కోర్టును కోరింది. అప్పటి బకాయిల ఆధారంగా ఆ 10 శాతం రూ. 200 కోట్లుగా లెక్కతేలింది. దాన్ని చెల్లించాల్సిందిగా హైకోర్టు ఆదేశించి మిగతా బకాయిల చెల్లింపునకు ఆర్టీసీకి గడువు ఇచ్చింది. కానీ రూ. 200 కోట్లలో ఆర్టీసీ కేవలం రూ. 50 కోట్లనే చెల్లించడంతో సీసీఎస్ మళ్లీ హైకోర్టుకెక్కింది. ఆర్టీసీపై హైకోర్టు మండిపడటంతో ఈ ఏడాది ప్రారంభంలో మిగతా రూ. 150 కోట్లను చెల్లించింది. అదే సమయంలో సీసీఎస్ రూ. 150 కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని మొత్తం రూ. 300 కోట్ల నుంచి సభ్యులకు లోన్లు ఇవ్వడంతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల విత్‌డ్రాయల్ దరఖాస్తుల్లో కొన్నింటిని క్లియర్ చేసింది. ఆ నిధులన్నీ ఖర్చు కావడంతో మిగతావారికి చెల్లింపు సాధ్యం కాలేదు. హైకోర్టు ఆదేశంతో.. ఆర్టీసీ ప్రస్తుతం ప్రతినెలా సీసీఎస్‌కు జమ కట్టే (ఉద్యోగుల జీతాల నుంచి కట్ చేసిన మొత్తం) మొత్తాన్ని చెల్లిస్తోంది. వాటితో సీసీఎస్ బ్యాంకు అప్పుపై వడ్డీని, ఇతర సెటిల్‌మెంట్లను చేస్తూ వస్తోంది. కానీ చెల్లించాల్సిన మొత్తం అంతకంటే ఎక్కువగా ఉండటంతో గత 9 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగులకు వడ్డీ చెల్లింపును నిలిపేసింది.



పీవీకి సీఎం నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయనకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్‌బీ ప్రాయోజిత సంస్థగా పతంజలి యోగపీఠ్

హరిద్వార్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన భారతీయ శిక్షా బోర్డు (బీఎస్‌బీ) పతంజలి యోగపీఠ్‌ను దాని ప్రాయోజిత సంస్థగా గుర్తించింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యను ఆధునీకరించడం, అభివృద్ధి భారత్ కోసం భారతీయ తత్వాన్ని సమగ్రపరచడం అనే పునాదిపై రెండు రోజుల విద్యా సదస్సు నిర్వహించారు. హరిద్వార్‌లోని పతంజలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో డిసెంబర్ 14, 15 తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమంలో బీఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎన్పీ సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మిషన్ భగీరథ టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ ప్రారంభం

• పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: మిషన్ భగీరథ సమస్యలను ఆలకించి.. వాటిని పరిష్కరించేందుకు వీలుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ కాల్ సెంటర్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం ప్రారంభించారు. మిషన్ భగీరథ సమస్యలపై ఫిర్యాదులపై.. నేరుగా 1800-599-4007 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని మంత్రి సూచించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్ నేతృత్వంలోని ఐదుగురు సిబ్బందితో ఈ కాల్‌సెంటర్ 24 గంటలు పని చేస్తుందని ఆమె వెల్లడించారు. పగటిపూట వచ్చే కాల్స్‌ను నేరుగా సిబ్బంది అందుకుంటారని, రాత్రిపూట వచ్చే కాల్స్ రికార్డవుతాయని వివరించారు. ఫిర్యాదులను మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి సమీక్షిస్తారని చెప్పారు. వీటిని 24 గంటల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కల్లు దుకాణాలపై దాడులు వెంటనే ఆపాలి: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గౌడ కులస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తోందని, దాడులు ఆపకపోతే త్వరలోనే లక్ష మందితో హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు పల్లె రవికుమార్, రాంచంద్ర నాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చిన్నచిన్న కారణాలతో గీత కార్మికులపై ఎక్సైజ్ అధికారులు కఠినమైన సెక్షన్ల కింద కేసులు పెట్టడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా.. కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నారని, కల్తీ పేరిట అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తూ మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడంలేదని, ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ప్రతిష్ఠిస్తామని ఇచ్చిన హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు.

25 నుంచి వాజపేయి శతజయంతి వేడుకలు

కాసం వెంకటేశ్వర్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి శత జయంతి వేడుకలు ఈనెల 25నుంచి ఏడాదిపాటు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు వెల్లడించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని సమాజసేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 25న బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వాజపేయి జీవిత చరిత్రతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు సుధాన్షు త్రివేది ప్రారంభిస్తారన్నారు. అదేరోజున రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో శోభాయాత్ర నిర్వహించిన తర్వాత కూడళ్లలో స్మారక సభలు ఏర్పాటు చేస్తామన్నారు. స్వచ్ఛభారత్, దవాఖానాల్లో రోగులకు పండ్ల పంపిణీ, పేదలకు దుప్పట్ల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పట్నంకు ముందస్తు బెయిల్

విచారణకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ భూసేకరణ అంశంపై వికారాబాద్ జిల్లా బొమ్రాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో బీఆర్‌ఎస్ నేత పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల పూచీకత్తుతో పాటు ఇదే మొత్తానికి రెండు షూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. విచారణకు సహకరించాలని, సాక్ష్యులను ప్రభావితం చేయవద్దని స్పష్టం చేసింది. ప్రతీ సోమవారం పీఎస్‌కు వెళ్లి సంతకం పెట్టాలని చెబుతూ, పిటిషన్‌పై విచారణ ముగించింది. ఫార్మాసిటీ భూసేకరణ కోసం అక్టోబర్ 25న నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా భూ సేకరణకు తాను కూడా కారణమని భావించిన రైతులు, భూ యజమానులు తన కారును ధ్వంసం చేశారంటూ కాంగ్రెస్ పార్టీ దుద్యాల్ మండల అధ్యక్షుడు శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొమ్రాస్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. ప్రస్తుతానికి ఈ కేసులో తన పేరు లేదని, అయితే భవిష్యత్‌లో చేర్చి అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నందున.. తనను అరెస్టు చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో నరేందర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు చేస్తే వెంటనే బెయిల్ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం తీర్పు వెలువరించారు. ఇప్పటికే పలు కేసుల్లో నవంబర్ 13న అరెస్టయిన నరేందర్‌రెడ్డికి ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.



హైదరాబాద్‌లో ఆదివారం ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి, హేమలతల కుమారుడు కార్తీక్, అర్శిల వివాహం సందర్భంగా అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రి కోమటిరెడ్డి

30న కేబినెట్ సమావేశం

కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసాపై నిర్ణయాలు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం ఈ నెల 30న సచివాలయంలో సమావేశం కానుంది. కొత్త సంవత్సరం 2025 ప్రారంభం కావడానికి ఒక రోజు ముందు ప్రభుత్వం మంత్రివర్గ సమావేశానికి పూనుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన సంవత్సరం సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించి మంత్రివర్గం నిర్ణయాలు తీసుకోనుంది. ప్రధానంగా కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించనున్న విధివిధానాలపై చర్చించి ఆమోదించడంతోపాటు లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతి తర్వాత రైతు భరోసా పంపిణీని ప్రారంభిస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ ప్రకటించారు. రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన విధివిధానాలపై సైతం మంత్రివర్గం చర్చించనుంది. అనంతరం రైతు భరోసా పంపిణీపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. వీటితోపాటు రేషన్ షాపుల్లో సన్నబియ్యం, ఉద్యోగుల సమస్యలు, నియామకాలు, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముంది.

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డితో సాక్షి ఎడ్యుకేషన్ ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా పలు చట్టాల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన.. ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఇటీవలే తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో బాలకిష్టారెడ్డి కుటుంబ నేపథ్యం, ఎడ్యుకేషన్, సాధించిన విజయాలతోపాటు.. రానున్న రోజుల్లో ఉన్నత విద్యలో ఎలాంటి సంస్కరణలు చేయనున్నారు.. తదితర కీలక అంశాలపై సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ పూర్తి ఇంటర్వ్యూను సాక్షి ఎడ్యుకేషన్ యూట్యూబ్ చానల్‌లో చూడొచ్చు. అలాగే ఈ **క్యూఆర్ కోడ్** స్కాన్ చేసి.. డైరెక్ట్‌గా ఈ పూర్తి ఇంటర్వ్యూను చూడొచ్చు.

గ్రామాల్లో జేఆరోలు!

▶ మొదటి పేజీ తరువాయి

వీఆర్వో వ్యవస్థ రద్దుకు ముందు ఆ పోస్టుల్లో పనిచేసిన వారు, వీఆర్‌ఏలుగా పనిచేస్తూ వివిధ శాఖల్లోకి పంపిన వారికి ఈ నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వనుంది. డిగ్రీ చదివిన పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏలను నేరుగా రెవెన్యూ శాఖలోకి తీసుకోనున్నారు. ఈ క్రమంలో 3,600 మంది పూర్వ వీఆర్వోలు, 2,000 మంది వరకు పూర్వ వీఆర్‌ఏలకు ఈ అర్హత ఉన్నట్టు అంచనా. మిగతా సుమారు 5,300 పోస్టులను ఏ విధంగా భర్తీ చేయాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. ఇంటర్ పూర్తిచేసిన వారు, ముఖ్యంగా ఇంటర్మీడియట్‌లో గణిత శాస్త్రం చదివిన వారిని కూడా నేరుగా తీసుకునే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అంతేకాదు వీరిలో కొందరిని సర్వేయర్లుగా నియమించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మంది కొత్త సర్వేయర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో... ఇంటర్ పూర్తి చేసిన పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలను సర్వేయర్లుగా నియమించే అవకాశం ఉందని సమాచారం. ఇలా నేరుగా భర్తీ చేసే జూనియర్ రెవెన్యూ అధికారి, సర్వేయర్ పోస్టులు పోగా... మిగతా పోస్టులకు రాతపరీక్ష నిర్వహించి భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో ఓపెన్‌గా దరఖాస్తులు స్వీకరించి ఈ పోస్టులను భర్తీ చేస్తారా? లేక పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలకు మాత్రమే పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

అంగీకారం తెలిపితేనే!

పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలలో తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిన వారినే జూనియర్ రెవెన్యూ అధికారులుగా నియమించనున్నారు. వాస్తవానికి 2022కు ముందు రాష్ట్రంలో 5వేల మందికిపైగా 'గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో)'గా పనిచేశారు. అయితే రెవెన్యూ శాఖలో పెరిగిపోయిన అవినీతిని నియంత్రించడం కోసమంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దు చేసింది. ఆ పోస్టుల్లో ఉన్నవారిని వివిధ ప్రభుత్వ శాఖల్లోకి పంపింది. ఆ నిర్ణయంపై కోర్టుకు వెళ్లిన సుమారు 70 మంది కోర్టు తీర్పు ఆధారంగా రెవెన్యూ శాఖలోనే కొనసాగుతున్నారు. మిగతా వారంతా వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. మున్సిపాలిటీలలో వార్డు అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కూడా పొందారు. ఈ క్రమంలో మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిన వారిని మాత్రమే జూనియర్ రెవెన్యూ అధికారులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక వీఆర్‌ఏల విషయానికొస్తే... 2023 జూలై నాటికి 22 వేల మందికిపైగా వీఆర్‌ఏలుగా పనిచేస్తున్నారు. అందులో 61 ఏళ్లలోపు వయసున్న, 2011 సంవత్సరంలోపు నియమితులైన 16,758 మందిని వివిధ ప్రభుత్వ శాఖల్లోకి పంపారు. మరో 3,797 మంది వయసు 61 ఏళ్లు దాటడంతో.. వారి వారసులకు వేరే శాఖలో ఉద్యోగాలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఇలా వివిధ శాఖల్లోకి వెళ్లిన వీఆర్‌ఏలలో కూడా సుముఖత వ్యక్తం చేసినవారిని మాత్రమే మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకోనున్నారు.

ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులపై భారం

గత ప్రభుత్వం వీఆర్‌ఏ, వీఆర్వోలను రెవెన్యూ శాఖ నుంచి పంపించేశాక.. గ్రామస్థాయిలో రెవెన్యూ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతల్లో కొన్నింటిని పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. చాలా చోట్ల పెద్ద గ్రామ పంచాయతీలు ఉండటం, రెవెన్యూ వ్యవహారాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తాయి. ప్రభుత్వ భూములను కాపాడటం, గ్రామాల్లోని రెవెన్యూ అంశాలను ప్రభుత్వానికి నివేదించడం వంటి పనులతో పంచాయతీ కార్యదర్శులపై అదనపు భారం పడింది. మరోవైపు గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది లేని కారణంగా ధ్రువీకరణ పత్రాల జారీ, సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని తిరిగి గ్రామ రెవెన్యూ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ మినహా గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు నిర్వహించిన బాధ్యతలన్నీ 'జూనియర్ రెవెన్యూ అధికారుల'కు అప్పగించే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రభుత్వ నిర్ణయం పట్ల టీజీఆర్‌ఎస్‌ఏ హర్షం

భూభారతి చట్టం కింద రాష్ట్రంలో గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం హర్షం వ్యక్తం చేశారు. పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి ఆప్షన్లను కోరుతూ సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేశారని.. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పూర్వ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర సలహాదారు వింజమూరు ఈశ్వర్ కూడా మరొక ప్రకటనలో ప్రభుత్వం నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులు.. పేదలకు దేవాలయాలు

• మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
• కొత్తపేటలోని టిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన



ఆస్పత్రి నిర్మాణ పనులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చైతన్యపురి: రాష్ట్రంలో నిర్మితవుతున్న టిమ్స్ ఆసుపత్రులను వేగంగా పూర్తిచేసి పేదలకు అందుబాటులోకి తేవాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేదలకు దేవాలయాల వంటివని చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ ఆసుపత్రి పనులను మంత్రి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లాభాపేక్షలేని సంస్థలాగా పదిమంది మెచ్చేలా ఆసుపత్రి నిర్మాణం చేయాలని ఎల్‌అండ్‌టీకి సూచించారు. మేజర్ ఆపరేషన్ థియేటర్, ఎమర్జెన్సీ, రేడియల్ వార్డులు, ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పార్కింగ్, ఇతర నిర్మాణాల విషయంలో రెండోసారి టెండర్లు పిలుస్తామన్న సంస్థ సమాధానంపై మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పనులను నాణ్యంగా, వేగంగా చేయాలని చెప్పారు. అనంతరం మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందాలనే సంకల్పంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం, 108 అంబులెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. టిమ్స్ ఆసుపత్రులు త్వరగా పూర్తయితే.. పేదలకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే బాధ తప్పుతుందన్నారు. గత ప్రభుత్వం 2021లో ప్రకటించి 2023లో టిమ్స్ నిర్మాణాలను ప్రారంభిస్తే ఇప్పటికీ 27 శాతం పనులు మాత్రమే పనులు పూర్తయ్యాయన్నారు. రూ.900 కోట్ల వ్యయంతో వెయ్యి పడకలతో చేపట్టిన ఎల్‌బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీని 14 ఫ్లోర్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. పనుల నాణ్యతను పరిశీలించేందుకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంపెనీ బ్యూరో వెరిటాస్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. టిమ్స్ పక్కనే పోలీస్ స్టేషన్, దేవాలయం, మసీదు నిర్మాణంలో అవాంతరాలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఆస్పత్రి నిర్మాణ పనులపై నిర్లక్ష్యం సరికాదు: హరీశ్‌రావు

• రాష్ట్రంలో దద్దమ్మ పాలన సాగుతోంది
• వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన



ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు

ఎంజీఎం (వరంగల్): వరంగల్ నగరంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల్లో 14నెలల కాలంలో ఒక్కశాతం కూడా పూర్తికాలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నగరంలోని సెంట్రల్ జైలు ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల ఆస్పత్రిని సోమవారం సాయంత్రం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్‌లతో కలిసి హరీశ్‌రావు సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2023 అక్టోబర్‌లో తాను మంత్రి హోదాలో ఆస్పత్రి నిర్మాణ పనులు సందర్శించినప్పుడే 84 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. సర్కారు మారిన నేపథ్యంలో నిర్మాణ పనుల్లో ఎలాంటి అడుగులు ముందుకు పడలేదని చెప్పారు. ఏడాది వరకు ఓపిక పట్టి ఆస్పత్రిని సందర్శించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రి పనులు చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. పేద ప్రజలకు మేలు చేసే ఆస్పత్రి నిర్మాణ పనులపై నిర్లక్ష్యం చేయడం సరికాదని, త్వరితగతిన పనులు చేపట్టకపోతే బీఆర్‌ఎస్ తరఫున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి తొక్కుకుంటూ ముఖ్యమంత్రి పదవిదాకా వచ్చానని అంటున్నాడని, ఈ తొక్కుడు ఎప్పటికీ నడవదని గుర్తించుకోవాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.

రాష్ట్రంలో శాంతి లేదు, భద్రత లేదు..

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో ఎవరికీ శాంతి లేదు, భద్రత లేదని.. ప్రతిపక్షాలను అణచివేయడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని హరీశ్‌రావు ఆరోపించారు. సోమవా రం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు లకు రైతుబంధు, మహిళలకు బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్టులు బంద్ చేశారని అన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చాలని సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను పట్టించుకోవడం లేదని తెలిపారు. పోలీసులు తమపని తాము చేయలేకపోతున్నారని, కేసీఆర్ పాలనకంటే, రేవంత్ పాలనలో ఏడాదిలో 41 శాతం క్రైం రేటు పెరిగిందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ రిపోర్ట్ ఇచ్చినట్లు తెలిపారు. అసెంబ్లీలో మూడు గంటలు సుత్తి మాట్లాడిన సీఎం రైతు భరోసాపై స్పష్టత ఇవ్వలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యం సేకరణలో తెలంగాణ @ 4

ఇప్పటివరకు రాష్ట్రంలో 41.43 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఉధృతంగా సాగుతోంది. ఇప్పటికే 4.12 కోట్ల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరణ పూర్తయినట్లు కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ వెల్లడించింది. దేశంలో మొత్తంగా 41,65,383 మంది రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించగా, ఇందుకు సంబంధించి రూ.90,015 కోట్లను రైతులకు చెల్లించినట్లు సోమవారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో దేశవ్యాప్తంగా 4.89 హెక్టార్లలో వరి సాగు జరిగింది. దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి సాగు విస్తీర్ణం గత ఏడాదికన్నా 4 శాతం పెరిగింది. ఇందుకు అనుగుణంగా 6.50 కోట్ల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరణ చేయాల్సి ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. అక్టోబర్ నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యంలో అత్యధికంగా పంజాబ్ నుంచి జరిగిందని కేంద్రం వెల్లడించింది. పంజాబ్‌లో 1.73 కోట్లమెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్‌లో 63.62 లక్షల మెట్రిక్ టన్నులు, హరియాణాలో 53.93 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ జరిగింది. ధాన్యం సేకరణలో తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది. తెలంగాణలో మొత్తం 6.75 లక్షల మంది రైతుల నుంచి 41.43 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరణ జరిగింది.

హైపర్‌సోనిక్ టెక్నాలజీదే భవిష్యత్

ప్రముఖ శాస్త్రవేత్త ఆర్ఆర్ ప్రహ్లాద.. హైపర్‌సోనిక్ టెక్నాలజీపై వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ అంతా హైపర్‌సోనిక్ టెక్నాలజీదే అని ప్రముఖ శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఆర్ఆర్ ప్రహ్లాద అన్నారు. హైపర్‌సోనిక్ వాహనాల తయారీకి అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని 20 ఏళ్ల క్రితమే డీఆర్‌డీవో గుర్తించిందని తెలిపారు. ఇప్పుడు అది వాస్తవరూపం దాల్చిందని అన్నారు. దేశీయంగా హైపర్‌సోనిక్ వాహనాలను అభివృద్ధి చేయడంలో నైపుణ్యం సాధించామని, దీంతో ఈ టెక్నాలజీలో మన దేశం కూడా అమెరికా, రష్యా మొదలైన దేశాల సరసన చేరిందని తెలిపారు. సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ శివసుబ్రమణ్యం నంబినాయుడు మాట్లాడుతూ.. హైపర్‌సోనిక్ గైడెడ్ వాహనాలు, క్రూయిజ్ క్షిపణుల అభివృద్ధిలో హైపర్‌సోనిక్ విండ్ టన్నెల్ సాంకేతికత కీలక పాత్ర పోషించిందని చెప్పారు. సమావేశంలో శాస్త్రవేత్తలు శ్రీనివాసమూర్తి, బీవీ పాపారావు, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైస్‌–చాన్స్‌లర్ యు. రాజబాబు, ఇస్రో, ఐఐటీ, ఎన్‌ఐటీల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

భూ భారతి చట్టంపై రైతులతో ముఖాముఖి

నల్లగొండ జిల్లా కంబాలపల్లిలో నిర్వహించిన రైతు సేవా ఫౌండేషన్



చందంపేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న భూభారతి హక్కుల రికార్డుల చట్టం – 2024పై నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని కంబాలపల్లి గ్రామంలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రైతు సేవా ఫౌండేషన్ రైతులతో ముఖాముఖి నిర్వహించింది. ఈ సదస్సుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో రైతు సేవా ఫౌండేషన్ చైర్మన్ భూమి సునీల్ ప్రసంగిస్తూ.. కొత్త చట్టం ఆవశ్యకతను, చట్టంలో ఉన్న కీలక అంశాలను, ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ఈ చట్టం ఎలా పరిష్కరించబోతోందో వివరించారు. ఇక నుంచి గ్రామ లేదా మండల స్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని, రైతాంగం ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలకు ఈ చట్టం పరిష్కారం చూపుతుందని తెలిపారు. గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి రాబోతున్నారని, ఇకపై ఏ సమస్య ఉన్నా రైతులు వారి గ్రామంలో ఉన్న అధికారి ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, సమస్య పరిష్కారం ఏ స్థాయిలో ఉందో కూడా ఎప్పటికప్పుడు సమాచారం పొందవచ్చని తెలిపారు. రైతు సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకుడు వి.లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అయిందని చెప్పారు. ఎమ్మెల్యే బాలూనాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వివరించారు. దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డితో పాటు తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

దేశ ప్రగతి కోసం సరికొత్తగా ఆలోచించండి

• విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచన
• సిద్దిపేటలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవంలో ప్రసంగం



ఏబీవీపీ మహాసభలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, సిద్దిపేట: దేశ ప్రగతి కోసం విద్యార్థులు సరికొత్త ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సభలకు ముఖ్యఅతిథిగా జిష్ణుదేవ్ వర్మ హాజరై ప్రసంగించారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని.. అందుకు యువత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. దేశ పునర్నిర్మాణంలో విద్యార్థులు, యువత ముందుండాలని సూచించారు. ఏబీవీపీ నుంచి ఎందరో గొప్ప నాయకులుగా ఎదిగారని ఆయన గుర్తుచేశారు. విద్యార్థులు, యువత ప్రవర్తన సమాజంలో వారి స్థాయిని నిలబెడుతుందని, లక్ష్య సాధనకు దోహదపడుతుందని చెప్పారు. ధర్మం అనేది మతం కాదన్న గవర్నర్.. ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి ఉండాలన్నారు. కలలు కనడంతోనే సరిపెట్టుకోకుండా దాన్ని సాధించడానికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి వివేకానందుని లక్ష్యం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లడంలో రాయబారులుగా పనిచేయాలని సూచించారు. ఏబీవీపీ జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ అశిష్ చౌహాన్ మాట్లాడుతూ ఏబీవీపీ ప్రస్థానం అన్నింటికన్నా భిన్నమైందన్నారు. విద్యార్థులు శారీరక దృఢత్వం కలిగి ఉండాలని ఏబీవీపీ పూర్వ సభ్యులతో కలిసి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రసంగాలను విన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌రెడ్డి, కార్యదర్శి రాంబాబు, తాటిపెల్లి అశోక్‌లు పాల్గొన్నారు.

పిటిషన్ విచారణార్హం కాదు.. కొట్టివేయండి

• 'మేడిగడ్డ'పై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్
• మాజీ మంత్రి హరీశ్‌రావుకూడా..
• నేడు విచారణ చేపట్టనున్న జస్టిస్ కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో తమను ప్రతివాదులుగా చేరుస్తూ దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్ విచారణార్హం కాదని, దీన్ని కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రైవేట్ వ్యక్తి పిటిషన్ (ఫిర్యాదు)పై విచారణ జరిపే అధికార పరిధి సెషన్స్ జడ్జికి లేదన్నారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ మున్సిఫ్ మేజిస్ట్రేట్ తొలుత పిటిషన్‌ను కొట్టివేశారని గుర్తుచేశారు. కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టనున్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ 2023, నవంబర్ 7న కేసీఆర్, హరీశ్‌రావుతోపాటు మరో ఆరుగురిపై భూపాలపల్లి ప్రధాన మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో భూపాలపల్లికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెళ్లి రాజలింగమూర్తి ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది తమ పరిధిలోకి రాదంటూ గత జనవరి 12న పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై రామలింగమూర్తి భూపాలపల్లి జిల్లా కోర్టును ఆశ్రయించగా, విచారణ ప్రారంభించింది.

రివిజన్ కింద విచారణ సాధ్యం కాదు..

విచారణ చేపట్టిన జిల్లా కోర్టు సెషన్స్ జడ్జి.. కేసీఆర్, హరీశ్‌రావుతోపాటు నాటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్‌కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్, చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, మేఘా నిర్మాణ సంస్థ అధినేత కృష్ణారెడ్డి, ఎల్‌అండ్‌టీ సంస్థకు ఆగస్టు 5న నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత రెండుసార్లు సమన్లు జారీ చేసినా కేసీఆర్, హరీశ్ కోర్టుకు హాజరుకాలేదు. ఈ నేపథ్యంలోనే సెషన్స్ కోర్టు జారీ నోటీసులను సవాల్ చేయడంతోపాటు ప్రైవేట్ ఫిర్యాదును కొట్టివేయాలంటూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. ఒకసారి మేజిస్ట్రేట్ తనకు అధికార పరిధి లేదని నిర్ధారణకు వచ్చి పిటిషన్‌ను కొట్టివేసిన తర్వాత సెషన్స్ జడ్జి రివిజన్ కింద విచారణ చేపట్టడం సాధ్యం కాదన్నారు. నోటీసులు జారీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. తొలుత విచారణ చేపట్టలేమని అభిప్రాయపడిన సెషన్స్ జడ్జి.. ఒకవేళ పిటిషన్‌పై విచారణ చేపట్టకుంటే సమాజానికి తప్పుడు సంకేతం ఇచ్చినట్లు అవుతుందేమో అన్న ఉద్దేశంతో అనుమతించడం తప్పుడు నిర్ణయమని పేర్కొన్నారు.

రేవంత్ బీజేపీ పెద్దలను కలిసిన తరువాతే కేటీఆర్‌పై కేసు

మీడియాతో చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను కలిసిన తరువాతనే కేటీఆర్‌పై కేసు నమోదుకు రాష్ట్ర గవర్నర్ అనుమతిచ్చారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఏసీబీ కేసు నమోదు చేసిన వెంటనే ఈడీ రంగంలోకి దిగి కేసు పెట్టిందని అన్నారు. ఈ వ్యవహారంతో కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని మరోసారి రుజువు అయిందన్నారు. సోమవారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. గవర్నర్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఒక రకంగా బీజేపీ సర్కార్ నడుస్తోందని, మోదీ పీఎం కిసాన్ యోజన పథకం రూల్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుతున్నది బండి సంజయ్, రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్ అని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ ప్రపంచ బ్యాంకును రాష్ట్రంలోకి రానివ్వలేదని, కానీ రేవంత్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు నిధులు తెస్తున్నారని, అంత అవసరం ఏమొచ్చిందని ఆమె ప్రశ్నించారు.



అసాధారణ విషయాలు చెప్పడానికి సాధారణ మాటలు ఉపయోగించాలి.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 24 డిసెంబర్ 2024

పారదర్శకతకు పాతర

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) వ్యవహారశైలిపై, దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియపై అనేక అనుమానాలు తలెత్తుతున్న వేళ... అవి మరింత పెరిగే ప్రమాదం తాజాగా తలెత్తింది. ఎన్నికల నిర్వహణ నిబంధనల్ని మారుస్తున్నట్టు కేంద్ర సర్కార్ శుక్రవారం ప్రకటించింది. నిబంధనల్లో సరికొత్త సవరణ వల్ల ఇకపై ఎన్నికలకు సంబంధించిన అన్ని పత్రాలనూ పరిశీలించే అవకాశం ప్రజలకు ఉండదు. సీసీ టీవీ, వెబ్‌కాస్టింగ్ ఫుటేజ్, అభ్యర్థుల వీడియో రికార్డింగుల లాంటి ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్లు ఇకపై అందుబాటులో ఉండవు. అదేమంటే, అలాంటివన్నిటినీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచితే వాటిని దుర్వినియోగం చేస్తారనీ, అసలు ఓటరు భద్రతకే ప్రమాదకరమనీ పాలక వర్గాల వాదన. సోషల్ మీడియా యుగంలో, పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్ల దృశ్యాలు విస్తృతంగా అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో అది వట్టి డొల్ల వాదనే. ఎన్నికల నిబంధనల్లో మార్పుపై దేశ వ్యాప్తంగా అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నది అందుకే!

''ఎన్నికకు సంబంధించిన మిగిలిన అన్ని పత్రాలనూ ప్రజాక్షేత్రంలో పరిశీలించేందుకు వీలుండాలి'' అని 1961 నాటి ఎన్నికల నిర్వహణ నిబంధనల్లోని రూల్ 93(2)(ఎ) చెబుతోంది. దానికే ఇప్పుడు సవరణ చేశారు. ఈసీ సిఫార్సు మేరకు, కేంద్ర న్యాయశాఖ ఈ మార్పును నోటిపై చేసింది. దాంతో, ఇప్పుడిక నిబంధనల్లో ప్రత్యేకంగా పేర్కొన్న పత్రాలను మాత్రమే జనం పరిశీలించవచ్చన్న మాట. అంతేకాదు... ఎన్నికల పత్రాలన్నిటినీ కోరినవారికి ఇవ్వాలంటూ ఈసీని ఇక కోర్టులు ఆదేశించడానికి వీలుండదు. చిత్రమేమంటే, ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పోలింగ్ కేంద్రంలో పోలైన ఓట్లకు సంబంధించిన పత్రాల కాపీలు, సెక్యూరిటీ కెమెరాలోని ఫుటేజ్, వీడియోలను ఓ పిటిషనర్‌కు అందించాల్సిందిగా పంజాబ్ – హర్యానా హైకోర్ట్ సరిగ్గా ఈ నెల 9వ తేదీనే ఆదేశాలిచ్చింది. అక్టోబర్ నాటి ఎన్నికల్లో అభ్యర్థి కాదు గనక సదరు పిటిషనర్ ఆ పత్రాలు కోరరాదని ఈసీ వాదించింది. హైకోర్ట్ మాత్రం అభ్యర్థికైతే ఉచితంగా, ఇతరులకైతే రుసుముపై పత్రాలివ్వాలన్న పిటిషనర్ వాదనతో ఏకీభవించింది. కోర్టు ఆదేశాన్ని తప్పక పాటించాల్సిన పరిస్థితి. కానీ, తద్భిన్నంగా ఎన్నికల సంఘం నిబంధనల్ని సవరించడం సహజంగానే చర్చనీయాంశమవుతోంది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తున్నప్పుడే, సామాన్య ఓటర్లకున్న తిరుగులేని సమాచార హక్కును సుప్రీమ్ కోర్ట్ నొక్కి వక్కాణించింది. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే వ్యక్తుల, సంస్థల వివరాలు తెలుసుకొనే హక్కు ప్రజలకుందని తేల్చి చెప్పింది. వివాదాస్పద బాండ్ల పథకాన్ని సమర్థించిన సర్కారుకు అది ఎదురుదెబ్బ. నిజానికి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకత, నిజాయతీలో రాజీకి తావు లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్పుడే స్పష్టం చేసినట్టయింది. అయినా సరే, ప్రభుత్వం చెవికెక్కించుకోకుండా ఇప్పుడు ఈసీ సిఫార్సు పేరు చెబుతూ, నిబంధనల సవరణకు దిగడం ప్రజాస్వామ్యవాదులకు దిగ్భ్రాంతి కలిగించే విషయం. ఓటర్లే స్వయంగా తమ ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా సాక్షిగా పంచుకుంటున్న రోజుల్లో సీసీ టీవీ దృశ్యాల పట్ల ఈసీ ఇంత హంగామా ఎందుకు చేస్తోందో అంతుపట్టదు. సీసీ టీవీ ఫుటేజ్ అందుబాటులో ఉంటే కృత్రిమ మేధతో దుర్వినియోగం చేసే ముప్పుందన్న ఈసీ వాదన కొంత నిజమైనా, డిజిటల్ యుగంలో అన్ని వీడియోలపై నిషేధం పెడతామా? సవాలుకు అది పరిష్కారం కాదు కదా!

ఎన్నికల సంఘం సారథ్యంలో నిఖార్సుగా సాగాల్సిన ఎన్నికల ప్రక్రియ తాలూకు నైతిక నిష్ఠ శరవేగంగా హరించుకుపోతోందంటూ ప్రతిపక్షాలు అసలే గొంతు చించుకుంటున్న సమయంలో నిబంధనల్లో ఈ కొత్త సవరణలు చేయ డాన్ని ఏ రకంగా అర్థం చేసుకోవాలి? ఎన్నికల రికార్డులనూ, డేటాను ప్రజాక్షేత్రానికి దూరంగా ఉంచాలన్న జ్ఞానోదయం హఠాత్తుగా పాలకులకూ, ఈసీకీ ఎందుకు కలిగినట్టు? జనం దృష్టి నుంచి ఏం దాచాలని చూస్తున్నారు? ప్రతిపక్షాలనే కాదు... పౌరులనూ వేధిస్తున్న ప్రశ్నలివి. పైగా విస్తృత స్థాయి చర్చ జరగకుండానే చేపట్టిన ఈ తొందరపాటు చర్య ఎన్నికల ప్రక్రియపై మరిన్ని అనుమానాలు పెంచేలా పరిణమిస్తుంది. ప్రజాస్వామ్య దేశంలో అది మరింత విషాదం.

వాస్తవానికి భిన్న భౌగోళిక పరిస్థితులు, భాషలు, సంస్కృతులు, సమస్యలున్న సువిశాల దేశంలో అతి పెద్ద ప్రజాస్వామ్య ప్రక్రియగా ఇన్నేళ్ళుగా విజయవంతంగా ఎన్నికలను నిర్వహిస్తూ రావడం గొప్పే. అందుకు మన రాజ్యాంగం ఏర్పరచిన సుస్థిర వ్యవస్థనూ, గత దశాబ్దాల్లో ఈసీ పాత్రనూ తప్పక ప్రశంసించాల్సిందే. కానీ ఏ ఎన్నికల ప్రక్రియకైనా పారదర్శకత ప్రాణాధారం. ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికీ అదే కీలకం. తీరా ఆ పారదర్శకతే ఇప్పుడు రానురానూ తగ్గుతూ పోతుంటే ఏమనాలి? ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గొప్పలు చెప్పుకొనే మనం ఎటువైపు ప్రయాణిస్తున్నట్టు? అందులోనూ ఆంధ్రప్రదేశ్, హర్యానా సహా అనేక చోట్ల ఎన్నికల్లో ఈవీఎంలపై, వీవీప్యాట్లపై నీలినీడలు కమ్ముకున్న ప్రస్తుత పరిస్థితుల్లో... ఈ తరహా కొత్త నిబంధనతో పాలకులు ఏ రకమైన సూచన ఇవ్వదలిచినట్టు? ఎన్నికల ప్రక్రియ పట్ల విశ్వాసం పాదుకొనాలంటే, ఈ సరికొత్త నిబంధనల మార్పును పునఃపరిశీలించాలి. స్వతంత్రంగా సాగాల్సిన ఈసీ పాలకుల చేతిలో మరబొమ్మగా మారిపోతున్నట్టు విమర్శలు పెల్లుబుకుతున్న సందర్భంలో అది అత్యవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.నవమి రా.7.20 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** హస్త ప.12.35 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.9.29 నుండి 11.13 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.43 నుండి 9.31 వరకు తదుపరి రా.10.44 నుండి 11.32 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

బాలికా విద్యపై ఇంకా వివక్షా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశ వ్యాప్తంగా దళిత, బహుజన స్త్రీ విద్యపై తీవ్రమైన వివక్ష కొనసాగుతోంది. నిజానికి గురుకుల హాస్టల్స్‌లోనూ, జనరల్ హాస్టల్స్‌లోనూ విద్యార్థినులు నిరంతరం అనారోగ్యానికి గురి అవుతున్నారు. దీనికి కారణం పౌష్టికాహార లోపం, శుభ్రతగా ఉండే పరిస్థితుల లేమి, సరైన మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడం. అందుకే పిల్లలు రక్త హీనతతో శక్తి లేక కళావిహీనంగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి సంరక్షణ విషయంలో సరైన బడ్జెట్‌ను రూపొందించ లేకపోతున్నాయి. వీరిపట్ల ఎంతో అశ్రద్ధ కనబడుతోంది. వార్డెన్స్‌ను శాశ్వతంగా నియమించకపోవడం, హాస్టల్స్‌కు సొంత భవనాలు లేకపోవడం, విద్యార్థినుల సంఖ్యకు తగినట్లుగా గదులు లేకపోవడం లాంటి ఎన్నో కారణాలు బాలికలకు మెరుగైన చదువును నిరాకరిస్తున్నాయి.

తల్లిదండ్రులు వలస కూలీలుగా వెళ్తుండగా, ఇంట్లో ఆలనా పాలనా లేని జీవన వ్యవస్థలో దళిత బాలికలు ఎంతో సంక్షోభాన్ని అనుభవిస్తున్నారు. దీనికి తోడు ఉద్యోగుల దోపిడీ విధానాలు కూడా పిల్లల నోటికాడి కూడును దొంగిలించే పరిస్థితులు వచ్చాయి. ఇస్తున్న కొద్దిపాటి సామాన్లనే వార్డెన్లు పరిగ్రహించటం, రాత్రుళ్ల కనీసం గర్ల్స్ హాస్టల్స్‌లో కూడా వార్డెన్లు నిద్రించకపోవడం, విద్యార్థులను సొంత పనులకు వాడుకోవడం లాంటి ఎన్నో లొసుగులు ఉన్నాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గన్‌మెన్ వెంట తిరుగుతూ ఉంటారు. బాలికల హాస్టల్స్‌కు కనీసం ఒక గార్డ్ కూడా కాపలా ఉండడు.



సౌకర్యాలు కల్పించకూడదా?

విద్యకు ఆహారం, వసతి ముఖ్యం. ప్రభుత్వం ప్రతి మూడు జిల్లాలకైనా ఒక స్పెషల్ కలెక్టర్‌ను వెయ్యాల్సి ఉంది. ఆయనకు కొన్ని టాస్క్ ఫోర్స్ టీములను అప్పగించాల్సి ఉంది. ఈ సంవత్సరం హాస్టళ్ళలో అత్యాచారాల సంఖ్య పెరిగింది. ప్రతి మహిళా పోలీస్ స్టేషన్‌కు ఆ ప్రాంతంలో వున్న బాలికల హాస్టల్ రక్షణ బాధ్యతను అప్పగించాల్సి ఉంది. తెలంగాణలో ఎన్నిసార్లు గురుకుల విద్యార్థినులు కలుషిత ఆహారంతో ఆసుపత్రుల పాలయ్యారు? రెండు రాష్ట్రాలలోనూ నాసిరకం బియ్యాన్ని గురుకుల పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. దీనికి కారణం వీళ్ళలో గూడుకట్టుకున్న కులతత్వం అని చెప్పక తప్పదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమ్మఒడి పథకం ఇస్తానని చెప్పి దళిత విద్యార్థుల్లో విద్య పెరుగుతుందనే ఆ పథకం మీద గొడ్డలివేటు వేశారు. అమరావతి నిర్మాణం, పోలవరం అనే పాట పాడుతూ, ప్రపంచ బ్యాంకుల నుండి అప్పులు తెస్తూ మహా నగరాన్ని నిర్మిస్తాననే మాటతో ఏపీ ముఖ్యమంత్రి ప్రజల్ని నమ్మిస్తున్నారు. దళిత బహుజన విద్యార్థుల్ని విద్యాశక్తికి పనికిరాకుండా మానసిక దౌర్బల్యానికి గురిచెయ్యాలనే పెద్ద ప్రయత్నం జరుగుతోంది.

దళిత బహుజనుల జీవన వ్యవస్థల మీద దెబ్బ కొట్టాలనే ప్రయత్నంతోనే 'అమ్మఒడి'కి 'తల్లి దీవెన' అని పేరు పెట్టి దాన్ని నిర్వీర్యం చేయాలని రోజుకొక ప్రకటన చేస్తున్నారు. గిరిజనుల హాస్టళ్ళకు ఆహార, ఆహార్య, రక్షణలను కలిగించకుండా, తల్లిదండ్రులకు తమ పిల్లలను చదివించాలనే ఆసక్తిని పోగొడుతున్నారు. నిజానికి ఇది ఒక పద్ధతి ప్రకారమే అగ్రకులాధిపత్యం చేయిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇవ్వగలిగి కూడా ఇవ్వలేకపోవడానికి కారణం ఏమిటి? తల్లిదండ్రులు వలస కూలీలుగా వెళ్ళేటప్పుడు ఒక్కొక్క ఆటోలో 25 మంది వరకు ఎక్కి, ప్రమాదాల్లో చనిపోయి, పిల్లలు అనాథలవుతున్న స్థితి మనకు కనబడుతుంది. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే బహుజన స్త్రీలలో మొబిలిటీ పెరుగుతుందనీ, వారు దూర ప్రాంత పనులకు వెళ్ళగలుగుతారనీ అంచనా వేసే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని దాటవేస్తోంది.

కుటుంబాల్లో సంక్షోభం

ఈ సందర్భంగా దళితవాడల పరిస్థితిని ఒకసారి చూద్దాం. రెండు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలలో దళితవాడలు మురుగు నీరుతో, జబ్బులతో కునారిల్లుతున్నాయి. గ్రామ రాజ్యాన్ని పునరుద్ధరిస్తానంటున్న ఏపీ ఉపముఖ్యమంత్రి దళితవాడలకు ఇంతవరకు ఇళ్ళ స్థలాల విషయంగానీ, ఉపాధిని ఇచ్చే కుటీర పరిశ్రమల విషయంగానీ ఎత్తడం లేదు. దళిత వాడల్లో మద్యపానంతో పురుషులు ఎక్కువ మంది మరణిస్తూ స్త్రీలు విధవరాళ్లు అవుతున్నారు. గ్రామాలు సంక్షోభంలో, కుటుంబాలు వైరుధ్యాలతో కొట్టుమిట్టాడుతుంటే నోరు మెదపడం లేదు. దళిత బహుజన విద్యార్థినులు పేరెంట్స్ మీటింగ్‌కు పిలిస్తే సగంమంది విడిపోయిన భార్యాభర్తలు వస్తున్న విషయాలు వీరికి తెలిసి కూడా, ఈ కుటుంబ సంక్షోభం విద్యార్థుల భవిష్యత్తుపై గొడ్డలి వేటు అని తెలుసుకోలేకపోతున్నారు. రెండు రాష్ట్రాల్లో మద్యం తాగేవారి సంఖ్య విపరీతంగా పెరగడం ఎంత బాధకరమో అర్థం చేసుకోలేకపోతున్నారు.

ఏ దేశానికైనా, రాష్ట్రానికైనా స్త్రీ ఆర్థికాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం జీవగర్ర. మగవాళ్లు తాగి జుట్టు పట్టుకొని ఆడవాళ్లను, ఆఖరికి తల్లిని కూడా కొట్టి ఇళ్ళల్లోంచి తరుముతున్న దారుణాలు చూస్తున్నాం. ఈ సామాజిక సంక్షోభాన్ని ప్రభుత్వం నివారించడానికి ప్రయత్నించడం లేదు. పైగా అనేక రకాల మత్తు పదార్థాలను విచ్చల విడిగా పాఠశాల పరిసర ప్రాంతాల్లోనూ, దళిత వాడల్లోనూ అమ్ముతూ ఉన్నా కూడా ప్రభుత్వాలు కళ్ళప్పగించి చూడటం ఆశ్చర్యం వేస్తుంది.

పూలే ఆశయాలు మరిచారా?

తెలంగాణలో అయితే అసెంబ్లీలో ప్రతిపక్షం హాస్టళ్లలోని దుర్భరమైన పరిస్థితులను ఎత్తిచూపినా ప్రభుత్వం దాటవేసే చర్యలను చేస్తున్నదే తప్ప వాటిని నిజంగా నివారించే చర్యలు చేపట్టడం లేదు. అసలు హాస్టల్స్‌లో రగ్గులు పంచి, పిల్లలను చలి నుండి కాపాడాలనే ఉద్దేశం కూడా లేకుండా జీవిస్తున్న పరిస్థితి కనబడుతోంది. మొత్తం భారతదేశంలోనే దళిత బహుజన విద్యపైన గొడ్డలివేటు పడుతోంది. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు కోట్లకు పడగలెత్తిన వారున్నారు. కనీసం తమ నియోజక వర్గాల్లో కూడా విద్యార్థులకు దుప్పట్లు పంచడం గానీ, శక్తిమంతమైన ఆహారాన్ని కల్పించడం కోసం పాలు, గుడ్లు, పండ్లు, పప్పులు వంటివి పంచిపెట్టడం గానీ చెయ్యడం లేదు. దీనికంతటికీ కారణం వీళ్ల స్వార్థ పూరితమైన జీవితంతో మహాత్మ పూలే జీవితానుసరణను, ఆయన సిద్ధాంతాలను, ఆశయాలను మరచిపోయి అగ్రవర్ణాలతో సంపాదనలో పోటీ పడటమే.

మహాత్మా పూలే 1848లోనే బ్రిటిష్ ప్రభుత్వానికి బహుజన స్త్రీల మీదే కాక మొత్తం స్త్రీలకే విద్య రావాలనే విషయం మీద ఎన్నో ఉత్తరాలు రాశారు. అంబేడ్కర్ తన జీవితం మొత్తం దళిత బహుజనుల విద్యకోసం పోరాడారు. ఆనాడు ఎలాగైతే అగ్రవర్ణాల్లో దళిత బహుజనులు చదువుకోకూడదనే దురుద్దేశం ఉండిందో, అది ఇప్పటికీ కొనసాగుతోందని అర్థం అవుతోంది. ఒక పదవ తరగతి విద్యార్థిని ఏడు సబ్జెక్టులు చదవాలంటే, పాఠాలు వినాలంటే, పరీక్షలు రాయాలంటే ఎంత శక్తి కావాలి, ఎంత ఆహారం తినాలి అని ప్రభుత్వాలకు తెలియదా!

మహాత్మా పూలే చెప్పినట్లు మన గ్రామాలను మనమే పునర్నిర్మించుకునే సందర్భం వచ్చింది. అంబేడ్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ స్వీయ వ్యవస్థల ద్వారా విద్య సంస్కరణలను చేసుకోవాలనీ, విద్యా వ్యవస్థలను నిర్మించుకోవాలనీ చెప్పిన విషయాలను జ్ఞాపకం చేసుకోవాలి. మన పిల్లల భవిష్యత్తుకు మనమే మార్గం వేసుకోవాలి. ముఖ్యంగా చర్చిల్లో కేవలం ప్రార్థనలే కాకుండా విద్యా బోధనలకు అవకాశం కల్పించాలని కోరాలి. దళిత బహుజన సామాజిక సంఘాలు, స్వీయ సామాజిక విద్యా పునర్జీవనం కోసం పాటుపడాలి. ఆత్మ గౌరవ పోరాటాలతోనే సమసమాజ నిర్మాణం సాధ్యం.

విద్యే జీవన వ్యవస్థలకు సోపానం. విద్య మానవ వ్యక్తిత్వ వికాసానికి పునాది. విద్య మానవాభ్యుదయానికి నాంది. విద్యా పునాదుల మీదే నూత్న సమాజం రూపొందుతుంది. అందుకే అంబేడ్కర్ దళితులకు విద్యా విప్లవ నినాదాన్ని ఇచ్చారు. అందునా బాలికా విద్య సామాజిక భవితవ్యానికి వారధి. అంబేడ్కర్ మార్గంలో నడుద్దాం. నూత్న సమాజాన్ని నిర్మిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు I 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సోషల్ తమాషా



నువ్వు ఎందుకూ కొరగానివాడివైనా, నువ్వు చాలా ప్రయోజకుడివని అనిపించేలా సోషల్ మీడియా ద్వారా చేసుకోగలిగే మార్గాలున్నాయి.

– ఒన్యేకా నువేల్యూ, నైజీరియా రచయిత

దానికీ పన్నా?



పెట్రోల్‌తో నడిచే కార్లను 15 ఏళ్లకు, డీజిల్‌తో నడిచేవైతే 10 ఏళ్లకు వదిలించుకోవాలని ఢిల్లీలో ఒక నిబంధన ఉంది. అంటే బాగా నడుస్తూవున్న మన మంచి కార్లను 15/10 ఏళ్లకే వదులుకునేలా బలవంతం చేస్తారు. మళ్లీ ఆ రీసేల్ మీద 12–18 శాతం జీఎస్టీ వసూలు చేస్తారు. ఇంకేం మాట్లాడతాం!

– స్వాతి కె., న్యాయవాది

వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేలా...



1951 నుంచి ఉష్ణోగ్రత 0.7 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. వర్షపాతం 6 శాతం తగ్గింది. దీనివల్ల మన వ్యవసాయ ఉత్పత్తులు ప్రభావితం అయ్యాయి. వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి తగిన సమయం ఇదే. దీనికోసం బడ్జెట్‌లో మన వ్యవసాయ 'ఆర్ అండ్ డీ' కేటాయింపులను 0.5 నుంచి 1 శాతానికి పెంచాలి.

– రమణ్‌దీప్ సింగ్ మాన్, రైతు ఇంజినీర్

సినిమాను మార్చినవాడు



ఆయన 'న్యూ వేవ్' సినిమాను సృష్టించారు. అంకుర్, మంథన్, అలాంటి ఎన్నో సినిమాలతో భారతీయ చలనచిత్ర దిశను మార్చినవాడిగా శ్యామ్ బెనెగల్ ఎప్పటికీ గుర్తుండిపోతారు. శబానా అజ్మీ, స్మితా పాటిల్ లాంటి గొప్ప నటుల్లోంచి స్టార్లను సృష్టించారు. నా స్నేహితుడు, గైడ్‌కు వీడ్కోలు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

గౌరవానికి భంగం



భయానకమే అయినా, శవంతో జరిపే లైంగిక కృత్యం అత్యాచారం కిందకు రాదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అభిప్రాయపడిందని వార్త. భారతీయ చట్టాల ప్రకారం 'నెక్రోఫీలియా' స్పష్టంగా నేరం కాదు. కాకపోతే, నిఠారీ కేసులో ఆర్టికల్ 21కు ఇచ్చిన 'మరణంలో గౌరవపు హక్కు' వివరణే ఇప్పటికి ఉన్న ఉత్తమ ప్రతివాదన. 75 ఏళ్లుగా మన శాసనకర్తలు కనీసం ఈ లోపాన్ని పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరం!

– అమిత్ శాండిల్యా, కాలమిస్ట్

మేడ్ డిఫికల్ట్...



ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా నేను ఏం మాట్లాడుతున్నానో నాకు తెలుసు. మధ్యతరగతి మీద సంక్లిష్ట జీఎస్టీ(వస్తు,సేవల పన్ను)ని మోపుతున్నారు. అసలు జీఎస్టీని తెచ్చిందే పరోక్ష పన్నులను సరళీకృతం చేయడం ద్వారా వస్తువుల ధరలు తగ్గుతాయని! దానికి బదులుగా మధ్యతరగతిని దోచుకుంటున్నారు.

– అర్పిత్ శర్మ, ఛార్టర్డ్ అకౌంటెంట్

తీవ్ర సమస్యలు



ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ శహర్‌లో ఒక వ్యాపారి కోటి లీటర్ల కృత్రిమ పాలను తయారు చేయగలిగే పరికరాలతో అధికారులకు పట్టుబడ్డాడు. (అజయ్ అగర్వాల్ అనే వ్యాపారి ఒక్క లీటర్ రసాయనాలతో 500 లీటర్ల కృత్రిమ పాలను తయారుచేస్తూ ఇప్పటికే అరెస్టయ్యాడు.) ఇలాంటి విషయాల మీద మనం చూపాల్సినంత ఆగ్రహం చూపడం లేదు.

– ఐశ్వర్య ముద్గిల్, రచయిత్రి

ఇన్ బాక్స్

రైతుకు అండ ఏదీ?

అతివృష్టి, అనావృష్టి, చీడపీడలను ఎదుర్కొని వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వ అండ తగినంతగా ఉండటం లేదు. లాభసాటి ధర మాట దేవుడికి ఎరుక, కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ) కూడా లేదు. కొన్ని పంటలకు మాత్రమే అరకొరగా ఎమ్ఎస్‌పీని కేంద్రం ప్రకటిస్తోంది. దీంతో పెట్టుబడి కూడా చేతికందక, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎమ్ఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసినా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

లాభసాటి ధర అంటే అన్ని రకాల ఖర్చులను లెక్కించి ఆ మొత్తానికి 50 శాతం అదనంగా కలిపి ఇవ్వడం. అలా ఇస్తేనే రైతు బతికి బట్ట కడతాడని స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసింది. అయినా పట్టించుకునే నాథుడే లేడు. పంటలు బాగా పండినప్పుడు ధరలు పాతాళానికి పోతాయి. సరఫరా తగ్గి, గిరాకీ పెరిగినప్పుడేమో దళారులు, వ్యాపారుల పాలవుతాయి. దళారుల మాయాజాలానికి ఇటు రైతులు, అటు వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారుల లంచాలకు అలవాటు పడిన అధికారులు నోరు మెదపడం లేదు. ఫలితంగా వ్యవసాయ కుటుంబాల సగటు నెలవారీ ఆదాయం 14 వేల రూపాయలకు మించడం లేదు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటిన నేటి తరుణంలో 14 వేలతో ఎలా బతుకుతారో అమాత్యులే చెప్పాలి. అందుకే ఇక సేద్యం చేయలేమని రైతు కుటుంబాలు వ్యవసాయానికి దూరమవుతున్నాయి. అందువల్ల ప్రజలకు అందుబాటులోకి వచ్చే 70 రకాల పంటలు ఇప్పుడు 20కి పడిపోయాయి. దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో దూసుకుపోతున్న నేటి తరుణంలో... శాస్త్రీయంగా పంట ప్రణాళికలు రూపొందించే వ్యవస్థ ఇంతవరకు మనదేశంలో లేకపోవడం సిగ్గుచేటు. వ్యవసాయం బాగుపడాలంటే నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీటిని పారించాలి. వెనుకబడిన ప్రాంత రైతులకు ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించాలి. విత్తనం నుండి విక్రయం దాకా రైతుకు అండగా నిలబడాలి, దళారుల ఆగడాలను అరికట్టాలి. సమర్థ ఉచిత పంటల బీమా కల్పించాలి.


– కె.వి. రమణ; అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు, అనంతపురం

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి.
ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను
ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

సుపరిపాలన సాకారం కావాలంటే...

మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జన్మదినమైన డిసెంబరు 25ను సుపరిపాలనా దినోత్సవంగా 2014 నుంచి జరుపుకొంటున్నాం. ప్రధానిగా ఉన్నప్పుడు మన పురాణ, ఇతిహాసాలు చెప్పిన రాజధర్మాన్ని పాటించి సుపరిపాలన చేశారాయన. అందుకే ఆయన పాలనకు గుర్తుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని జరపాలని నిర్ణయించి, కొనసాగిస్తోంది.

రామాయణంలో రాముడు భరతుడికి సుపరిపాలన గురించి చెబుతూ రాజ ధర్మాన్ని వివరిస్తాడు. మహాభారతంలో అంపశయ్యపై ఉన్న భీష్మ పితామహుడు ధర్మరాజుకు సుపరిపాలన గురించి వివరించాడు. భీష్ముడి ఉద్దేశంలో సుపరిపాలన ఆకాంక్షించే ప్రభువులు నైతిక విలువలను విస్మరించరాదు. ఆచార్య చాణక్యుడు తన అర్థశాస్త్ర గ్రంథంలో సుపరిపాలనకు సంబంధించిన అనేక అంశాలను ప్రస్తావించాడు. 'ప్రజల సంతోషమే రాజు సంతోషం. ప్రజల సంక్షేమంలోనే ప్రభువు సంక్షేమం ఉంది. రాజు సంక్షేమ కోసం కాకుండా ప్రజల సంతానం కోసం మాత్రమే పరిపాలన గావించాలి.'



అటల్ బిహారీ వాజ్‌పేయి

సుపరిపాలనలో... పరిపాలనను వికేంద్రీకరించాలి. కానీ మన దేశంలో ప్రభుత్వ పాలన కేంద్రీకృతమైనట్లు విమర్శలున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలు కల్పించాలి. స్థానిక ప్రభుత్వాలను 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా కొంత బలోపేతం చేసినప్పటికీ అవి అనేక రాష్ట్రా లలో నిధులు లేని విధులు నిర్వహిస్తున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. స్థానిక సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలి. సత్వర న్యాయం లభించాలి. అనేక కారణాల వల్ల ప్రజలకు న్యాయస్థానాల్లో సత్వర న్యాయం లభించడం లేదు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా అంగీకరించింది. తగిన సమయంలో లభించని న్యాయం అన్యాయంతో సమానం. అన్ని న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల కొరత కారణంగా, లక్షల్లో కేసులు అపరిష్కృతంగా ఉన్నాయి. కేసుల సత్వర నివారణకు అవసరమైన సంస్కరణను న్యాయ వ్యవస్థలో ప్రవేశపెట్టాలి.

సుపరిపాలన అంటే అవినీతి రహిత పాలన. దురదృష్టవశాత్తు ప్రభుత్వ పాలనలో అవినీతి పెరుగుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అవినీతి నిరోధక శాఖలైన సీబీఐ, ఏసీబీ, విజిలెన్స్ కమిషన్లను స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలుగా పని చేయనివ్వాలి. అనేక సందర్భాల్లో సుప్రీం కోర్టు సీబీఐని పంజరంలో చిలకలా అభివర్ణించడం గమనార్హం. అవినీతికి పాల్పడే వారికి కఠినమైన శిక్షలు విధించాలి.


ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. పరిపాలనలో పారదర్శకత ఉండాలి. ఇందుకోసం 2005లో సమాచార హక్కు చట్టాన్ని రూపొందించడం హర్షించదగ్గ పరిణామం. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చడానికి ప్రయత్నిస్తున్నాయి. కేంద్ర సమాచార కమిషన్‌లోనూ, రాష్ట్రాల సమాచార కమిషన్‌లోనూ ఏర్పడిన ఖాళీలను భర్తీచేయడం లేదు. ఇటువంటి చర్యలు సుపరిపాలనకు వ్యతిరేకం. సుపరిపాలనలో ప్రజలకు నిర్ణయాలలో తగిన పాత్ర ఉండాలి. ప్రజలు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ, చట్ట బద్ధమైన వ్యవస్థల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలలో భాగస్వాములు కావాలి.

పార్టీ ఫిరాయింపు చట్టాన్ని సదుద్దేశంతో రూపొందించిప్పటికీ అందులో ఉన్న కొన్ని లోపాల వల్ల ఆ చట్టం ఆశయాలు నెరవేరలేదు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయడం కోసం అవసరమైన చర్యలు గైకొనాలి. ఇవన్నీ జరిగినప్పుడే సుపరిపాలన సాధ్యం అవుతుంది.

– డా॥ పి. మోహన్ రావు
ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ఛైర్మన్ I 99495 95509
(రేపు వాజ్‌పేయి శత జయంతి ముగింపు: సుపరిపాలనా దినోత్సవం)

పాటకు పట్టం కట్టిన ఆలయం

పాటకు పట్టం కట్టి విశ్వవ్యాప్తంగా గుర్తింపును తెచ్చిన ఆలయం జర్మనీ దేశంలోని ఆస్ట్రియాలో ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం మిగిల్చిన విషాద ఛాయలను సంగీతం ద్వారా రూపుమాపిన జర్మన్ భాషా కీర్తనగా 'స్టిల్లే నాఖ్ట్, హీలిగే నాఖ్ట్' అనే పాటకు దక్కుతుంది. కాథలిక్ చర్చ్ ఫాదర్ అయిన జోసెఫ్ మోర్ (1792–1848) రచించిన ఈ కీర్తన (ఇంగ్లిష్‌లో 'సైలెంట్ నైట్ హోలీ నైట్') 1818 డిసెంబర్ 24వ తేదీ రాత్రి తొలిగా ఆస్ట్రియా చర్చ్‌లో ఆలపించారు. ఫ్రాన్సిస్ జేవియర్ గూబర్ అనే పాఠశాల ఉపాధ్యాయుడు 'మోడరేటో' అనే రాగంలో సంగీతం సమకూర్చాడు. గిటార్ వాద్యసహకారంతో 1818 క్రిస్మస్ రాత్రి వేలాది మంది విశ్వాసులకు ఈ పాట నేర్పించాడు. 1890లో వచ్చిన వరదల కారణంగా ఈ దేవాలయం కూలిపోయింది. 1924లో ప్రారంభించి 1937 ఆగస్టు 15న దేవాలయాన్ని పునఃప్రతిష్ఠించారు. నూతనంగా నిర్మించిన ఈ దేవాలయానికి 'సైలెంట్ నైట్ ఛాపెల్' అని నామకరణం చేశారు. గుడి గోపుర భాగం గంట ఆకారంలో నిర్మించారు.



1859లో ఎపిస్కోపల్ చర్చ్ ప్రీస్ట్ జాన్ ఫ్రీమన్ యంగ్ చేసిన ఇంగ్లిష్ అనువాదం 'సైలెంట్ నైట్ హోలీ నైట్' న్యూయార్క్ సిటీలోని ట్రినిటీ చర్చ్‌లో తొలిగా విడుదల చేశారు. ఈ కీర్తనకు మూలం బైబిల్‌లోని లూకా 2:8. దేవదూత గొర్రెల కాపరులకు ఏసు జనన వార్త తెలిపిన ప్రదేశం క్రీస్తుపూర్వం 1230 కాలానికి చెందిన రూతు సేద్యం చేసిన పొలం. రూతు దావీదు మహారాజుకు ముత్తవ్వ. ఏసు వంశావళికి చెందిన పూర్వ మహిళ. ఈ పొలంలోనే గొర్రెల కాపరులు మందలు కాసే చోట దేవదూత ప్రత్యక్షమైన ఘటన ఆధారంగా రచించిన కీర్తన ఇది. 2011లో యునెస్కో వారు ఈ దేవాలయాన్ని పురాతత్వ వారసత్వ నిర్మాణంగా గుర్తించారు. ఎన్నో అంతర్జాతీయ సినిమాల్లో 'సైలెంట్ నైట్' పాటకు అవకాశం దక్కింది. లక్షా 50 వేల పైచిలుకు వేర్వేరు ప్రాంతాల్లో ఈ పాట రికార్డింగ్ చేశారు. డిసెంబరు 24 రాత్రి 300 భాషల్లో ఒకేసారి ఆలపించే ఈ సన్నివేశం ప్రపంచవ్యాప్తంగా ప్రసారం అవుతుంది.

ఒక కీర్తన విశ్వవ్యాప్తంగా గుర్తింపును పొందడమే కాక దాని పేరే దేవాలయానికి రావడం ఒక చారిత్రక ఘటన.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, క్రైస్తవ సాహిత్య పరిశోధకులు

క్లుప్తంగా...

బోర్లు పడక.. అప్పులు తీరక

- రైతు బలవన్మరణం


రాజు

వెల్దుర్తి(తూప్రాన్): పంట కోసం వేసిన బోర్లలో చుక్కనీరు పడక.. అప్పులు తీరక ఒక రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. రామాయిపల్లి గ్రామానికి చెందిన బత్తుల రాజు (40) తన కున్న రెండెకరాల భూమిలో వారం రోజుల కిందట రెండు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. గతంలో అదే భూమిలో సుమారు 8 బోర్లు వేసినా విఫలమయ్యాయి. బోర్లు వేయడానికి, కుటుంబ పోషణకు సుమారు.10 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు పెరిగిపోవడంతో ఎలా తీర్చాలో తెలీక.. రెండు, మూడు రోజులుగా మనస్తాపంతో ఉన్నాడు. అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన కుటుంబానికి గ్రామ పెద్దలే న్యాయం చేయాలంటూ ఒక సెల్ఫీ వీడియో తీసి ఆదివారం రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కామాంధుడికి 20 ఏళ్ల జైలు

- బాలునిపై అత్యాచారం కేసులో తీర్పు

జగిత్యాల జోన్: బాలునిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జగిత్యాల ప్రధాన న్యాయమూర్తి, జిల్లా పోక్సో కోర్టు ఇన్చార్జి జడ్జి నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి కథనం ప్రకారం.. 2019 ఏప్రిల్ 4న జిల్లాలోని మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో కాయలు తెంపుకొందామంటూ అదే గ్రామానికి చెందిన గోగుల సాయికుమార్.. ఒక బాలుడిని వెంటబెట్టుకుని వెళ్లాడు. అక్కడ బాలునిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై బాధితుని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి ఎస్ఐ పృథ్వీధర్ కేసు నమోదు చేశారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి సీఐ రవికుమార్ నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి.. నిందితుడు సాయికుమార్కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆర్కే స్మారక స్థూపం కూల్చివేత


పోలీసులు కూల్చివేసిన ఆర్కే స్మారక స్థూపం

చర్ల: ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో ఒక్కొక్క గ్రామాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లో మావోయిస్టు నేతల స్మారక స్థూపాలను కూడా కూల్చివేస్తున్నారు. తాజాగా సోమవారం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ అలియాస్ ఆర్కే స్మారక స్థూపాన్ని కూల్చివేశారు. బీజాపూర్ జిల్లా కోమటిపల్లి అడవుల్లో 20 అడుగుల వెడల్పు, 62 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఆర్కే స్మారక స్థూపం చుట్టూ జేసీబీతో కందకాలు తవ్వి దాని కింద మందుపాతరలు పెట్టి పేల్చివేశారు.

రైతు ఖాతాల్లోకి | రూ. 530 కోట్ల సన్నాల బోనస్

- కొద్ది రోజుల్లో మరో రూ. 370 కోట్లు
- ఇప్పటివరకు రూ.903 కోట్ల విలువైన 18 ఎల్ఎంటీ సన్నాల కొనుగోలు
- అత్యధికంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సేకరణ.. అత్యల్పంగా ఆదిలాబాద్లో..



సాక్షి, హైదరాబాద్: ఖరీఫ్ సీజన్లో సన్నాలు పండించిన రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన సత్ఫలితాన్నే ఇస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో సన్నధాన్యం పంట గణనీయంగా పెరిగింది. రైతులు తమ తిండి అవసరాల కోసం మిగిల్చుకున్న సన్న ధాన్యం పోను... కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 18.07 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) సన్నాలను విక్రయించారు. సన్నాలు విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం ఇప్పటివరకు రూ.530 కోట్లను బోనస్ రూపంలో జమచేసింది. మరో రూ.373 కోట్లను కొద్దిరోజుల్లోనే జమ చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. ఇప్పటివరకు 3,24,338 మంది రైతులు సన్నాలను విక్రయించినట్లు పౌర సరఫరా శాఖ వర్గాలు తెలిపాయి. ఈ రైతులకు క్వింటాలుకు మద్దతు ధర రూ.2,320తోపాటు రూ.500 బోనస్ కలిపి 2,820 ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రబీ (యాసంగి)లో సన్నాల సాగు పెంచేందుకు రైతులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. వచ్చే సంక్రాంతి వరకు ఖరీఫ్ సీజన్ కొనుగోళ్లు ఉంటాయని భావిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు మరో 2 ఎల్ఎంటీల సన్న ధాన్యం వచ్చే అవకాశం ఉంది.

46 ఎల్ఎంటీల సేకరణ: రాష్ట్రంలో హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో 7,624 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 46,02,099 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఇందులో సన్న రకం 18.07 ఎల్ఎంటీ కాగా, దొడ్డు రకం 27.95 ఎల్ఎంటీ. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ ముగింపు దశకు చేరుకోగా, ఖమ్మం, మహబూబ్నగర్, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో ఇంకా కొనుగోళ్లు సాగుతున్నాయి. సంక్రాంతి వరకు మరో 10 ఎల్ఎంటీల వరకు ధాన్యాన్ని సేకరించే అవకాశం ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు అంచనా వేస్తున్నారు. బోనస్తో సంబంధం లేకుండా... ఇప్పటివరకు కొనుగోలు చేసిన 46.02 ఎల్ఎంటీ ధాన్యానికి రూ.10,675.15 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.9,890.46 కోట్లు రైతుల ఖాతాల్లోకి జమచేశారు. ఇంకా రూ.784.69 కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరాల్సి ఉంది.

అధిక ధరకు విక్రయించిన రైతులు

రాష్ట్రంలో ఈసారి అత్యధికంగా కోటీ 50 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి అయినట్లు ప్రభుత్వం చెపుతోంది. 91 ఎల్ఎంటీలు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసింది. నాణ్యమైన రకాలకు చెందిన బియ్యాన్ని ఇప్పుడే క్వింటాలుకు రూ. 6వేల వరకు విక్రయిస్తున్నారు. ధాన్యం విక్రయాల్లో ఇప్పటివరకు అత్యధికంగా నిజామాబాద్ జిల్లా నుంచి 4,90,906 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. తరువాత స్థానంలో కామారెడ్డి జిల్లాలో 4,36,979 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. ఈ రెండు జిల్లాల్లోనే (ఉమ్మడి నిజామాబాద్) ఏకంగా 9.27 ఎల్ఎంటీల ధాన్యం కొనుగోలు చేయడం గమనార్హం. రాష్ట్రంలో కొనుగోలు చేసిన ధాన్యంలో 20 శాతానికి పైగా ఇక్కడి నుంచే కావడం విశేషం. తరువాత స్థానాల్లో ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. అత్యల్పంగా కేవలం 1951 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే విక్రయించి ఆదిలాబాద్ ఆఖరి స్థానంలో నిలిచింది.

ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లు ఇలా...

సన్నరకం ధాన్యం: 18.07 ఎల్ఎంటీ
దొడ్డు రకం: 27.95 ఎల్ఎంటీ
సన్నధాన్యం విక్రయించిన రైతులు: 3,24,338
దొడ్డు రకం విక్రయించిన రైతులు: 5,39,494
మొత్తం ధాన్యం విలువ: రూ. 10,675.15 కోట్లు
రైతులకు చెల్లించిన మొత్తం: రూ. 9,890.46 కోట్లు
సన్న ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్: రూ. 903.63 కోట్లు
చెల్లించిన మొత్తం: రూ. 529.99 కోట్లు


ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న రైతులు

ఉరితాళ్లతో రైతుల నిరసన

ఇచ్చోడ: రుణమాఫీ కాలేదని.. రైతు భరోసా అందలేదంటూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కే) గ్రామస్తులు ఉరితాళ్లు బిగించుకొని సోమవారం పంట పొలాల్లో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గాడ్గే సుభాష్ మాట్లాడారు. వంద శాతం రుణమాఫీ చేసినట్లు.. సీఎం రేవంత్రెడ్డి అసెంబ్లీ సాక్షిగా పచ్చి అసత్యాలు చెప్పారని ఆరోపించారు. అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని స్పష్టం చేశారు రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు.


కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో బెలూన్లు ఎగురవేసి సింగరేణి ఆవిర్భావ వేడుకలను ప్రారంభిస్తున్న సీఎండీ బలరామ్, డైరెక్టర్లు

ఇతర వ్యాపారాల్లోనూ విస్తరిస్తున్నాం

- విదేశాల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్పై దృష్టి
- సింగరేణి సీఎండీ బలరామ్ వెల్లడి
- కొత్తగూడెంలో ఘనంగా వార్షికోత్సవాలు

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థ మరో 100 సంవత్సరాల పాటు విరాజిల్లేందుకు గాను ఇతర వ్యాపార రంగాల్లోనూ విస్తరించేలా కృషి చేస్తున్నామని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. ఈ దిశలో భాగంగా విదేశాల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (అరుదైన మూలకాలు, ఖనిజాలు) వెలికితీతపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సోమవారం సింగరేణి 136వ ఆవిర్భావ వేడుకలు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలరామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సమీపంలో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ నేడు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో విస్తరించిందని చెప్పారు. ఇంతకాలం బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాగా, ఇప్పుడు ఇతర వ్యాపారాలపై దృష్టి సారించామని తెలిపారు. రామగుండంలో 500 మెగావాట్లు, ఇల్లెందులో 100 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపనకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. సోలార్ విద్యుదుత్పత్తి కోసం కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఒడిశాలోని నైనీ బ్లాక్లోనూ బొగ్గు ఉత్పత్తికి అవసరమైన పర్యావరణ అనుమతులు వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వెంకటేశ్వర రెడ్డి, సత్యనారాయణరావు, వేడుకల నిర్వహణ కన్వీనర్ కోడూరి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్కుమార్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకోళ్ల జబర్దస్తీ!

- రైతుల పొలాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు
- ఈ నెల 26న భూములు వేలం వేస్తున్నట్టు నోటీసులు


రైతు పొలంలో వేలం ప్రకటన ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాల వసూలు కోసం సహకార బ్యాంకు అధికారులు జబర్దస్తీకి దిగుతున్నారు. తనఖాలో ఉన్న భూములను వేలం వేస్తున్నట్టుగా రైతులకు నోటీసులు ఇవ్వడమే గాకుండా, పొలాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. బ్యాంకోళ్ల జబర్దస్తీతో తమ పరువు పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్డీసీసీబీ) అధికారులు కామారెడ్డి జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలం అంకోల్ తండా, సంగెం, మైలారం, దుర్కి, బస్వాయిపల్లి, అంకోల్, హాజీపూర్ తదితర గ్రామాల్లో రైతులకు నోటీసులు జారీ చేశారు. రైతుల భూములను వేలం వేస్తున్నట్టు నోటీసులు జారీ చేశారు. అంతటితో ఆగకుండా కుదువ పెట్టిన భూములను వేలం వేయడానికి తాము అధీనంలోకి తీసుకున్నట్టు కొందరు రైతుల భూముల్లో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూన్లో లింగంపేట మండలంలోని పోల్కంపేట గ్రామంలో రైతుల భూములను వేలం వేస్తున్నట్టు పొలాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయంపై 'సాక్షి' ప్రచురించిన కథనంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి సహకార బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పరువు తీసేలా వ్యవహరించవద్దని ఆదేశించారు. దీంతో రైతుల భూముల వేలం నిలిచిపోయింది. తాజాగా నస్రుల్లాబాద్ మండలంలో సహకార బ్యాంకు అధికారులు తిరిగి అదే పద్ధతిని మొదలుపెట్టారు. ఈనెల 26న పలువురు రైతుల భూములను వేలం వేయనున్నట్టు రైతులకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు.

రైతుల ఆవేదన..: బ్యాంకు అధికారులు తమ భూములను వేలం వేస్తున్నట్టు నోటీసులు ఇవ్వడంతో పాటు భూముల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు బయట అప్పులు చేసి బ్యాంకు రుణాలు తీర్చే ప్రయత్నం చేస్తుండగా, మరికొందరు ఆస్తులు అమ్ముకుని అయినా కడతామని, తమ భూములు వేలం వేసి పరువు తీయద్దని వేడుకుంటున్నారు.

ప్రేమంటూ వేధింపులు.. యువతి బలవన్మరణం


వరుణ్ప్రియ

హుజూరాబాద్: ప్రేమ పేరుతో ఓ యువకుడి వేధింపులు తట్టుకోలేక యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లిలో సోమవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలం ఇప్పల నర్సింగాపూర్కు చెందిన కిల్లి కుమారస్వామి, వసంత కూతురు వరుణ్ప్రియ (18) హన్మకొండలోని మహిళా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెను అదే గ్రామానికి చెందిన అజయ్ (19) మూడేళ్లుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన వరుణప్రియ తల్లిదండ్రులు అజయ్ను మందలించినా.. అతనిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కుమారస్వామి కూతురు వరుణ్ప్రియను.. ఆమె అమ్మమ్మ ఇల్లున్న పెద్దపాపయ్యపల్లిలో వదిలిపెట్టి వచ్చాడు. ఇంట్లో అందరూ వ్యవసాయ పనులకు వెళ్లారు. వారు వచ్చి చూసేసరికే వరుణ్ప్రియ ఇంట్లో ఉరేసుకుని కనిపించింది. అజయ్ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందన్న కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హుజూరాబాద్ సీఐ తిరుమల్గౌడ్ తెలిపారు.

అడవి ఆముదం కాయలు తిని విద్యార్థులకు అస్వస్థత

- వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన
- టీచర్లు వెంటనే స్పందించటంతో తప్పిన ముప్పు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని. (ఇన్సెట్లో) అడవి ఆముదం కాయలు

కాటారం: పాఠశాల ఆవరణలో ఉన్న అడవి ఆముదం చెట్టు కాయలు తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం పోలంపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గతంలో హరితహారంలో భాగంగా పోలంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాటిన అడవి ఆముదం మొక్క ప్రస్తుతం ఏపుగా పెరిగి విరివిగా కాయలు కాసింది. రెండు రోజుల క్రితం ఓ విద్యార్థి ఆ చెట్టు కాయల లోపలి గుజ్జు తిన్నాడు. దాని రుచి బాగుందని చెప్పడంతో సోమవారం పాఠశాల సమయంలో వైష్ణవి, హర్షిత్, రుత్విక్, శ్రీవర్షిణి, హర్ష, వర్షన్, అనిర్విన్యశ్రీ, మహాద్విత అనే విద్యార్థులు కూడా వాటిని తిన్నారు. కొంత సమయానికి వారంతా తీవ్ర కడుపు నొప్పితో వాంతులు, విరేచనాలు చేసుకొన్నారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు సమాచారం అందించి విద్యార్థులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా భూపాలపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి పంపించారు. విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

సంఘటనపై అధికారుల ఆరా..

విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకొని కలెక్టర్ రాహుల్శర్మ ఆరా తీశారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఎంఈఓ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో విద్యార్థుల పరిస్థితిని గుర్తించి ఆసుపత్రికి తీసుకొచ్చిన ఉపాధ్యాయులను, చికిత్స అందించిన వైద్య సిబ్బందిని అభినందించారు.

రీజనల్ రింగ్రోడ్డు అలైన్మెంట్ మార్చాలని బాధితుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

భువనగిరి టౌన్: రీజనల్ రింగ్రోడ్డు అలైన్మెంట్ మార్చాలని యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట బాధితులు సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడారు. ఔటర్ రింగ్ రోడ్డుకు 40 కిలో మీటర్ల దూరంలో రీజనల్ రింగ్రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. 30 కిలోమీటర్ల లోపే ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. తాము వ్యతిరేకిస్తున్నా.. అధికారులు భూ సేకరణ కోసం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పంటలు పండే పచ్చటి భూములను తీసుకొని తమకు ఉపాధిని దూరం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రీజనల్ రింగ్రోడ్డు అలైన్మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని.. లేనిపక్షంలో భూమికి భూమి ఇవ్వాలని కోరారు. తమకు న్యాయం చేయకుండా భూ సేకరణకు ప్రయత్నిస్తే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు.

జిల్లాల్లో సెట్విన్ సెంటర్ల ఏర్పాటు

- సంస్థ ఎండీ వేణుగోపాల్రావు



సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్కే పరిమితమైన సెట్విన్ సంస్థ సేవలను జిల్లాలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న 21 కేంద్రాలకు అదనంగా మరో పది సెంటర్లను జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్రావు తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 21 కేంద్రాలతోపాటు అనుబంధంగా ఉన్న47 కేంద్రాల్లో 57 ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. కొత్తగా స్పోకెన్ ఇంగ్లిష్, ఆటోక్యాడ్, సోలార్ ప్యానల్ ఇన్స్టలేషన్స్అండ్ మెయింటెనెన్స్, మొబైల్ సర్వీసింగ్, ఎల్ఈడీ బల్బులు, టాబ్ల మరమ్మతు, సీసీ కెమెరాల ఏర్పాటు, రిపేరింగ్, డిప్లొమా ఇన్ హార్డ్వేర్ అండ్ నెట్ వర్కింగ్, ట్యాలీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తాజాగా విద్యుత్ వాహనాలకు సంబంధించి ఈ- వెహికిల్ కోర్సును అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఇటీవల హుస్నాబాద్, నల్లగొండ, మహబూబ్నగర్లలో సెట్విన్ సెంటర్లు ప్రాంభించామన్నారు. జనవరిలో జహీరాబాద్తో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం సెట్విన్ ఆధ్వర్యంలో 60 కోర్సుల్లో శిక్షణతో పాటు ఉపాధి కల్పించడానికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ మేళాలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సెట్విన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాదిలో 13,254 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ అందించామని, దాదాపు 80 శాతం మంది అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించామని వేణుగోపాల్రావు చెప్పారు.

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- చిన్నారులకు సెల్ఫోన్లో అశ్లీల చిత్రాలను చూపించిన టీచర్
- చితకబాదిన తల్లిదండ్రులు
- టీచర్ను సస్పెండ్ చేసిన విద్యాశాఖ అధికారులు


ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తండావాసులు

కురవి: విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఓ ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండా గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సక్రాంనాయక్ తండా డీఎస్టీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న డీఎస్ శ్రీను (శ్రీనివాస్) నాలుగో తరగతి చదువుతున్న బాలికలకు కొన్ని రోజులనుంచి సెల్ఫోన్లో అశ్లీల చిత్రాలు చూపిస్తున్నాడు. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో విసిగిపోయిన చిన్నారులు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో సోమవారం తల్లిదండ్రులు పాఠశాలలకు చేరుకుని శ్రీనివాస్కు దేహశుద్ధి చేశారు. ఎంఈఓ ఇస్లావత్ లచ్చిరాంనాయక్ ఆదేశాల మేరకు కాంపల్లి హైస్కూల్ హెచ్ఎం అరుణశ్రీ పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు. అనంతరం డీఈఈఓ రవీందర్రెడ్డికి నివేదిక ఇవ్వడంతో సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులిచ్చారు. అసభ్యకర ప్రవర్తనపై జిల్లా సంక్షేమ శాఖ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, బాలరక్షా భవన్ వారిని విచారణ చేసేందుకు నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీరోలు ఎస్సై నగేశ్ పాఠశాల వద్దకు చేరుకుని పిల్లల తల్లిదండ్రులతో, హెచ్ఎంతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసిరిమాండ్కు తరలించినట్లు ఆయన తెలిపారు.

అమెరికా 'పగ్గాలు' ఎవరి చేతిలో?

డొనాల్డ్ ట్రంప్‌కు అన్నీ తానై ముందుండి నడిపిస్తున్న ఎలాన్ మస్క్ | మస్క్ ప్రధానమంత్రిలా వ్యవహరిస్తారంటూ డెమొక్రాట్ల విమర్శలు | కొట్టిపారేసిన ట్రంప్





అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో హోరాహోరీ పోరులో విజయనాదం చేసిన డొనాల్డ్ ట్రంప్ ప్రెసిడెంట్ పీఠంపై కూర్చున్నాక ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు? పాలన ఎలా ఉంటుంది? అనే ఆసక్తికర అంశాలకంటే మరో అంశం ఇప్పుడు అమెరికాలో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నూతన ప్రభుత్వంలో ఎలాంటి పాత్ర పోషిస్తారనేది ఇప్పుడు అతిపెద్ద చర్చనీయాంశమైంది. కొత్తగా సృష్టించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ(డోజ్)కు సహ సారథిగా కొనసాగాల్సిన మస్క్ ఏకంగా అధ్యక్షుడి నిర్ణయాల్లో కలగజేసుకుంటున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇందుకు బలం చేకూర్చే ఘటనలు తరచూ జరగడం చూస్తుంటే అధ్యక్ష పీఠంపై పేరుకే ట్రంప్ కూర్చున్నా నిర్ణయాధికారం మస్క్‌దేనన్న రాజకీయ పండితుల విశ్లేషణలు ఇప్పుడు సగటు అమెరికన్‌ను ఆలోచనల్లో పడేస్తున్నాయి. మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్ నినాదంతో దూసుకొచ్చి పీఠంపై పెత్తనాన్ని ఖరారుచేసుకున్న ట్రంప్‌కు బదులు సొంత వ్యాపార ప్రయోజనాలే పరమావధిగా నడుచుకునే నయా ప్రపంచ కుబేరుడు మస్క్ ఆలోచనలే ప్రభుత్వ నిర్ణయాలుగా అమలుకాబోతున్నాయని డెమొక్రాట్లు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇందులో నిజమెంతో తెలియాలంటే మరో నాలుగు వారాలు ఆగక తప్పదు.

దోజ్ మొదలు ద్రవ్య వినిమయ బిల్లు దాకా..

టెస్లా సీఈవోగా, ప్రపంచ కుబేరుడుగా సుపరిచిత మస్క్ అమెరికా రాజకీయాల్లో మొత్తం తలదూర్చేసి ట్రంప్‌ను ఎలాగైనా గెలిపించాలని కంకణం కట్టుకున్నారు. వేల కోట్లరూపాయల సొంత డబ్బును ట్రంప్ ప్రచారం కోసం నీళ్లలా ఖర్చుచేశారు. డోజ్‌కు సారథ్యం వహిస్తూ అమెరికా ప్రభుత్వ అనవసర ఖర్చులకు కత్తెర వేసే పనిని తన భుజాలకెత్తుకున్నారు. అంతటితో ఆగకుండా అమెరికా తాత్కాలిక బడ్జెట్ అయిన ద్రవ్య వినిమయ బిల్లులోనూ వేలు పెట్టారు. అమెరికా తలపై షట్‌డౌన్ కత్తి వేలాడుతున్నా సరే ఈ బిల్లు ఆమోదం పొందకూడదని మస్క్ తెగేసి చెప్పారు. మస్క్ తన అభిప్రాయం చెప్పిన కొద్దిసేపటికే ట్రంప్ సైతం అదే పాటపాడటం గమనార్హం. పార్లమెంట్‌లో ఆ బిల్లును వ్యతిరేకించాలని సొంత పార్టీ రిపబ్లికన్ నేతలకు ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి అంశంలో కలగజేసుకోవడం చూస్తుంటే మస్క్ అప్రకటిత ప్రధానమంత్రి హోదా వెలగబెట్టడం ఖాయంగా కనిపిస్తోందని డెమొక్రాట్లతోపాటు కొందరు రిపబ్లికన్ పార్లమెంట్ సభ్యులూ ఆరోపిస్తున్నారు. '''ఎక్స్'ను మస్క్ కొనుగోలుచేశారుకాబట్టి సరిపోయింది. లేదంటే ద్రవ్య బిల్లులో ఏముందో మాకు కూడా తెలిసేది కాదు. 'ఎక్స్'పోస్టుల ద్వారానే బిల్లు వివరాలు తెల్సుకున్నాం''అని రిపబ్లికన్ సెనేటర్ విలియం ఫ్రాన్సిస్ హగెర్టీ వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలను ట్రంప్ ఆదివారం కొట్టిపారేశారు. ఆరిజోనా రాష్ట్రంలోని ఫీనిక్స్ సిటీలో ట్రంప్ పాల్గొన్న అమెరికాఫెస్ట్ కార్యక్రమంలో ప్రేక్షకులు 'అధ్యక్షుడు మస్క్'అంటూ నినాదాలు ఇవ్వడంతో ట్రంప్ స్పందించారు. పీఎం కాకపోతే ఏకంగా ప్రెసిడెంట్ అవుతారని డెమొక్రాట్లు చేసిన వ్యంగ్య వ్యాఖ్యలపై ట్రంప్ మాట్లాడారు. ''మస్క్ ఏనాటికీ అధ్యక్షుడు కాలేడు. నా సీటు భద్రం. ఆయన అమెరికాలో పుట్టలేదుగా. అమెరికా రాజ్యాంగం ప్రకారం అమెరికా గడ్డపై పుట్టిన వ్యక్తికే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉంటుంది''అని ట్రంప్ అన్నారు. మస్క్ దక్షిణాఫ్రికాలో పుట్టారు.

వినూత్న దారిలో వ్యాపార దార్శనికుడు

ఈ-కామర్స్ మొదలు విద్యుత్ వాహనాలు, అంతరిక్ష రంగంలో స్పేస్‌క్రాఫ్ట్ పునర్వినియోగం దాకా పట్టిందల్లా బంగారంగా మార్చిన మస్క్‌కు అమెరికా వ్యాపారవర్గాల్లో, యువతలో ఎనలేని క్రేజ్ ఉంది. అన్ని ఖండాల్లో వ్యాపారాలు, అంతర్జాతీయంగా వ్యాపారదిగ్గజాలు, అగ్రనేతలతో సత్సంబంధాలు, అమెరికా ప్రభుత్వం నుంచి బిలియన్ డాలర్ల భారీ కాంట్రాక్టులు, శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థ, సొంత ఉపగ్రహాలు, సొంత సోషల్‌మీడియా నెట్‌వర్క్‌లతో విశ్వవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించిన మస్క్.. అమెరికా పాలననూ శాసిస్తారని ఇప్పటికే పుకార్లు మొదలయ్యాయి. అగ్రరాజ్యానికి అధినేతగా ట్రంప్ కొనసాగినా సెనేట్ సభ్యులైన రిపబ్లికన్ నేతల ఆర్థిక అవసరాలు తీర్చే నిలువెత్తు ఖజానాగా మస్క్ మారారని వార్తలొచ్చాయి. పార్లమెంట్‌లో రిపబ్లికన్ నేతలు ట్రంప్ కంటే మస్క్ మాటకే ఎక్కువ విలువ ఇచ్చే పరిస్థితులు కనబడుతున్నాయని తెలుస్తోంది. ఇదే జరిగితే త్వరలో కొలువుతీరే కొత్త ప్రభుత్వంలో మస్క్ నిర్ణయాలే ఎక్కువగా అమలుకు నోచుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషణలు వినవస్తున్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీకి సహ సారథిగా ఉంటూ సొంత వ్యాపార ప్రయోజనాలకే మస్క్ పెద్దపీట వేస్తారని డెమొక్రాట్లు ఆరోపిస్తున్నారు. ద్రవ్య వినిమయ బిల్లు తెచ్చిన దిగువసభ స్పీకర్ మైక్ జాన్సన్‌పై మస్క్ బహిరంగంగా విమర్శలు చేయడం చూస్తుంటే ఆయన ఇప్పటికే పరిపాలనలో జోక్యం చేసుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తోంది. అధ్యక్షుడిగా గెలిచిన ట్రంప్‌కు ప్రపంచదేశాధినేతలు ఫోన్ చేస్తే పక్కనే ఉన్న మస్క్‌తోనూ ట్రంప్ ఫోన్ మాట్లాడించడం చూస్తుంటే స్వయంగా ట్రంపే ఆయనను చంకన ఎక్కించుకున్నారని అర్థమవుతోంది.

సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారా?

అమెరికా దేశ ప్రయోజనాలకంటే మస్క్‌సొంత వ్యాపారానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని దిగువసభ సభ్యురాలు డెమొక్రటిక్ నేత రోసా డీలారో ఆరోపించారు. ''చైనాలోని షాంఘైలో టెస్లా కంపెనీ పెట్టుబడులపై అమెరికా పార్లమెంటరీ కమిటీ సమీక్ష జరగాలి. దానిని మస్క్ అడ్డుకుంటున్నారు. దీనిపై మస్క్ సరైన వివరణ ఇవ్వలేదు పైగా ఆమెను పార్లమెంట్ నుంచి బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎవరినీ లెక్కపెట్టని ట్రంప్.. మస్క్‌కు ప్రస్తుతానికి అగ్ర తాంబూలం ఇస్తున్నారు. మరి ఈ సఖ్యత ఎన్నాళ్లు ఉంటుందో చూడాలి మరి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ప్రేమ, సామరస్యమే క్రీస్తు బోధనల సారం

క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని మోదీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ: ప్రేమ, సోదరభావం, సామరస్యమే క్రీస్తు బోధనల సారమని, అందరూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత ఉత్సాహంతో పనిచేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. కేథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఇండియా(సీబీసీఐ) సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ప్రధాని పాల్గొని, మాట్లాడారు. సమాజంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసి, హింసను వ్యాపింపజేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తోటి వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలనే భావనను అందరం అలవర్చుకున్నప్పుడు మాత్రమే 21వ శతాబ్దపు ప్రపంచంలో కొత్త శిఖరాలకు చేరుకోగలమన్నారు. జర్మనీలో క్రిస్మస్ మార్కెట్‌పై దాడి, 2019లో శ్రీలంకలో ఈస్టర్ బాంబు దాడులను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ..ఇటువంటి సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. కేరళలో జన్మించిన జార్జి కూవకడ్‌ను పోప్ ఫ్రాన్సిస్ ఇటీవల కార్డినల్ ప్రకటించడం మనందరికీ గర్వకారణమన్నారు. దేశంలో కేథలిక్ చర్చ్‌లకు ప్రధాన కేంద్రంగా భావించే సీబీసీఐలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొనడం ఇదే మొదటిసారి.

అమెరికా ఏఐ సలహాదారుగా
శ్రీరామ్ కృష్ణన్

ఇండో-అమెరికన్ పారిశ్రామికవేత్తను ఎంపిక చేసిన ట్రంప్



వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికన్ పారిశ్రామికవేత్త, మస్క్ సహాయకుడు శ్రీరామ్ కృష్ణన్ వైట్‌హౌస్ బృందంలో చేరారు. మైక్రోసాఫ్ట్ మాజీ ఉద్యోగి అయిన శ్రీరామ్ కృష్ణన్‌ను ఆఫీస్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీలో కృత్రిమ మేధ విధానాలపై సీనియర్ సలహాదారుగా నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. కృత్రిమ మేధ విధానాన్ని రూపొందించడంలో, సమన్వయం చేయడంలో శ్రీరామ్ కృష్ణన్ సహాయపడతారని, డేవిడ్ సాక్స్‌తో కలిసి పనిచేస్తారని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. ట్రంప్ ప్రకటనపై కృష్ణన్ స్పందించారు. 'మన దేశానికి సేవ చేయడం, కృత్రిమ మేధలో అమెరికా నాయకత్వాన్ని కొనసాగించడం గౌరవంగా భావిస్తున్నా. ఈ అవకాశం ఇచ్చినందుకు డోనాల్డ్ ట్రంప్‌కు ధన్యవాదాలు'అని ట్వీట్ చేశారు.

తమిళనాడు నుంచి...

శ్రీరామ్ కృష్ణన్ తమిళనాడులోని ఎస్ఆర్ఎం వల్లియమ్మై ఇంజనీరింగ్ కళాశాలలో చదివారు. మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, ట్విట్టర్‌లలో పనిచేశారు. ఇటీవలే ఆండ్రీసెన్ హోరోవిట్జ్ (ఎ 16 జెడ్)లో సాధారణ భాగస్వామిగా చేరారు. ఫేస్‌బుక్‌లో మొబైల్ యాప్ అడ్వర్టైజింగ్ వేదికను విస్తరించడంలో కీలకంగా వ్యవహరించారు. ఎలన్‌మస్క్ ట్విట్టర్‌ను (ఇప్పుడు ఎక్స్)ను స్వాధీనం చేసుకున్నప్పుడు కీలకంగా పనిచేసిన కృష్ణన్ ఆయనతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. ఆ తరువాత ఆండ్రీసెన్ హోరోవిట్జ్ (ఎ 16జెడ్)లో సాధారణ భాగస్వామి అయ్యారు.



5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం

న్యూఢిల్లీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 5, 8 తరగతుల విద్యార్థులకు నో డిటెన్షన్ విధానాన్ని కేంద్రం రద్దు చేసింది. ఈ రెండు తరగతుల్లో ఫైనల్ పరీక్షలో ఫెయిలైనప్పటికీ విద్యార్థులు తదుపరి తరగతుల్లో కొనసాగేందుకు ఇప్పటిదాకా వీలుండేది. ఇకపై అలా కాదు.. '5వ తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ఫైనల్ పరీక్షా ఫలితాలు వెలువడిన రెండు నెలల్లోగా మళ్లీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించాలి. ఆ పరీక్షలోనూ ఫెయిలైతే వారిని తిరిగి 5వ తరగతిలోనే కొనసాగించడం తప్పనిసరి. 8వ తరగతి ఉత్తీర్ణత సాధించని వారికీ ఇదే వర్తిస్తుంది. రెండోసారి పరీక్ష రాసే విద్యార్థిని క్లాస్ టీచర్, తల్లిదండ్రులు మార్గదర్శకత్వంలో పరీక్షలకు సమాయత్తం చేయాలి. విద్యార్థి ఏ విషయంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి, ఆయా అంశాల్లో ప్రావీణ్యం సాధించేందుకు ప్రోత్సహించాలి'అని కేంద్రం విడుదల చేసిన గజెట్ పేర్కొంది. అయితే, ఎలిమెంటరీ విద్యను పూర్తి చేయకుండా ఏ ఒక్కరినీ స్కూల్ నుంచి తొలగించే ప్రసక్తే లేదని కూడా కేంద్రం స్పష్టం చేసింది. విద్యా హక్కు చట్టానికి 2019లో చేపట్టిన సవరణతో ఇప్పటికే 16 రాష్ట్రాలు, 2 రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు 5, 8 తరగతులకు 'నో డిటెన్షన్ విధానం'రద్దు చేశాయి. విద్య రాష్ట్రాల పరిధిలోని అంశమైనందున, గజెట్‌ను అనుసరించి రాష్ట్రాలు ఈ విషయంలో తగు చర్యలు చేపట్టాలని కోరింది.

అసద్ భార్య విడాకుల పిటిషన్


రష్యాలో నివసించడంపై ఆస్మా అసంతృప్తి



మాస్కో: పదవీచ్యుత సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ భార్య ఆస్మా(49) విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రష్యాను వీడి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కూడా ఆమె అభ్యర్థించారు. ఆమె దరఖాస్తును మాస్కోలోని న్యాయస్థానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ నెలారంభంలో తిరుగుబాటుదార్లు అసద్ ప్రభుత్వాన్ని కూలదోయడం, అధ్యక్షుడు రష్యాకు కుటుంబం సహా పలాయనం కావడం తెలిసిందే. రష్యా ప్రభుత్వం ఆ కుటుంబానికి ఆశ్రయం కల్పించింది. అయితే, వారిపై పలు ఆంక్షలను విధించింది. అసద్, ఆయన కుటుంబీకులను మాస్కో వీడి వెళ్లరాదని, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదని కట్టడి చేసింది. అసద్ తమ వద్ద దాచిన 270 కిలోల బంగారం, సుమారు రూ.17 వేల కోట్ల ధనంతోపాటు, మాస్కోలోని 18 అపార్టుమెంట్లు తదితర ఆస్తులను రష్యా ప్రభుత్వం స్తంభింపజేసినట్లు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్మా అల్-అసద్ రష్యాలో ఉండేందుకు అంగీకరించడం లేదని, పుట్టి పెరిగిన లండన్ వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారని సమాచారం. సిరియన్ల కుటుంబంలో లండన్‌లో జన్మించిన ఆస్మా అక్కడే చదువుకున్నారు. 25 ఏళ్ల వయస్సులో 2000వ సంవత్సరంలో సిరియా వెళ్లారు. అదే ఏడాది అసద్‌తో ఆమె వివాహమైంది. ఆమెకు ద్వంద పౌరసత్వం ఉంది. ఇలా ఉండగా, అసద్ సోదరుడు మహెర్ అల్-అసద్ అతడి కుటుంబానికి రష్యా అధికారికంగా ఆశ్రయం కల్పించలేదు. ఆయన దరఖాస్తు పరిశీలనలో ఉందని చెబుతున్నారు. మహెర్ కుటుంబాన్ని గృహ నిర్బంధంలో ఉంచి, ఆస్తుల్ని స్తంభింపజేసినట్లు చెబుతున్నారు.

ఏడాదిన్నరలో రికార్డ్‌స్థాయి నియామకాలు

యువతకు దాదాపు 10 లక్షల శాశ్వత ఉద్యోగాలు
- రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్య



న్యూఢిల్లీ: గడచిన ఏడాదిన్నర స్వల్పకాలంలోనే రికార్డుస్థాయిలో దాదాపు 10 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని ప్రధాని మోదీ ప్రకటించారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా మరో 71వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించిన సందర్భంగా వర్చువల్‌గా సోమవారం ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ''కేవలం ఒకటిన్నర సంవత్సరాల కాలంలో 10లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. గతంలో ఏ ప్రభుత్వమూ ఇంత తక్కువకాలంలో ఇంతటి భారీస్థాయిలో ఉద్యోగ కల్పన చేపట్టలేదు. మిషన్ మోడ్‌లో చేపట్టిన ఈ నియామక ప్రక్రియ నిజంగా ఒక రికార్డ్. యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ మా ప్రభుత్వ విధాన నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, పథకాల్లో యువతకు పెద్దపీటవేస్తున్నాం. అత్యంత పారదర్శకంగా, నిజాయతీగా నియామక క్రతువు కొనసాగుతోంది. రోజ్‌గార్ మేళాలు యువత సాధికారత పెంపొందిస్తూ వారిలోని సామర్థ్యాలను వెలికితీస్తున్నాయి. నేటి భారతీయ యువత పూర్తి ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. ప్రతి రంగంలోనూ విజయపతాక ఎగరేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిలో మహిళలు అధికంగా ఉన్నారు. సాకారమవుతున్న మహిళా సాధికారతకు ఇది ప్రబల నిదర్శనం. ప్రతి రంగంలో మహిళల స్వావలంబనే మా ప్రభుత్వ ధ్యేయం. 26 వారాల ప్రసూతి సెలవులు మహిళలు కెరీర్‌కు ఎంతగానో దోహదపడుతున్నాయి. పీఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన గృహాల్లో మెజారిటీ ఇళ్లకు మహిళలే యజమానులుగా ఉన్నారు. మహిళల సారథ్యంలో అభివృద్ధి దేశంలో సాకారమవుతోంది. భారతీయ యువత నైపుణ్యాలు, శక్తియుక్తులను పూర్తి స్థాయిలో సద్వినియోగంచేసుకునేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. స్టార్టప్ ఇండియా కావొచ్చు, డిజిటల్ ఇండియా కావొచ్చు, అంతరిక్ష రంగంలో, రక్షణ రంగంలో సంస్కరణల్లో ప్రతి విభాగంలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చాం. విద్యాభ్యాసం మాతృభాషలో జరిగితేనే మెరుగైన విద్యాసముపార్జన సాధ్యం. రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో నెగ్గుకురావడానికి భాష అనేది ఒక అవరోధంగా ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 13 ప్రధాన భారతీయ భాషల్లో ప్రవేశ, పోటీ పరీక్షలను నిర్వహిస్తోంది''అని మోదీ అన్నారు.

గ్రామీణ భారతం కోసం చరణ్ సింగ్ కృషిచేశారు

''మాజీ ప్రధాని దివంగత చరణ్ సింగ్ జయంతి సోమవారం జరుపుకున్నాం. గ్రామీణ భారతావని అభివృద్ధి కోసం చరణ్ సింగ్ ఎంతగానో శ్రమించారు. ఆయన చూపిన స్ఫూర్తిపథంలో మా ప్రభుత్వం నడుస్తోంది. గ్రామాల్లోనూ ఉపాధి కల్పిస్తూ స్వయంఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. ఈ ఏడాదిలోనే మా ప్రభుత్వం చరణ్ సింగ్‌కు భారతరత్న ఇవ్వడం మాకెంతో గర్వకారణం''అని మోదీ అన్నారు. ''శ్రమించే తత్వం, తెగువ, యువత నాయకత్వ లక్షణాలే నేటి భారత్‌ను ముందుకు నడిపిస్తున్నాయి. ప్రతిభ గల యువతలో సాధికారతను పెంచుతూ 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను సాకారంచేసే దిశగా మా ప్రభుత్వం విధానపర నిర్ణయాలను అమలుచేస్తోంది. ఇప్పుడు ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ త్వరలో మూడోస్థానానికి ఎదగడం ఖాయం''అని మోదీ అన్నారు.

పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపైకి
దూసుకెళ్లిన లారీ

ఇద్దరు పసికందులు సహా ముగ్గురు మృతి

ఆరుగురికి గాయాలు

పుణే: పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపై లారీ దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురు గాయాలపాలయ్యారు. మహారాష్ట్రలోని పుణే నగరంలో ఆదివారం అర్ధరాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని అమరావతికి చెందిన కార్మికులు వారి కుటుంబాలతోపాటు రెండు రోజుల క్రితం ఉపాధి కోసం పుణేకు వచ్చారు. వఘోలి ప్రాంతంలోని కెస్నాడ్ ఫటా పుట్‌పాత్‌పై వీరంతా నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 12.55 గంటల సమయంలో అదుపు తప్పిన ఓ ట్రక్కు పుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపైగా దూసుకెళ్లింది. ఘటనలో రెండేళ్లలోపు ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు చనిపోగా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ గజానన్ టొట్రేను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. ఘటన సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నట్లు భావిస్తున్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

హసీనాను అప్పగించండి

భారత్‌ను కోరిన బంగ్లాదేశ్



షేక్ హసీనా

ఢాకా: ఎగసిన విద్యార్థుల నిరసనలు, ఆందోళనలతో దేశం వీడి భారత్‌లో తలదాచుకుంటున్న తమ దేశ మాజీ మహిళా ప్రధానమంత్రి షేక్ హసీనాను అప్పగించాలని పొరుగుదేశం బంగ్లాదేశ్ మోదీ ప్రభుత్వాన్ని కోరింది. 16 ఏళ్ల పాలనకు విద్యార్థుల ఉద్యమం చరమగీతం పాడటంతో ఆగస్ట్ ఐదో తేదీన ఢాకా నుంచి హసీనా హుటాహుటిన ఢిల్లీకి వచ్చి రహస్య ప్రదేశంలో ఆశ్రయం పొందుతున్న విషయం విదితమే. బంగ్లాదేశ్‌లో మానవత్వాన్ని మంటగలుపుతూ మారణహోమానికి పాల్పడ్డారంటూ హసీనా, ఆమె కేబినెట్‌లోని నాటి మంత్రులు, సలహాదారులు, సైనిక, పౌర అధికారులపై బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యూనల్(ఐసీటీ) అరెస్ట్ వారెంట్లు జారీచేసిన నేపథ్యంలో అక్కడి తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. ''చట్టపరమైన విచారణను ఎదుర్కొనేందుకు, ఆమెను విచారించేందుకు హసీనాను మాకు అప్పగించండి'' అంటూ అధికారికంగా దౌత్యపర నోట్‌ను భారత్‌కు సోమవారం పంపినట్లు బంగ్లాదేశ్ విదేశీవ్యవహారాల శాఖ సలహాదారు తౌహిద్ హొస్సేన్ ఢాకాలో మీడియాతో చెప్పారు. హోం శాఖ సలహాదారు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ జహంగీర్ ఆలం ఆదేశాల మేరకు ఈ నోట్‌ను సిద్ధంచేసి భారత్‌కు పంపించారు. బంగ్లాదేశ్, భారత్ మధ్య వ్యక్తుల పరస్పర అప్పగింత ఒప్పందం అమల్లో ఉన్నందున ఈ ఒప్పందంలోభాగంగా హసీనాను తమకు అప్పగించాలని జహంగీర్ పేర్కొన్నారు. హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తామని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహదారు మొహమ్మద్ యూనుస్ చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వం కొలువుతీరి 100 రోజులు పూర్తయిన సందర్భంగా యూనుస్ నవంబర్‌లో ప్రకటన చేశారు. ''ప్రతి చావుకు న్యాయం జరగాల్సిందే. నియంత షేక్ హసీనాను తిరిగి అప్పగించాలని కోరతాం''అని ఆయన అన్నారు. అప్పగింత ఒప్పందంలోని లోపాలను సాకుగా చూపి తిరిగి పంపడం కుదరదని భారత్ చెబితే ఊరుకునేది లేదని బంగ్లాదేశ్ న్యాయ శాఖ సలహాదారులు ఆసిఫ్ నజ్రుల్ వ్యాఖ్యానించారు. హసీనా ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలు, అల్లర్లు, పోలీసులతో ఘర్షణ ఘటనల్లో విద్యార్థులు, కార్మికులు సహా 1,500 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 20,000 మంది గాయపడ్డారు.

ఫిలిబిత్‌లో ఎదురుకాల్పులు

ముగ్గురు అనుమానిత ఖలిస్తానీ ఉగ్రవాదుల మృతి

పిలిభిత్/చండీగఢ్: గురుదాస్‌పూర్‌లో గ్రెనేడ్ దాడికి పాల్పడిన ముగ్గురు అనుమానిత ఖలిస్తానీ ఉగ్రవాదులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఖలిస్తాన్ జిందాబాద్ ఫోర్స్ సభ్యులు, ఉత్తరప్రదేశ్-పంజాబ్ పోలీసుల బృందానికి మధ్య సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురూ చనిపోయారని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ పేర్కొన్నారు. మధ్య పిలిభిత్‌లోని పురాన్‌పూర్ ప్రాంతంలో ఎదురుకాల్పులు జరిగాయని, మృతులు ముగ్గురిని వరీందర్ సింగ్ అలియాస్ రవి (23), గుర్విందర్ సింగ్ (25), జషన్ ప్రీత్ సింగ్ అలియాస్ ప్రతాప్ సింగ్ (18)గా గుర్తించామన్నారు. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, చికిత్స నిమిత్తం వెంటనే పురాన్‌పూర్‌కు పీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించి ముగ్గురూ మరణించారని తెలిపారు. వారి నుంచి రెండు ఏకే-47 రైఫిళ్లు, రెండు గ్లాక్ పిస్తోళ్లు, భారీగా మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లోని పోలీసు స్థావరాలపై జరిగిన గ్రెనేడ్ దాడుల్లో ఈ టెర్రర్ మాడ్యూల్ ప్రమేయం ఉందని డీజీపీ చెప్పారు.

అంతరిక్షంలో ఉన్నా
మాకూ సెలవు కావాలి

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమైన వ్యోమగాములు



'సెలవు కావాలి'. పండుగలు, పెళ్లిళ్లు, ముఖ్యమైన సందర్భాల్లో ఉద్యోగి నోట వినిపించే మొట్టమొదటి మాట ఇది. ప్రపంచదేశాలు అన్ని చోట్లా ఇదే వినతి. ఇప్పుడు ఈ విన్నపం భూమిని దాటి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికీ చేరింది. క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకల కోసం తాము కూడా విధులకు గైర్హాజరై సెలవు పెడతామని ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లోని ఆస్ట్రోనాట్స్, కాస్మోనాట్స్ తెగేసి చెప్పారు. వీళ్ల సెలవు అభ్యర్థనకు ఇప్పటికే ఆమోదముద్ర పడిందోఏమో క్రిస్మస్, కొత్త ఏడాది సంబరాలకు వ్యోమగాములంతా సిద్ధమైపోయారు. ప్రత్యేకంగా క్రిస్మస్, న్యూ ఇయర్ విందు కోసం ఇప్పటికే ప్యాక్ చేసి పంపించిన ఆహారపదార్థాలు తినేందుకు నోరూరుతోందని అక్కడి భారతీయమూలాలున్న అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ చెప్పారు. ఐఎస్ఎస్‌లోని ఏడుగురు వ్యోమగాముల బృందం క్రిస్మస్, జనవరి ఒకటిన తమ రోజువారీ శాస్త్రీయ పరిశోధనలు, ప్రయోగాలను కాసేపు పక్కనబెట్టి సంబరాల్లో తేలిపోతారని తెలుస్తోంది. తాజాగా ఐఎస్ఎస్‌కు వచ్చిన స్పేస్ఎక్స్ డ్రాగన్ 2,700 కేజీల కార్గోలో వ్యోమగాముల కోసం విడి విడిగా వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల నుంచి గిఫ్టులు వచ్చాయి. స్పెషల్ మీల్స్ తింటూ కుటుంబంతో వీడియో కాల్స్ మాట్లాడుతూ వ్యోమగాములు సరదాగా గడపనున్నారు. ఇప్పటికే హాలిడే మూడ్‌ను తెస్తూ సునీత, డాన్ పెటిట్‌లు శాంటా టోపీలు ధరించిన ఫొటో ఒకటి తాజాగా షేర్‌చేశారు. బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో ఐఎస్ఎస్‌కు వచ్చిన సునీతా విలియమ్స్ తాము వచ్చిన వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా తిరిగి భూమికి రాలేక అక్కడే చిక్కుకుపోయారు. నెలల తరబడి అక్కడే ఉండిపోయిన సునీతకు క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు కాస్తంత ఆటవిడుపుగా ఉండబోతున్నాయి.

- వాషింగ్టన్

ఒమర్‌కు సొంతపార్టీలో
నిరసన గళం

జమ్మూ: జమ్మూకశ్మీర్ రిజర్వేషన్లలో ఎస్టీ జాబితాలో పహారీలను చేర్చి, ఓబీసీ జాబితాను సరిచేయాలన్న కేంద్రం నిర్ణయం అక్కడి ప్రధాన వర్గాలైన కశ్మీరీలు, డోగ్రాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ సమస్యపై వెంటనే స్పందించాల్సిందేనంటూ అధికార నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ సయ్యద్ ఆగా రుహుల్లా సీఎం ఒమర్ అబ్దుల్లాకు గట్టి హెచ్చరికలు పంపారు. ఓబీసీ, ఎస్టీ రిజర్వేషన్లపై కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తేకుంటే సీఎం నివాసం ఎదుట ధర్నా చేపడతానని ఆయన బెదిరించారు. స్పందించిన సీఎం ఒమర్.. కీలకమైన ఈ అంశంపై హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందంటూ ఆయన, ఎంపీ రుహుల్లా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. పహారీలను ఎస్టీ జాబితాలో చేర్చిన పక్షంలో ఓపెన్ మెరిట్ కోటా 40 శాతానికి పడిపోనుంది. ఇది తమ పట్ల వివక్ష చూపడమేనని కశ్మీరీలు, డోగ్రాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌హెచ్ఆర్సీ చైర్మన్‌గా
వి.రామసుబ్రమణియన్

సభ్యులుగా ప్రియాంక్ కనూంగో, డాక్టర్ బిద్యుత్ రంజన్ సారంగి



న్యూఢిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ కొత్త చైర్మన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వి.రామసుబ్రమణియన్ నియమితులయ్యారు. జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా పదవీకాలం జూన్1తో ముగియడంతో ఎన్‌హెచ్ఆర్సీ చైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉంది. కొత్త చైర్‌పర్సన్ ఎంపిక కోసం డిసెంబర్ 18న సమావేశమైన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ నిర్ణయం మేరకు రాష్ట్రపతి నియమించారు. చైర్మన్ రామసుబ్రమణియన్‌తోపాటు సభ్యులుగా ప్రియాంక్ కనూంగో, డాక్టర్ బిద్యుత్ రంజన్ సారంగి (రిటైర్డ్)లను నియమిస్తున్నట్లు ఎన్‌హెచ్ఆర్సీ తెలిపింది. కనూంగో గతంలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) చైర్‌పర్సన్‌గా పనిచేశారు. గతంలో హక్కుల సంఘానికి అధిపతులుగా పనిచేసిన మాజీ సీజేఐలలో హెచ్ఎల్ దత్తు, కేజీ బాలకృష్ణన్ ఉన్నారు.



నీతూ బాయి ఆటకట్టిస్తాం..
గంజాయి డాన్‌గా పేరొందిన నీతూ బాయిని ఎట్టిపరిస్థితుల్లోనూ పట్టుకుని తీరుతామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి చెప్పారు. -8లో



... కోటీశ్వరులను చేస్తాం
ప్రతి మహిళను మహాలక్ష్మిలా గౌరవించడంతో పాటు వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
29.0/19.0
వాతావరణం
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.

బల్దియా బడ్జెట్ రూ. 8,440 కోట్లు



- క్యాపిటల్ వ్యయం రూ.4,440 కోట్లు
- స్టాండింగ్ కమిటీ ఆమోదం
- త్వరలో పాలకమండలి ముందుకు..

రెవెన్యూ వ్యయం రూ.4,000 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2025–26) రూ.8,440 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ప్రత్యేక సమావేశం ఆమోదం తెలిపింది. సోమవారం మేయర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో..గత ప్రత్యేక సమావేశం ముందుంచిన రూ.8,340 కోట్ల బడ్జెట్‌కు అదనంగా వంద కోట్లు పెంచి రూ.8,440 కోట్లుగా మార్చారు. బడ్జెట్‌ను వ్యతిరేకించే సభ్యులతో సమావేశానికి ముందు మేయర్ సంప్రదింపులు జరిపి ఆమోదం పొందేలా చేయగలిగారు. ఈ బడ్జెట్ సైతం వాస్తవికంగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నడుస్తున్న ఆర్థిక సంవత్సర (2024–25)బడ్జెట్ రూ.7,937 కోట్లు కాగా, దాన్ని రూ.8,118 కోట్లకు రివైజ్ చేశారు. ఈ ముసాయిదా బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడంతో జనవరిలో పాలక మండలి సమావేశం ముందుంచనున్నారు.

ఇంకా..
గృహ నిర్మాణం కోసం రూ.300 కోట్లు, 15వ ఆర్థిక సంఘం ఎన్‌సీఏపీ గ్రాంట్లుగా మరో రూ.140 కోట్లు బడ్జెట్‌లో విడిగా ప్రస్తావించారు. ఈ రెండూ కేంద్ర ప్రభుత్వం నుంచి అందే నిధుల్ని అంచనా వేసి, ప్రతిపాదించారు.

పొంతన ఉందా?
గ్రేటర్‌లో ఆస్తిపన్ను వ్యత్యాసాలు భారీగా ఉన్నాయి. ఆస్తిపన్ను ఆదాయం ఇంకా పెంచుకునే అవకాశాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. అలాగే ట్రేడ్ లైసెన్సుల ఫీజులు, ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాల్ని తక్కువగా చూపారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లలో వాస్తవంగా ఎన్ని వస్తాయో చెప్పలేమంటున్నారు. అలాగే భవన నిర్మాణ ఫీజులను అంచనా వేయడమూ కష్టమే అంటున్నారు. మొత్తానికి రెవెన్యూ ఆదాయం రూ.4,445 కోట్లు, క్యాపిటల్ ఆదాయం రూ. 4,440 కోట్లుగా పేర్కొన్నారు. రెవెన్యూ ఆదాయంలో రూ.445 కోట్లు మిగులుగా పేర్కొన్నారు. దాన్ని తిరిగి క్యాపిటల్ ఆదాయంలో చూపారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీతప్రవీణ్ ముదిరాజ్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహా బేగం, చింతల విజయ శాంతి, కంది శైలజ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతిపాదనల మేరకు రూపాయి రాక, పోకల్లో ముఖ్యాంశాలిలా..

రూపాయి రాక..

అంశం	నిధులు (రూ.కోట్లు)
ఆస్తిపన్ను	2029.81
భవన నిర్మాణ ఫీజులు	1201.15
రెవెన్యూగ్రాంట్లు	800.00
మ్యుటేషన్ ఫీజులు	105.00
ట్రేడ్ లైసెన్స్ ఫీజులు	112.00
ప్రకటనల ఫీజులు	60.70
15వ ఆర్థికసంఘం నిధులు	279.00
రాష్ట్రప్రభుత్వ గ్రాంట్లు	3000.00
అప్పులు	700.00


రూపాయి పోక..

అంశం	(నిధులు రూ.కోట్లు)
వీధి దీపాలు	344.00
అప్పులు, వడ్డీల చెల్లింపులు	1252.90
చెత్త నిర్వహణ	687.00
భూసేకరణ	283.00
నాలాలు	408.00
ఫ్లై ఓవర్లు, రోడ్లు, (హైసిటీ)	1690.00
పచ్చదనం (గ్రీన్ బడ్జెట్)	453.00
పారిశుధ్యం	226.00
ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్	307.00

'రియల్' డౌన్.. మనమే టాప్!

దేశంలోని 9 నగరాల్లో క్షీణత...నగరంలో అత్యధికం

- తాజా త్రైమాసిక ఫలితాలపై అంచనాలు
- వెల్లడించిన ప్రాప్ ఈక్విటీ రిపోర్ట్



సాక్షి, సిటీబ్యూరో: రియల్ ఎస్టేట్ రంగం తీరుతెన్నులపై గత అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ తుది త్రైమాసిక ఫలితాలు రానున్న తరుణంలో...దేశంలోని 9 నగరాల్లో గృహ విక్రయాలు క్షీణించగా ఈ క్షీణత విషయంలో హైదరాబాద్ అగ్రగామిగా ఉన్నట్టు ప్రాప్ ఈక్విటీ తాజా నివేదిక వెల్లడించింది.

తగ్గుదల అంచనాలివీ...
ప్రస్తుత డౌన్ ట్రెండ్ ప్రకారం..ఈ త్రైమాసికం ముగిసే సరికి ఈ నగరాల్లో విక్రయాల సంఖ్య 1.08 లక్షల యూనిట్లు వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. తొమ్మిది నగరాల్లోని రెసిడెన్షియల్ ప్రాపర్టీల మొత్తం విక్రయాలు గత ఏడాది ఇదే కాలంలో 1,37,225 యూనిట్ల నుంచి..ప్రస్తుత త్రైమాసికంలో 1,08,261 యూనిట్లకు తగ్గే అవకాశం ఉంది. ఈ తగ్గుదల ఉన్న నగరాల్లో ఢిల్లీ ముంబై, నవీ ముంబై, కోల్‌కతా, బెంగళూరు, పుణే, హైదరాబాద్, చెన్నై, థానే ఉన్నాయి.

డౌన్ ట్రెండ్‌లో సిటీ టాప్...
మిగిలిన నగరాలతో పోలిస్తే నగరంలో గృహాల అమ్మకాలు గరిష్ఠంగా తగ్గే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. హైదరాబాద్‌లో విక్రయాలు గత 2023 అక్టోబర్–డిసెంబర్ మధ్య కాలంలో 24,044 యూనిట్ల నుంచి ఏకంగా 47 శాతం తగ్గి 12,682 యూనిట్లకు పడిపోయాయని అంచనా. ఇక బెంగళూరులో విక్రయాలు 13 శాతం తగ్గి 17,276 యూనిట్ల నుంచి 14,957 యూనిట్లకు చేరుకోగా, చెన్నైలో 4,673 యూనిట్ల నుంచి 9 శాతం తగ్గి 4,266 యూనిట్లకు చేరుకోవచ్చు. అలాగే ముంబైలో గృహాల విక్రయాలు 27 శాతం తగ్గి 13,878 యూనిట్ల నుంచి 10,077 యూనిట్లకు పడిపోనున్నాయి.

మూలాలు పటిష్టం...ఇది తాత్కాలికం..
అధిక బేస్ ఎఫెక్ట్ కారణంగా విక్రయాలు తగ్గుముఖం పట్టాయని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపక సీఈఓ సమీర్ జసుజా అంటున్నారు. 'విక్రయాలు పడిపోయినప్పటికీ, సంఖ్యలను నిశితంగా పరిశీలిస్తే, 2024లో సరఫరా–డిమాండ్ నిష్పత్తి 2023లో లాగే ఉంది. ఈ పరిణామాలు రియల్ ఎస్టేట్ రంగం మూలాలు బలంగా ఉన్నాయని సూచిస్తున్నాయి' అని జసుజా విశ్లేషిస్తున్నారు.

వేగంగా దూసుకొచ్చి.. బైకుని ఢీకొట్టి..



శివాని(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం

- ఔటర్ సర్వీస్ రోడ్డులో బైక్‌ను ఢీ కొట్టిన కారు
- కారును అతివేగంగా నడపడం వల్లే ప్రమాదమన్న పోలీసులు

గచ్చిబౌలి: ఓ యువకుడి నిర్లక్ష్యపు డ్రైవింగ్..మితిమీరిన వేగం కారణంగా బీటెక్ విద్యార్థిని దుర్మరణం పాలైంది. మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం.. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన నర్సయ్య, పూజ దంపతుల రెండో కుమార్తె ఐరేని శివాని(21) గండిపేట్‌లోని సీబీఐటీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతోంది. గండిపేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. నిజాంసాగర్‌లోని నవోదయ స్కూల్ 10వ తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళనం కోసం ఈ నెల 22న ఉదయం 4.30 గంటలకు హాస్టల్ నుంచి బయలుదేరింది. తిరిగి రాత్రి 12 గంటలకు కూకట్‌పల్లిలో బస్సు దిగి హాస్టల్‌కు వెళ్లేందుకు తన స్నేహితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకట్‌రెడ్డిని పిలిచింది. ఇద్దరు కలిసి డిన్నర్ చేసి హాస్టల్‌కు బయలుదేరారు. రాత్రి 1.30 గంటల సమయంలో నానక్‌రాంగూడ రోటరీ నుంచి నార్సింగ్ సర్వీస్ రోడ్డులో బైకుపై వెళ్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన స్కోడా కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో శివాని, వెంకట్‌రెడ్డి ఎగిరి కిందపడ్డారు. తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరిని 108 అంబులెన్స్‌లో కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శివాని మృతిచెందినట్లు అక్కడి డాక్టర్లు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలతో ఉన్న వెంకట్‌రెడ్డిని మెరుగైన చికిత్స కోసం మదీనాగూడలోని ఓ హాస్పిటల్‌లో చేర్పించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. నగరంలోని ఓ ఆస్పత్రిలో పనిచేసే వైద్యుని కుమారుడు శ్రీకాలేష్ (19) కారును అతి వేగంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని తేలింది. దీంతో అతన్ని అరెస్ట్ చేసి, స్కోడా కారును స్వాధీనం చేసుకున్నారు. బ్రీత్ ఎనలైజర్ చేయగా ఎలాంటి ఆల్కహాల్ తాగలేదని నిర్ధారణ అయిందని, అతి వేగమే ప్రమాదానికి కారణమై ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు. కొండాపూర్‌లో నివాసం ఉండే శ్రీకాలేష్ అమెరికా నుంచి వచ్చిన తన స్నేహితులను నార్సింగిలో డ్రాప్ చేసేందుకు కారులో బయలుదేరగా మార్గమధ్యలో ప్రమాదం చోటు చేసుకుంది. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

శ్రీతేజ్‌ను పరామర్శించిన మేయర్ విజయలక్ష్మి



ఆస్పత్రికి వస్తున్న మేయర్ విజయలక్ష్మి తదితరులు

రహమత్‌నగర్: సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీతేజ్‌ను సోమవారం నగర మేయర్ విజయలక్ష్మి, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడి ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

27, 28 తేదీల్లో ఐఎంఏ సదస్సు

సుల్తాన్‌బజార్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సదస్సు ఈ నెల 27, 28, తేదీలలో నిర్వహించనున్నట్లు ఐఎంఏ నాట్కో చైర్మన్ డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ దిలీప్ బానుశాలి తెలిపారు. కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరాబాద్ సిటీ బ్రాంచ్ వార్షిక ఆల్ ఇండియా మెడికల్ కాన్ఫరెన్స్ ఉత్సవ్–2024ను గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పీవీకి పుష్పాంజలి


మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు చిన్నారులు పుష్పాంజలి ఘటించారు. ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞాన భూమి వద్ద జరిగిన కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులతో పాటు పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు, పీవీ కుటుంబ సభ్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.



భాగ్యనగర్ కా బెనగళ్..

శ్యామ్ బెనగళ్‌కు నగరంతో విడదీయలేని బంధం

- చదువు..తొలి సినిమా అనుభవమూ ఇక్కడే..



సాక్షి, సిటీబ్యూరో: విఖ్యాత సినీ దర్శకుడు శ్యామ్ బెనగళ్‌కు నగరంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన చదువు ఇక్కడే కొనసాగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని నిజాం కళాశాల నుంచి ఆర్థిక శాస్త్రంలో శ్యామ్ బెనగళ్ పట్టభద్రుడయ్యాడు. అదే సమయంలో ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని ప్రారంభించారు.

నాన్నే తొలి గురువు...
నగరంలో ఉండగానే తన సినిమా ప్రయాణాన్ని ప్రారంభించారు శ్యామ్ బెనగళ్. ఆయన తండ్రి నగరంలో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్‌గా ప్రాచుర్యం పొందాడు. ఖాళీ సమయాల్లో ఆయన 16 ఎంఎం కెమెరాతో తన పిల్లలతోనే సినిమాలను షూట్ చేసేవారు. ఆయన దగ్గర ఈ సినిమాల భారీ కలెక్షన్ ఉంది. శ్యామ్ బెనగళ్‌ది పెద్ద కుటుంబం. ఆయనతో కలిపి పది మంది పిల్లలు. 'నాకు మా నాన్న తొలిగా సినిమా గురించి అవగాహన కల్పించారు. మా డిన్నర్ తర్వాత వినోదం.. మా నాన్న రూపొందించిన చిత్రాలను చూడటమే. సినిమాతో నా ప్రమేయం అలా మొదలై చివరికి నన్ను ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకర్‌గా మార్చింది' అంటూ శ్యామ్ బెనగళ్ గుర్తు చేసుకునేవారు. తన తండ్రికి చెందిన 16 ఎంఎం సినిమా కెమెరాతో వేసవి సెలవుల్లో తన అన్నదమ్ములు, కజిన్‌లు కలిసినప్పుడు తాను తీసిన 'చుటియో మే మౌజ్ మజా (సెలవుల్లో వినోదం, ఆటలు)' తన మొదటి సినిమాగా ఆయన పేర్కొంటారు.

కంటోన్మెంట్ ఏరియాలో...
సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ ఏరియాలో తాము నివసించే ప్రదేశానికి దగ్గరగా ఉన్న ఆర్మీ గ్యారీసన్‌లో సినిమా ప్రదర్శనలు ఉండేవనీ, ప్రధానంగా సైన్యం కోసం ఉద్దేశించిన ఆ ప్రదేశంలో వారాంతంలో ఆంగ్ల భాషా చిత్రంతో పాటు, వివిధ భారతీయ భాషలలోని చలనచిత్రాలు ప్రదర్శించేవారని ఆయన తన చిన్ననాటి స్మృతులను నెమరేసుకునేవారు.

అనుబంధం..అపురూపం...
'హైదరాబాద్ నా జన్మభూమి' అని శ్యామ్ బెనగళ్ సగర్వంగా చెప్పేవారు. తాను జన్మించిన నగరం గురించి 'నేను ఇక్కడ పెరిగాను, నా పాఠశాల కళాశాల ఇక్కడే. ఇక్కడ మరే ఇతర ప్రదేశంలో లేని విశిష్టమైన స్వభావం, మిశ్రమ సంస్కృతి దీని సొంతం' అంటూ కొనియాడేవారు. ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన నిజాం కాలేజ్‌లో చదువుకున్న తాను ప్రస్తుతం పిల్లల చదువు గురించి ఆందోళన చెందుతున్నానని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 'విశ్వవిద్యాలయం ఇప్పటికీ గొప్పగా ఉంది, కానీ అక్కడ రాజకీయ ప్రమేయం పెరిగింది' అంటూ ఆయన తాను చదువుకున్న ఉస్మానియా గురించి గతంలో ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ నేపథ్యంలో మరో చిత్రం తీస్తానన్నారు...
తన సినిమాలపై తెలంగాణ ప్రభావం గురించి మాట్లాడుతూ తన సినిమాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన 'అంకుర్, నిషాంత్, మండి చిత్రాలపై ఈ ప్రాంత ప్రభావం ఉందని బెనగళ్ అనేవారు. తెలంగాణ నేపథ్యంలో మరొక కథ దొరికితే, తాను ఖచ్చితంగా దాన్ని కూడా సినిమాగా మలుస్తాను అంటూ ఈ రాష్ట్రంపై ప్రేమను చాటేవారాయన.

అనుగ్రహం అనే తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన బెనగళ్‌కు తెలుగు మాట్లాడటం అంతగా రాదు. 'నాకు తెలుగు బాగా అర్థం అవుతుంది కానీ మాట్లాడటం కొంచెం కష్టమవుతుంది' అనేవారు. తాను హైదరాబాద్‌ను విడిచిపెట్టి 50 సంవత్సరాలకు పైనే అవుతున్నా, ఈ సిటీపై ఇష్టానికి దూరం కాలేదంటారు. 'ఇది సినిమా క్రేజీ సిటీ. ఇక్కడ భారీ సంఖ్యలో ప్రేక్షకులు సినిమాలు చూస్తారు. చాలా మంది మంచి దర్శకులు, నిర్మాతలు ఇక్కడ ఉన్నారు' అంటూ కొనియాడేవారు. ఆయన ఇప్పుడు లేకున్నా..ఆ మంచి దర్శక నిర్మాతలకు ఆయన ఇచ్చిన స్ఫూర్తి ఎప్పటికీ ఉంటుందనేది వాస్తవం.

నేరాల 'కొండ'!

హత్యలు..లైంగిక దాడులు.. అపహరణలు

రాచకొండ పరిధిలో పెరిగిన నేరాలు
- 2024లో 33,084 కేసులు నమోదు
- గతేడాదితో పోలిస్తే 4 శాతం అధికం
- 42.5 శాతం పెరిగిన సైబర్ నేరాలు
- అత్యధిక కన్విక్షన్ రేటూ ఇక్కడే..
- రాచకొండ పోలీస్ వార్షిక నివేదిక విడుదల



సాక్షి, సిటీబ్యూరో: హత్యలు, అత్యాచారాలు, అపహరణ, సైబర్ నేరాలతో రాచకొండ 'నేరాల కొండ'గా మారింది. గతేడాదితో పోలిస్తే 2024లో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో నేరాలు 4 శాతం పెరిగాయి. ఈ ఏడాది 33,084 కేసులు నమోదయాయి. వీటిల్లో 25,143 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది 64 శాతం నేర నిరూపణ (కన్విక్షన్) రేటుతో రాష్ట్రంలో అత్యధిక కన్విక్షన్లు సాధించిన కమిషనరేట్‌గా రాచకొండ నిలిచింది. ఈ మేరకు సోమవారం రాచకొండ పోలీసు కమిషనరేట్ వార్షిక నివేదికను కమిషనర్ జి.సుధీర్‌బాబు విడుదల చేశారు.

- ఈ ఏడాది రాచకొండలో 73 హత్యలు, 463 అపహరణలు, 384 లైంగిక దాడులు జరిగాయి. గతేడాదితో పోలిస్తే వరుసగా 11, 10, 17 శాతం మేర పెరిగాయి. అయితే మరోవైపు రాచకొండలో మహిళలపై నేరాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. 2024లో మహిళలపై 2,893 నేరాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 9 శాతం మేర తగ్గాయి.

డ్రగ్స్ నేరస్తులపై హిస్టరీ షీట్లు..
ఈ ఏడాది రాచకొండలో 253 ఎన్‌డీపీఎస్ కేసుల్లో 521 మంది అరెస్టు కాగా.. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. 165 మంది డ్రగ్స్ నేరగాళ్లపై హిస్టరీ షీట్లు తెరిచారు. 33 మానవ అక్రమ రవాణా కేసుల్లో 61 మందిని అరెస్టు చేసి, 34 మంది బాధితులను కాపాడారు. అలాగే 236 గేమింగ్ యాక్ట్ కేసుల్లో 1,486 మందిని అరెస్టు చేశారు.

పెరిగిన సైబర్ నేరాలు
రాచకొండలో ఏటేటా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 2024లో 42.5 శాతం సైబర్ క్రైమ్స్ పెరిగాయి. ఈ ఏడాది 4,458 కేసులు నమోదయ్యాయి. 53 మంది అంతర్రాష్ట్ర, విదేశీ నేరస్తులను అరెస్టు చేశారు. అత్యధికంగా పార్ట్ టైం జాబ్స్ 2,125 నేరాలు, 996 ఫిషింగ్ కేసులు, 634 క్రిప్టో/ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. రూ.21.94 కోట్ల సొమ్మును సైబర్ క్రైమ్ బాధితులకు రీఫండ్ చేయగా.. నేరస్తుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.23.12 కోట్ల నగదును ఫ్రీజ్ చేశారు.

రాచకొండ మహిళలపై జరిగిన నేర గణాంకాలివీ:

నేరం రకం	2023	2024
వరకట్న హత్యలు	6	3
వరకట్న మరణాలు	16	18
ఆత్మహత్యలు	52	61
గృహ హింస	1,582	1,222
హత్యలు	12	19
అత్యాచారం	327	384
అపహరణ	116	233
వేధింపులు	744	561
పోక్సో	317	392

తగ్గిన రోడ్డు ప్రమాదాలు..
రాచకొండలో రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. ఈ ఏడాది 3,207 యాక్సిడెంట్లలో 653 మంది మరణించారు. గతేడాది 3,657 ప్రమాదాలతో పోలిస్తే.. యాక్సిడెంట్లు 12.30 శాతం తగ్గాయి. ఔటర్‌పైన 30.30 శాతం యాక్సిడెంట్లు తగ్గాయి. 2024లో ఓఆర్ఆర్‌పైన 46 ప్రమాదాల్లో 19 మంది మృతి చెందగా.. 58 మందికి గాయాలయ్యాయి. ఈ ఏడాది రాచకొండలో 25 లక్షలకు పైగా మోటార్ వెహికల్ (ఎంవీ) యాక్ట్ కేసులు నమోదయ్యాయి. 15,692 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. 102 మంది మందుబాబులకు న్యాయస్థానాలు జైలు శిక్ష విధించాయి. రూ.3.42 కోట్లు జరిమానా విధించాయి. 2,614 డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దయ్యాయి.

'వి.క్యూ.టి' వినియోగం పెరిగింది
విజుబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీ (వి.క్యూ.టి) వినియోగం పెరిగింది. దీంతో నేరాలు తగ్గడంతో పాటు శాంతి భద్రతలు అదుపులో ఉంటున్నాయి. మహిళా సిబ్బందితో సైకిల్ పెట్రోలింగ్‌ను ప్రారంభించాం. దీంతో గస్తీ పెరగడంతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.
– జి.సుధీర్‌బాబు, పోలీసు కమిషనర్, రాచకొండ

చెరువుల ఆక్రమణలపై హైడ్రా నజర్

- నానక్ రాంగూడ, నెక్నాంపూర్, నార్సింగి పరిధిలోని పలు చెరువుల పరిశీలన
- మూసీ బఫర్ జోన్‌లో మట్టి పోస్తే కఠిన చర్యలు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో/మణికొండ: చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టిసారించింది. నానక్ రాంగూడ, నెక్నాంపూర్, నార్సింగిలోని పలు చెరువులను కమిషనర్ రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువుల ఆక్రమణలపై ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేపట్టారు. నానక్ రాంగూడకు చేరువలో ఉన్న తౌతానికుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగిలోని నెక్నాంపూర్ చెరువుల ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయా చెరువుల్లోకి వరద నీరు చేరకుండా కాలువలను మళ్లించడం, మూసివేయడంపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులతో క్షుణ్ణంగా పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఖాళీ స్థలంలో వర్షం నీరు వెళ్లే రహదారులు మూసుకుపోవడంతో తమ అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే నానక్‌రామ్‌గూడ ప్రధాన రహదారికి ఎగువన ఉన్న తౌతాని కుంట చెరువు నీరు..దిగువవైపు ఉన్న భగీరథమ్మ చెరువుకు వెళ్లే కాలువ లింకు తెగిందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. నానక్ రామ్‌గూడకు ఇరువైపులా ఉన్న వరదనీటి కాలువలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, దుకాణాలను తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. చెరువులకు ఆనుకుని ఉన్న స్థలాలు తమవంటూ పలువురు కమిషనర్‌ను కలువగా..పూర్తి వివరాలను హైడ్రాకు సమర్పిస్తే.. క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ మ్యాప్‌లతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ విభాగాలకు చెందిన మ్యాప్‌లతో పూర్తి స్థాయి పరిశీలన జరిపించి వారం రోజుల లోపు నివేదిక సమర్పించాలని కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నార్సింగ్ దగ్గర మూసీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించిన రంగనాథ్.. కొన్ని నిర్మాణ సంస్థలు మూసీ నదిలోకి పోసిన మట్టిని తొలగించాలని ఆదేశించారు. బఫర్ జోన్‌లో మట్టిపోస్తే ఆయా సంస్థలపై చర్యలుంటాయని హెచ్చరించారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



వేములపల్లి శ్రీదేవికి అవార్డు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బంజారాహిల్స్: ప్రతి మహిళను మహాలక్ష్మిలా గౌరవించడంతో పాటు వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో జరిగిన అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా 31వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నదన్నారు. శిల్పారామంలో డ్వాక్రా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేశామని, ఇదే తరహాలో ప్రతి జిల్లా కేంద్రంలో వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ ఏడాది డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు రూ. 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇప్పించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. రాబోయే ఐదేళ్ల వడ్డీ లేకుండా రూ.లక్ష కోట్ల రుణాలు ఇచ్చి మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంబానీ, ఆదానీలనే కాకుండా సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటులో మహిళలను భాగస్వాములను చేశామన్నారు. మహిళలు సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుందని, వారు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్ ద్వారా కొనుగోలు చేసి వారికి ప్రతి నెల బిల్లులను చెల్లిస్తుందన్నారు.

◆ ఇప్పటివరకు కోటి మందికి పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించినట్లు మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. వైఎస్సార్ హయాంలో మహిళల కోసం ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. మన ఆర్థిక వ్యవస్థకు మహిళలే వెన్నెముకని అభివర్ణించారు. అనంతరం మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి 'బెస్ట్ ఆఫ్ ద బెస్ట్' అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మెప్మా సీఈవో దివ్య దేవరాజన్, అలీప్ అధ్యక్షురాలు రమాదేవి, ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, మధుసూదన్, మక్సూద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కారు రిలీజ్

రూ.5వేల పూచీకత్తుతో కారు విడుదల చేసిన నాంపల్లి కోర్టు

సిటీ కోర్టులు: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కారును నాంపల్లి కోర్టు విడుదల చేసింది. పోలీసు విధులను అడ్డుకోవడమే కాకుండా బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రను బెదిరించాడన్న ఆరోపణలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అదే సమయంలో ఆయన కారును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసుల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తరుపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఇటీవల నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గత వారం కౌశిక్‌రెడ్డి తరుపు న్యాయవాది కారును విడుదల చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. సోమవారం దీనిపై విచారణ చేపట్టిన నాంపల్లిలోని 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రూ. 5వేల పూచీకత్తు ఇవ్వాలని ఆదేశించారు. కౌశిక్‌రెడ్డి తరుపు న్యాయవాది కోర్టులో పూచీకత్తు అందజేయడంతో కారును విడుదల చేస్తున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు వేగవంతం చేయండి

చర్లపల్లి రైల్వే స్టేషన్‌పై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష

సాక్షి , సిటీబ్యూరో: చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను ఈ నెల 28న ప్రారంభించనున్న నేపథ్యంలో పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం తన నివాసంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, ప్రభాకర్, తాడూరి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్టేషన్ విస్తరణకు అవసరమైన టీజీఐఐసీ, రెవెన్యూ, అటవీ భూములను కేటాయిస్తామని తెలిపారు. రాంపల్లి వైపు రోడ్డు నిర్మాణం, లైట్ల ఏర్పాటు పనులను త్వరతిగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషన్ ఇలంబర్తిని మంత్రి ఆదేశించారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్దన్ రెడ్డి, రైల్వే కన్‌స్ట్రక్షన్స్ సీఈ సుబ్రమణ్య, కీసర ఆర్డీవో, కాప్రా డిప్యూటీ కమిషనర్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

విడాకులు ఇవ్వడం లేదనే..

- బోయిన్‌పల్లి యువకుడి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ఐదుగురు నిందితుల అరెస్టు
- పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్

కంటోన్మెంట్: విడాకులు ఇవ్వడం లేదన్న కారణంతోనే బోయిన్‌పల్లికి చెందిన యువకుడు సమీర్‌ను అతడి భార్య కుటుంబ సభ్యులు హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు చేధించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను గుర్తించిన పోలీసులు, ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. సోమవారం బోయిన్‌పల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాల్ వివరాలు వెల్లడించారు. బోయిన్‌పల్లికి చెందిన సమీర్ అనే యువకుడు గత జనవరిలో నాచారం ప్రాంతానికి చెందిన ఫిర్దోస్ సదాఫ్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం నచ్చని అమ్మాయి తండ్రి, ఆమె బంధువులు సాంప్రదాయబద్ధంగా మళ్లీ పెళ్లి చేస్తామని ఆమెకు నచ్చజెప్పి పుట్టింటికి తీసుకెళ్లారు. ఆ తర్వాత సమీర్‌తో పెళ్లి రద్దు చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. అయినా ఆమె తన భర్త సమీర్‌తో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. దీనిని జీర్ణించుకోని సదాఫ్ తండ్రి తన బంధువులతో కలిసి సమీర్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా శనివారం ఇద్దరు రౌడీషీటర్లతో కలిసి సమీర్ ఇంటికి వచ్చిన సదాఫ్ కుటుంబ సభ్యులు అతడిపై కత్తులతో దాడి చేసి హతమార్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రాథమిక ఆధారాలతో సదాఫ్ తండ్రి మహ్మద్ షబ్బీర్ అహ్మద్‌తో పాటు మహ్మద్ ఓబర్, అబ్దుల్ మతీన్, సయ్యద్ సోహాయిల్, షేక్ అబు బాకర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీం అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు అబ్దుల్ మతీన్, సయ్యద్ సోహాయిల్‌లపై రౌడీషీట్‌లు ఉన్నట్లు డీసీపీ తెలిపారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

అంబర్‌పేట: డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఒక వినియోగదారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేటకు చెందిన సోల్‌మాన్ సూసై రాజ్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. అనంతరం డ్రగ్స్ విక్రేతగా మారిన అతను బెంగళూరు గోవా నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో అతడిపై అంబర్‌పేట ఎక్సైజ్, ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. జైలులో అతడికి అంబర్‌పేటకు చెందిన షేక్ గౌస్‌తో పరిచయం ఏర్పడింది. బయటికి వచ్చిన తర్వాత కూడా ఇద్దరూ కలిసి డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నారు. ఈనెల 21న అంబర్‌పేట పీఎస్ పరిధిలో తార్నాకకు చెందిన మహేశ్ అనే యువకుడికి డ్రగ్స్ విక్రయిస్తుండగా సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 3.35 లక్షల విలువైన 6 గ్రాముల కొకైన్, 2 ఎల్ఎస్‌డీ ప్యాకెట్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

అవినీతికి తావులేకుండా ఉద్యోగాల భర్తీ

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- రోజ్‌గార్ మేళాలో 348 మందికి ఉద్యోగ నియామక పత్రాల అందజేత

జవహర్‌నగర్: అవినీతికి తావులేకుండా ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం ఆయన రోజ్‌గార్ మేళా 14వ ఎడిషన్‌లో భాగంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని హకీంపేట నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా)లో 348 మంది అభ్యర్థులకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 10 లక్షల ఉద్యోగాలు ఇస్తామని 2022లో రోజ్‌గార్ మేళాను ప్రకటించారని, ఇందులో భాగంగా అవినీతికి ఆస్కారం లేకుండా భర్తీ ప్రక్రియను నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటివరకు రోజ్‌గార్ మేళాల్లో 9.25 లక్షల ఉద్యోగ నియామకాల పత్రాలను అందజేశారని, మరో 75 వేల ఉద్యోగాలు ఇస్తే లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఉద్యోగాలు పొందిన యువకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ చేరవేసినప్పుడే ఉద్యోగానికి సార్థకత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీసా డైరెక్టర్ కె.సునీల్ ఇమాన్యుయేల్, డీఐజీ శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

ముగ్గురు బీటెక్ విద్యార్థుల అదృశ్యం

- గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆలస్యంగా వెలుగులోకి..
- కేసు నమోదు చేసిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: వారం రోజుల్లో ముగ్గురు బీటెక్ విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలు సోమవారం ఆలస్యంగా వెలుగుచూశాయి. మిస్సింగ్ అయిన వారిలో ఇద్దరూ మైనర్లు కావడం గమనార్హం. స్థానిక ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట మండలం రాంనాథ్‌గుడపల్లికి చెందిన కొత్తగాడి బాల్‌రాజ్ కుమారుడు (17) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల్లో బీటెక్ (సీఎస్‌సీ) ప్రథమ సంవత్సరం చదువుతూ కాలేజ్ హాస్టల్‌లో ఉంటున్నాడు.14న హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. తండ్రి బాల్‌రాజ్ విష్ణుకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మరుసటి రోజు నేరుగా కాలేజ్‌కి వచ్చి ఆరా తీయగా.. సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు. ఇదిలా ఉండగా యాదాద్రి జిల్లా ఆత్మకూర్ మండలం, కాప్రాయిపల్లికి చెందిన మరో విద్యార్థిని(17) గురునానక్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ ఇదే కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 17న సాయంత్రం 6 గంటల నుంచి కనిపించకుండా పోయింది. అలాగే వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన 19 సంవత్సరాల విద్యార్థిని ఈనెల 20న అదృశ్యమైంది. ఈమె కూడా కాలేజ్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. వారం రోజుల్లో ముగ్గురు విద్యార్థులు అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు. కాలేజీ నిర్వాహకులు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మధు మృతదేహం

మేడ్చల్‌రూరల్: బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ మండలం, రాయిల్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీరంగవరం గ్రామం, కర్ణంబావి ప్రాంతానికి చెందిన తుప్పతి మధు(31) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా ఉద్యోగాన్వేషణలో ఉన్న అతను సోమవారం ఉదయం కొంపల్లిలో ఓ ఇంటర్వ్యూకు హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో రాయిలాపూర్ గ్రామ శివార్లలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మధు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

చందానగర్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి 9.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం శంషాబాద్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జియా గూడకు చెందిన శ్రీకాంత్ గత కొన్నేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నాడు. దీనిపై ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం గోపన్‌పల్లి తాండా ఫ్లైఓవర్ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి 9.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విని'యోగ' క్షేమం..!

- నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం
- కమిషన్‌లో ప్రతి పౌరునికీ సత్వరన్యాయం..
- ఆర్థికభారం లేకుండా న్యాయ సదుపాయం

సిటీ కోర్టులు: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ప్రతి యేటా డిసెంబర్ 24న జరుపుకుంటారు. వినియోగదారుల రక్షణ చట్టాన్ని దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 1986లో పార్లమెంట్‌లో రూపొందించారు. అప్పటి నుంచి వినియోగదారుల రక్షణ చట్టం అమలులో ఉంది. ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశం వినియోగదారుల హక్కులను పరిరక్షిస్తూ వారికి సరైన న్యాయం అందించడం. ముఖ్యంగా వినియోగదారునికి సేవాలోపం కానీ, వస్తువు నాణ్యత కానీ లేనప్పుడు లేదా ఏ ఇతర లోపాల వల్ల నష్టపోతున్నప్పుడు ఈ చట్టం అండగా ఉంటుంది.

మూడు రకాల్లో న్యాయం

జిల్లా స్థాయి : జిల్లా స్థాయిలో ఎలాంటి సమస్యలున్నా.. జిల్లా వినియోగదారుల కమిషన్ ద్వారా న్యాయం పొందవచ్చు.

రాష్ట్ర స్థాయి : జిల్లా స్థాయిలో న్యాయం దక్కని పక్షంలో రాష్ట్ర స్థాయి కమిషన్‌ను సంప్రదించవచ్చు.

జాతీయ స్థాయి : రాష్ట్ర స్థాయిలో న్యాయం దక్కని పరిస్థితిలో అంతిమంగా జాతీయ కమిషన్‌ను సంప్రదిస్తే న్యాయం పొందే అవకాశం ఉంటుంది.

దారి దోపిడీ కేసులో రౌడీషీటర్ల అరెస్ట్



బాగిడి ఆకాష్



అమర్ జిత్ సింగ్

చాంద్రాయణగుట్ట: దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను ఛత్రినాక పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కేఎస్ ప్రసాద్ వర్మ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుల్తాన్‌షాహి ప్రాంతానికి చెందిన యువకులు బాగిడి ఆకాష్, దిలౌర్ అమర్‌జిత్ సింగ్ పాత నేరస్తులు. వారిపై రౌడీ షీట్‌లు నమోదై ఉన్నాయి. ఈ నెల 22న మహ్మద్ రహీముద్దీన్ అనే వ్యక్తి మొఘల్‌పురా పాఠశాల సమీపంలో నడిచి వెళుతుండగా అతడిని అడ్డుకున్న ఆకాష్, అమర్‌జిత్ కత్తితో బెదిరించి అతడి వద్ద నుంచి రూ.3500 నగదు లాక్కున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి సోమవారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.వెయ్యి నగదు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితులు బాగిడి ఆకాష్‌పై 14, అమర్‌జిత్ సింగ్‌పై మూడు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎండు చేపల మాటున గంజాయి వ్యాపారం

- నిందితుడి అరెస్ట్
- 6 కేజీల గంజాయి స్వాధీనం

ఉప్పల్: ఎండు చేపల మాటున్న గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా ప్రాంతానికి చెందిన దివ్యాంగుడు భరత్ కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా నారపల్లికి వలస వచ్చాడు. సంతలో ఎండు చేపలు, రొయ్యలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న అతను గంజాయి వ్యాపారం ప్రారంభించాడు. ఒడిశా నుంచి పెద్దమొత్తంలో గంజాయి తీసుకువచ్చి నగరంలో కిలో రూ.10,000 చొప్పున విక్రయిస్తున్నాడు. ఇటీవల అతను ఒడిశాకు చెందిన తన స్నేహితుడి భసంత్ పరిచాతో కలిసి 7 కిలోల గంజాయిని నగరానికి తీసుకొచ్చాడు. ఒక కిలో విక్రయించిన అనంతరం మిగిలిన దానిని తీసుకుని సోమవారం నాగోల్ మెట్రోస్టేషన్‌కు వచ్చాడు. దీనిపై సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నీతూబాయి ఆట కట్టిస్తాం..

ఆమెపై 32 కేసులు ఉన్నాయి

- రెండుసార్లు పీడీ యాక్ట్‌పై జైలుకు
- ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గంజాయి డాన్‌గా పేరొందిన నీతూబాయిని ఎట్టిపరిస్థితుల్లోనూ పట్టుకుని తీరుతామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. ఆమె పట్ల తాము ఎలాంటి మెతక వైఖరి అవలంభించడం లేదని, కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. నానక్‌రామ్‌గూడ కేంద్రంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న నీతూబాయి ఎక్సైజ్ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. ఎక్సైజ్ శాఖతో పాటు లా ఎన్ ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు కూడా సీరియస్‌గా దృష్టి సారించాయన్నారు. ఆమె అక్రమ కార్యకలాపాలపై కేసులు నమోదు చేశామని, గతంలో ఆమె పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. అయినా ఆమె వైఖరిలో మార్పురాలేదన్నారు. బయటికి వచ్చిన తర్వాత కూడా యథావిధిగా గంజాయి అమ్మకాలు కొనసాగిస్తుండడంతో బెయిల్‌కు అవకాశం లేకుండా పోలీస్ శాఖ ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేసిందన్నారు. రెండు సార్లు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడమే కాకుండా, గంజాయి అమ్మకాల ద్వారా నీతూబాయి, ఆమె కుటుంబసభ్యులు అక్రమంగా కూడబెట్టిన స్థిర, చర ఆస్తులను జప్తు చేసినట్లు తెలిపారు. నీతూబాయ్ నుంచి రూ.15.17 లక్షలు, ఆమె కుటుంబ సభ్యులైన మధు బాయి రూ. 25.13 లక్షలు, గౌతమ్‌సింగ్ నుంచి రూ.91.21 లక్షలు, మరో వ్యక్తి నుంచి రూ. 86 లక్షల స్థిరాస్తులను జప్తు చేశామన్నారు. నీతూబాయిపై హిస్టరీ షీట్‌ను ఓపెన్ చేసినట్లు చెప్పారు. శేరిలింగంపల్లి, గోల్కొండ, గచ్చిబౌలి, మొయినాబాద్, గౌరారం, నల్లగొండ టూటౌన్‌లతోపాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ధూల్‌పేట్, నారాయణగూడలోనూ ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు ఆమెపై 25 కేసులు ఉన్నాయని, పోలీసులు 7 కేసులు నమోదు చేశారన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. ఆపరేషన్ ధూల్‌పేట్ తరహాలో నానక్‌రాంగూడలోనూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

బాలానగర్: లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలానగర్‌కు చెందిన శాంతాదేవి తన కుమార్తె జయంతి, మనవరాలు పూజతో కలిసి ఆదివారం బైక్‌పై ఫతేనగర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో నర్సాపూర్ చౌరస్తాలో వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ వారు ప్రయాణిస్తున్న స్కూటర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో శాంతాదేవి (54) కిందపడిపోవడంతో లారీ చక్రాలు ఆమె మీదుగా వెళ్లాయి. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమార్తె, మనవరాలికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలు శాంతాదేవి భర్త రాకేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

పీవీకి ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న సురభి వాణిదేవి

బంజారాహిల్స్: దేశ ఆర్థిక పురోగతి కోసం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా సోమవారం బంజారాహిల్స్‌లోని కేన్సర్ ఆస్పత్రి చౌరస్తాలోని పీవీ విగ్రహానికి పూల మాల వేసి ఆమె ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ దేశానికి పీవీ నర్సింహారావు దార్శనికుడని ఆయన ఎన్నో సంస్కరణలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యూబీడీ మేనేజర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీకి ఆహ్వానం



దీపాదాస్ మున్షీని ఆహ్వానిస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: మాజీ సీఎల్పీ నాయకుడు పి.జనార్దన్‌రెడ్డి 17వ వర్ధంతి వేడుకలు ఈ నెల 28వ తేదీన నిర్వహించనుండగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి సోమవారం తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఆహ్వానించారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కూడా కలిసి ఆహ్వానించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పనులను ప్రారంభిస్తున్న వనం సంగీత

శ్రీనగర్‌కాలనీ: సోమాజీగూడ డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని, అలాగే మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిగూడ వడ్డెరబస్తీ నుంచి శ్రీనగర్‌కాలనీ వైపుగా నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేతలు వనం శ్రీనివాస యాదవ్, వడ్డెర లక్ష్మణ్, బస్తీ నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్, ట్రీ కట్టింగ్‌లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సైఫాబాద్ డీఈ ఆపరేషన్ నెహ్రూ నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఇందిరాపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో కవాడిగూడ ఏరియా, ఎస్‌బీఐ కాలనీ మెయిన్‌రోడ్డు, సాయిబాబా టెంపుల్ ఏరియా, గాంధీనగర్ ఏరియా, ఎసీటీసీ కలెక్టర్ కార్యాలయం, వార్త కార్యాలయం, గాంధీనగర్ నాలా ఏరియా, ఎస్‌బీఐ కాలనీ, గంటసాల గ్రౌండ్ ఏరియా, గాంధీనగర్ పోస్ట్ ఆఫీస్ ఏరియా, మదర్ డెయిరీ మిల్క్ బూత్, రాజరాజేశ్వరీ టెంపుల్ ఏరియా, నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎర్రమంజిల్ ఏరియా, బాలాపురా బస్తీ ఏరియా, ఎర్రమంజిల్ చమాన్ ఏరియా తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పి ఆఫీస్ సబ్ స్టేషన్ పరిధిలో ఖైరతాబాద్ ఏరియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, చింతల బస్తీ ఏరియా, తుమ్మలబస్తీ, బిగ్‌బాస్ హోటల్ లేన్, హిందీ ప్రచారసభ లేన్, కేర్ హాస్పిటల్, విరించి, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వెంగళరావునగర్: మూసాపేట 11కెవీ ఫీడర్, ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు ఏరియా, అశ్విని హెయిర్ ఆయిల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదే విధంగా హెచ్‌పీ రోడ్డు 11 కెవీ ఫీడర్ ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



ఎన్‌బీటీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న సర్కిల్-18 డీసీ ప్రశాంతి

ఇందిరమ్మ పథకం అమలుకు

కసరత్తు

అర్హుల గుర్తింపునకు
సర్కిల్-17, 18 పరిధిలో ఇంటింటి సర్వే

- సర్కిల్-17లో 1300, సర్కిల్-18లో 1400 మందిని సర్వే చేసిన అధికారులు
- సంబంధిత జాబితాతో అర్హుల ఇళ్లకు అధికారులు
- సర్వేలో పనిచేస్తున్న 12 బృందాలు



వినాయకనగర్ బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే చేస్తున్న అధికారులు



సోమాజీగూడలో...

బంజారాహిల్స్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో అర్హుల ఎంపికకు కసరత్తు మొదలైంది. పథకం అమలుకు ప్రభుత్వం ఇప్పటికే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు అందులో పొందుపర్చారు. గత ఐదు రోజుల నుంచి ఈ రెండు సర్కిళ్ల పరిధిలో అర్హుల నిర్ధారణకు ఇంటింటి సర్వే చేపట్టారు. ఖైరతాబాద్ సర్కిల్-17 కిందికి వచ్చే సోమాజీగూడ, ఖైరతాబాద్, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు 21,497 మందిని గుర్తించారు. ఇప్పటికే 1300 మందిని సర్వే చేశారు. సర్వే కోసం 20 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల అర్హులు 24,821 మందిని గుర్తించారు. ఇప్పటి వరకు 1400 మందిని సర్వే చేశారు. సర్వే కోసం 12 బృందాలు పనిచేస్తున్నాయి. మరో వారం రోజుల్లో సర్వే పూర్తికానుంది. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌లో తప్పుడు వివరాలు సరిచూడడం కూడా పూర్తయ్యింది. ప్రజాపాలన దరఖాస్తుల్లోనే అర్హులను గుర్తించారు. అయినప్పటికీ అర్హులను తేల్చేందుకు ఇంటింటి సర్వే చేసేందుకు సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి యాప్‌లో వివరాలను నిర్ధారణ చేస్తారు. సర్వే బాధ్యతలను ప్రభుత్వ సిబ్బంది చూస్తున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీల్లోని బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బందిని వినియోగిస్తున్నారు. దీనికి ఇప్పటికే నిబంధనలు, సూచనలు జారీ చేశారు. ఇందుకు భిన్నంగా ఎంపికలు చేస్తే సదరు ఉద్యోగులను బాధ్యులను చేస్తామని అధికారులను హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయా సర్కిళ్ల డీఎంసీలు పర్యవేక్షిస్తున్నారు.

మూడు ఫొటోలు తీస్తారు

దరఖాస్తుదారుని ప్రస్తుతం ఉంటున్న ఇంటి వద్ద నిల్చోబెట్టి ఒకటి, ఇల్లు కనిపించేలా మరొకటి, ఖాళీ స్థలం ఫొటోలను తీసుకుంటారు. ఇప్పటికే ఇల్లు కట్టుకున్నవారు చాలా మంది దరఖాస్తు చేసుకోగా వారి వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- ఖాళీ స్థలానికి జియో ట్యాగింగ్ చేస్తారు. కొత్తగా కట్టనున్న ఇంటికి నాలుగు దశల్లో రూ.5 లక్షలు మంజూరు చేస్తారు.
- పూరి గుడిసెలు, శిథిలావస్థ ఇళ్లల్లో ఉంటున్నవారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ఫిలింనగర్: విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులు, పాఠశాలలు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ స్కూల్‌కు ఆయన టాయ్‌లెట్ క్లీనింగ్ మిషన్‌తో పాటు విద్యార్థుల కోసం 50 బెంచీలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని బాగా చదువుకోవాలని సూచించారు. అదే విధంగా స్వచ్ఛత విషయంలో విద్యార్థులు అవగాహన కలిగి ఉండటంతో పాటు తల్లిదండ్రులు, పరిసర నివాసితులకు అవగాహన కల్పించాలన్నారు. శుభ్రత పాటించడం వల్ల అనేకరోగాల నుంచి దూరంగా ఉండవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వెంకటస్వామి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల కోసం పోరాడతాం



నియామక పత్రాలతో మహిళలు

పంజగుట్ట: వినియోగదారుల హక్కులకు ఎక్కడ భంగం వాటిల్లినా తాము ముందుండి పోరాడతామని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా జి.ఎస్.వీణ, ప్రధాన కార్యదర్శిగా జి.ఎల్.ప్రీతితో పాటు 25మంది మహిళలను సంస్థ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ తాము 15 జిల్లాల్లో వినియోగదారుల సమస్యలను పరిష్కరించామని, ఎక్కువ ఫిర్యాదులు మహిళల నుంచే అందుతున్నాయిని పేర్కొన్నారు. ఎక్కువశాతం మహిళలే షాపింగ్, మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు, కొనుగోలు చేస్తుంటారని, వీరు డిస్కౌంట్‌లు, ప్రత్యేక ఆఫర్లు అనగానే ఆకర్షితులౌతారని దీన్ని అనువుగా చేసుకుని వినియోగదారులను సులువుగా వ్యాపారస్తులు మోసాలు చేస్తున్నారని తెలిపారు. వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడంతోపాటు వారు ప్రశ్నించేవిధంగా చేసేందుకే మహిళా కమిటీని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా విభాగం కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుడపర్తి శివకుమార్, వల్లాల రవియాదవ్, సెక్రటరీ దుర్గాప్రసాద్, రాజేష్, రాజుయాదవ్, ప్రభాకర్, సంజీవ్, క్రిస్టఫర్, రమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పెరుగుతున్న వర్క్‌స్పేస్

- మంత్రి శ్రీధర్‌బాబు



వెల్‌స్పేస్ వర్క్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

శ్రీనగర్‌కాలనీ: హైదరాబాద్ మహానగరంలో వర్క్‌స్పేస్ రోజురోజుకూ పెరుగుతుందని, ఇక్కడి వసతులు అన్ని సెక్టార్లకు ఆమోదయోగ్యంగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం అమీర్‌పేటలోని ఎంపీ ఎంమాల్‌లో వెల్‌వర్క్ స్పేస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో కూడా స్టార్టప్స్, ఐటీ సెక్టార్స్ పుంజుకోవడం శుభపరిణామమన్నారు. ప్రభుత్వపరంగా ఐటీ, ఉపాధి అవకాశాలకు తగు సదుపాయాలను, ప్రోత్సాహకాలను అందిస్తున్నామని, ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో ఐటీ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వెల్‌వర్క్ స్పేస్ ప్రతినిధులకు అభినందించారు.

అభినందన



వెంగళరావు నగర్: కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జూబ్లీహిల్స్ నియోజక వర్గ అధ్యక్షుడు కాలెద్ సోమవారం రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలో జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన కాలెద్‌ను ఈ సందర్భంగా అనిల్‌కుమార్ అభినందించారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. ఆయనతో పాటుగా సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు మధుయాదవ్ కూడా కాలెద్‌ను అభినందించారు.

ఇతరుల అభిప్రాయాలను గౌరవించాలి

అంబేడ్కర్ వర్సిటీలో క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న వైస్‌చాన్సలర్ ఘంటా చక్రపాణి



సెయింట్ సాల్మాన్ హైస్కూల్లో చిన్నారులు

బంజారాహిల్స్: మతాలపైన విశ్వాసం ఉన్నా లేకున్నా ఇతరుల అభిప్రాయాలను తప్పకుండా గౌరవించాలని అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో క్రిస్మస్ సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఇన్‌చార్జి అకాడమిక్ డైరెక్టర్ ఆనంద్ పవార్‌లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరినీ గౌరవించాలని అన్ని మతగ్రంథాలు చెబుతున్నా యని ఆ విధంగా మసులుకోవాలని కోరారు. ఏసు ప్రభు బోధించిన శాంతి, కరుణ, దయను ఇతరుల పట్ల చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్ సోలమన్, మేరీ సునంద, ఉదయిని, దివాకర్, ధర్మ కళ్యాణ్, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఏసు ప్రభు వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. క్రిస్మస్ థీమ్‌తో నాటికలు ప్రదర్శించారు. ప్రార్థనలు నిర్వహించారు. పాటలు పాడి విశేషంగా ఆకట్టుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో సోమవారం క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో సందడి చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా విద్యార్థులు, టీచర్లతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. స్థానిక చర్చి పాస్టర్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు.

రహమత్‌నగర్‌లో...

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద పాస్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి పాల్గొని కేక్‌కట్ చేసి క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పురిమి సంజీవరావు, షేక్ సాబేర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మశంకర్‌నగర్ సెయింట్ సాల్మాన్ హైస్కూల్లో సోమవారం గ్రాండ్ క్రిస్మస్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సుధాకర్, హెచ్ఎం ప్రీతి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరి రామారావు స్కూల్‌లో...



లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో...

వినాయకనగర్ బస్తీ ఎన్నికలకు సమాయత్తం



తీర్మాన పత్రాన్ని చూపిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

రహమత్‌నగర్: వినాయకనగర్ వీకర్స్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నిర్వహణకు స్థానికులు సమాయత్తం అవుతున్నారు. ఈ క్రమంలోనే స్థానిక కమ్యూనిటీ హాల్లో బస్తీకమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ అడ్వైజర్ వీరస్వామి యాదవ్, బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి డానీయల్, వర్కింగ్ ప్రెసిడెంట్ డెవిడ్, ఉపాధ్యక్షుడు కేశవులు, కోశాధికారి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బస్తీకి అధ్యక్షుడు లేక అభివృద్ధి కుంటుపడుతుందని వాపోయారు. గతంలో జరిగిన ఎన్నిక గడువు ముగిసి రెండు సంవత్సారాలు గడుస్తున్న దృష్ట్యా తామంత బస్తీ ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందుకోసం మరోమారు కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల విధి విధానాలపై చర్చించనున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన బస్తీ తీర్మాన పత్రాన్ని వారు ఆవిష్కరించారు.

ఎన్‌బీటీనగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో రోడ్డుకు రెండువైపులా ఆక్రమణలతోపాటు అక్రమ పార్కింగ్‌లతో అంబులెన్స్‌లు, బస్సులు, వాటర్ ట్యాంకర్లు రాలేని దుస్థితి నెలకొందని స్థానికులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేయడంతో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఆపరేషన్ రోప్ నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా పర్యవేక్షణలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ నేతృత్వంలో ట్రాఫిక్ సిబ్బంది రోడ్డుకు రెండువైపులా ఆక్రమణలను, అక్రమ పార్కింగ్‌లను తొలగించారు. సుమారుగా 70 ఆక్రమణలు తొలగించడంతో ఎన్‌బీటీనగర్ ప్రధాన రోడ్డు అడ్డంకులు తొలగించుకుని విశాలంగా మారింది. దీంతో ట్రాఫిక్ పోలీసుల చర్యను స్థానికులు అభినందించారు. తరచూ ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలని వారు ట్రాఫిక్ పోలీసులను కోరారు. ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలతో రోడ్డంతా కుంచించికుపోయిందని, అక్రమ పార్కింగ్‌లతో ముందుకుసాగలేని పరిస్థితి నెలకొందని, ఇన్నాళ్లకు వీటిని తొలగించడం శుభపరిణామమని ప్రోత్సహించారు. స్థానికులే దగ్గరుండి ట్రాఫిక్ పోలీసులను ప్రోత్సహించడంతో వెంటవెంటనే ఆక్రమణలు తొలగించి అక్కడి నుంచి తరలించారు.



ఎన్‌బీటీనగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న రాహుల్ హెగ్డె



ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను డైరెక్టర్ శౌనత సోమవారం హోటల్ తాజ్ కృష్ణలో ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కొనసాగనుంది. –బంజారాహిల్స్



బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్ 17వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఇంజినీర్స్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగభూషణరావు, వెల్‌నెస్ కోచ్ హరికృష్ణ, బడ్స్ అండ్ బ్లూమ్స్ స్కూల్స్ చైర్మన్ సుధాకర్‌లు హాజరై వేడుకలకు ప్రారంభించారు. చిన్నారుల పలు సందేశాత్మక ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. – శ్రీనగర్‌కాలనీ

నగరంలో నేడు

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

తెలంగాణ జానపద అకాడమీ ఏర్పాటు చేయాలి



జానపద కళాకారుల సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ నుంచి జానపద కళాకారులను వేరు చేసి ప్రత్యేకంగా తెలంగాణ జానపద అకాడమీ ఏర్పాటు చేయాలని, జానపద కళాకారుల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతివెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద కళాకారులకు 11 ఏళ్లుగా ఎలాంటి మేలు జరగలేదని కనీసం గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేదని అన్నారు. జానపద కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతిక సమాఖ్య కార్యదర్శి రాకేష్, పోతు రమేష్, కొండూరు భాస్కర్, రాఘవులు, డాక్టర్ ఖాజా మన్సూర్, మురళీధర్ దేశ్‌పాండే, కస్తూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2న మాదిగ విద్యార్థి, యువజన గర్జన



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

పంజగుట్ట: మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 2వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో మాదిగ విద్యార్థి, యువజన గర్జన నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. మంద కృష్ణమాదిగ డిమాండ్ చేసినట్లు వర్గీకరణ జరిగితే మాదిగలకు కేవలం 7 శాతం మాత్రమే రిజర్వేషన్లు వస్తాయని, అలా కాకుండా జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో 10 విద్యార్థి సంఘాలు, 17 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెంట నడుస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, వివిధ మాదిగ సంఘాల నాయకులు చంద్రశేఖర్, పాల్వాయి నాగేష్, బుదాల బాబురావు, బొమ్మెర స్టాలిన్, బచ్చలకూర బాలరాజ్, గడ్డ యాదయ్య, నంద్రు నరసింహ, బోరెల్లి సురేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా..

- అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యం
- ముఖ గుర్తింపుతో సరుకుల పంపిణీకి శ్రీకారం
- అమలుకు కేంద్ర సర్కారు ఆదేశాలు
- నగర శివారుల్లో 2,393 అంగన్‌వాడీ కేంద్రాలు



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కండ్లకోయ అంగన్‌వాడీ కేంద్రం

సాక్షి, సిటీబ్యూరో: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సజావుగా అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు పక్కదారి పట్టకుండా, టీహెచ్ఆర్(టేక్ హోం రేషన్) తీసుకెళ్లే లబ్ధిదారు ఫొటో చిత్రీకరించి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నిక్షిప్తం చేయాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు అందించే సరుకు తీసుకెళ్లే వారి ఫొటోను ఇక నుంచి ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు.

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మొత్తం 2,393 కేంద్రాలు ఉండగా, ఇందులో 2,22,661 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో మొత్తం చిన్నారులు 1,83,224 మంది ఉన్నారు. కేంద్రాల నిర్వహణను పారదర్శకం చేసేందుకు ముఖ గుర్తింపు(ఫేస్ అథెంటికేషన్) హాజరు విధానాన్ని ముందుగా మూడేళ్లలోపు చిన్నారులకు వర్తింపజేయనున్నారు. వీరికి టీహెచ్ఆర్, బాలామృతం అందిస్తున్నారు. ఈ వివరాలను పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇందులోనే ప్రస్తుతం ముఖ గుర్తింపు(ఫేస్ అథెంటికేషన్) ఆప్షన్ తీసుకొచ్చారు. ఇందులోనే వివరాలు నమోదు చేయాల్సి ఉంటోంది. ఆధార్, ఫొటో, లబ్ధిదారుల ఫోన్ సంఖ్య నమోదు చేస్తారు. ఇది పూర్తి కాగానే లబ్ధిదారుడి ఫోన్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్ యాప్‌లో పొందుపరిస్తే ప్రక్రియ పూర్తవుతుంది. అనంతరం సరుకులు, బాలామృతం అందించిన ప్రతిసారి ముఖ గుర్తింపు నమోదు చేయాల్సి ఉంటోంది. ఈ ప్రక్రియ విజయవంతం అయితే 3–5 ఏళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అమలు చేస్తాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

పంపిణీ ఇలా..

కేంద్రాల్లో నమోదైన వారికి నిత్యం 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, నూనె, గుడ్లు, మురుకులు, బాలామృతం అందజేస్తున్నారు. అంగన్‌వాడీలో నమోదైన మూడేళ్లలోపు చిన్నారులకు ఇంటి వద్దకే ఈ పౌష్టికాహార సరుకులను అందజేస్తున్నారు. ఇవి పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా బోగస్‌కు అడ్డుకట్ట వేయాలని మాతా, శిశు సంక్షేమశాఖ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నారులకు సంబంధించి కేంద్రం నుంచి సరుకులు తీసుకెళ్లే వారి ముఖ చిత్రాన్ని పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ముందుగా వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. దీనిపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట..

సరుకుల పంపిణీలో అక్రమాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సరుకులు తీసుకెళ్లే వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రతినెలా వారే వచ్చి సరుకులు తీసుకోవాల్సి ఉంటోంది. దీంతో అవకతవకలకు అడ్డుకట్ట పడుతుంది.

అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు దారుణం



కవాడిగూడ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించే విధంగా కేంద్రమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు వీడీ కృష్ణ, అంజియాదవ్, కేఆర్‌కే ప్రసాద్, మాజీ కార్పొరేటర్ వాజిద్‌హుస్సేన్, కాంగ్రెస్ సికింద్రాబాద్ యువజన అధ్యక్షుడు మధు, పార్టీ కవాడిగూడ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, పార్టీ నగర నాయకులు పి.లక్ష్మణ్, ప్రభాకర్, ఆకుల ప్రవీణ్, సూర్యచంద్రశేఖర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మీరు తినే తిండి, వేసుకునే బట్టలు ప్రేక్షకులవే..

- ఈ విషయాన్ని సినీ పరిశ్రమ గుర్తుంచుకోవాలి
- అల్లు అర్జున్‌కు ఇచ్చిన జాతీయ అవార్డును వెనక్కి తీసుకోవాలి
- తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

పంజగుట్ట: సంధ్య థియేటర్ ఘటనలో రేవతి మృతికి కారణమైన అల్లు అర్జున్‌కు ఇచ్చిన జాతీయ అవార్డును వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం డిమాండ్ చేశారు. ఇదే విషయంపై త్వరలోనే జాతీయ అవార్డు కమిటీకి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్ప–2 సినిమా రూ.2 వేల కోట్లు వ్యాపారం చేసిందని ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి అందులో 2 శాతం రూ.20 కోట్ల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. థియేటర్ వద్ద తొక్కిసలాటలో యువతి మృతి చెందిందని, బాలుడు చావుబతుకుల్లో ఉన్నాడని అల్లు అర్జున్‌కు తెలిసినా అభిమానులకు చేతులు ఊపుతూ వెళ్లిన తీరు చూస్తుంటే ఆయనకు మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. సామాన్యులు, మధ్యతరగతి వారు సినిమా చూస్తేనే సినీ పరిశ్రమ ఉంటుందని, మీరు వేసుకునే బట్టలు, తినే తిండి అన్నీ సినిమా చూసిన ప్రేక్షకులవే అనే విషయాన్ని సినీ పరిశ్రమ వారు గుర్తుంచుకోవాలన్నారు.

జర్నలిస్టులకు డబ్ల్యూజేఐ అవార్డులు



– 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే పాత్రికేయ రంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి అవార్డులు ఇవ్వనున్నట్లు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ప్రకటించింది. జర్నలిస్ట్ కాలనీలో సోమవారం అవార్డుల బ్రోచర్‌ను డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.కృపాకర్, రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్, కార్యదర్శి క్రాంతి తదితరులు విడుదల చేశారు. మూడు కేటగిరీల్లో జర్నలిస్టులకు అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాకు ఈ ఏడాది నుంచి అవార్డులు ఇస్తున్నట్లు వారు చెప్పారు. ప్రతి విభాగం నుంచి ప్రతిభావంతులను ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేస్తామన్నారు. సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ విజేతలను ఎంపిక చేయనుంది. వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న ఆసక్తిగల వారు జనవరి 10వ తేదీలోగా ఎంట్రీలను telangana2017@gmail.comకు పంపించాలని కోరారు. జనవరి మూడో వారంలో నగరంలో పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తూ నడక



కవాడిగూడ: హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తూ సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్ట మైసమ్మ దేవాలయం నుంచి ఎన్టీఆర్ స్టేడియంలోని పుస్తక ప్రాంగణం వరకు పలు పాఠశాలల విద్యార్థులతో పుస్తక నడక ఆహ్వాన నడక నిర్వహించారు. అనంతరం బుక్ ఫెయిర్‌లో సభ నిర్వహించారు. మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, ఎమెస్కో పబ్లిషర్స్ విజయకుమార్, ఐజీ రమేష్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ వంటి కార్యక్రమాలతో పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గుతుందనే ఆందోళన పోతుందన్నారు. పుస్తకాలు అంటే నాగరికతను భవిష్యత్తుకు అందించేవని అభిప్రాయపడ్డారు. అనంతరం అతిథులను బుక్ ఫెయిర్ నిర్వాహకురాలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు యాకూబ్, సెక్రటరీ వాసు, వైస్ ప్రెసిడెంట్ బాల్‌రెడ్డి, శోభన్‌బాబు, కోశాధికారి నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపెల్లి అంజీ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో చట్టం చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు తంగెళ్లమూడి నందగోపాల్, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, దుడుకు లక్ష్మీనారాయణ, మిర్యాల యాదగిరి, ప్రసన్న కుమార్, రాజు నేత, జిర్వాది వెంకటేశ్వర్లు, నిమ్మల వీరన్న పాల్గొన్నారు.

టీఎస్ ఎడ్‌సెట్ కన్వీనర్‌ను మార్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఎడ్‌సెట్–2025 కన్వీనర్‌ను మార్చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. ఓయూలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా 2025 విద్యా సంవత్సరం సెట్ల కన్వీనర్లను నియమించడంపై మండిపడ్డారు. ఇతర సెట్లకు సంబధిత సబ్జెక్టుల ప్రొఫెసర్లను నియమించిన ఉన్నత విద్యామండలి అధికారులు కేవలం ఎడ్‌సెట్, పీఈసెట్–2025 కన్వీనర్లను వేరే సబ్జెక్టుల అధ్యాపకులను నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెట్ల కన్వీనర్ల నియామకంలో అవగాహన లేకుండా ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు, ఇతర అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ విషయమై వర్సిటీల వీసీలతో చర్చించి వెంటనే కన్వీనర్లను మార్చాలని, లేనిపక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షుడు కలకోటి ఉదయ్‌కుమార్‌తో రీసెర్చ్ స్కాలర్స్, బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 177 అర్జీలు

లక్డీకాపూల్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన అర్జీల పరిష్కారానికి ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, కుక్కల సమస్యలు తదితర ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 5 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, అశోక్ సామ్రాట్, చంద్రకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, రఘుప్రసాద్, యాదగిరిరావు, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధికి కేంద్రం నిధులు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని షేక్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్యూయల్ డెస్కులు, టాయిలెట్ క్లీనింగ్ మిషిన్లను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్మించి టాయిలెట్స్ క్లీనింగ్ మిషిన్లు కూడా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు కూర్చోవడానికి ఇబ్బందులు పడకుండా ఫర్నీచర్ కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత ఇంకా ఉందన్నారు. ఎన్నో పాఠశాలల్లో స్కావెంజర్స్ లేకపోవడం వల్ల బాలికలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోందన్నారు. పాఠశాలల నిర్వహణ కూడా పకడ్బందీగా ఉండాలని, విద్యాశాఖ అధికారులు పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత ఖర్చు అయినా సరే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని, దీనికి సంబంధించిన బిల్లులు తాను చెల్లిస్తానని హైదరాబాద్ డీఈవోకు తాను చెప్పినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ డీఈవో రోహిణి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షులు గౌతమ్‌రావు, దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ గంగరాజు, బీజేపీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు శివకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణతో సింగరేణికి మరో వందేళ్ల భవిత



ఆవిర్భావ వేడుకల్లో ప్రసంగిస్తున్న రవి ప్రసాద్

నాంపల్లి: సింగరేణి సంస్థ 135 ఏళ్లుగా దేశ సేవలో తరిస్తోందని, బొగ్గు ఉత్పత్తితో పాటు తన వ్యాపార విస్తరణ చర్యలతో మరో వందేళ్లకుపైగా మనుగడ సాగించనుందని జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సోమవారం జరిగిన సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తూ సింగరేణి సంస్థ రాష్ట్ర కొంగు బంగారమని, రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గు సరఫరా చేయడమే కాకుండా 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్, 245 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నట్లు చెప్పారు. రానున్న ఐదేళ్లలో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ కొత్త గనులు ప్రారంభించనుందని, తద్వారా వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి భవన్ ఉద్యోగులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంకా విషమంగానే బాలుడి పరిస్థితి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

- సంధ్యా థియేటర్ ఘటనపై వెంటనే ఎందుకు స్పందించలేదు?
- ఘటనపై సీఎం, మంత్రి స్పందించిన తీరు అభినందనీయం
- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ

పంజగుట్ట: సంధ్య థియేటర్ ఘటనలో ఒక ఆర్యవైశ్య మహిళ రేవతి మృతి, ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్ర గాయాలపాలైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించిన తీరు అభినందనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఘటన జరిగిన వెంటనే సినీ పరిశ్రమ స్పందించి వారికి సాయం అందించి ఉంటే ఇంతదూరం వచ్చి ఉండేదికాదని, సినీ హీరో కొన్ని గంటలు జైలుకు వెళ్లివస్తే యావత్ సినీ ఇండస్ట్రీ ఆయన్ను పరామర్శించింది అన్నారు. అదే ఒక ప్రాణం పోయి, మరో చిన్నారి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నా ఎవరూ పరామర్శించకపోవడం బాధాకమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ తరఫున తాము కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నామని, బాలుడి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, బ్రెయిన్ డ్యామేజీ అయ్యిందని, వారం రోజులు గడిస్తే కానీ ఏమీ చెప్పలేమని వైద్యులు అంటున్నారని ఆయన తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి స్పందించి బాబు తండ్రికి రూ.25 లక్షల చెక్కుతో పాటు బాలుడి చికిత్సకు అయ్యే ఖర్చు భరిస్తానని, అవసరమైతే విదేశాలకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తానని హామీ ఇవ్వడంతో ఆ కుటుంబానికి కొండంత ధైర్యం లభించిందన్నారు. బాధిత కుటుంబానికి ఆర్యవైశ్య మహాసభ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. సమావేశంలో మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణేష్‌గుప్తా, పొలిటికల్ చైర్మన్ చింతల రవి కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు ఉప్పల శారద, సామ్రాజ్య లక్ష్మి, బి.కిరణ్‌కుమార్, రామ్మోహన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో వైశ్య లైమ్‌లైట్ అవార్డుల ప్రదానోత్సవం

మాదాపూర్: వివిధ వృత్తుల్లో ప్రతిభ చాటిన, ఉన్నత శిఖరాలను అధిరోహించిన వివిధ వృత్తులు, రంగాలకు చెందిన వైశ్య మహిళలకు అవార్డులను అందజేశారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో వైశ్య లైమ్‌లైట్ అవార్డుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది అనురాధ వాబ్బిలిశెట్టి, దుబాయ్‌లోని లీగల్ కన్సల్టెంట్లు, ఆర్యవైశ్య కమ్యూనిటీ నుంచి ప్రథమ మహిళ పైలెట్ మధుకృష్ణ తదితరులకు అవార్డులను అందజేశారు. 17 మంది మహిళలను గుర్తించి ప్రముఖులచే అవార్డులను అందజేశారు. వైశ్య లైమ్‌లైట్ అవార్డుల వ్యవస్థాపకుడు శివకుమార్ ఎమ్మిడి మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని కోరారు. గుర్తింపు లభించినప్పుడే మరింత ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. విశిష్ట మహిళలను గుర్తించి సత్కరించినప్పుడు భవిష్యత్ నాయకులకు మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోసం దరఖాస్తుల వెల్లువ



సాక్షి, సిటీబ్యూరో: ప్రజల నుంచి స్వీకరించిన ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరివన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అత్యధికగా డబుల్ బెడ్‌రూమ్ కోసం దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 1,637 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 1,593, పెన్షన్ 19, జిల్లా విద్యాశాఖ 06, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ 02, ఇతరములు 17 దరఖాస్తులు అందాయని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రామకృష్ణ, జిల్లా అధికారులు జి.ఆశన్న, ఆర్.రోహిణి, డాక్టర్ వెంకటి, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్, సిబ్బంది, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం ఓటు వేయాలి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికుల సంక్షేమం కోసం పరితపించే వారిని ఎన్నుకోవాలని తెలంగాణ జలమండలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్, వాటర్‌వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి పిలుపునిచ్చారు. వాటర్ వర్క్స్ ఎం ప్లాయిస్ యూనియన్ ప్రాంగణంలో చీఫ్ వైస్ ప్రెసిడెంట్ మొగులయ్య ఆధ్వర్యంలో జరిగిన కిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. కార్మికులకు కిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్, జలమండలి జనరల్ సెక్రటరీ రాఘవేంద్ర రాజు, శ్రవణ్, గౌస్ పాషా, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్, రాజా, దేవేందర్, విశ్వనాథ్, ఆంజనేయులు గౌడ్, రాంచందర్, లింగం, రాజకుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, మంగళవారం, 24, డిసెంబర్‌, 2024



గుర్రపు స్వారీ నేర్చుకోవడం అనేది నగరంలో ఒక నయా ట్రెండ్‌గా మారుతోంది. విద్యార్థి దశ నుంచే గుర్రమెక్కాలని టీనేజర్స్‌ తహ తహలాడుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల అభిరుచి, ఆసక్తులను గమనించి ఆ మేరకు ప్రోత్సహిస్తున్నారు. నగరంలోని కొంత మంది ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు ఏకంగా గుర్రాన్ని కొనుగోలు చేసుకుని, ప్రత్యేకంగా శిక్షకుడిని నియమించుకుంటున్నారు. పిల్లలకు గుర్రపు స్వారీలో మెళకువలు నేర్పిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరి కొంత మంది మాత్రం శిక్షణా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో నగరంలో గుర్రపు స్వారీ శిక్షణా కేందాల సంఖ్య పెరుగుతోంది. పూర్తి స్థాయి శిక్షణ పొందిన ఇండియన్‌, బ్రిటిష్‌ బ్రీడ్‌ గుర్రాలకు స్థానికంగా గిరాకీ ఏర్పడింది.

- సాక్షి, సిటీబ్యూరో

వారాంతంలో రైడ్స్‌..

నగరంలోని కొన్ని క్లబ్‌లు వారాంతంలో ప్రత్యేకంగా హార్స్‌ రైడ్స్‌ నిర్వహిస్తున్నాయి. ప్రశాంతమైన ప్రకృతిలో గుర్రపు స్వారీ చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. గ్రూప్‌ ఆఫ్‌ పీపుల్స్‌ కలుసుకుని, హాయిగా ఎంజాయ్‌ చేస్తున్నారు. గండిపేట్‌, ఎల్‌బీ నగర్‌, ఔటర్‌ రింగ్‌ రోడ్డు పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి హార్స్‌ రైడింగ్‌ కనిపిస్తోంది.



- నగర యువతలో పెరుగుతున్న ఆసక్తి
- శివారు ప్రాంతాల్లో కొత్తగా శిక్షణ కేంద్రాలు
- సొంత గుర్రాల కొనుగోలుపై పలువురి దృష్టి
- ప్రత్యేక ట్రైనర్లను నియమించుకుంటున్న రైడర్స్‌
- శిక్షణ పొందిన ఇండియన్‌, బ్రిటిష్‌ బ్రీడ్‌లకు గిరాకీ

హార్స్‌.. రైడింగ్‌..

ట్రెండీగా మారుతున్న గుర్రపు స్వారీ

నగరానికి చెందిన పలువురు ఔత్సాహికులు బెంగళూరు, ఢిల్లీ, జైపూర్‌, జోధ్‌పూర్‌ తదితర ప్రాంతాల నుంచి రూ.లక్షలు వెచ్చించి గుర్రాలను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో ఫాం హౌస్‌లు, ఖాళీ ప్రదేశాల్లో ప్రత్యేకించి ఇసుకతో కూడిన మెత్తని నేలలను శిక్షణా కేంద్రాలుగా తయారు చేస్తున్నారు. శిక్షణ తీసుకునే వారు ప్రమాదవశాత్తూ కిందపడినా దెబ్బలు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గుర్రం ఎక్కడం ఎలా, కుడి, ఎడమ ఎటు వైపు తిప్పాలంటే ఎలాంటి సంకేతాలు ఇవ్వాలి, గుర్రాన్ని ఆపడానికి ఏం చేయాలనే విషయాలు శిక్షకులు ముందుగానే పిల్లలకు బోధిస్తున్నారు.

ఏడు వేల నుంచి..

హార్స్‌ రైడింగ్‌ అనుకున్నంత సులువైనదేమీ కాదు. ఇందుకు చాలా ఏకాగ్రత, దృష్టికేంద్రీకరణ ఉండాలి. ముఖ్యంగా గుర్రంపై కూర్చోవడమే ఓ పెద్ద సవాలుగా ఉంటుంది. కూర్చున్నాక అది ఎటు వెళుతుందనేదీ ముందుగానే పసిగట్టాల, మన దారిలోకి తెచ్చుకోగల నైపుణ్యాన్ని సాధించాలి. చాలా మంది పిల్లలు నెల నుంచి రెండు నెలల్లో అశ్వాన్ని అదుపులోకి తెచ్చుకోగలుగుతున్నారని శిక్షకులు చెబుతున్నారు. కాగా శిక్షణకు గానూ పెద్దవాళ్లకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, పిల్లలకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకూ ఫీజు తీసుకుంటున్నారు.

రిచ్‌మ్యాన్‌ గేమ్‌..

గుర్రపు స్వారీ అనేది రిచ్‌మ్యాన్‌ గేమ్‌. సామాన్యులకు గుర్రం కొనుగోలుచేయడం, పోషించడం, శిక్షణకు అవసరమైన విధంగా తీర్చిదిద్దడం, అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు దాన్ని బాగోగులు.. ఇలా అన్నీ ఖర్చుతో కూడుకున్న పనులే. ఆరోగ్యంగా ఉన్న గుర్రానికి నెలకు కనీసం రూ.25 వేలు, ఆపైనే వెచ్చించాల్సి ఉంటుంది. జంతువులను మచ్చిక చేసుకోవడం, వాటితో స్నేహంచేయడం, జాగ్రత్తగా చూసుకోవడంలో ఎంతో సంతృప్తినిస్తుందని పలువురు నిర్వాహకులు చెబుతున్నారు. జంతువుల నుంచి కొత్తవిషయాలు నేర్చుకునే అవకాశం ఉంటుందని ట్రైనర్స్‌ పేర్కొంటున్నారు.

ఇదో హాబీలా..

పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన గుర్రాలను మాత్రమే గుర్రపు స్వారీ నేర్చుకునేందుకు వచ్చేవారికి ఇస్తాం. మొత్తం 25 గుర్రాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలో 10 ఏళ్ల నుంచి 20 ఏళ్ల మధ్య వయస్కులు ఎక్కువ మంది శిక్షణ తీసుకోడానికి వస్తున్నారు. ఉత్తర భారత దేశంలో గుర్రపు స్వారీకి ఎక్కువ డిమండ్‌ ఉంది. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలోనే ఆ ట్రెండ్‌ మొదలైంది. ఇదొక హాబీలా మారిపోయింది. ఢిల్లీ, జైపూర్‌, జోధ్‌పూర్‌, ముంబయి, గుజరాత్‌ తదితర ప్రాంతాల్లో గుర్రపు క్రీడల పోటీలకు వెళుతుంటాం.

– సయ్యద్‌ మాజ్‌, ట్రైనర్‌, క్రాస్‌ కంట్రీ క్లబ్‌ హైదరాబాద్‌



నవాబుల కాలం నుంచే..

నవాబుల కాలం నుంచే హైదరాబాద్‌లో గుర్రపు స్వారీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పుడదే క్రేజ్‌గా మారుతోంది. నగరంలో రాత్రి పూట పలువురు గుర్రాలపై సంచరిస్తున్న సందర్భాలూ కనిపిస్తున్నాయి. అయితే వారికి తిరిగేందుకు వాహనాలు అందుబాటులో లేక ఇలా వస్తున్నారనుకుంటే పొరపాటే.. అందరిలోకీ ప్రత్యేకంగా ఉండాలనే దృష్టితో కొందరు.. గుర్రపు స్వారీపై మక్కువతో మరికొందరు ఇలా చేస్తున్నామంటున్నారు.



స్వారీ చాలా నేర్పిస్తుంది..



కరోనా లాక్‌డౌన్‌ సమయంలో గుర్రపు స్వారీ నేర్చుకున్నాను. శరీరంలోని కండరాల అమరిక, ఆత్మస్థైర్యం, పాజిటివ్‌ థింకింగ్‌, సెల్ఫ్‌ కంట్రోల్‌, జంతువుల పట్ల గౌరవం, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవడం, క్లాస్‌, మీటింగ్‌, ఓపెన్‌ ప్లేస్‌ ఎక్కడైనా మాట్లాడగలిగే వాక్చాతుర్యం, ఇలా అన్నీ కలిపి ఒక ప్యాకేజీలా వచ్చాయి. నేర్చుకునేందుకు పూర్తిస్థాయిలో శిక్షణ పొందిన గుర్రం కొనుగోలు చేసుకున్నాం. దాన్ని నిర్వహణ కొద్దిగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వారాంతాల్లో రైడ్స్‌కి వెళుతుంటాం. ఆ గుర్రమే మనకు అన్నీ నేర్పిస్తుంది.

– ఇషాన్‌ శర్మ, ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం, మణికొండ



నేడు క్రిస్మస్‌ స్పెషల్‌

సలేహా ఈవెంట్‌

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో క్రిస్మస్‌ సంబరాలను పురస్కరించుకుని హైటెక్‌ సిటీలోని హార్డ్‌ రాక్‌ కేఫ్‌ ఓ ప్రత్యేక సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రైవేట్‌ గాయని సలేహా సంగీత ప్రదర్శన ఉంటుంది. బాలీవుడ్‌ పాటలకు, పాశ్చాత్య, ఆంగ్ల గీతాలకు పేరొందిన సలేహా మ్యూజిక్‌ ఈవెంట్‌ను క్రిస్మస్‌ స్పెషల్‌గా కేఫ్‌ సమర్పిస్తోంది. రాత్రి 9 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో ఎంట్రీలు లభిస్తాయి.

బేర్‌ఫుట్‌ కేఫ్‌లో కేక్‌ మిక్సింగ్‌

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2లోని బేర్‌ఫుట్‌ కేఫ్‌లో సోమవారం క్రిస్మస్‌, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్‌ మిక్సింగ్‌ కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్త, సోషలైట్‌ శైలజారెడ్డి తన ఎన్‌జీఓ శైలజ ఆర్యన్‌ ఫౌండేషన్‌ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు సంఘ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం @300



నాట్య గురువు శ్రావ్య మానస భోగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శన

300 మంది నృత్య కళాకారుల భాగస్వామ్యం

మోతీనగర్‌ : ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ సుమధుర అకాడమీ వార్షికోత్సవ వేడుకలు సుమధురోత్సవం పేరుతో మోతీనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నాట్య గురువు శ్రావ్య మానస భోగిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది కూచిపూడి కళాకారుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆంగికం.. భువనం.. అంశంతో ప్రారంభమై.. శ్లోకాభినయం, థిల్లానా, దశావతార శ్లోకం, మహాగణపతిం, అష్టలక్ష్మీ స్తోత్రం, పరమ పరుష, శివగంగ, హనుమాన్‌చాలీసా, అన్నమయ్య బ్రహ్మమొక్కటే, కాళీయ నర్తనం నమో నమో నృత్యాంశాలతో పాటు, ప్రత్యేక నృత్య రూపకాలుగా రామాణయం, శ్రీనివాస కళ్యాణం వంటి అంశాలు నాట్య గురువు శ్రావ్య మానస భోగిరెడ్డి శిష్య బృందం అత్యద్భుతంగా ప్రదర్శించింది. దీనికి అతిథులుగా డాక్టర్‌ కేకేవీ శర్మ, నటరాజ్‌ భట్‌, డా. నైని హాల్‌సింగ్‌, డా. ఎస్‌పీ భారతి, విజయ్‌కుమార్‌, విశేష్‌ సిన్హా, రచయిత, దర్శకులు శోభన్‌ కళాకారులను అభినందించారు.

1300లకు పైగా ప్రదర్శనలు..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 1300లకు పైగా ప్రదర్శనలు ఇచ్చి, వందలాది మందికి శిక్షణ ఇస్తూ తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరుచుకున్నారని శ్రావ్య మానస నృత్య సేవను పలువురు అతిథులు కొనియాడారు. అంతేకాకుండా కూచిపూడి నృత్యాన్ని దశదిశలా వ్యాపింపచేస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా ఆర్‌కె ధూళిపాల, శరత్‌ భోగిరెడ్డి వ్యవహరించారు.



శిక్షణకు నిథమ్‌.. రుచికి అద్భుతం..

వంటల్లో సత్తా చాటిన మహిళలు

ముగిసిన మహిళాశక్తి శిక్షణా కార్యక్రమం

చికెన్‌ బిర్యాని, సాధారణ బిర్యాని, బేసిక్‌ గ్రేవీస్‌, తెలంగాణ స్నాక్స్‌, రైతా, వెజ్‌ దమ్‌ బిర్యాని, చికెన్‌ కర్రీ, మిర్చి మసాల, రకరకాల అన్నం తయారీ, టీ, విభిన్న రకాల కాఫీ, సావరీ, వంటి వివిధ మెనూలను అదరగొట్టారు ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల నిర్వాహకులు. చెఫ్‌లు మహేష్‌, నిథమ్‌ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌, ప్రముఖ చెఫ్‌ డాక్టర్‌ ఎంకె గణేష్‌, ప్లేస్‌మెంట్‌ ఆఫీసర్‌ మిసెల్లీ జే ఫ్రాన్సిస్‌ పర్యవేక్షణలో ఐదో బ్యాచ్‌లో 28 మంది మహిళలకు వంటల తయారీ, క్యాంటీన్‌ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. - రాయదుర్గం



పరిశుభ్రమైన వాతావరణంలో, స్వచ్ఛమైన, నాణ్యమైన వస్తువులతో ఆహార పదార్థాలను తయారు చేసి అందించేలా ఏర్పాట్లు చేయడం, దీనిపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం విశేషమని శిక్షణలో పాల్గొన్న మహిళలు అన్నారు. పదిరోజుల పాటు అందించిన శిక్షణలో భాగంగా చివరి రోజైన సోమవారం మహిళలు నేర్చుకున్న వంటకాలన్నీ స్వయంగా తయారుచేసిన ప్రదర్శించారు. ఈ వంటకాలను నిథమ్‌, సొసైటీ ఫర్‌ ఎలిమినేషన్‌ ఆఫ్‌ రూరల్‌ పావర్టీ (ఎస్‌ఈఆర్‌పీ), పర్యాటక శాఖ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పరిశీలించారు. అనంతరం ఎస్‌ఈఆర్‌పీ డైరెక్టర్‌ డబ్ల్యూ జాన్సన్‌, ప్రాజెక్ట్‌ మేనేజర్‌ శ్రావణ్‌, నిథమ్‌ అధికారులు శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించారు.



ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం..

మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడానికే క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని ఎస్‌ఈఆర్‌పీ డైరెక్టర్‌ డబ్ల్యూ జాన్సన్‌ తెలిపారు. శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడుతూ క్యాంటిన్ల నిర్వహణ ద్వారా వారు ఆర్థికంగా ఎదగడమే కాకుండా మరికొంత మందికి ఉపాధి అవకాశం కల్పించనున్నారని గుర్తు చేశారు. ఆహార పదార్థాల తయారీపై ప్రత్యేక శిక్షణలో నిథమ్‌కు మంచి గుర్తింపు ఉందని, నిర్వాహకులకు ఐదు విడతల వారిగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సెర్ప్‌ సీఈఓ డీ దివ్య, పర్యాటక శాఖ, నిథమ్‌ డైరెక్టర్‌ జెడ్‌, హన్మంత్‌ ఎప్పటికప్పుడు శిక్షణను పర్యవేక్షించారని గుర్తు చేశారు. సెర్ప్‌, నిథమ్‌, పర్యాటక శాఖ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేఎల్‌కి స్మార్ట్‌ క్యాంపస్‌ అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక ఆల్‌ ఇండియా స్మార్ట్‌ క్యాంపస్‌ అవార్డును నగరానికి చెందిన కేఎల్‌ డీమ్డ్‌ టూ బీ యూనివర్సిటీ దక్కించుకుంది. ఢిల్లీలోని విగ్యాన్‌ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బ్యూరో ఆఫ్‌ ఎనర్జీ ఎఫిషియన్సీ డైరెక్టర్‌ జనరల్‌ శ్రీకాంత్‌ నాగులపల్లి నుంచి కేఎల్‌ డీమ్డ్‌ యూనివర్శిటీ ప్లానింగ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ డీన్‌ డాక్టర్‌ వి.రాజేష్‌ ఈ అవార్డును అందుకున్నారు. 'పర్యావరణ హితమైన క్యాంపస్‌ను రూపొందించడానికి మా ప్రయత్నంలోని చిత్తశుద్ధికి ఈ అవార్డు నిదర్శనం' అని రాజేష్‌ అన్నారు. 'ఎనర్జీని ఆదా చేయడం మాత్రమే కాదు, పర్యావరణ పరిరక్షణతో కూడిన బాధ్యతాయుతమైన పురోగతిని విశ్వసిస్తున్నాం' అని విశ్వవిద్యాలయం వైస్‌ ఛాన్సలర్‌ డాక్టర్‌ జి.పార్థసారథి వర్మ ఈ సందర్భంగా అన్నారు.



పురాతన వస్తువుల ప్రదర్శన ప్రారంభం

ఉర్దూఘర్‌లో 25 వరకు ఎగ్జిబిషన్‌




చార్మినార్‌: అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల ప్రదర్శన–2024 సోమవారం మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ప్రారంభమైంది. డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనలో సొసైటీ చైర్మన్‌ డాక్టర్‌ అబ్దుల్‌ సమద్‌ ఉస్మానీ మాట్లాడుతూ ఆజ్‌ కల్‌ మార్కెట్‌ మే పైసా బీ బిక్తా హై (ఈ రోజుల్లో డబ్బు సైతం విక్రయించబడుతుంది) అని అన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రపంచ దేశాల పురాతన కరెన్సీ, విలువైన వస్తువులు, నాణేలను ఎగ్జిబిషన్‌ రూపంలో ఒకే చోట చేర్చామని, విజ్ఞానంతో పాటు వ్యాపారం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో హుస్సేనీ ఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ పద్మ, సొసైటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ అబ్దుల్‌ హై ఖాద్రీ, సిరాజుద్దీన్‌ తో పాటు టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు జుబేర్‌ అల్‌ ఆమోదీ పాల్గొన్నారు.

కరెంట్ కోత.. చార్జీల మోత

ఏపీలో 6 నెలల్లో రూ.15 వేల కోట్లకుపైగా జనంపై భారం వేసిన కూటమి సర్కార్

ఒకపక్క విద్యుత్ బిల్లుల షాక్‌లు.. మరోపక్క కోతలు



రోజూ 2 నుంచి 3 గంటల పాటు సరఫరా నిలిపివేత

డిమాండ్ మేరకు సరఫరా చేయలేక అనధికారిక కోతలు

కరెంట్ లేక చీకట్లో గాడాంధకారంలో అల్లాడుతున్న గ్రామాలు

ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం అందించిన ఉచిత విద్యుత్తుకు ఎగనామం

ఉచిత విద్యుత్తు లబ్ధిదారులకు రూ.వందలు.. వేలల్లో బిల్లులు జారీ చేస్తున్న కూటమి సర్కారు

తమ కష్టాలు చెప్పుకుంటే పింఛన్లు, రేషన్ కార్డులు తొలగిస్తారని ప్రజల్లో ఆందోళన

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈనాడు చెవిలో ఈడీ చెప్పిందా?

దర్యాప్తు విషయాలు బహిర్గతమయ్యాయా?

లేక ఈనాడు తన అజెండాకు అనుగుణంగా కథనాలను నడిపిస్తోందా?

- రూ.3,000 కోట్ల నికర లాభాలు సాధిస్తున్న అరబిందో రూ.494 కోట్లు సమకూర్చుకోలేదా?
- నిజంగానే బెదిరించి ఉంటే పోర్టులో 100% వాటా తీసుకుంటారుగానీ 41 శాతం వాటా మాత్రమే ఎందుకు తీసుకుంటుంది?



వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగానే కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో వాటాల కొనుగోలు

ఆడిటర్లను ఆయా శాఖల అధికారులు ఎంపిక చేస్తారన్న విషయం ఎల్లో మీడియాకు తెలియదా?

సాక్షి, అమరావతి: కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయంపై 'ఈనాడు' తన ఆక్రోశాన్ని మరోసారి వెళ్లగక్కింది. 150 దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తూ ఏటా రూ.3,000 కోట్లకు పైగా లాభాలను ఆర్జిస్తున్న కంపెనీ రూ.494 కోట్లు సమకూర్చుకోవడం కూడా పెద్ద వింత అయినట్లు ఒక విషపూరిత కథనాన్ని వండివార్చింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేస్తున్న దర్యాప్తు అంతా ఈనాడుకు చెవిలో చెబుతున్నట్లుగా ''రూ.494 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?'' అంటూ సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈడీ లాంటి సంస్థ దర్యాప్తు చేస్తున్న విషయాలే కాకుండా ఎవర్ని, ఎప్పుడు, ఎలా విచారిస్తారు...? వారిని ఏ ప్రశ్నలు అడుగుతారు? అనే వాటిని కథనంలో ప్రచురించడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకవేళ నిజంగానే విషయాలను ఇలా బయటకు చెబుతుంటే ఆ దర్యాప్తు ఎంత పక్షపాతంతో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు! లేదంటే ఈనాడు తన అజెండాకు అనుగుణంగా ఈడీ పేరుతో ఈ కథనాలను వండివార్చి ఉండాలి. ఈ రెండింటిలో ఏది నిజమైనా ఈనాడు ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరి అజెండాకు డప్పు కొడుతుందో ఊహించవచ్చు!!

అది వ్యూహాత్మక పెట్టుబడి

అరో ఇన్‌ఫ్రా వ్యూహాత్మక పెట్టుబడిలో భాగంగా కాకినాడ డీప్ వాటర్‌పోర్టులో వాటాలు కొనుగోలు చేసింది. పోర్టులో 41 శాతం వాటాలను కేవీ రావు పూర్తి సమ్మతితోనే 2020లో విక్రయించడంతో పాటు ఆ వాటాల విలువ రూ.494 కోట్లను స్వీకరించారు. కాకినాడ డీప్‌వాటర్ పోర్టు దగ్గరలోనే కాకినాడ సెజ్‌ను రూ.1,700 కోట్లకు కొనుగోలు చేయడంతో పాటు ఆ సెజ్‌లో రూ.2,400 కోట్లతో మరో పోర్టును కూడా అరో ఇన్‌ఫ్రా నిర్మిస్తోంది. ఇదంతా వ్యూహాత్మక వ్యాపార ప్రణాళికలో భాగంగా జరిగింది. సెజ్‌ను ఆనుకుని ఉన్న కాకినాడ డీప్ వాటర్ పోర్టులో కూడా తమకు వాటాలు ఉంటే వ్యూహాత్మకంగా ప్రయోజనకరమని అరబిందో సంస్థ భావించింది. భవిష్యత్‌లో కాకినాడ డీప్ వాటర్ పోర్టులోని తన మెజార్టీ వాటాలను ప్రమోటర్ కేవీ రావు విక్రయించాలని భావిస్తే ముందుగా అరబిందో సంస్థకే అవకాశం ఇవ్వాలి. ఆ నిబంధన (రైట్ టు ఫస్ట్ రెఫ్యూజల్) ఒప్పందంలో ప్రధానాంశం. ఒకవేళ బెదిరించి ఉంటే మొత్తం పోర్టునే స్వాధీనం చేసుకుని ఉంటారు కదా! 41 శాతం వాటా కొనుగోలు తర్వాత కూడా పోర్టు యాజమాన్య హక్కులు కేవీరావు చేతిలోనే ఉన్నాయి కదా. ఆయన్ను నిజంగానే బెదిరించి ఉంటే అప్పుడే రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ), నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ) తదితర సంస్థలకు ఫిర్యాదు చేసేవారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించేవారు. కానీ కేవీ రావు ఈ నాలుగున్నరేళ్లలో ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. కేవీ రావుకు అభ్యంతరం ఉంటే వాటాల బదిలీ పూర్తయ్యేలోగా వివిధ దశల్లో ఎప్పుడైనా సరే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. కానీ ఆయన ఏ దశలో కూడా ఫిర్యాదు చేయలేదు. అంటే ఆయన పూర్తి సమ్మతితోనే వాటాలను విక్రయించారన్నది స్పష్టమవుతోంది. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఫిర్యాదు చేశారంటే దీని వెనుక కుట్రను సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఏది నిజం?

తప్పుడు ఫిర్యాదు... వెంటనే కేసు

అనంతరం అసలు పాత్రధారి తెరపైకి వచ్చారు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడైన కాకినాడ డీప్ వాటర్‌పోర్ట్ ప్రమోటర్ కేవీ రావుతో ఈ నెల 2న సీఐడీకి ఫిర్యాదు ఇప్పించారు. 2020లో తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌లో 41శాతం వాటాను అరబిందో సంస్థకు చెందిన అరో రియాల్టీ సంస్థ కొనుగోలు చేసిందని ఆయన నాలుగేళ్ల తరువాత ఫిర్యాదు చేయడం చంద్రబాబు పక్కా కుట్రను స్పష్టం చేస్తోంది. విచిత్రం ఏమిటంటే... కేవీ రావు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు చేసిన ఈ నెల 2నే సీఐడీ కేసు నమోదు చేసేయడం గమనార్హం

ఆడిట్ సంస్థను ఎంపిక చేసేది ఆ శాఖ కార్యదర్శి

ప్రభుత్వాలు వివిధ విభాగాల్లో ఆడిటింగ్ నిర్వహించడం సాధారణం. ఏదైనా విభాగంలో ఆడిటింగ్ నిర్వహించాలంటే ఆ శాఖకు చెందిన కార్యదర్శి ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేస్తారు. ఇక్కడ కూడా అదే విధంగా పీకేఎఫ్ శ్రీధర్ అండ్ సంతానం ఎల్‌ఎల్‌పీ అనే ఆడిటింగ్ సంస్థను ఎంపిక చేశారు. ఆ ఆడిటింగ్ సంస్థకు, విజయసాయిరెడ్డికి ఏమిటి సంబంధం? లేని సంబంధాలను అంటగట్టి మసిబూసి మారేడు కాయ చేయాలని, తద్వారా ఎల్లో గ్యాంగ్‌కు ప్రయోజనం కలిగించేందుకు ఈనాడు పడరానిపాట్లు పడుతోంది.



ప్రభుత్వ పోర్టును కారుచౌకగా కట్టబెట్టింది బాబే

కాకినాడ డీప్ వాటర్ పోర్టును ప్రైవేటుపరం చేసింది గతంలో చంద్రబాబు ప్రభుత్వమేనన్నది అసలు వాస్తవం. ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఏడీబీ రుణాలతో ఏపీ ప్రభుత్వం కాకినాడ డీప్ వాటర్ పోర్ట్‌ను 1997లో నిర్మించింది. లాభాల్లో ఉన్న ఆ పోర్టును 1999లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబే కారు చౌక ధరకు ప్రైవేటుపరం చేశారు. ఓ మలేషియా కంపెనీని ముందు పెట్టి కాకినాడ డీప్‌వాటర్ పోర్టును కారు చౌకగా కట్టబెట్టేశారు. కానీ తరువాత అసలు విషయం వెలుగు చూసింది. మలేషియా కంపెనీ ముసుగులో చంద్రబాబు సన్నిహితుడు కేవీ రావు ఆ పోర్టును దక్కించుకున్నట్లు బయటపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలు పెట్టిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను కూడా చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తుండటం గమనార్హం.

ప్రైవేట్ ఒప్పందంతో ప్రభుత్వానికి ఏం సంబంధం?

అరబిందో సంస్థ 150 దేశాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందింది. ఏటా రూ.72 వేల కోట్ల టర్నోవర్, రూ.3 వేల కోట్ల నికర లాభం నమోదు చేస్తోంది. ఆ వ్యాపార లావాదేవీ పూర్తిగా అరబిందో సంస్థ, కేవీ రావు మధ్య జరిగిన ప్రైవేట్ ఒప్పందం. అందులో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికిగానీ, ఇతరులకుగానీ ఎలాంటి సంబంధం లేదు. కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాల విక్రయం అన్నది పూర్తిగా రెండు ప్రైవేటు సంస్థల మధ్య వ్యవహారం. ఐదేళ్ల తరువాత చంద్రబాబు ప్రభుత్వం ఆ వ్యవహారంలో తల దూర్చడం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టమవుతోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ప్రైవేటు ఆస్తుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ దందా సాగిస్తుండటం విభ్రాంతికరం. రెండు సంస్థల మధ్య ప్రైవేటు వ్యవహారంలో టీడీపీ కూటమి ప్రభుత్వం జోక్యం వెనుక మర్మం ఏమిటి? ప్రభుత్వం మారగానే అంతకుముందు జరిగిన ప్రైవేటు వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటామంటే రాష్ట్రంలోనే కాదు దేశంలో కూడా ఓ దుష్ట సంప్రదాయానికి తెరతీసినట్టు అవుతుంది. పరస్పర అంగీకారంతో ప్రైవేటు ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు సాగుతుంటాయి. ఐదేళ్ల తరువాత సహజంగానే ఆ ఆస్తుల మార్కెట్ విలువ పెరుగుతుంది. మార్కెట్ విలువ పెరిగింది కాబట్టి ఐదేళ్ల క్రితం తనను బెదిరించి ఆస్తిని అమ్మేలా చేశారని ఫిర్యాదు చేస్తామంటే ఎలా..? వాటిలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటే పరిస్థితి ఎంతవరకు వెళుతుంది ?

అంతా బాబు కుట్ర స్క్రిప్టే...

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను హస్తగతం చేసుకునేందుకు చంద్రబాబు పన్నాగం పన్నారు. ఈ క్రమంలో పోర్ట్ నుంచి బియ్యం అక్రమ రవాణాను తెరపైకి తెచ్చి జనసేనలోని తన కోవర్ట్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కాకినాడ పర్యటనకు పంపారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ గత నెల 29న ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకుని కాకినాడలో వాలారు. కాకినాడ యాంకరేజ్ పోర్ట్ వద్దకు చేరుకుని రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ డ్రోన్ కెమెరాలతో డ్రామా పండించారు. యాంకరేజ్ పోర్ట్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. మరి అక్కడ నుంచి రేషన్ బియ్యం స్మగ్లింగ్ జరిగితే వారు ప్రశ్నించాల్సింది ముఖ్యమంత్రి చంద్రబాబునే కదా!!

దక్షిణమధ్య రైల్వేకు ఆల్‌ఇండియా 'ఎఫీషియెన్సీ షీల్డ్స్'



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులకు ఉత్తమ సదుపాయాలను అందజేయడంతో పాటు, ఆదాయంలోనూ ప్రగతిపథంలో దూసుకుపోతున్న దక్షిణమధ్య రైల్వేకు ప్రతిష్టాత్మక ఆల్‌ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫీషియెన్సీ షీల్డ్స్ లభించాయి. 69వ రైల్వే వారోత్సవాల సందర్భంగా ఈ నెల 21వ తేదీన ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ ఈ అవార్డులను అందజేశారు. అతి విశిష్ట రైలు సేవా పురస్కారాల్లో భారతీయ రైల్వేలోని అన్ని జోన్‌లలో రెండు ''ఆల్‌ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫీషియెన్సీ షీల్డ్స్''సాధించడం ద్వారా దక్షిణమధ్య రైల్వేకు జాతీయస్థాయిలో అత్యున్నత గుర్తింపు లభించడం విశేషం. గడచిన సంవత్సర కాలంలో ప్రదర్శించిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి (పశ్చిమ రైల్వే, దక్షిణ రైల్వేతో కలిపి), అలాగే దక్షిణ మధ్య రైల్వే నిర్మాణ విభాగానికి (మధ్య రైల్వే, తూర్పు మధ్య రైల్వేతో కలిపి) ఆల్ ఇండియా పెర్ఫార్మెన్స్ ఎఫీషియెన్సీ షీల్డ్‌లు లభించాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధిపతులైన చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యప్రకాశ్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ పీఎస్ బ్రహ్మానందం తదితరులు ఈ షీల్డ్‌లను అందుకున్నారు. అలాగే దక్షిణ మధ్య రైల్వేకు చెందిన మరో ముగ్గురు అధికారులు, ముగ్గురు ఉద్యోగులకు అతి విశిష్ట రైలు సేవా పురస్కార్ వ్యక్తిగత అవార్డులు లభించాయి.

అటవీ అధికారుల సమాఖ్యలో తెలంగాణ అధికారి

అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఎండీ మోజామ్ అలీఖాన్ ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: అటవీ అధికారుల సమాఖ్యలో తెలంగాణకు చెందిన అధికారికి చోటు దక్కింది. అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర డిప్యూటీ రేంజర్ ఎండీ మోజామ్ అలీఖాన్ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన అటవీ అధికారుల సమాఖ్య జాతీయ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షునిగా పంజాబ్ రాష్ట్రానికి చెందిన ప్రదీప్ కుంబాడ ఎన్నికవగా.. జాతీయ ప్రధాన కార్యదర్శితోపాటు దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షునిగా తెలంగాణలోని గజ్వేల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పవన్ కుమార్, జాతీయ సహాయ కార్యదర్శిగా మెదక్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆజం హుస్సేన్, కార్యవర్గ సభ్యునిగా మహబూబ్‌నగర్ డిప్యూటీ రేంజర్ జాకీర్‌లను ఎన్నుకున్నారు. మోజామ్ అలీఖాన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అటవీ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అడవిలో ఉద్యోగాలు చేసే అటవీ అధికారుల వ్యక్తిగత భద్రత కోసం ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోలవరం ముంపుపై మళ్లీ సర్వే

- సర్వే కిన్నెరసాని, ముర్రెడువాగులకే పరిమితం
- నలుగురు ఇంజనీర్లను నియమించిన ఏపీ సర్కారు
- మరో ఐదు వాగులపైనా సర్వే చేయాలంటున్న తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే కిన్నెరసాని, ముర్రెడువాగులు ఉప్పొంగి తెలంగాణ భూభాగంలో ముంపునకు గురికానున్న ప్రాంతాలను గుర్తించి డీమార్కింగ్ చేసేందుకు ఎట్టకేలకు ఏపీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ అధికారులు గత ఏప్రిల్‌లో నిర్వహించిన జాయింట్ సర్వే ఆధారంగా డీమార్కింగ్ చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నేతృత్వంలో నలుగురు ఇంజనీర్లు తమ రాష్ట్రం తరఫున ఈ ప్రక్రియలో పాల్గొంటారని ఏపీ తెలిపింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ధవళేశ్వరం సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.నరసింహ మూర్తి ఈ నెల 3న తెలంగాణకు లేఖ రాశారు. డీమార్కింగ్ ప్రక్రియ కోసం మళ్లీ జాయింట్ సర్వే నిర్వహించేందుకు తేదీలను తెలపాలని తెలంగాణ నీటిపారుదల శాఖను కోరారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రెడువాగులకు ఏర్పడనున్న ముంపుపై ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇప్పటికే జాయింట్ సర్వే నిర్వహించగా, తదుపరిగా క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయాల్సి ఉంది. ఇందుకు తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించాలని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా గత ఆగస్టు 28న సాంకేతిక కమిటీ సమావేశంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావానికి సంబంధించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అభ్యంతరాలపై అప్పట్లో ఈ సమావేశం నిర్వహించారు.

950 ఎకరాలు ముంపునకు గురవుతాయి: తెలంగాణ

పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల ఎఫ్ఆర్ఎల్‌తో తెలంగాణలో 950 ఎకరాలు ముంపునకు గురవుతాయని, దీనిపై సైతం జాయింట్ సర్వే చేయాల్సిందేనని తెలంగాణ డిమాండ్ చేస్తోంది. కిన్నెరసాని, ముర్రెడువాగులతో పాటే మరో ఐదు వాగులపై ఉండనున్న ప్రభావంపై సైతం సర్వే నిర్వహించాలని కోరుతోంది. మరోవైపు ఎన్జీటీ ఆదేశాల మేరకు ముర్రెడువాగు, కిన్నెరసానిలకే సర్వేను పరిమితం చేస్తామని ఏపీ అంటోంది. ప్రస్తుతానికి రెండు వాగులతో ఉండనున్న ముంపుపై మాత్రమే సర్వే జరిగే అవకాశం ఉంది.

ఘనంగా ఉద్యాన వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 2014 జూన్‌లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదే సంవత్సరం డిసెంబర్ 23న కొండా లక్ష్మణ్ వర్సిటీ ఏర్పడిందని విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ కళాధార్‌బాబు అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయానికి గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి, తుది పోరాటాల్లో చురుకుగా పాల్గొన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని తెలిపారు. ఇది రాష్ట్రంలో మొదటి ఉద్యాన విశ్వవిద్యాలయం కాగా, దేశంలో నాలుగవది అని ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయం చదువు, పరిశోధన, విస్తరణలో ముందడుగు వేస్తోందని, ఉద్యాన పంటలలో వచ్చే ఆధునిక సాంకేతికతను రైతులకు అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే వరకు ముందుకు నడవాలని సూచించారు.

అన్న నుంచి నాకు, కుటుంబానికి ప్రాణహాని

- హీరో మంచు విష్ణుపై తమ్ముడు మనోజ్ ఆరోపణ
- సహచరులతో కలిసి కుట్రలు పన్నుతున్నారని పోలీసులకు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: 'మంచు' కుటుంబంలో చెలరేగిన మంటలు ఇంకా చల్లారలేదు. అన్న మంచు విష్ణు వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ మంచు మనోజ్ మరోసారి ఆరోపించారు. సహచరులైన వినయ్ మహేశ్వరి, విజయ్‌రెడ్డి, రాజ్ కొందూరు, శివ, వన్నూర్‌లతో కలిసి విష్ణు తనకు, తన భార్య, పిల్లలకు హాని కలిగించాలన్న ఉద్దేశంతో నేరపూరిత కుట్రలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఏడు పేజీల ఫిర్యాదును పహాడీ షరీఫ్ పోలీసులకు ఆన్‌లైన్‌లో పంపారు. తన ఆరోపణలకు సంబంధించి డాక్యుమెంటరీ సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ రికార్డులు, సందేశాలను ఫిర్యాదుకు జత చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 11న మోహన్‌బాబు యూనివర్సిటీ, ట్రస్ట్‌ల నిధులను విష్ణు, అనుచరులు దుర్వినియోగం చేశారని మంచు మనోజ్ ఫిర్యాదులో ఆరోపించారు. వర్సిటీ కార్యకలాపాలను విష్ణు, వినయ్ అ. దీనంలోకి తీసుకున్నారని.. దీనిపై వినయ్‌కు మెసేజ్ చేయగా చంపుతామని అపరిచితుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8న తనపై దాడి జరిగిందని, ఈ నెల 14న తన తల్లి పుట్టిన రోజున విష్ణు, శివ, వన్నూర్, మరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పుట్టినరోజు కేక్ డెలివరీ నెపంతో ఇంట్లో వచ్చి జనరేటర్లలో చక్కెర పోసి విద్యుతాఘాతం ద్వారా చంపేందుకు ప్రయత్నించారని మనోజ్ ఆరోపించారు. తాజాగా సోమవారం ఇంటికి నీటి సరఫరా నిలిపివేశారన్నారు. అయితే తనకు న్యాయం జరిగే దాకా ఇంటిని విడిచివెళ్లనని లేఖలో మనోజ్ పేర్కొన్నారు. అప్పటివరకు తనతోపాటు తన భార్య, పిల్లలకు భద్రత కల్పించాలని పోలీసులను కోరారు.

ఆసుపత్రుల నిర్వహణ మెరుగుపడాలి!

- సమీక్షలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలపై హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ భవన్‌లో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లోని పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాల నిర్వహణ, మరమ్మతులపై దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరికరాలు, సిబ్బంది నియామకంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని కోరారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, వైద్యారోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్ చుట్టూ కూరగాయల సాగు

- వివిధ కార్పొరేషన్ల ఎండీలకు మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు 100 కిలోమీటర్ల పరిధిలోని అన్ని జిల్లాల్లో కూరగాయల సాగును పెంచి, మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. వ్యవసాయ, చేనేత అనుబంధ కార్పొరేషన్ల ఎండీలతో ఆయన సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రాధాన్యతలను బట్టి కార్పొరేషన్ల పని తీరు మార్చుకోవాలని సూచించారు. గిడ్డంకుల శాఖ పరిధిలోని గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. గోదాముల పైకప్పుపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధచేయాలని ఆదేశించారు. యాసంగి సీజన్‌లో ఎరువుల సరఫరాలో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే సీజన్‌లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్ల కోసం చర్యలు చేపట్టాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతులకు యంత్ర పరికరాలు అందించేందుకు ప్రతి జిల్లాలో ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఆగ్రోస్ ఎండీ రాములుకు సూచించారు. నేత కార్మికులకు సకాలంలో నూలు పంపిణీ చేయాలని కోరారు. విత్తన కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల విత్తనాలను ముందుగానే సేకరించి పెట్టుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్, గిడ్డంగుల సంస్థ, హాకా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రధాని కృషి

- 11వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 526 మందికి నియామక పత్రాల అందజేత
- ఉద్యోగాలు సాధించిన వారంతా దేశానికి పేరు తేవాలని సూచన



అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

చాంద్రాయణగుట్ట: ప్రపంచంలోకెల్లా అత్యధిక యువ జనాభాగల భారత్‌ను శక్తియుక్తులతో అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. సోమవారం హైదరాబాద్ చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 526 (సీఆర్‌పీఎఫ్:426, ఐటీబీపీ:37, ఎస్ఎస్‌బీ:34, రైల్వే:10, పోస్టల్:06, మౌలానా యూనివర్సిటీ:02, హైదరాబాద్ యూనివర్సిటీ:02, ఎస్‌బీఐ:04, కెనెరా బ్యాంక్:05) మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను కిషన్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశసేవలో యువతను భాగస్వాములను చేస్తూ నిరుద్యోగ సమస్యకు తెరదించే ఉద్దేశంతో 12 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రధాని మోదీ 2022లో రోజ్‌గార్ మేళాకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటివరకు 10 రోజ్‌గార్ మేళాల ద్వారా అన్ని మంత్రిత్వ శాఖల్లో 10 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం 11వ మేళాలో దేశవ్యాప్తంగా 71 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగ నోటిఫికేషన్ల జారీలో కాలయాపన చేయకుండా ప్రతి నెలా ఖాళీలు భర్తీ చేయాలని మోదీ ఆదేశించారన్నారు. పైరవీలు, పారపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు.

దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి..

ఒకప్పుడు ఇతర దేశాలనుంచి సెల్‌ఫోన్లు, రక్షణ శాఖ పరికరాలను దిగుమతి చేసుకొనేవారమని.. కానీ ప్రస్తుతం మన దేశం నుంచే అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 2014లో 98 శాతం ఫోన్లను దిగుమతి చేసుకొనే పరిస్థితి ఉండగా ప్రస్తుతం 99 శాతం ఫోన్లు స్వదేశంలోనే తయారవుతూ 150 దేశాలకు ఎగుమతి చేసే స్థితికి చేరుకున్నామని వివరించారు. అమెరికా, యూకే, జర్మనీలాంటి దేశాలకు ఐ ఫోన్లను ఎగుమతి చేస్తుండటం గొప్ప విషయమన్నారు. ఇపుడు ఉద్యోగాలు సాధించిన యువత అంకితభావంతో పనిచేసి కన్నవారికి, పుట్టిన గడ్డకు పేరు తీసుకురావాలని సూచించారు. అంతకుముందు ప్రధాని మోదీ రోజ్‌గార్ మేళాను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ ఉదయ్ భాస్కర్ బిల్లా, కమాండెంట్ ఎం.హెచ్.ఖోబ్రాగ్డే, డిప్యూటీ కమాండెంట్ ధృవ్ నారాయణ్, ఇన్‌స్పెక్టర్ జి.కె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మోహన్‌బాబుకు హైకోర్టు షాక్

- జర్నలిస్ట్‌పై దాడి కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత
- బెయిల్‌పై ట్రయల్‌కోర్టుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్ట్‌పై దాడి కేసులో ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు హైకోర్టు మరోసారి షాక్ ఇచ్చింది. తీవ్ర అభియోగాలు ఉన్నందున అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టంచేసింది. రాచకొండ పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమంటూ మోహన్‌బాబు పిటిషన్‌ను కొట్టివేసింది. తన ఆరోగ్యం బాగోలేదని, విద్యాసంస్థల నిర్వహణలో భాగంగా తిరుపతిలో ఉన్నానని, వయసును దృష్టిలో పెట్టుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరగా.. న్యాయస్థానం తిరస్కరించింది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఆవరణలో మీడియా ప్రతినిధి రంజిత్‌పై దాడి కేసులో పహాడీషరీఫ్ పోలీసులు తొలుత బీఎన్ఎస్ 118 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. తర్వాత న్యాయసలహాలు తీసుకుని బీఎన్ఎస్ 109 (హత్యాయత్నం) సెక్షన్ జోడించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు హైకోర్టులో ఈ నెల 13న పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. సోమవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు. గుండె, నరాల సంబంధిత సమస్యలు, మతిమరుపుతో బాధపడుతున్నారని మోహన్‌బాబు తరపు సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చినా.. న్యాయమూర్తి తోసిపుచ్చారు. మోహన్‌బాబు పరారీలో ఉన్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, మనుమరాలు పుట్టినరోజు వేడుకల కోసం దుబాయ్ వెళ్లి వచ్చి, తిరుపతిలో ఉన్నారని రవిచందర్ చెప్పారు. తీవ్రమైన హత్యాయత్నం నేరంలో ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని ఏపీపీ జితేందర్‌రావు చేసిన విజ్ఞప్తిని న్యాయమూర్తి అనుమతించారు. కాగా, విచారణకు హాజరైన రోజే బెయిల్ మంజూరు చేసేలా ట్రయల్ కోర్టుకు ఆదేశాలు జారీ చేయాలని మోహన్‌బాబు న్యాయవాది కోరగా, న్యాయమూర్తి నిరాకరించారు. విచారణ రోజే ఉత్తర్వులు వెలువరించాలని ట్రయల్‌కోర్టుకు హైకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఈ మేరకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నాయని జస్టిస్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. అది ట్రయల్ కోర్టుపై ఒత్తిడి తేవడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. చట్టప్రకారం పోలీసులు దర్యాప్తును చేపట్టవచ్చని, ట్రయల్ కోర్టు కూడా అలాగే విచారణ చేస్తుందని తేల్చిచెప్పారు.

● నివాళి


శ్యామ్ బెనగళ్

శ్యామ్ బెనగళ్ ఇక లేరు


భారతీయ సినిమా పరిశ్రమలో తీరని విషాదం నెలకొంది. భారతీయ పార్లల్ సినిమాకు దశదిశలా ఖ్యాతిని తెచ్చి పెట్టిన తొలి తరం దర్శకులు శ్యామ్ బెనగళ్ (90) ఇకలేరు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగి ముంబైలో స్థిరపడిన బెనగళ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ముంబైలోని ఓ ఆసుపత్రిలో సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని శ్యామ్ బెనగళ్ కుమార్తె పియా బెనగళ్ వెల్లడించారు. బెనగళ్ దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'ముజిబ్: ది మేకింగ్ ఆఫ్ ఏ నేషన్'. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రం 2023 అక్టోబరు 13న విడుదలైంది. శ్యామ్ బెనగళ్‌కు భార్య నీరా బెనగళ్, కుమార్తె పియా బెనగళ్ ఉన్నారు. లెజెండరీ దర్శకుడిగా పేరొందిన శ్యామ్ బెనగళ్ మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. జన్మతః కన్నడిగ అయినప్పటికీ తెలంగాణలో పుట్టి పెరగడం వల్ల తెలంగాణ చైతన్యం ఆయనలో చివరికంటా ఉంది.

అవార్డులు...


శ్యామ్ బెనగళ్ భారత ప్రభుత్వం నుంచి 8 జాతీయ చలన చిత్ర అవార్డులు అందుకున్నారు. అవి 'అంకుర్'(1975), 'నిశాంత్'(1976), 'మంథన్'(1977), 'భూమిక: ది రోల్'(1978), 'జునూన్'(1979), 'ఆరోహణ్'(1982), 'నేతాజీ సుభాష్ చంద్రబోస్'(2005), 'వెల్‌డన్ అబ్బా' (2009). అలాగే సినీ రంగంలో కనబరచిన అత్యుత్తమ ప్రతిభకుగానూ 1976లో పద్మశ్రీ, 1991లో పద్మభూషణ్, 2003లో ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత పురస్కారం, 2013లో ఏఎన్‌ఆర్ జాతీయ అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా 2005 సంవత్సరానికిగాను 2007 ఆగస్టు 8న అత్యంత ప్రతిష్ఠాత్మమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అందుకున్నారు. తెలుగు సినిమా 'అనుగ్రహం'కు నంది అవార్డు అందుకున్నారు.

స్త్రీ పాత్రల రూపశిల్పి


శ్యామ్ బెనగళ్ తన సినిమాల్లో శక్తిమంతమైన స్త్రీపాత్రలకు రూపకల్పన చేశాడు. 'అంకుర్' (1974)తో మొదలెట్టి 'జుబేదా' (2001) వరకు దాదాపుగా ప్రతి సినిమాలో స్త్రీ పాత్రలకు చైతన్యాన్ని, శక్తిని ఇచ్చిన దర్శకుడు శ్యామ్ బెనగళ్. సత్యజిత్ రే వాస్తవిక సినిమాను ప్రవేశపెట్టి ఆ పరంపరను మృణాళ్ సేన్ అందుకున్నాక శ్యామ్ బెనగళ్ ఆ ఛత్రాన్ని గట్టిగా పట్టుకుని నిలబెట్టాడు. 1973లో విడుదలైన రెండు సినిమాలు 'అంకుర్', 'గరమ్ హవా' నవ సినిమాల పతాకాన్ని పట్టుకున్నాయి. అయితే 'గరమ్ హవా' తీసిన ఎం.ఎస్.సత్యు ఎక్కువ సినిమాలు చేయలేదు. శ్యామ్ బెనగళ్ నిరంతరం పని చేశాడు. 'సినిమా కచ్చితంగా సామాజిక మాధ్యమం. అది సమాజాన్ని పట్టించుకోవాల్సిందే. నేను సికింద్రాబాద్‌లో పుట్టి పెరగడం వల్ల రైతాంగపోరాడం, విప్లవ పోరాటాల ప్రభావం నా మీద ఉంది. ప్రజల పక్షం నిలబడాలి సినిమా అనుకున్నాను' అంటారాయన. కంటోన్మెంట్ ఏరియాలోని టెంట్ హాలులో వారానికి మూడు ఇంగ్లిష్ సినిమాలు చూస్తూ తన అన్నయ్యతో కలిసి సినిమాలు తీసేందుకు ప్రయోగాలు చేసిన శ్యామ్ బెనగళ్ యాడ్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీల తర్వాత ఫీచర్ ఫిల్మ్ డైరెక్టర్ అయ్యాడు. ఇంకా చెప్పాలంటే పార్లల్ సినిమా అంటే చిత్రోత్సవాల్లో ప్రదర్శించేది కాదు నేరుగా హాల్లో రిలీజ్ చేసి హిట్ చేయదగ్గది అని నిరూపించిన తొలి భారతీయ దర్శకుడు శ్యామ్ బెనగళ్. 'అంకుర్' హైదరాబాద్‌లో 100 రోజులు ఆడటమే ఉదాహరణ. భూస్వాముల దోపిడిని ఆ సినిమాలో చూపి కొనసాగింపుగా 'నిషాంత్' తీశాడు బెనగళ్. ఇక 'మంథన్' చిన్న మనుషులు ఒక్కటైతే సహకార వ్యవస్థ ద్వారా ఎలా స్వయం సమృద్ధి సాధించ వచ్చో ఆ రోజుల్లోనే తీశాడు బెనగళ్. దీని నిర్మాణానికి పాడిరైతులు తలా రెండురూపాయల వాటా వేయడం నభూతో నభవిష్యతి.








'అనుగ్రహం'లో వాణిశ్రీ





ఎన్నో ప్రయోగాలు:

శ్యామ్ బెనగళ్ తన సినిమాల్లో ఎన్నో ప్రయోగాలు చేశాడు. కొత్త నటీనటులకు అవకాశం ఇచ్చాడు. బెనగళ్ సినిమాలతో షబానా, స్మితా పాటిల్ గొప్ప పాత్రలు పోషించదగ్గ నటీమణులుగా గుర్తింపు పొందారు. షబానాకు మొదటి సినిమాతోటే జాతీయ పురస్కారం వచ్చింది. ఔట్‌డోర్‌కు తన యూనిట్‌తో వెళ్లి అక్కడే ఉండిపోయి సినిమా తీసే పరంపరను బెనగళ్ ప్రవేశపెట్టాడు. అందరూ కలిసి ఆలోచనలు పంచుకోవడానికి ఇది మంచి మార్గం అంటాడాయన. ఆయన దర్శకత్వ ప్రతిభ తెలిసి కేవలం ఆయన దర్శకత్వంలో నటించాలనే అభిలాషతో 'అనుగ్రహం'లో వాణిశ్రీ నటించింది. వ్యభిచార వ్యవస్థ మీద 'మండి', వ్యాపార సామ్రాజ్యాల ఎత్తుగడల మీద 'కల్‌యుగ్', గోవాలో పోర్చుగీసు పాలన సమాప్త సమయంలో చెలరేగిన భావోద్వేగాలను 'త్రికాల్' లో, నాలుగు కాలాల అంతరంలో ఒక సినీ నాయిక జీవితం, సినిమా జీవితం ఎలా మారిందో చూపిన 'భూమిక'... ఇవన్నీ ప్రయోగాత్మక కథలు. 'త్రికాల్'లో రాత్రి సన్నివేశాలు క్యాండిళ్ల వెలుతురులో తీసి ఒక గాంభీర్యం తెచ్చాడు బెనగళ్.

దేశం కోసం:

దేశం కోసం దేశ వాసుల కోసం బెనగళ్ పని చేస్తూనే వెళ్లాడు. ఎన్నో డాక్యుమెంటరీలు తీశాడు. వాటిలో సత్యజిత్ రే మీద తీసిన డాక్యుమెంటరీ ముఖ్యమైనది. ఇక నెహ్రూ 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'ను 'భారత్ ఏక్ ఖోజ్' పేరుతో ఇచ్చిన దృశ్యరూపం కష్టతరమైనది. దూరదర్శన్‌లో దీనికి విపరీతమైన ఫాలోయింగ్ ఉండేది. అదే సమయంలో సుభాష్ చంద్రబోస్ మీద పరిశోధన చేసి 'నేతాజీ సుభాష్ చంద్రబోస్' తీశాడు. 'మేకింగ్ ఆఫ్ మహాత్మా'కు దర్శకత్వం వహించాడు. జీలాని బానో రాసిన 'నర్సయ్య కీ బావ్‌డీ' (నర్సయ్య బావి)ని చాలా కాలం తర్వాత 'వెల్‌డన్ అబ్బా'గా తీశాడాయన.

ఆయన నిష్క్రమణంతో గొప్ప వెలుగు వీడ్కోలు తీసుకున్నట్టయ్యింది.




సికింద్రాబాద్ ఓల్డ్ అల్వాల్‌లోని శ్యామ్ బెనగళ్ నివాసం ప్రస్తుత స్థితి

ఓల్డ్ అల్వాల్ పోరడు

- బి. నరసింగ రావు, దర్శకులు


శ్యామ్ బెనగళ్‌కూ నాకూ 12 ఏళ్ల వయసు తేడా ఉంది. ఆయనకు 90 అయితే నాకు 78. మా ఓల్డ్ అల్వాల్‌లో వాళ్ల ఇల్లు ఇప్పటికీ అలాగే ఉంది. గతంలో శ్యామ్ అన్నయ్య మధు అందులో ఉండేవారు. ఇప్పుడు ఎవరున్నారో తెలియదు. కనిపించడం లేదు. శ్యామ్ చాలా చురుగ్గా ఉండేవాడు. వాళ్ల నాన్నకు ఫొటో స్టుడియో ఉండేది. అందులో మేము చిన్నప్పుడు ఫొటోలు దిగేవారం. శ్యామ్ చాలా యాక్టివ్. నిజాం కాలేజీలో మేగజీన్ ఎడిటర్‌గా ఉండేవాడు. ఫిల్మ్ సొసైటీ నడిపాడు. సైకిల్ తొక్కుకుంటూ కాలేజీకి వెళ్లి తిరిగి వచ్చాక ఫ్రెష్ అయ్యి వెంటనే పరేడ్ గ్రౌండ్‌కు చేరుకునేవాడు ఆటలకు. గురుదత్ ఆయనకు కజిన్. బాంబే వెళ్లి సినిమాల్లో ప్రయత్నించాలంటే చార్జీలకు కూడా డబ్బులు లేవు. అప్పుడు మా మిత్రుల్లో అమ్రేష్ అనే అతని అన్న రైల్వేలో ఉండేవాడు. అతను పాస్ ఇస్తే వెళ్లాడు. గురుదత్ ఇంట్లోనే ఉండి సినిమాలు తెలుసుకున్నాడు. 'అంకుర్' కథలో హీరోకు మా మిత్రబృందంలోని ఒక వ్యక్తి జీవితమే ఇన్‌స్పిరేషన్. 'నీ కథే తీస్తున్నానురా' అని ఆ మిత్రుడికి చెప్పి మరీ ఆ సినిమా తీశాడు. ఆఫ్‌కోర్స్... సినిమాకు తగ్గట్టుగా మార్పులు చేసుకున్నాడు. తన నిర్మాణ సంస్థకు 'సహ్యాద్రి ఫిల్మ్స్' అని పేరు పెట్టుకున్నాడు. సత్యం శంకరమంచి కథలను దూరదర్శన్ కోసం తీస్తున్నప్పుడు నన్ను కలిశాడు. వాటి నిర్మాణంలో నా మాటసాయం ఉంది. ఒకటిన్నర సంవత్సరం క్రితం ఆఖరుసారి మాట్లాడాను. ఆ తర్వాత మాట్లాడలేదు. చాలా క్వాలిటీతో ఎక్కువ పని చేసిన దర్శకుడు శ్యామ్.

శారదకు మిస్సయిన 'అంకుర్'



శ్యామ్ బెనగళ్ తన మొదటి సినిమా 'అంకుర్'లో హీరోయిన్‌గా వహీదా రెహమాన్‌ను అనుకున్నాడు. ఆమె మొదట చేస్తానని తర్వాత నో చెప్పింది. అప్పుడు శారదకు ఇలాంటి పాత్రలు చేయడంలో మంచి పేరుందని ఆమెను సంప్రదించాడు. ఆమెకు కథ నచ్చినా దక్కనీ భాషలో డైలాగులు చెప్పగలనో లేదో అనే సందేహంతో చేయలేదు. అపర్ణసేన్ కూడా వెనుకా ముందు ఆడటంతో చివరకు పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ స్టూడెంట్ అయిన షబానా ఆజ్మీని ఎంచుకున్నాడు. షబానాకు ఒకరకంగా హైదరాబాద్‌తో బంధం ఉన్నట్టే కదా. ఆమె తల్లి షౌకత్ హైదరాబాదీ. షబానా, స్మిత, నసీరుద్దీన్ షా, ఓంపురి, అమ్రిష్‌పురి... వీరంతా బెనగళ్ సినిమాల్లో గొప్ప పాత్రలు పోషించారు.

● రఫీ శత జయంతి



యుగళ ధారతో మ్యూజిక్ థ'రఫీ'


● లతా మంగేష్కర్‌తో మహమ్మద్ రఫీ

రఫీ సోలోలు వేన వేలు... వాటికి అభిమానులు ఉన్నారు.
రఫీ డ్యూయెట్లు వేలకు వేలు... వాటికీ అభిమానులు ఉన్నారు.
ఈ స్వీటు కావాలా ఆ జున్ను కావాలా అంటే
చాయిస్ ఏమైనా ఉంటుందా ఎవరికైనా? రెండూ కావాలి.
కాని రఫీతో డ్యూయెట్లు పాడి సరిజోడుగా నిలిచి
సంగీతాభిమానులను మెప్పించిన
అద్భుత గాయనీమణులను రఫీతో పాటు స్మరించుకోవాలి.
డిసెంబర్ 24 రఫీ శతజయంతి.
మరి ఆయనతో కలిసి పాడుదామా యుగళగీతం.

లాహోర్ నుంచి ఒక అన్నను తోడు చేసుకుని బాంబేకు బయలుదేరిన రఫీ తాను గాయకుడిగా బతకాలంటే ముందు సంగీత దర్శకుణ్ణి మెప్పించాలని తెలుసుకున్నాడు. ఆ రోజుల్లో నౌషాద్ చాలా పెద్ద డిమాండ్‌లో ఉన్నాడు. కాని ఆయనను నేరుగా కలిసే శక్తి రఫీకి లేదు. అందుకని అన్నాదమ్ములు ఆలోచించి నేరుగా లక్నో వెళ్లారు. అక్కడ నౌషాద్ తండ్రి ఉంటారు. ఆయన దగ్గర సిఫార్సు ఉత్తరం తీసుకుని బాంబే తిరిగి వచ్చి అప్పుడు నౌషాద్‌ను కలిశారు. 'లాహోర్ నుంచి వచ్చావా? పాడతావా? ఏం పాడతావ్... నిన్ను వద్దనడానికి లేనంత పెద్ద రికమండేషన్ తెస్తివి' అని నౌషాద్ రఫీని పరికించి చూసి తన టీమ్‌లోకి తీసుకున్నాడు. అప్పటికి తలత్ ఊపు మీదున్నాడు. అయినా సరే 'దులారీ' (1949)లో రఫీ పాడిన సోలో 'సుహానీ రాత్ ఢల్ చుకీ నా జానే తుమ్ కబ్ ఆవోగే' పాట పెద్ద హిట్ అయ్యి రఫీ దేశానికి పరిచయం అయ్యాడు. అయినప్పటికీ రావలసినంత పేరు రాలేదు. అప్పుడు నౌషాదే 'బైజు బావరా' (1952)లో మళ్లీ పాడించాడు. ఆ సినిమాలో రఫీ పాడిన సోలో పాటలు 'ఓ దునియాకే రఖ్‌వాలే', 'మన్ తరప్‌త్ హరి దర్శన్ కో ఆజ్' పాటలు ఇక రఫీని తిరుగులేని గాయకుని స్థానంలో కూచోబెట్టాయి. రఫీ రేంజ్‌ను తెలిపిన పాటలు అవి. అయితే అప్పటికే నూర్జహాన్ పాకిస్తాన్ వెళ్లిపోగా ప్రతిభను, ప్రొఫెషనలిజాన్ని నిలబెట్టుకుంటూ లతా మంగేష్కర్ 'మహల్' (1949)లో 'ఆయేగా ఆయేగా ఆనేవాలా ఆయేగా' పాటతో స్థిరపడింది. రఫీ, లతా తొలి పాట కామెడీ సాంగ్ అయినా ఆ తర్వాత వారి డ్యూయెట్లు సరైన రొమాంటిక్ టచ్‌ను అందుకున్నాయి. అందుకు 'బైజు బావరా'లోని ఈ పాటే సాక్ష్యం.

తూ గంగాకి మౌజ్ మై యమునా కా ధార
హో రహేగా మిలన్ యే హమారా హో
హమారా తుమ్హారా రహేగా మిలన్...

మేల్ సింగర్ కొందరికి సరిపోతాడు.. కొందరికి సరిపోడు అనే ధోరణి ఉంది. రఫీ.. రాజ్‌కపూర్‌కు మేచ్ కాడు. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్‌లకు బాగా సరిపోయేవాడు. కాని లతాకు ఆ అడ్డంకి లేదు. ఏ హీరోయిన్ గొంతైనా లతా గొంతే. మీనా కుమారి, నర్గిస్, వైజయంతీ మాల, మాలా సిన్హా.. అందరికీ లతా గొంతు. అందువల్ల రఫీ, లతాల పాటలు రాజ్ కపూర్ సినిమాల్లో తప్ప తక్కిన అన్నింటిలో కొనసాగాయి. అందరు సంగీత దర్శకులు సరైన తీపితో తయారైన రవ్వలడ్డ వంటి పాటలను వారి చేత పాడించారు.

- *దో సితారోంకా జమీ పర్ హై మిలన్ ఆజ్ కీ రాత్ (కోహినూర్)*
- *ఓ జబ్ యాద్ ఆయే బహుత్ యాద్ ఆయే (పరాస్‌మణి)*
- *దిల్ పుకారే ఆరె ఆరె ఆరె (జువెల్ థీఫ్)*
- *జిల్ మిల్ సితారోంక అంగన్ హోగా (జీవన్ మృత్యు)*
- *వాదా కర్‌లే సాజ్‌నా (హాత్ కీ సఫాయి)..*

వీటికి అంతే లేదు. రఫీ తన కెరీర్‌లో షమ్మీ కపూర్‌కు పాడటానికి ఎక్కువ సరదా చూపాడు. వాళ్లిద్దరిదీ హిట్ పెయిర్. షమ్మీ కపూర్ సినిమాలో రఫీ డ్యూయెట్లు ఎక్కువగా ఆశా భోంస్లేకు వెళ్లినా లతా కూడా పాడింది. రఫీ-లతాల జోడి వెన్నెల-వెలుతురు లాంటిది. ఆ చల్లదనం వేరు.

■ ఆశా భోంస్లే

వ్యాంప్‌లకు పాడుతూ మెల్లమెల్లగా కుదురుకున్న గాయని ఆశా రఫీతో కలిసి గొప్ప పాటలు పాడింది. అన్నింటిలోకి కలకాలం నిలిచే పాట 'అభీ నా జావో ఛోడ్ కర్ కె దిల్ అభీ భరా నహీ' (హమ్ దోనో). ఈ పాటలో రఫీ బాగా పాడుతున్నాడా ఆశానా అనేది చెప్పలేం. ఓపీ నయ్యర్ ఆశా చేత ఎక్కువ పాడించడం వల్ల 'కశ్మీర్ కి కలీ'లో రఫీతో 'దీవానా హువా బాదల్', 'ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా'లో 'బహుత్ షుక్రియా బడీ మెహర్బానీ' వంటి సూపర్‌హిట్లు సాధించింది. ఆర్.డి.బర్మన్ తన సంగీతంలో రఫీ, ఆశాలను అద్భుతమైన పాటల్లో కూచోబెట్టాడు. 'ఓ మేరే సోనరే సోనరే సోనరే' (తీస్రీ మంజిల్), 'చురాలియా హై తుమ్‌నే జో దిల్‌కో' (యాదోంకి బారాత్)... ఒంట్లో నిస్సత్తువను వదలగొట్టే పాటలు.


● ఆశా భోంస్లేతో...


● గీతా దత్‌తో...

■ గీతా దత్

ఎంతో గొప్ప గాయని అయి ఉండి తక్కువ కాలం పాడిన గీతా దత్ (గీతా రాయ్) గురుదత్ సినిమాల్లో రఫీతో మురిపమైన పాటలు పాడింది. 'సున్ సున్ సున్ జాలిమా' (ఆర్ పార్), 'హమ్ ఆప్‌కే ఆంఖోమే ఇస్ దిల్ కో బసాదేతో'(ప్యాసా) ఇవి రెండు గురుదత్ మీద తీసినవి. 'సిఐడి'లో దేవ్ ఆనంద్, షకీలా మీద తీసిన 'ఆంఖోహి ఆంఖోమే ఇషారా హోగయా'..పెద్ద హిట్. గురుదత్ సినిమాల్లో కమెడియన్ జానీ వాకర్‌కు పాటలు ఉంటాయి. జానీ వాకర్‌కు కూడా రఫీనే పాడతాడు. తోడు గీతా దత్. 'అయ్ దిల్ ముష్కిల్ హై జీనా యహా' (సిఐడి), 'జానే కహా మేరా జిగర్ గయా జీ'(మిస్టర్ అండ్ మిసెస్ 55)... ఇవన్నీ దశాబ్దాలైనా నిలిచి ఉన్న పాటలు. రఫీతో పాటు గాయనీమణులు నిలబెట్టిన పాటలు.

■ సుమన్ కల్యాణ్‌పూర్

రాయల్టీ విషయంలో లతా మంగేష్కర్‌కు రఫీకు విభేదాలు వచ్చాయి. రాయల్టీ కావాలని లతా, అక్కర్లేదని రఫీ మూడేళ్లు విభేదించి పాడలేదు. 1961 నుంచి 63 వరకు సాగిన ఈ కాలంలో రఫీతో డ్యూయెట్లు పాడిన గాయని సుమన్ కల్యాణ్‌పూర్. 'పూర్‌మేన్స్ లతా'గా పేరుబడ్డ సుమన్‌కు గొప్ప ప్రతిభ ఉన్నా తక్కువ అవకాశాలు దొరికాయి. అయినా సరే రఫీ, సుమన్ కలిసి మంచి హిట్స్ ఇచ్చారు. వీటిలో 'బ్రహ్మచారి' కోసం పాడిన 'ఆజ్ కల్ తెరె మెరె ప్యార్ కే చర్చే హర్ జబాన్ పర్', 'జబ్ జబ్ పూల్ ఖిలే'లో 'నా నా కర్తే ప్యార్ తుమ్హీసే కర్‌బైఠే' పెద్ద హిట్స్‌గా నిలిచాయి. 'రాజ్ కుమార్'లోని 'తుమ్‌నే పుకారా ఔర్ హమ్ చలే ఆయే' కూడా పెద్ద హిట్టే. అయితే లతా, రఫీల మధ్య సంధి కుదరడంతో సుమన్ వెనక్కు వెళ్లిపోయింది.


● సుమన్ కల్యాణ్‌పూర్‌తో...

వీళ్లే కాదు ఎందరో గాయనులతో రఫీ డ్యూయెట్స్ పాడాడు. షంషాద్ బేగంతో 'లేకె పెహలా పెహలా ప్యార్', ముబారక్ బేగంతో 'ముజ్‌కో అప్‌నే గలే లగాలో', హేమలతాతో 'తూ ఇస్ తర్హా మేరి జిందగీమే'... లాంటి ఎన్నో మంచి పాటలు ఉన్నాయి. సుశీలతో 'ఇద్దరి మనసులు ఒకటాయె', జానకితో 'నా మది నిన్ను పిలిచింది గానమై'... ఈ పాటలు అపురూపం.

రఫీ ఘనతలో రఫీ ప్రతిభకు మరో సగమై నిలిచిన గాయనీమణులందరికీ రఫీ శతజయంతి సందర్భంగా జేజేలు పలకాలి. రఫీకి జిందాబాద్‌లు కొట్టాలి.



నేడు సింధు వివాహ రిసెప్షన్... ప్రముఖులు హాజరయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, వెంకటదత్త సాయి వివాహ వేడుకల్లో భాగంగా నేడు మరో కార్యక్రమం హైదరాబాద్ నగరంలో జరగనుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న అన్వయ కన్వెన్షన్స్ వేదికగా మంగళవారం రిసెప్షన్ జరుగుతుంది. దీనికి పెద్ద ఎత్తున క్రీడా, సినిమా, రాజకీయ రంగ ప్రముఖులు హాజరు కానున్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి మొదలు సచిన్ టెండూల్కర్ తదితరులను సింధు ఆహ్వానించింది. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య ఆదివారం రాత్రి రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో సింధు పెళ్లి జరిగింది. అత్యంత సన్నిహితులైన కొందరు అతిథులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివాహానికి హాజరైన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ వధూవరులను ఆశీర్వదించారు. రెండు ఒలింపిక్ స్వర్ణాలు, ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు సహా పలు గొప్ప విజయాలతో భారత అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరిగా సింధు గుర్తింపు తెచ్చుకోగా... పొసిడెక్స్ టెక్నాలజీస్ కంపెనీకి దత్తసాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.


షఫాలీ

హరియాణా 389/5
బెంగాల్ 390/5

- మహిళల లిస్ట్ 'ఎ' క్రికెట్ ఛేజింగ్‌లో కొత్త ప్రపంచ రికార్డు
- 197 పరుగులతో చెలరేగిన షఫాలీ

రాజ్‌కోట్: బీసీసీఐ దేశవాళీ సీనియర్ మహిళల వన్డే టోర్నీ మ్యాచ్‌లో పరుగుల వరద పారి లక్ష్య ఛేదనలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. హరియాణా, బెంగాల్ జట్ల మధ్య జరిగిన పోరులో ఈ ఘనత చోటు చేసుకుంది. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బెంగాల్ 5 వికెట్లతో హరియాణాపై నెగ్గింది. ముందుగా హరియాణా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 389 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (115 బంతుల్లో 197; 22 ఫోర్లు, 11 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించింది. షఫాలీకి సోనియా (61; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), రీమా (58; 8 ఫోర్లు), త్రివేణి (46; 5 ఫోర్లు) అండగా నిలిచారు. అనంతరం బెంగాల్ 49.1 ఓవర్లలో 5 వికెట్లకు 390 పరుగులు చేసి ఛేదనలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. 2019లో కాంటర్‌బరీ టీమ్ 309 పరుగుల లక్ష్యాన్ని విధించగా ... నార్తర్న్ డిస్ట్రిక్ట్స్ 312 పరుగులు చేసి గెలిచిన రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. బెంగాల్ తరఫున 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తనుశ్రీ సర్కార్ (83 బంతుల్లో 113; 20 ఫోర్లు) శతకం సాధించింది.

విజేత శరణ్య దేవి



దుర్గాపూర్: జాతీయ అండర్-13 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన అమ్మాయి శరణ్య దేవి నరహరి విజేతగా నిలిచింది. శరణ్య 9 పాయింట్లతో అగ్ర స్థానాన్ని పొందింది. 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో శరణ్య 8 గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. శరణ్యకు విన్నర్స్ ట్రోఫీ తోపాటు రూ. 80 వేలు ప్రైజ్‌మనీ లభించింది.

హర్మన్‌ప్రీత్ సింగ్‌కు 'ఖేల్‌రత్న' అవార్డు!

నామినేషన్లలో కనిపించని మనూ భాకర్ పేరు	తుది జాబితాలో ఖరారయ్యే అవకాశం!	తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజికి 'అర్జున'


మనూ భాకర్


ప్రవీణ్


దీప్తి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పురస్కారాల ప్రకటనకు రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రహ్మణ్యం నేతృత్వంలోని 12 మంది సభ్యుల సెలక్షన్ కమిటీ అర్జున, ఖేల్‌రత్న, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ తదితర అవార్డులకు సంబంధించిన నామినేషన్ల జాబితాను ప్రభుత్వానికి అందించింది. మార్పులు లేకుండా దాదాపు ఇదే జాబితా ఖాయమయ్యే అవకాశం ఉంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పేరును 'ఖేల్‌రత్న' పేరు కోసం ప్రతిపాదించారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న జట్టులోనూ సభ్యుడైన 28 ఏళ్ల హర్మన్‌ప్రీత్... ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, చాంపియన్స్ ట్రోఫీ తదితర ప్రధాన ఈవెంట్లలో భారత్ పతకాలు గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. హర్మన్‌తో పాటు పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ పేరును కూడా కమిటీ 'ఖేల్‌రత్న' కోసం సిఫారసు చేసింది. పారిస్ పారాలింపిక్స్ హైజంప్ (టి64 క్లాస్)లో ప్రవీణ్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవీణ్ ఇదే విభాగంలో కాంస్యం సాధించాడు. మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు సాధించిన షూటర్ మనూ భాకర్ పేరు ఖేల్‌రత్న జాబితాలో లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న ప్లేయర్‌గా మరో చర్చ లేకుండా 'ఖేల్‌రత్న' అవార్డుకు ఆమె అర్హురాలు. అయితే మనూ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదని క్రీడా మంత్రిత్వశాఖ వర్గాలు వెల్లడించాయి. దానిని మనూ తండ్రి రామ్‌కిషన్ ఖండించారు. తాను సరైన ఫార్మాట్‌లోనే అప్లికేషన్ అందించామని స్పష్టం చేశారు. ఒకవేళ దరఖాస్తు చేసుకోకపోయినా ... ప్రదర్శనను బట్టి అవార్డుకు ఎంపిక చేసే అధికారం జ్యూరీకి ఉంది. కాబట్టి మనూ సాధించిన 'డబుల్ ఒలింపిక్ మెడల్' ఘనతను బట్టి చూస్తే ఆలస్యంగానైనా ఆమె పేరు ఈ జాబితాలో చేరవచ్చు.

'అర్జున' జాబితాలో 30 మంది


కమిటీ ప్రతిపాదించిన 'అర్జున' అవార్డీల జాబితాలో 13 మంది రెగ్యులర్ ఆటగాళ్లు, మరో 17 మంది పారా ఆటగాళ్లు ఉన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న అమన్ (రెజ్లింగ్), సరబ్‌జోత్, స్వప్నిల్ కుసాలే (షూటింగ్) పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. పారా ఆటగాళ్లలో తెలంగాణకు చెందిన దీప్తి జివాంజికి 'అర్జున' దక్కనుండటం విశేషం. వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి పారిస్ పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు (టి20)లో కాంస్యం గెలుచుకుంది. అంతకుముందు ఆసియా పారా క్రీడలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో ఆమె ఖాతాలో రెండు స్వర్ణాలు ఉన్నాయి. పారా షూటింగ్ కోచ్ సుభాష్ రాణా పేరును 'ద్రోణాచార్య' అవార్డు కోసం కమిటీ సిఫారసు చేసింది. ఈ జాబితాలో మరో కోచ్ అమిత్ కుమార్ సరోహా పేరు కూడా ఉండటం చర్చకు దారి తీసింది. అతను ఎప్పుడూ అధికారికంగా కోచ్‌గా పని చేయలేదని... పైగా ఇటీవల పారిస్‌లోనూ ఆటగాడిగా బరిలోకి దిగాడు కాబట్టి ద్రోణాచార్య అవార్డుకు అర్హుడు కాదని విమర్శలు వస్తున్నాయి.


హర్మన్‌ప్రీత్

తనుశ్‌కు తొలి అవకాశం

అశ్విన్ స్థానంలో భారత జట్టులో చోటు

మెల్‌బోర్న్: ముంబై ఆఫ్‌స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ తనుశ్ కొటియాన్‌కు అరుదైన అవకాశం లభించింది. బోర్డర్–ఆస్ట్రేలియా ట్రోఫీలో మిగిలిన రెండు టెస్టుల కోసం అతడిని సెలక్టర్లు ఎంపిక చేశారు. అతనికి భారత జట్టు పిలుపు రావడం ఇదే మొదటిసారి. మూడో టెస్టు మ్యాచ్ ముగియగానే సిరీస్ మధ్యలో అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో అతని స్థానంలో తనుశ్‌ను టీమ్‌లోకి తీసుకున్నారు. జడేజా, సుందర్ రూపంలో ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లు ఇప్పటికే జట్టుతో ఉన్నా... ముందు జాగ్రత్తగా తనుశ్‌ను టీమ్‌లోకి ఎంపిక చేసినట్లు తెలిసింది. కొటియాన్ ప్రస్తుతం ముంబై తరఫు విజయ్ హజారే టోర్నీ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. సోమవారం భారత జట్టులోకి ఎంపికైన రోజే అతను అహ్మదాబాద్‌లో హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించడం విశేషం. 26 ఏళ్ల తనుశ్ 33 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 25.70 సగటుతో 101 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లోనూ రాణించిన అతను 47 ఇన్నింగ్స్‌లలో 41.21 సగటుతో 1525 పరుగులు సాధించాడు. ఇందులో 2 సెంచరీలు, 13 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 2023–24 రంజీ ట్రోఫీ టైటిల్‌ను ముంబై గెలుచుకోవడంలో తనుశ్‌దే కీలకపాత్ర. 502 పరుగులు చేసి 29 వికెట్లు పడగొట్టిన అతను 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలవడం విశేషం. ఇటీవల భారత్ 'ఎ' జట్టులో సభ్యుడిగా ఆస్ట్రేలియా 'ఎ'తో జరిగిన ఒక మ్యాచ్‌లో బరిలోకి దిగాడు.


తనుశ్

'నన్ను ఢిల్లీ ప్రభుత్వం పట్టించుకోలేదు'


భారత చెస్ స్టార్ తానియా సచ్‌దేవ్ ఆవేదన



న్యూఢిల్లీ: దాదాపు దశాబ్దంన్నర కాలంగా తానియా సచ్‌దేవ్ పలు అంతర్జాతీయ చెస్ టోర్నీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఉమెన్ గ్రాండ్ మాస్టర్ (డబ్ల్యూజీఎం) అయిన తానియా కామన్వెల్త్, ఆసియా చాంపియన్‌షిప్‌లలో పతకాలు గెలుచుకుంది. ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం, స్వర్ణం గెలుచుకున్న భారత జట్టులో ఆమె సభ్యురాలు కూడా. అయితే ఇన్ని ఘనతల తర్వాత కూడా తనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదని 38 ఏళ్ల తానియా వాపోయింది. ఢిల్లీ ప్రభుత్వం తనను ఏనాడూ పట్టించుకోలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. '2008 నుంచి చెస్ ఆడుతున్నాను. ఈ క్రీడలో సాధించిన ఘనతలకు ఢిల్లీ ప్రభుత్వం ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదు. ఆటగాళ్లను ప్రోత్సహించే ఇతరుల్లో స్ఫూర్తి నింపే విషయంలో ఢిల్లీ చాలా వెనుకబడి ఉంది. రెండుసార్లు ఒలింపియాడ్ మెడల్‌తో వచ్చినా కనీసం పట్టించుకోలేదు' అని తానియా వ్యాఖ్యానించింది. స్వర్ణం గెలిచిన ఒలింపియాడ్ జట్టులో ఆమెతోపాటు సభ్యులైన ఇతర ప్లేయర్లు వైశాలి, ద్రోణవల్లి హారిక, దివ్య దేశ్‌ముఖ్‌లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నగదు పురస్కారాలు అందించాయి. తానియా ఆవేదనపై ఢిల్లీ సీఎం ఆతిశి మర్లీనా స్పందించింది. తాము క్రీడలను తగిన విధంగా ప్రోత్సహిస్తామని... తానియాను కలిసి ఈ అంశంపై చర్చించేందుకు తాను సిద్ధమని ఆతిషి హామీ ఇచ్చింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● సుదీప్

దమ్ముంటే రారా!

'మా పొలిటికల్ కెరీర్‌కి ఈ రాత్రి చాలా ఇంపార్టెంట్' అనే డైలాగ్‌తో ప్రారంభం అవుతుంది 'మ్యాక్స్' సినిమా తెలుగు ట్రైలర్. సుదీప్ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్ కుమార్, సునీల్, 'అఖండ' ఫేమ్ శరత్ లోహితస్య ఇతర కీలక పాత్రల్లో నటించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో వి క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్ సంస్థలపై కలైపులి ఎస్. థాను నిర్మించిన ఈ చిత్రం తెలుగులో ఈ నెల 27న విడుదల కానుంది. ఏషియన్–సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెలుగులో రిలీజ్ చేస్తోంది. తాజాగా 'మ్యాక్స్' తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ఒకవేళ చావు ఎదురొచ్చినా సరే.. మా అబ్బాయి ఒంటరిగా పోరాడతాడు', 'ఎవడ్రా.. నిన్ను రావొద్దని చెప్పింది.. దమ్ముంటే రారా', 'మ్యాక్స్‌తో మాట్లాడుతున్నప్పుడు మ్యాగ్జిమమ్ సైలెన్స్ ఉండాలి' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. సంయుక్త హార్నడ్, సుకృతి వాగల్, అనిరుధ్ భట్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోకనాథ్, కెమెరా: శేఖర్ చంద్ర.

ప్రేక్షకాదరణ చూస్తుంటే ఉత్సాహం కలుగుతోంది



''యూఐ' ఓ డిఫరెంట్ ఫిల్మ్. ఆడియన్స్‌పై నమ్మకంతోనే ఈ సినిమా తీశాను. వారికి మా చిత్రం కనెక్ట్ అవుతుండటం సంతోషంగా ఉంది. ప్రేక్షకుల ఆదరణ చూస్తుంటే.. నా డైరెక్షన్‌లో ఇంకా సినిమాలు చేయాలనే ఉత్సాహం కలుగుతోంది'' అని హీరో ఉపేంద్ర అన్నారు. **- ఉపేంద్ర**

ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'యూఐ: ది మూవీ'. లహరి ఫిల్మ్స్, వీనస్ ఎంటర్‌టైనర్స్ పతాకాలపై కేపీ శ్రీకాంత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజైంది. విజయవాడలో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో ఉపేంద్ర మాట్లాడుతూ–''మా సినిమాను తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేసిన గీతా ఆర్ట్స్ అల్లు అరవింద్‌గారికి థ్యాంక్స్. అలాగే మా చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని తెలిపారు. ''తెలుగు వారికి మా సినిమా బాగా కనెక్ట్ అయ్యింది. రోజురోజుకు షోలు, వసూళ్లు పెరుగుతున్నాయి'' అని చిత్ర సహ నిర్మాత నవీన్ మనోహరన్ అన్నారు.


● ఆది సాయికుమార్

హారర్ థ్రిల్లర్

'శంబాల' కోసం జియో సైంటిస్ట్‌గా మారారు ఆది సాయికుమార్. ఆయన హీరోగా నటిస్తున్న సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. అర్చనా అయ్యర్ హీరోయిన్. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. కాగా సోమవారం (డిసెంబరు 23) ఆది బర్త్ డే. ఈ సందర్భంగా 'శంబాల' నుంచి ఆయన ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్.

''ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ పాయింట్‌తో ఈ మూవీ తీస్తున్నాం. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో శిక్షణ పొందిన యుగంధర్ ముని ఈ సినిమాని హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. హాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మర్‌తో పని చేసిన శ్రీరామ్ మద్దూరి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు''అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ మూవీలో శ్వాసిక, రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.


డిసెంబరు 14న జరిగిన శ్యామ్ బెనగళ్ 90వ పుట్టినరోజు వేడుకల్లో ఓ దృశ్యం

సమాంతర సినిమా సృష్టికర్త శ్యామ్ బెనగళ్

శ్యామ్ బెనగళ్– ఈ పేరు ఈ తరం ప్రేక్షకులకి తెలిసి ఉండవచ్చు. కానీ సినిమాలు తెలిసి ఉండక పోవచ్చు. భారతీయ సినిమా భాషా భేదాలు లేకుండా కమర్షియల్ సినిమాల ప్రవాహంలో కొట్టుకుపోతున్న రోజుల్లో ప్రవాహానికి ఎదురీదిన వాడు, సమాంతర (పారలల్) సినిమాకి ఊపిరి పోసిన వాడు శ్యామ్ బెనగళ్. ఆయన పూర్తి పేరు బెనగళ్ళ శ్యామ్ సుందర రావు. సికింద్రాబాద్‌లో డిసెంబరు 14, 1934న జన్మించారు. సరిగ్గా 90 సంవత్సరాల 9 రోజులు ఈ భూమి మీద బతికారు. భారతీయ సినిమా రంగంలో ఇకపై ఎన్ని వందల ఏళ్ళు శ్యామ్ బెనగళ్ జీవించి ఉంటారనేది చరిత్ర చెబుతుంది.

తెలంగాణ– ఆయనకి ఊహ తెలిసేటప్పటికి ఇంకా నిజాం పాలనలోనే ఉంది. అప్పటి దొరల దౌర్జన్యాలు, పెత్తందారీతనాలు– అట్టడుగు ప్రజల, ముఖ్యంగా స్త్రీల కన్నీటి కథలు– శ్యామ్ బెనగళ్ గుండెలపై చెరగని జ్ఞాపకాలు అయ్యాయి.

అందుకే తన మొదటి సినిమా అంకుర్ – ఇదే తెలంగాణ నేపథ్యంలో తీశారు. అప్పటిలో నిజాం రాజ్యంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు కలిసి ఉండేవి. ఈ మూడు ప్రాంతాల సంస్కృతులు, నేపథ్యాలు – శ్యామ్ బెనగళ్‌ని వెంటాడాయి. యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా కెరీర్‌ని ఆరంభించినా – ఆయన దృష్టి సినిమాల మీదే ఉండేది . కమర్షియల్ సినిమాల ప్రభంజనంలో – ఆర్టిఫిషియల్ హీరోలను కాకుండా– జీవితాన్ని – సమాజం లోని పాత్రల్ని వాస్తవికంగా తెరపై ఆవిష్కరించాలనుకున్నాడు శ్యామ్.

హైదరాబాద్‌లో ఫిలిమ్ సొసైటీ ప్రారంభించిన వ్యక్తి శ్యామ్ బెనగళ్. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన అత్యున్నతమైన సినిమాల ప్రింట్‌లు అతి కష్టం మీద తెప్పించుకుని, సినిమా లవర్స్ కోసం హైదరాబాద్ ఫిలిమ్ సొసైటీలో ప్రదర్శిస్తుండే వారు. తెలిసిన జీవితాలు, చూసిన సినిమాలు శ్యామ్ బెనగళ్ ఆలోచనల్లో పారలల్ సినిమా ప్రపంచాన్ని సృష్టించాయి .

కొత్త కథలు చెప్పాలి, జనం మస్తిష్కాలు కదిలించాలని శ్యామ్ బెనగళ్‌లో 'అంకుర్' సినిమాతో భారతీయ సినిమా తెరపై తన సంతకాన్ని పెట్టారు.

1978–1980 మధ్య తెలుగు సినిమా అడవి రాముడు నుంచి శంకరాభరణం సినిమాల మధ్య బాక్సాఫీస్ ఊయలలు ఊగుతుండగా, ఓ బ్రహ్మాండమైన మలుపు తిరగబోయి ఆగిపోయింది. సినిమా గర్వించదగ్గ గొప్ప దర్శకుల్లో కొందరు– శ్యామ్ బెనగళ్, మృణాల్ సేన్, గౌతమ్ ఘోష్ – తెలుగు ప్రేక్షకుల అభిరుచికి, ఆమోదానికి ఫిదా అయ్యారేమో తెలియదు కానీ – హిందీలో కాకుండా తెలుగులో పారలల్ సినిమాలు తీశారు. 'మా భూమి' అంటూ గౌతమ్ ఘోష్ అత్యద్భుతమైన సినిమాలు అందించారు. వీరి మధ్యలో శ్యామ్ బెనగళ్ మరాఠీ నవల ఆధారంగా తెలుగులో 'అనుగ్రహం' సినిమా తీశారు. తెలుగుతో పాటు హిందీలో ఇదే కథతో కొండూర– టైటిల్‌తో పారలల్‌గా తీశారు. రెండింటిలో అప్పటి అగ్ర కథానాయిక వాణిశ్రీ హీరోయిన్. అనంత్ నాగ్ హీరో .

స్మితా పాటిల్ తెలుగులో నటించిన సినిమా ఇదే! అలాగే అమ్రేష్ పురి జగదేక వీరుడు – అతిలోక సుందరి మొదలైన వాటి కన్నా చాలా చాలా ముందు తెలుగులో నటించిన సినిమా అనుగ్రహం. తెలుగులో ఆరుద్ర, గిరీష్ కర్నాడ్‌తో కలిసి స్క్రీన్ ప్లే రాశారు శ్యామ్ బెనగళ్. ఆరుద్ర మాటలు– పాటలు రాశారు. రావు గోపాలరావు గుర్తుండి పోయే పాత్ర చేశారు.

అయితే శ్యామ్ బెనగళ్ చెప్పిన కథా విధానం అప్పటి ప్రేక్షకులకి రుచించ లేదనే చెప్పాలి. ఆ రోజుల్లో అభిరుచి ఉన్న ప్రేక్షకులు అంకుర్, నిషాంత్ , మంథన్ , భూమిక – ఏ ఫిలిమ్ సొసైటీల్లో చూపిస్తారా అని తిరుగుతుండేవారు. సగటు ప్రేక్షకులేమో ఈయనేంటి – వేరే కథలు చెబుతున్నారు – మనకి తెలియని జీవితపు కోణాలు పట్టుకుంటున్నారు అని డిస్టర్బ్ అవుతుండే వారు. ఎదిగిన కొద్దీ ప్రేక్షకులకు శ్యామ్ బెనగళ్‌ను ఇంకొంచెం అర్థం చేసుకునే అవకాశం దొరికింది. అనంత్ నాగ్, షబానా అజ్మీ , నసీరుద్దీన్ షా , ఓం పురి , స్మితా పాటిల్ , అమ్రేష్ పురి , లాంటి గొప్ప నటుల్ని కనుగొన్న కొలంబస్ – శ్యామ్ బెనగళ్. ముఖ్యంగా మన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రాసిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా శ్యామ్ బెనగళ్ దూరదర్శన్ కోసం తీసిన సీరియల్ ఎప్పటికీ గుర్తుంచు కోదగ్గది. ముస్లిమ్ మహిళల జీవితాలను స్పృశిస్తూ మమ్మొ, సర్దారీ బేగమ్, జుబేదా అని మూడు సినిమాలు రూపొందించారు. కమర్షియల్‌గా ఫెయిల్ అయినప్పటికీ – మహా భారతాన్ని ఓ బిజినెస్ సామ్రాజ్యానికి అన్వయిస్తూ శశి కపూర్ తీయించిన 'కలియుగ్' శ్యామ్ బెనగళ్ ప్రయోగం.

23 డిసెంబర్ 2024న కన్ను మూశారు శ్యామ్ బెనగళ్. కన్ను మూసినా ఆయన ఆలోచనల్లో తీరని కలలు చెప్పని కథలు ఏమున్నాయో మనకి తెలియదు. కానీ కొత్త తరం రచయితలు, దర్శకులు శ్యామ్ బెనగళ్ స్ఫూర్తితో ఏ కొత్త సినిమాని పరిచయం చేస్తారోనని ఎదురు చూద్దాం.

– తోట ప్రసాద్, సినీ రచయిత

సంతాపం

సువర్ణాధ్యాయం ముగిసింది

భారతీయ సినిమా, టెలివిజన్ రంగాల్లోని ఓ సువర్ణాధ్యాయం శ్యామ్‌బెనగళ్ మరణంతో ముగిసింది. కొత్త తరహా సినిమాలను ప్రారంభించి, క్లాసిక్ సినిమాలను రూపొందించారు. నిజమైన ఇన్‌స్టిట్యూషన్‌కు ఆయన ఓ నిదర్శనం. ఎందరో కళాకారులను, నటులను తీర్చిదిద్దారు. సినిమా పరిశ్రమకు శ్యామ్ బెనగళ్ చేసిన సేవలు దాదాసాహెబ్ ఫాల్కే, పద్మభూషణ్ పురస్కారంతో సహా ఎన్నో విశిష్ట పురస్కారాలు అందుకున్నాయి. ఆయన కుటుంబ సభ్యులకు, ఎంతోమంది ఆయన అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి.

– భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తీవ్రంగా బాధించింది

శ్యామ్ బెనగళ్ గారి మరణం తీవ్రంగా బాధించింది. ఆయన కథలు ఇండియన్ సినిమాపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. ఆయన ప్రతిభ ఎప్పటికీ ప్రజాదరణకు నోచుకుంటూనే ఉంటుంది. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

– భారత ప్రధానమంత్రి నరేంద్రమోది

ఫిలిం మేకర్స్‌కు స్ఫూర్తి

సమాంతర సినిమాకు నిజమైన మార్గదర్శకుడు, ఆలోచింపజేసే కథ, కథనాలు, సామాజిక సమస్యలతో సినిమాల ద్వారా చిత్ర పరిశ్రమపై తనదైన ముద్ర వేశారు బెనగళ్. 18 జాతీయ చలన చిత్ర అవార్డులతో సహా ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను అందుకున్నారు. ఆయన చరిత్ర ఫిల్మ్‌మేకర్స్‌కు స్ఫూర్తినిస్తుంది.

– కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

భావితరాలకు ప్రేరణ

విజనరీ ఫిల్మ్‌మేకర్ శ్యామ్ బెనగళ్ గారి మరణవార్త బాధిస్తోంది. సినిమాల్లో అద్భుతంగా సాగిన ఆయన ప్రయాణం, సామాజిక అంశాలపై అంకితభావంతో ఆయన చేసిన సినిమాలు భావితరాలకు ప్రేరణగా నిలుస్తాయి.

– కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

సాంస్కృతిక సంపద

మన దేశంలోనే అత్యుత్తమ ఫిల్మ్‌మేకర్, మేధావి అయిన శ్యామ్ బెనగళ్‌గారి మరణం నన్ను బాధించింది. సినిమా రంగంలోని ప్రతిభావంతులను గుర్తించి, ప్రోత్సహించారు. ఆయన తీసిన సినిమాలు, జీవిత చరిత్రలు, డాక్యుమెంటరీలు భారతదేశ సాంస్కృతిక సంపదలో భాగమయ్యాయి. సహచర హైదరాబాదీ వాసి, మాజీ రాజ్యసభ సభ్యులు అయిన బెనగళ్‌గారి అద్భుతమైన చిత్రాలు, భారతీయ సినిమాలో ఎప్పటికీ మన్ననలు పొందుతూనే ఉంటాయి. – చిరంజీవి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	499	78,540
నిఫ్టీ ▲	166	23,753

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	19,694	▲	121
డోజోన్స్	42,739	▽	101
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,103	▲	18
డాక్స్	19,849	▽	36
షాంఘై	3,351	▽	17
నికాయ్	39,161	▲	459

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	75,944
బంగారం (99.5 స్వచ్ఛత)	75,640
వెండి (కేజీ)	87,488

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.60	85.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.70	108.53
€	యూరో	ఎస్‌బీఐ	87.57	90.17
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.70	55.05
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.16	54.33
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.42	65.10
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.80	23.36
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.28	24.07
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.61	10.79

అదానీ గ్రూప్ చేతికి ఎయిర్ వర్క్స్

- 85.8% వాటాల కొనుగోలు
- రూ. 400 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువ

న్యూఢిల్లీ: ఏవియేషన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవరాల్ (ఎంఆర్‌వో) సర్వీసుల దిగ్గజం ఎయిర్ వర్క్స్‌లో అదానీ గ్రూప్ 85.8 శాతం వాటాలు కొనుగోలు చేయనుంది. ఈ డీల్ కోసం సంస్థ విలువను రూ. 400 కోట్లుగా లెక్కించారు. ఇందుకు సంబంధించి అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ (ఏడీఎస్‌టీఎల్) షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అదానీ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్ వర్క్స్ 35 నగరాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 1,300 మంది పైగా సిబ్బంది ఉన్నారు. మెయింటెనెన్స్, ఇంటీరియర్ రీఫర్బిష్‌మెంట్, పెయింటింగ్ మొదలైన సేవలు అందిస్తోంది. భారతీయ నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కి కూడా సర్వీసులు అందిస్తోంది. హోసూర్, ముంబై, కొచ్చిలో యూనిట్లు ఉన్నాయి. 20 పైగా దేశాల్లో సివిల్ ఏవియేషన్ నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు ఉన్నాయి. డిఫెన్స్ ఎంఆర్‌వో విభాగంలో అదానీ గ్రూప్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి ఈ కొనుగోలు తోడ్పడుతుందని అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. భారత ఏవియేషన్ పరిశ్రమ ప్రస్తుతం అంతర్జాతీయంగా మూడో స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో 1,500 ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకుంటోందని వివరించారు. భారత ఎంఆర్‌వో సామర్థ్యాలను పటిష్టం చేయాలన్న తమ లక్ష్య సాధన దిశగా ఈ కొనుగోలు కీలక మైలురాయిగా ఉండగలదని అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సీఈవో ఆశీష్ రాజవంశి తెలిపారు.

హోండా, నిస్సాన్ విలీనం

ఎంవోయూ కుదుర్చుకున్న కంపెనీలు ● ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థగా ఆవిర్భావం

టోక్యో: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజాలు హోండా, నిస్సాన్ విలీనం కానున్నట్లు ప్రకటించాయి. ఇందుకు సంబంధించి ఇరు సంస్థలు ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. నిస్సాన్‌కు వాటా లున్న మిత్సుబిషి మోటార్స్ కూడా తన వ్యాపారాన్ని విలీనం చేసే చర్చల్లో భాగమయ్యేందుకు అంగీకరించినట్లు కంపెనీలు వెల్లడించాయి. ఈ డీల్‌తో విలీన సంస్థ.. అమ్మకాలపరంగా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆటోమొబైల్ కంపెనీగా ఆవిర్భవించనుంది. ఫ్రాన్స్‌కు చెందిన రెనోతో భాగస్వామ్యం, అలాగే మిత్సుబిషి మోటార్స్ కార్పొలతో కలిసి హోండా, నిస్సాన్ కూటమి.. జపాన్‌కే చెందిన ఆటోమొబైల్ దిగ్గజం టయోటా మోటర్ కార్ప్, జర్మనీకి చెందిన ఫోక్స్‌వ్యాగన్‌లతో పోటీ పడనుంది. విలీనం అమల్లోకి వస్తే మరింత పెద్ద స్థాయిలో కస్టమర్లకు చేరువయ్యేందుకు తోడ్పడగలదని నిస్సాన్ సీఈవో మకొటొ యుషిడా తెలిపారు. ఇటీవలే హోండా, నిస్సాన్ విలీన వార్తలు రావడం తెలిసిందే.

ఆటోమొబైల్ పరిశ్రమ క్రమంగా శిలాజ ఇంధనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలు, స్వయంచాలిత టెక్నాలజీల వైపు మళ్లుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.


50 బిలియన్ డాలర్ల దిగ్గజం..: మూడు కంపెనీల కలయికతో 50 బిలియన్ డాలర్ల పైగా మార్కెట్ విలువ గల దిగ్గజ సంస్థ ఏర్పాటవుతుంది. వీటి వార్షిక వాహనాల ఉత్పత్తి పరిమాణం 80 లక్షలు ఉంటుంది. 2023లో హోండా 40 లక్షలు, నిస్సాన్ 34 లక్షలు, మిత్సుబిషి మోటార్స్ దాదాపు 10 లక్షల వాహనాలను ఉత్పత్తి చేశాయి. అయితే ఈ మూడూ కలిసినా కూడా ఉత్పత్తి పరంగా టయోటానే అగ్రగామిగా కొనసాగనుంది. 2023లో టయోటా మొత్తం 1.15 కోట్ల వాహనాల తయారీతో టాప్‌లో ఉంది. ఫోక్స్‌వ్యాగన్ సుమారు 89 లక్షల వాహనాల ఉత్పత్తితో రెండో స్థానంలో నిల్చింది. ప్రస్తుతం దాదాపు 68 లక్షల వాహనాలతో (కియా, జెనెసిస్ బ్రాండ్లతో కలిసి) దక్షిణ కొరియా సంస్థ హ్యుందాయ్ మూడో స్థానంలో ఉంది.

ప్రయోజనాలేమిటంటే..

ఒకవైపు వాహన కంపెనీలు శిలాజ ఇంధనాల వాహనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లేందుకు తంటాలు పడుతుండగా మరోవైపు చైనా కంపెనీలు కొత్త టెక్నాలజీల విషయంలో దూసుకెళ్తుండటం పరిశ్రమను కుదిపేస్తోంది. చైనాకు చెందిన బీవైడీ, గ్రేట్ వాల్, నియో వంటి చౌక ప్రత్యామ్నాయ ఎలక్ట్రిక్ వాహనాలు.. జపాన్, అమెరికన్ కార్ల కంపెనీల మార్కెట్ వాటాను కొల్లగొడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరిశ్రమలో కన్సాలిడేషన్ చోటుచేసుకుంటున్నట్లు పరిశ్రమల వర్గాలు తెలిపాయి. ఆర్థిక సమస్యలు, తగ్గుతున్న లాభదాయకతతో నిస్సాన్ సతమతమవుతోంది. చైనాలో అమ్మకాల బలహీనతతో హోండా లాభాలపైనా ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో విలీనం చోటు చేసుకుంటోంది.



బడ్జెట్ రోజున ఎక్స్ఛేంజీలు పనిచేస్తాయ్



ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అయితే, ఆ రోజు శనివారం అయినా కూడా ఎక్స్ఛేంజీలు పనిచేస్తాయని ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తెలిపాయి. ఉదయం 9:15 నుంచి సాయంత్రం 3.30 గంటల మధ్య ట్రేడింగ్ నిర్వహించనున్నట్లు ఇరు ఎక్స్ఛేంజీలు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నాయి. గతంలో 2020 ఫిబ్రవరి 1న, 2015 ఫిబ్రవరి 28న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు శనివారం అయినప్పటికీ స్టాక్ మార్కెట్లు పని చేశాయి.

మహా కుంభ మేళా ప్రకటనల హక్కులు శ్రేయాస్‌కు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సేల్స్, మార్కెటింగ్ కంపెనీ శ్రేయాస్ మీడియా మహా కుంభ మేళా–2025 ప్రత్యేక ప్రకటనల హక్కులను దక్కించుకుంది. కుంభ మేళా జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగనుంది. ఆధ్యశ్రీ ఇన్ఫోటైన్‌మెంట్‌లో భాగమైన శ్రేయాస్ మీడియా వెండింగ్, అమ్యూజ్‌మెంట్ జోన్స్, ఫుడ్ కోర్ట్ సహా పలు కార్యకలాపాల హక్కులు సైతం పొందింది. రూ.6,300 కోట్లతో యూపీ ప్రభుత్వం నిర్వహించనున్న ఈ మేళాకు దేశ, విదేశాల నుంచి 50 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. 4,000 హెక్టార్ల విస్తీర్ణంలో జరిగే ఈ మెగా ఈవెంట్ భారత చరిత్రలో అత్యంత గొప్ప కుంభ మేళా అవుతుందని శ్రేయాస్ మీడియా ఫౌండర్ జి.శ్రీనివాస్ రావు తెలిపారు. ప్రకటనలు, బ్రాండింగ్‌కు కంపెనీలు సుమారు రూ.3,000 కోట్లు వెచ్చించే అవకాశం ఉందన్నారు. మేళా వేదికగా బ్రాండ్లను కోట్లాది మందికి చేర్చడానికి సంస్థ తనకున్న అపార అనుభవం, అసమాన నైపుణ్యాన్ని ఉపయోగిస్తుందని చెప్పారు.

పబ్లిక్ ఇష్యూలకు ఇయర్‌ఎండ్ రష్!

ముంబై: 2024 సంవత్సరాంతంలో నిధుల సమీకరణకు వచ్చిన అయిదు ఐపీఓలకు ఇన్వెస్టర్ల నుంచి అద్భుత స్పందన లభించింది. చివరి రోజు నాటికి మొత్తం అయిదు పబ్లిక్ ఇష్యూలు పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఇందులో మమతా మెషనరీ ఐపీఓకు అత్యధికంగా 195 రెట్ల స్పందన లభించింది.

కంపెనీ పేరు	క్యూఐబీ	ఎన్ఐఐ	రిటైల్	మొత్తం
మమత మెషినరీ	236	274	138	195 రెట్లు
డీఏఎం క్యాపిటల్	166	98	27	82 రెట్లు
ట్రాన్స్‌రైల్ లైటింగ్	201	76	22	81 రెట్లు
సనాతన్ టెక్స్‌టైల్స్	76	42	9	35 రెట్లు
కాంకర్డ్ ఎన్విరో	17	14	6	11 రెట్లు



● క్యూఐబీ = క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు ● ఎన్ఐఐ = నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు

వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల కోసం ప్రత్యేక ప్లాన్

టెల్కోలకు ట్రాయ్ సూచన

న్యూఢిల్లీ: డేటాను ఉపయోగించని కస్టమర్లకు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్ సర్వీసుల కోసం విడిగా ప్లాన్‌ను ప్రవేశపెట్టాలని టెల్కోలకు నియంత్రణ సంస్థ ట్రాయ్ సూచించింది. 365 రోజుల వేలిడిటీకి మించకుండా కనీసం ఒక స్పెషల్ టారిఫ్ వోచర్‌ను అందించాలంటూ.. ఈ మేరకు టారిఫ్ నిబంధనలను సవరించింది. దీంతో కస్టమర్లు తాము వినియోగించుకునే సర్వీసులకు మాత్రమే చెల్లించే వీలు లభిస్తుంది. ఇంటి వద్ద బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లున్న కుటుంబాలు, సీనియర్ సిటిజన్లకు తప్పనిసరిగా డేటా రీచార్జ్ ప్లాన్ల అవసరం ఉండదనే విషయం ఈ అంశంపై నిర్వహించిన చర్చల ప్రక్రియలో పరిశీలించినట్లు ట్రాయ్ తెలిపింది.

అయిదు రోజుల నష్టాలకు చెక్!

- దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు
- సెన్సెక్స్ లాభం 499 పాయింట్లు
- 166 పాయింట్లు పెరిగిన నిఫ్టీ...

ముంబై: దిగువ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో అయిదు రోజుల తర్వాత సోమవారం స్టాక్ సూచీలు లాభాలు నమోదుచేశాయి. సెన్సెక్స్ 499 పాయింట్లు పెరిగి 78,540 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 166 పాయింట్లు బలపడి 23,753 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఫైనాన్స్, మెటల్, ఐటీ షేర్లు రాణించడంతో ప్రథమార్థంలో భారీ లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 876 పాయింట్లు బలపడి 78,918 వద్ద, నిఫ్టీ 282 పాయింట్లు ఎగసి 23870 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ



ఏడు పైసలు బలహీనపడి 85.11 వద్ద స్థిరపడింది. అమెరికాలో ద్రవ్యోల్బణ తగ్గుముఖం పట్టినట్లు గణాంకాలు వెల్లడికావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➡ ట్రేడింగ్‌లో మెటల్ షేర్లు మెరిశాయి. కొన్ని రకాల ఫ్లాట్ స్టీల్ ఉత్పత్తులు చౌకగా దిగుమతి అవుతున్నాయన్న దేశీ స్టీల్ పరిశ్రమ ఫిర్యాదుపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ (డీజీటీఆర్) అధికారిక దర్యాప్తు మొదలు పెట్టడంతో ఈ రంగ షేర్లకు డిమాండ్ లభించింది. సెయిల్ 4%, జిందాల్ స్టీల్ 3.50% పెరిగాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో 2% రాణించాయి. జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్, నాల్కో 1%, టాటా స్టీల్, ఎస్ఎండీసీ షేర్లు అరశాతం లాభపడ్డాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
డేటా సెంటర్ సామర్థ్యాలు రెండేళ్లలో రెట్టింపు | షోరూంలోనే కారు కొనుగోలు

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో 608 ఇన్సూరెన్స్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ) దేశవ్యాప్తంగా ఉన్న ఈఎస్ఐసీ డిస్పెన్సరీలు/ఆసుపత్రుల్లో ఇన్సూరెన్స్ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. యూపీఎస్సీ నిర్వహించే కంబైన్డ్ మెడికల్ సర్వీస్ ఎగ్జామినేషన్–2022/2023లో డిస్‌క్లోజర్ లిస్టులో ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 608.
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తయి ఉండాలి.యూపీఎస్సీ నిర్వహించే కంబైన్డ్ మెడికల్ సర్వీస్ ఎగ్జామినేషన్–2022/2023లో డిస్‌క్లోజర్ లిస్టులో ఎంపికైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
» **వయసు:** 26.04.2024 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** పే స్కేల్ రూ.56,100 నుంచి రూ.1,77,500.
» **ఎంపిక విధానం:** యూపీఎస్సీ నిర్వహించే కంబైన్డ్ మెడికల్ సర్వీస్ ఎగ్జామినేషన్ –2022/2023 ఫలితాల్లో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2025
» **వెబ్‌సైట్:** www.esic.gov.in/recruitments

ఎయిమ్స్ బిలాస్‌పూర్‌లో 110 ఫ్యాకల్టీ పోస్టులు

బిలాస్‌పూర్(హిమాచల్‌ప్రదేశ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. డైరెక్ట్/డిప్యూటేషన్/ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 110.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–22, అడిషనల్ ప్రొఫెసర్–16, అసోసియేట్ ప్రొఫెసర్–16, అసిస్టెంట్ ప్రొఫెసర్–56.
» **విభాగాలు:** అనెస్తీషియా, బయోకెమిస్ట్రీ, అనాటమీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్స్, సర్జికల్ ఆంకాలజీ, పల్మనరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియాలజీ, యూరాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఎస్/డీఎం/ఎండీ /ఎంసీహెచ్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ప్రొఫెసర్/అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, అభ్యర్థుల షార్ట్ లిస్టింగ్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, మూడో అంతస్తు, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), కోఠిపుర, బిలాస్‌పూర్, హిమాచల్‌ప్రదేశ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.01.2025.
» **వెబ్‌సైట్:** www.aiimsbilaspur.edu.in

బీఈఎల్, బెంగళూరులో అప్రెంటిస్‌లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏడాది అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **ట్రేడులు:** ఎలక్ట్రానిక్ మెకానిక్, ఈపీ, డీఎంఎం, ఫిట్టర్, సీవోపీఏ, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్.
» **అర్హత:** 01.01.2020 తర్వాత ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఐటీఐ ఫైనల్ సెమిస్టర్ లేదా ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తుల చేసుకోవచ్చు.
» **వయసు:** 01.12.2024 నాటికి గరిష్ఠంగా 21 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల మినహాయింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు ఫిట్టర్, డీఎంఎం, ఈఎల్, టర్నర్, ఈపీ, ఈఎం, మెషినిస్ట్ ట్రేడులకు రూ.10,333, పీవోపీఏ/పీఏఎస్ఏఏ ట్రేడుకు రూ.9185.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలో ప్రతిభ, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **వాక్‌ఇన్ సెలక్షన్స్/పరీక్ష తేది:** 26.12.2024.
» **వాక్‌ఇన్ ప్రదేశం:** సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్, జలహళ్లి, బెంగళూరు.
» **అప్రెంటిస్‌షిప్ శిక్షణ ప్రదేశం:** భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్
» **వెబ్‌సైట్:** https://d1frkna4b32ahm.cloudfront.net/uploadimages/BELAppren171224.pdf

బీమా కంపెనీలో అసిస్టెంట్ కొలువు

- » న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో 500 అసిస్టెంట్ పోస్టులు
- » రెండు దశల రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » నెలకు రూ.40 వేల ప్రారంభ వేతనం
- » భవిష్యత్తులో సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం

బీమా రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థ న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ(ఎన్ఐఏ) 500 అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీతోనే ఈ పోస్టులకు పోటీపడొచ్చు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి..నియామకం ఖరారు చేసుకుంటే.. క్లాస్-3 కేడర్‌లో సుస్థిర కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎన్ఐఏ అసిస్టెంట్ పోస్టుల వివరాలు, ,ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష విధానం, వేతనాలు తదితర సమాచారం..

దేశంలో ఇన్సూరెన్స్ రంగం రోజురోజుకూ విస్తరిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ బీమా సంస్థలు కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ప్రైవేట్ రంగంతో పోటీ పడుతూ సేవలందిస్తున్నాయి. ఇందులో భాగంగానే న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా నియామకాలు చేపడుతోంది. తాజాగా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం 500 పోస్టులు

తాజాగా న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ.. దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాలలోని తమ శాఖల్లో 500 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు, తెలంగాణలో 10 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ✦ 2024, డిసెంబర్ 12 నాటికి.. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఏదో ఒక స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ✦ **వయసు:** 2024,డిసెంబర్ 12 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

అసిస్టెంట్ పోస్టులకు రెండు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు. తొలిదశలో ప్రిలిమినరీ పరీక్ష, రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

వంద మార్కులకు ప్రిలిమినరీ

తొలి దశగా పేర్కొనే టైర్–1 ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇందులో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 35 ప్రశ్నలు–35 మార్కులకు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి 20 నిమిషాలు చొప్పున మొత్తం గంట వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే అడుగుతారు. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును నెగెటివ్ మార్కుగా నిర్దేశించారు.

మెయిన్స్‌కు 250 మార్కులు

రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దిష్ట కటాఫ్‌లను అనుసరించి మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ ఎగ్జామినేషన్ మొత్తం 5 విభాగాల్లో 250 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, టెస్ట్ ఆఫ్ జనరల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు. అభ్యర్థులు ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగిలిన సబ్జెక్ట్‌లను ఇంగ్లిష్ లేదా హిందీ భాషలో హాజరయ్యే అవకాశం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును నెగెటివ్ మార్కు నిబంధన ఉంది.

ప్రాంతీయ భాష పరీక్ష

మెయిన్ ఎగ్జామినేషన్‌లో భాగంగానే అభ్యర్థులు మరో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది. అదే రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్. తమ సొంత రాష్ట్రం కాకుండా.. ఇతర రాష్ట్రాలలోని పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు.. వారు ఎంపిక చేసుకున్న రాష్ట్రానికి సంబంధించిన అధికార భాషలో టెస్ట్‌ను నిర్వహిస్తారు. మొత్తం 50 మార్కులకు రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా అభ్యర్థులు ఒక ఎస్సే రైటింగ్, ఒక లెటర్ రైటింగ్ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

వేతనం

- ✦ ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపిన వారికి మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. ప్రారంభంలో క్లాస్–3 కేడర్‌లో నియమిస్తారు. రూ.22,405–రూ.62,265 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. నెలకు స్థూలంగా రూ.37 వేల వేతనం అందుతుంది. మెట్రో సిటీల్లో రూ.40 వేలు ఉంటుంది.
- ✦ నియామకాలు ఖరారు చేసుకున్న వారికి ముందుగా ఆరు నెలల ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి శాశ్వత నియామకం ఖరారవుతుంది.

సీనియర్ మేనేజర్ హోదాకు

అసిస్టెంట్ హోదాలో కొలువులు సొంతం చేసుకున్న వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏఏఓగా పదోన్నతి పొందొచ్చు. ఆ తర్వాత సర్వీసు నిబంధనలు అనుసరించి ఏఓ, ఎస్ఏఓ, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో ప్రధానంగా భావించే రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

అర్థమెటిక్ అంశాలపై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా బాగా ప్రాక్టీస్ చేస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందొచ్చు.



జనరల్ అవేర్‌నెస్

అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన విభాగం.. జనరల్ అవేర్‌నెస్. జీకే, కరెంట్ అఫైర్స్‌తోపాటు ఇన్సూరెన్స్, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా న్యూ ఫైల్ క్రియేషన్, ఎక్సెల్ షీట్, పీపీటీల వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా కీ బోర్డ్ షార్ట్ కట్స్, బేసిక్ హార్డ్‌వేర్ టూల్స్ గురించి తెలుసుకోవాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి స్టాక్ జీకే అంశాలతో పాటు.. ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు–విజేతలు, అవార్డులు–గ్రహీతలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. అంతేకాకుండా హిస్టరీపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, జనవరి 1
- ✦ **టైర్–1 ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2025, జనవరి 27
- ✦ **మెయిన్ ఎగ్జామ్ పరీక్ష తేదీ:** 2025, మార్చి 2
- ✦ **వెబ్‌సైట్:** www.newindia.co.in

కూలిన ఆలయాన్ని కలిసి నిలబెట్టారు!

ఆత్మకూరులోని వెయ్యేళ్ల పంచకూట ఆలయాన్ని పునరుద్ధరించిన గ్రామస్తులు

రూ.3.75 కోట్లు విరాళాలు సేకరించి.. కాకతీయులు గుడికి జీవం పోసిన వైనం


ఆలయం పాతచిత్రం


పునర్నిర్మించిన పంచకూట ఆలయం


ఆలయంలోని శివలింగం

ఆత్మకూరు: అత్యంత అరుదైన ఆలయమది. తెలంగాణలోనే ఏకైక పంచకూట శివాలయం. కాకతీయుల శిల్పకళా నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన వెయ్యేళ్లనాటి కోవెల. అదే హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని పంచకూట శివాలయం. నాడు ఓ వెలుగు వెలిగిన ఈ ఆలయం.. సరైన నిర్వహణ లేక కాలక్రమంలో కూలిపోయే దశకు చేరింది. గుడి దుస్థితి చూసి గ్రామస్తుల గుండెలు తరుక్కుపోయాయి. మా గుడిని బాగుచేయండి అని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా లాభం లేకపోవటంతో.. గ్రామస్తులంతా ఒక్కటయ్యారు. ఎలాగైనా గుడిని బాగుచేసుకోవాలని సంకల్పించారు. పైసాపైసా పోగుచేశారు. వారి సంకల్పానికి సమీప గ్రామాల ప్రజలు కూడా సాయంగా నిలిచారు. దీంతో ఆలయం మళ్లీ పూర్వవైభవం సంతరించుకొంది. కొంగొత్తగా ముస్తాబై భక్తులకు కనువిందు చేస్తోంది.



మహిమాన్విత ఆలయం

ఆత్మకూరు పంచకూట శివాలయం మహిమాన్వితమైనది. ఈ ఆలయంలో పూజలు చేస్తే సంతానప్రాప్తి, విద్యా, ఉద్యోగ ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం ఉంది. ఐదు లింగాలకు అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

-వచ్చునూరు రవిందర్‌శర్మ, అర్చకులు



అందరి సహకారంతో ఆలయాన్ని నిర్మించాం

గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించాం. వెయ్యేళ్ల నాటి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసుకునే అదృష్టాన్ని భగవంతుడు మాకు కల్పించాడు. కమిటీ సభ్యులందరి సమన్వయంతో ఆలయాన్ని పూర్తిగా రాతితో నిర్మించాం.

-వంగాల బుచ్చిరెడ్డి, కమిటీ అధ్యక్షుడు

రూ.3.75 కోట్ల విరాళాలు

ఆలయం పునరుద్ధరణ కోసం ఆత్మకూరు గ్రామానికి చెందిన ప్రతీ కుటుంబం వారిఆర్థిక స్తోమతను బట్టి రూ.2 వేల నుంచి రూ.15 లక్షల వరకు విరాళంగా ఇచ్చారు. సమీపంలోని పెద్దాపురం, గుడెపాడ్, తిరుమలగిరి గ్రామస్తులు కూడా విరాళాలు అందించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆత్మకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ అధికారులు తెలిపారు. గుడి పునరుద్ధరణకు ముస్లింలు, క్రిష్టియన్లు కూడా విరాళాలు ఇచ్చి మత సామరస్యం చాటారు. కొందరు ఎన్‌ఆర్‌ఐలు కూడా విరాళాలు ఇవ్వటంతో మొత్తం రూ.3.75 కోట్లు జమ అయ్యాయి. దీంతో తమిళనాడు నుంచి స్థపతులను రప్పించి గుడిని పునర్నిర్మించారు. వెయ్యేళ్లనాటి వైభవాన్ని సంతరించుకొన్న ఆలయాన్ని ఇటీవలే భక్తుల దర్శనం కోసం తెరిచారు. ఇప్పుడు రోజూ వందమందికి పైగా భక్తులు ఆలయాన్ని సందర్శిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

అత్యంత అరుదైన ఆలయం

శ్రీ పార్వతిదేవి సమేత మహాదేవ పంచకూట శివాలయాన్ని 11వ శతాబ్దంలో కాకతీయ రాజులు నిర్మించారు. కాకతీయుల పాలనలో త్రికూట ఆలయాలు ఎక్కువగా నిర్మించారు. అయితే, ప్రత్యేకంగా ఆత్మకూరు గ్రామంలో పంచకూట ఆలయం నిర్మించడం విశేషం. ఆలయంలో దక్షిణ ముఖంగా ఉన్న ప్రధాన ద్వారంలోపల గర్భగుడిలో శివలింగం ప్రతిష్ఠించారు. ప్రధాన గర్భగుడికి కుడివైపున ఉన్న రెండు గుడుల్లో రెండు శివలింగాలు, ఎడమ వైపు రెండు గుడుల్లో రెండు శివలింగాలు ప్రతిష్ఠించారు. ఈ ఐదు లింగాలను పంచభూతాలకు ప్రతీకలుగా ఏర్పాటు చేశారని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. ఈ ఆలయాన్ని పూర్తిగా రాతితోనే నిర్మించారు. క్రీస్తు శకం 1250 నాటి శాసనాల్లో పంచకూట ఆలయ వైశిష్ట్యాన్ని వివరించారు. కాకతీయ రాజులు, సామంతులు, జగద్గురువులు ఇక్కడ ప్రత్యేక పూజలు చేశారని చెబుతున్నారు. ఆలయంలో నందులు, వినాయకుడు, కుమారస్వామి, పార్వతీదేవి విగ్రహాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. ఈ ఆలయాన్ని పునర్‌నిర్మించాలని సంకల్పించి 2019 డిసెంబర్ 11న భూమిపూజ చేసి.. ఐదేళ్ల శ్రమ తర్వాత ఈ నెల 8న ఆలయం పునఃప్రతిష్ఠ చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మూడు రోజుల పాటు వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా...

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అరెస్ట్

బల్మూరి నారాయణరావు స్వగ్రామం జగిత్యాల జిల్లా బీర్పూర్



సారంగాపూర్/చర్ల: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు బల్మూరి నారాయణరావు అలియాస్ ప్రభాకర్‌రావు (57)ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుండగా.. సోమవారం అరెస్టు చేసినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. కొన్నిరోజులుగా కాంకేర్ ప్రాంతంలో నారాయణరావు కదలికలపై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలిసింది. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలకేంద్రానికి చెందిన నారాయణరావు 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అప్పటికే అదే గ్రామం నుంచి మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శిగా చురుకుగా పనిచేస్తున్న ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి పీపుల్స్‌వార్‌లో పనిచేస్తున్నారు. గణపతి దారిలోనే నడిచి నారాయణరావు అంచలంచెలుగా కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు. నారాయణరావుపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో పెద్ద సంఖ్యలో కేసులున్నాయి. నారాయణరావుపై ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది.

ఆయన ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఎంవోపీవోఎస్ టీంలో కీలకంగా పనిచేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆయనకు మావోయిస్టు పార్టీలో ఉన్న బసవరాజు, రాంచంద్రారెడ్డి అలియాస్ రాజు, దేవ్‌జీ అలియాస్ కుమాదాదా, కోసా, సోను, మల్లరాజురెడ్డి అలియాస్ సంగ్రామం వంటి ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

మార్చి 11 నుంచి ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ పరీక్షలు మార్చి 11 నుంచి మొదలవుతాయని ఇంటర్ బోర్డ్ వెల్లడించింది. మార్చి 11, 13, 17 తేదీల్లో మొదటి సంవత్సరం, 12, 15, 18 తేదీల్లో రెండో ఏడాది ఒకేషనల్ కోర్సుల పరీక్షలు ఉంటాయని పేర్కొంది. దీనికి సంబంధించిన టైమ్‌టేబుల్‌ను ఇంటర్ బోర్డ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

ఆడపులి కోసం అడవులన్నీ..

జత కోసం గాలిస్తూ 20 రోజుల్లో 10 జిల్లాలు చుట్టొచ్చిన బెంగాల్ టైగర్

- ప్రస్తుతం ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో తిష్ట వేసినట్లు గుర్తింపు
- ప్రజలను అప్రమత్తం చేసిన అటవీశాఖ అధికారులు



సాక్షి ప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలోని అడవుల్లో బెంగాల్ టైగర్ సంచారం కొనసాగుతోంది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఒకరిని చంపడంతోపాటు మరొకరిపై దాడి చేసిన పెద్దపులి.. తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం మీదుగా గోదావరి తీరం వెంట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకొని అక్కడి నుంచి తాజాగా ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో తిష్టవేసింది. ఈ విషయాన్ని అటవీశాఖ ధ్రువీకరించింది. 'తాడ్వాయి మండలం బందాల అడవుల్లో పులి సంచరిస్తున్నట్లు ఆధారాలు దొరికాయి. వారం క్రితం పంబాపురం, నర్సాపురం అడవుల్లో తిరిగిన పులి.. బందాల అడవుల్లో జంతువులను వేటాడిన ఆనవాళ్లున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'అని అటవీశాఖ రేంజ్ అధికారి సత్తయ్య హెచ్చరించారు. దీంతో గిరిజన గూడేల్లో మళ్లీ పులి కలకలం మొదలైంది.

తోడు కోసం గాలిస్తూ..: ఇరవై రోజులకుపైగా అటవీ ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న మగ పులి.. ఆడపులి తోడు కోసం అడవులన్నీ తిరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పూర్వ ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్.. చెన్నూరు, భూపాలపల్లి, ములుగు జిల్లా తాడ్వాయి, మంగపేట, వాజేడు, వెంకటాపురం.. ఇంద్రావతి నుంచి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు అటవీ ప్రాంతం... ఇలా పులి సుమారు 10 జిల్లాల్లో చాలా దూరం నడిచినట్లు పాదముద్రల ద్వారా తెలుస్తోందని అటవీశాఖ ప్రకటించింది. అయితే 2021లో ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్ నుంచి ములుగు అడవులకు మేటింగ్ కోసం వచ్చిన పులే మరోసారి వచ్చి ఉంటుందని కూడా అధికారులు భావిస్తున్నారు. దీన్ని ధ్రువీకరించుకోవడానికి నాలుగైదేళ్ల నాటి పులుల సంచార రికార్డులు, కెమెరా ట్రాప్‌లు, వాటి ఫొటోలు పరిశీలించాల్సి ఉందంటున్నారు. ఆ తర్వాతే ఈ పులి ఎక్కడ నుంచి వచ్చిందన్నది కచ్చితంగా చెప్పగలమంటున్నారు.

మూడేళ్ల కిందట ఇలాగే..: మూడేళ్ల క్రితం పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ములుగు, తాడ్వాయి, మంగపేట, కరకగూడెం, ఆళ్లపల్లి, రేగళ్ల అటవీ ప్రాంతాల్లో పెద్ద పులి పర్యటించిందని అధికారులు పేర్కొన్నారు. అప్పట్లో ఒక ఆవును కూడా పులి చంపితిందని, ఆ తర్వాత నుంచి దాని జాడ లేదని.. తిరిగి 10 రోజులుగా పులి ఆనవాళ్లు కనిపిస్తున్నాయని అంటున్నారు. ఆదిలాబాద్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, చెన్నూరు, భూపాలపల్లి, ములుగు, తాడ్వాయిల మీదుగా భద్రాద్రి కొత్తగూడెం వరకు పులి కారిడార్‌ను ఏర్పాటు చేసుకుందని అధికారులు అంటున్నారు.

గూడూరు శిలాశాసనానికి 900 ఏళ్లు

నేడు నవ శతాబ్ది మహోత్సవాలు



పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు శిలా శాసనానికి 900 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం నవశతాబ్ది మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. క్రీ.శ.1124 క్రోధి నామ సంవత్సరంలో కళ్యాణి చాళుక్యుల అధిపతులు, విరియాల రాజులు గూడూరు కేంద్రంగా పాలించిన సమయంలో ఒక శిలా శాసనం వేశారు. ఇందులో కాకతీయ మహాసామ్రాజ్య స్థాపనకు సంబంధించిన ముఖ్య పాత్ర, ముదిగొండ చాళుక్యులు కొరవి రాజ్యాన్ని తిరిగి పొందడంలో ఇక్కడి రాజుల ఘనతను వివరించారు. ఈ సందర్భంగా శ్రీపోతన చైతన్య వేదిక గూడూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల శిలాశాసన నవశతాబ్ది వేడుకలు నిర్వహిస్తోంది. ఈ శిలాశాసనం గురించిన పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, చరిత్రకారులు, సాహిత్యాభిమానులు హాజరవుతున్నారని పోతన చైతన్య వేదిక గూడూరు అధ్యక్షుడు ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్తి పరాంకుశం తెలిపారు.

చాక్లెట్‌తో తయారుచేసిన అతి పెద్ద చెస్ బోర్డు...



చాక్లెట్‌తో అతి పెద్ద చెస్ బోర్డు..

256 చ. అడుగుల విస్తీర్ణంలో తయారీ • సీఏఐ మరో ప్రపంచ రికార్డు

సనత్‌నగర్ (హైదరాబాద్): బేగంపేటలోని కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా (సీఏఐ) మరో రికార్డు సాధించింది. చాక్లెట్‌తో ప్రపంచంలోనే అతి పెద్ద చెస్ బోర్డును తయారుచేసి అబ్బురపరిచింది. 16 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవుతో.. 256 చదరపు అడుగుల విస్తీర్ణంలో చెస్ బోర్డును రూపొందించారు. చెస్ పావులను సైతం చాక్లెట్‌తో తయారుచేసి అబ్బురపరిచారు. సీఏఐ చెఫ్ అక్షయ కులకర్ణి ఆధ్వర్యంలో 25 మంది.. వారం రోజుల పాటు శ్రమించి దీనిని రూపొందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశం, అకాడమీ చైర్మన్ సుధాకర్‌రావు తదితరులు హాజరయ్యారు. చాక్లెట్‌తో అతిపెద్ద చెస్ బోర్డును తయారు చేయడం చాలా ఆనందంగా ఉందని బాలకృష్ణారెడ్డి చెప్పారు. ఏటా ఓ కొత్త రికార్డు సాధించాలనే ఉద్దేశంతో ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నట్లు కలనరీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ సుధాకర్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటికే ఐదు వరల్డ్ రికార్డులు సాధించామని, ఇది ఆరో రికార్డు అని వెల్లడించారు.

పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

- మలేషియా వ్యాపారవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు


భేటీలో పాల్గొన్న తుమ్మల, శ్రీధర్‌బాబు, మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడుల కోసం తెలంగాణలో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మలేషియా పారిశ్రామికవేత్తలను కోరారు. శ్రీధర్‌బాబు గత నెలలో మలేషియా తెలుగు మహాసభలకు హాజరైన సందర్భంగా అక్కడి పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించారు. ఈ మేరకు పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ చొరవతో సోమవారం సచివాలయంలో మలేషియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సౌర విద్యుత్ రంగం, డ్రైపోర్టుల నిర్మాణం, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

హుస్సేన్ సాగర్‌లో పూడికతీత, మురుగు నీటి శుద్ధి కోసం అత్యాధునిక సీవరేజీ ప్లాంట్ల ఏర్పాటులో పాలు పంచుకోవాలని మలేషియా పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డ్రైపోర్టుల నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుతం మలేషియా నుంచి పామాయిల్ మొలకలు దిగుమతి చేసుకుంటున్నామని, అలా కాకుండా విత్తనాలు సరఫరా చేయడానికి గానీ, ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేయడానికి గానీ ముందుకొస్తే సహకరిస్తామని చెప్పారు.

బిర్యానీయే బాస్!

ఆహారప్రియుల ఆన్‌లైన్ ఆర్డర్లలో వరుసగా తొమ్మిదో ఏడాదీ అగ్రస్థానం

8.3 కోట్ల ఆర్డర్లతో దేశంలోకెల్లా అత్యధిక ఆదరణ చూరగొన్న వంటకం	**158** సగటున నిమిషానికి నెటిజన్లు బుక్ చేసుకున్న ఆర్డర్లు	**2.3** కోట్ల ఆర్డర్లతో రెండో స్థానంలో నిలిచిన దోశ

పాస్తా కోసం రూ. 49,900 ఖర్చు చేసిన ఓ వినియోగదారుడు

స్విగ్గీ వార్షిక నివేదికలో వెల్లడైన దేశవ్యాప్త ఆహార ట్రెండ్స్



సాక్షి, హైదరాబాద్

వంటకాల్లోకెల్లా బిర్యానీయే మరోసారి బాస్‌గా నిలిచింది. దేశంలోని ఆహారప్రియుల ఫేవరేట్ డిష్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ ఆర్డర్లలో అత్యధికం మంది వినియోగదారులు కోరుకున్న వంటకంగా వరుసగా తొమ్మిదో సంవత్సరం అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాదిలో జనవరి 1 నుంచి నవంబర్ 22 మధ్య తమకు 8.3 కోట్ల బిర్యానీల ఆర్డర్లు వచ్చినట్లు ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ వెల్లడించింది. ఈ లెక్కన సెకనుకు 2 బిర్యానీల చొప్పున నిమిషానికి 158 బిర్యానీల ఆర్డర్‌లు నమోదైనట్లు తెలిపింది. ఈ మేరకు వివిధ రకాల ఆర్డర్ల వివరాలతో కూడిన దేశవ్యాప్త ఆహార ట్రెండ్స్‌తో వార్షిక నివేదికను విడుదల చేసింది.

నివేదికలోని విశేషాలు ఇవీ..

- దేశవ్యాప్తంగా 2.3 కోట్ల ఆర్డర్లతో బిర్యానీ తర్వాత దోశ రెండో స్థానంలో నిలిచింది.
- బ్రేక్‌ఫాస్ట్, లంచ్ సమయాలతో పోలిస్తేడిన్నర్ టైంలో ఏకంగా 21.5 కోట్ల ఆర్డర్‌లు వచ్చాయి. ఇది లంచ్ ఆర్డర్‌ల కంటే దాదాపు 29% ఎక్కువ.
- అత్యధికంగా ఆర్డర్ చేసిన తీపి వంటకాలుగా రసమలై, సీతాఫల్ ఐస్‌క్రీం చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉన్నాయి.
- బెంగళూరులో ఓ వినియోగదారుడు పాస్తా కోసం ఈ ఏడాదిలో ఏకంగా రూ. 49,900 ఖర్చు చేశాడు.
- ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయాలో రాజధాని షిల్లాంగ్ ప్రజలు అత్యధికంగా ఆర్డర్ చేసిన వంటకం నూడుల్స్.
- స్విగ్గీ డెలివరీ బాయ్స్ 196 కోట్ల కిలోమీటర్ల మేర ఆర్డర్ల డెలివరీలు పూర్తి చేశారు. ఇది కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 5.33 లక్షలసార్లు డ్రైవింగ్ చేయడంతో సమానం.
- ముంబైకి చెందిన కపిల్ కుమార్ పాండే అనే స్విగ్గీ రైడర్ ఈ ఏడాది అత్యధికంగా 10,703 ఆర్డర్‌లను అందించగా, కోయంబత్తూరుకు చెందిన కాళీశ్వరి 6,658 ఆర్డర్‌లతో మహిళా డెలివరీ విభాగంలో తొలి స్థానంలో నిలిచారు.
- బ్రేక్‌ఫాస్ట్‌గా 85 లక్షల దోసెలు, 78 లక్షల ఇడ్లీలతో దక్షిణాదివాసులు తమ ఆహార అలవాట్లను మరోసారి చాటారు.
- బెంగళూరువాసులు 25 లక్షల మసాలా దోశలను ఆస్వాదించగా.. ఢిల్లీ, చండీగఢ్, కోల్‌కతా నగరాల ప్రజలు చోలే, ఆలూ పరాటా, కచోరీలను ఆరగించారు.
- 24.8 లక్షల ఆర్డర్‌లతో దేశంలో అత్యధికంగా ఆర్డర్ చేసిన స్నాక్‌గా చికెన్ రోల్ నిలిచింది. చికెన్ మోమోస్ 16.3 లక్షల ఆర్డర్‌లను, ఆలూ ఫ్రై 13 లక్షల ఆర్డర్‌లతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- చికెన్ బర్గర్ 18.4 లక్షల మిడ్‌నైట్ ఆర్డర్లలో టాప్‌లో నిలవగా రెండవ స్థానాన్ని చికెన్ బిర్యానీ దక్కించుకుంది.
- ఢిల్లీలో ఓ కస్టమర్ ఒకే ఆర్డర్‌లో ఏకంగా 250 ఆనియన్ పిజ్జాలను ఆర్డర్ చేశాడు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



గోదావరి.. మధుర జ్ఞాపకాల లాహిరి

ప్రకృతి ప్రేమికులకు రా రమ్మని... స్వాగతం

పాపికొండల యాత్రకు పెరుగుతున్న డిమాండ్

భద్రాచలం సమీపాన పోచవరం నుంచి నిత్యం బోట్లు


పాపికొండల యాత్రలో బోట్

భద్రాచలం: గోదావరికి ఇరువైపులా ఉన్న ప్రకృతి అందాలు, గుట్టలపై ఉండే గిరిజన గూడేలు, ఆకుపచ్చని రంగులో ఆకాశాన్ని తాకేందుకు పోటీ పడుతున్న కొండల అందాలను కనులారా వీక్షించాలని అనుకుంటున్నారా? అయితే, మీరు పాపికొండలు యాత్రకు వెళ్లాల్సిందే. భద్రాచలం సమీపాన పోచవరం ఫెర్రీ పాయింట్ నుంచి నిత్యం బోట్లు నడిపిస్తుండగా.. క్రిస్మస్, కొత్త సంవత్సరంతో పాటు సంక్రాంతి సెలవులు రానున్న నేపథ్యాన పర్యాటకుల రద్దీ పెరగనుంది. ఈ నేపథ్యాన పాపికొండల అందాలు, యాత్ర మిగిల్చే తీయని అనుభవాలపై ప్రత్యేక కథనమిది.

రెండు మార్గాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పాపికొండల యాత్రను సందర్శించాలంటే రెండు మార్గాలున్నాయి. ఒకటోది.. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం వద్ద ఉన్న పోచమ్మ గండి పాయింట్ వద్ద నుంచి బోట్‌లో ప్రారంభమై.. పేరంటాలపల్లి వరకు వెళ్లి తిరిగి తీసుకొస్తారు. రెండోది.. తూర్పుగోదావరి జిల్లా వీఆర్ పురం మండలం పోచవరం ఫెర్రీ పాయింట్ నుంచి ప్రారంభమయ్యే మార్గం. ఈ పాయింట్ తెలంగాణలోని భద్రాచలానికి సమీపాన ఉంటుంది. దీంతో పర్యాటకులు ఒకరోజు ముందుగానే చేరుకుని రామయ్యను దర్శించుకుని.. ఆపై పాపికొండలు యాత్రకు బయలుదేరుతారు.

భద్రాచలం నుంచి ఇలా..

హైదరాబాద్ నుంచి పాపికొండల యాత్రకు రావాలనుకునే వారు ముందుగా భద్రాచలం చేరుకోవాలి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భద్రాచలానికి విరివిగా బస్సులు ఉన్నాయి. రైలు మార్గంలో వచ్చే వారు కొత్తగూడెం (భద్రాచలం రోడ్డు) స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో భద్రాచలం రావాలి. ఇక్కడ వీలు చూసుకుని సీతారాముల దర్శనం చేసుకున్న తర్వాత.. భద్రాచలం నుంచి 75 కిలోమీటర్ల దూరంలో బోటింగ్ పాయింట్ ఉన్న పోచవరం గ్రామానికి బయలుదేరవచ్చు.

70 కిలోమీటర్ల జలవిహారం

ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్యలో ప్రారంభమయ్యే యాత్ర సాయంత్రం 4 గంటల నుంచి లేదా 5 గంటల మధ్యలో ముగుస్తుంది. పోచవరం ఫెర్రీ పాయింట్ వద్ద పర్యాటకులను ఎక్కించుకుని మళ్లీ అక్కడే దింపుతారు. సుమారు ఆరు గంటల పాటు 70 కిలోమీటర్లు గోదావరిలోనే జలవిహారం చేసే అద్భుత అవకాశం ఈ యాత్రలో పర్యాటకులకు కలుగుతుంది.

పేరంటాలపల్లి సందర్శన

పాపికొండల యాత్రలో పేరంటాల పల్లి వద్ద నున్న ప్రాచీన శివాలయం వద్ద బోటు ఆపుతారు. ప్రశాంత వాతావరణంలో ఉన్న ఈ గుడిని గిరిజనులే నిర్వహిస్తున్నారు. గుట్ట పైనుంచి జాలువారే నది జలాన్ని తీర్థంగా పుచ్చుకుంటారు. యాత్ర ప్రారంభానికి ముందు లేదా తర్వాతైనా పోచవరానికి సమీపాన వీఆర్ పురం మండలంలోని శ్రీరామగిరి రాముడి క్షేత్రాన్ని దర్శించుకోవచ్చు.

షెడ్యూల్, ధరలు ఇలా..

పోచవరం వద్ద నుంచి ప్రారంభమయ్యే పాపికొండల యాత్రకు సంబంధించి పెద్దలకు రూ.950, చిన్నారులకు రూ.750గా ఏపీ పర్యాటక శాఖ నిర్ణయించింది. కళాశాల విద్యార్థులు గ్రూపుగా పర్యటనకు వస్తే.. వారికి రూ.850, ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.750 ప్యాకేజీ ధరగా ప్రకటించారు. అయితే శని, ఆదివారం, సెలవు దినాల్లో.. దీనికి అదనంగా రూ.100 వసూలు చేస్తారు. ఈ ప్యాకేజీలోనే భోజన సౌకర్యాన్ని బోటు నిర్వాహకులు కల్పిస్తారు. భద్రగిరిలోని రామాలయం పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బుకింగ్ కౌంటర్ల ద్వారా ఏజెంట్లు టికెట్లు విక్రయిస్తారు.

ఇసుక తిన్నెల్లో విడిది..

రాత్రివేళ నిశ్శబ్ద వాతావరణంలో గోదావరి ప్రవాహ శబ్దం, ఇసుక తిన్నెలు, వెన్నెల అందాలను ఆస్వాదించాలంటే వెదురు హట్స్‌ల్లో రాత్రి వేళ బస చేయాల్సిందే. పశ్చిమగోదావరి జిల్లాలోని సిరివాక అనే గ్రామం వద్ద పర్యాటకుల కోసం హట్స్ ఉన్నాయి. గుడారాలలో ఒక్కొక్కరికి రూ.4 వేలు, వెదురు కాటేజీల్లో అయితే రూ.5,500గా ధర నిర్ణయించారు. ఉదయం పోచవరం నుంచి వెళ్లి.. రాత్రికి సిరివాకలో బస చేయిస్తారు. అనంతరం మర్నాడు సాయంత్రానికి పోచవరానికి లాంచీలో చేరుస్తారు. రెండు రోజుల పాటు భోజన వసతి, ఇతర సౌకర్యాలను నిర్వాహకులే చూసుకుంటారు. ఈ టికెట్లు కూడా భద్రాచలంలో అందుబాటులో ఉంటాయి.

పటిష్టమైన రక్షణ

ఏపీలోని కచ్చులూరు లాంచీ ప్రమాదం అనంతరం పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చేశారు. అన్ని బోట్లకు అనుసంధానం చేసిన శాటిలైట్ ఫోన్లు, వాకీటాకీలు, వాటిని నియంత్రించే బోటింగ్ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు పోలీసు, అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, పర్యాటక శాఖ అధికారులు.. పర్యాటకుల ధ్రువీకరణ పత్రాలను సరిపోల్చిన తరువాతే బోటులోకి అనుమతిస్తారు. బోటులో లైఫ్ జాకెట్లు, ఇతర రక్షణ సామగ్రిని సిద్ధంగా ఉంచుతున్నారు.


పోచవరంలోని ఫెర్రీ పాయింట్ వద్ద బోట్లు

ఆహారం

ఉదయం యాత్ర ప్రారంభమయ్యే సమయంలో అల్పాహారం, టీ అందిస్తారు. మధ్యాహ్న సమయాన బోటులోనే శాఖాహార భోజనంతో ఆతిథ్యాన్ని అందిస్తారు. సాయంత్రం యాత్ర ముగిసిన తరువాత మళ్లీ బోట్ పాయింట్ వద్ద స్నాక్స్, టీ అందజేస్తారు. పాపికొండల ప్రయాణంలో కొల్లూరు, సిరివాక, పోచవరం వద్ద 'బొంగు చికెన్'అమ్ముతారు.



ఆకట్టుకునే వెదురు బొమ్మలు

పేరంటాలపల్లి దగ్గర గిరిజనులు తయారు చేసిన వెదురు బొమ్మలు, వస్తువులు ఆకట్టుకుంటాయి. రూ.50 నుంచి రూ.300 వరకు ధరల్లో ఇవి లభిస్తాయి.




పీవీ ఘాట్‌లో పీవీకి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క

పీవీ భూ సంస్కరణలు విప్లవాత్మకం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

- సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- పీవీ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖుల నివాళి

రాంగోపాల్‌పేట్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞాన భూమి వద్ద పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. 'పీవీ నరసింహారావు మంచి సాహితీవేత్త, సంఘ సంస్కర్త, పాలనా దక్షుడు. పీవీ ప్రధానమంత్రిగా చేపట్టిన భూ సంస్కరణలు దేశంలోనే విప్లవాత్మకమైనవి. కేంద్ర మంత్రిగా పీవీ నరసింహారావు విద్యావ్యవస్థను గాడిన పెట్టి ప్రపంచంతో మన విద్యార్థులు పోటీపడేలా తయారు చేసిన గొప్ప మేధావి. అలాగే ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి ఎంతో మంది పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందేలా చేశారు. గ్లోబలైజేషన్, లిబరలైజేషన్‌లతో ఆర్థిక రంగ సంస్కరణలు తీసుకొచ్చి మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంతో పోటీపడేలా పటిష్టపరిచారు'అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధికార, అనధికార ప్రముఖులు హాజరై ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ వాణిదేవి, బండా ప్రకాశ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీపీ రాంచందర్‌రావు, మాజీ ఎంపీ కేశవరావు, పొన్నాల లక్ష్మయ్య, వేణుగోపాలాచారి, వకులాభరణం కృష్ణమోహన్ తదితరులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

ఆర్థిక సంస్కరణలతో..: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేశం క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నపుడు భారత ప్రధానిగా అనేక రకాల ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి పటిష్ట పరిచారు. మారుమూల గ్రామంలో జన్మించి తన మేధాశక్తితో అత్యుత్తమ స్థాయికి చేరుకున్నారు. ప్రధాని మోదీ పీవీకి దేశంలోనే అత్యుత్తమ అవార్డును అందించి ఆయన చరిత్రను ముందుకు తీసుకుని వచ్చారు.

నేడు పేదలకు ఫలాలు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నాడు పీవీ నరసింహారావు చేసిన భూ సంస్కరణలతో నేడు పేదలు ఒక ఎకరం, రెండు ఎకరాల భూములు సాగు చేసుకుంటున్నారంటే ఆయన పుణ్యమే. అలాగే పేదవాడు రెసిడెన్షియల్, నవోదయ స్కూళ్లలో చదువుతున్నాడంటే నాడు పీవీ మానవ వనరుల మంత్రిగా చేసిన కృషి కారణం. అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నమైనా మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటానికి కారణం ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు.

పీవీ అందరివాడు: మంత్రి పొన్నం ప్రభాకర్

మారుమూల గ్రామంలో జన్మించిన పీవీకి ప్రపంచ గుర్తింపు వచ్చింది. పీవీ నరసింహారావు అందరివాడు. ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ నేటి యువత మంచి మార్గంలో నడవాలి. భారత ఆర్థిక వ్యవస్థ మొదటి స్థానంలో ఉండాలని ఆనాడు ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చారు. రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పీవీని ఆదర్శంగా తీసుకోవాలి.



అసెంబ్లీలో పీవీకి ఘనంగా నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతిని శాసనసభ భవనం మెంబర్స్ లాంజ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాశ్, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, లెజిస్లేటివ్ సెక్రటరీ వి.నరసింహాచార్యులు, అధికారులు నివాళులర్పించారు.

వ్యవసాయాన్ని నాశనం చేసిందే బీఆర్ఎస్

- ఏనాడూ రైతుబంధును పూర్తిగా అమలుచేయలేదు
- ఇప్పుడు రైతులకు లేఖల పేరుతో నాటకాలు: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రంలో రైతుల సంక్షేమాన్ని, వ్యవసాయాభివృద్ధిని అటకెక్కించిన బీఆర్ఎస్ నాయకులు.. రైతులకు లేఖల పేరుతో మాయమాటలు చెప్పి కొత్త నాటకాలకు తెరతీస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు విమర్శించారు. రైతుబంధులో కూడా రూ.21 కోట్లు దుర్వినియోగం చేసిన వాళ్లు.. ఇప్పుడు సాగులో ఉన్న భూమికే రైతుబంధు ఇద్దామంటే ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు బహిరంగలేఖ పేరుతో ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాసిన లేఖపై మంత్రి తుమ్మల సోమవారం ఒక ప్రకటనలో విమర్శలు గుప్పించారు. '2018లో 20 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టిన మాట వాస్తవం కాదా? 2019–20లో రెండు పంట కాలాల్లో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో రైతుబంధు ఇవ్వలేదు. 2023 యాసంగి రైతుబంధు రూ.7,600 కోట్లు ఎగ్గొట్టింది. రైతుబంధు పేరు చెప్పి వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, సబ్సిడీపై డ్రిప్ వంటి ఎన్నో పథకాలను అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వ పథకాలైన రాష్ట్ర కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రత మిషన్లకు రాష్ట్ర వాటా సొమ్ము విడుదల చేయకుండా దాదాపు రూ.3,005 కోట్లు రాష్ట్రానికి రాకుండా చేసింది. రుణమాఫీకి ఆ పేరు పెట్టడం కంటే వడ్డీ మాఫీ అని పెడితే బాగుండేదేమో'అని ధ్వజమెత్తారు.

కోతులతో భయం.. కొండముచ్చుతో ఉపాయం



చిట్యాల: కోతుల బెడదను నివారించేందుకు.. కొండముచ్చుల ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో కోతుల నుంచి రక్షణ పొందేందుకు ఆ గ్రామానికి చెందిన అవనగంటి మహేశ్ వినూత్నంగా ఆలోచించారు. తన ఇంటిపై కొండముచ్చు(కొండెంగ) ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారు. రూ.2 వేల ఖర్చుతో ఎనిమిది కొండముచ్చు బొమ్మలతో ఫ్లెక్సీలు చేయించి తన ఇంటి చుట్టూ ఏర్పాటు చేసుకున్నారు. కొండముచ్చు బొమ్మలను చూసిన కోతులు ఇంట్లోకి రావడం లేదు.


పెద్దకాపర్తిలో ఇంటికి కట్టిన కొండముచ్చు ఫ్లెక్సీ

తమిళ నటులకున్న సామాజిక స్పృహ తెలుగు నటులకు లేదా?

ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తమిళ నటులకు ఉన్న సామాజిక స్పృహ తెలుగు నటులకు ఎందుకు లేదని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించారు. ఏదైనా సాయం అవసరమైనప్పుడు బాలీవుడ్ నటుడు సోనూసూద్ ప్రజలకు గుర్తుకు వస్తారు కానీ తెలుగు నటులు ఎందుకు గుర్తుకు రారని నిలదీశారు. దివిసీమలో వరదలు వచ్చినప్పుడు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు జోలె పట్టుకుని ఊరూరా తిరిగారని, ఇప్పటి కాలం నటుల్లో చిరంజీవి మినహా ఎవరూ ప్రజలకు ఎలాంటి సాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి లింగం యాదవ్‌లతో కలిసి మాట్లాడుతూ, తామెంతో గొప్పవాళ్లమని విర్రవీగే సినీనటులు ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. ఎవరైనా పాఠశాలలను, ఆసుపత్రులను దత్తత తీసుకుని పోషిస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కోసం యువకులు బలిదానాలు చేసుకుంటుంటే సినీ నటులు చేతులు ముడుచుకుని కూర్చున్నారని విమర్శించారు. ప్రజల కష్టం మీద కోట్ల రూపాయలు సంపాదించుకునే సినీ నటులది రాతి హృదయమని, ప్రజలకు సాయం చేసే విషయంలో సమంత, మంచు లక్ష్మి ఎంతో ఆదర్శంగా ఉంటారని యెన్నం చెప్పారు.

ఇంకెన్నాళ్లిలా సాగదీత

విభజన సమస్యల పరిష్కారంపై లోపించిన చిత్తశుద్ధి

- మొక్కుబడిగా ఇరు రాష్ట్రాల వాదనలు
- కేంద్రం ఆదేశాల మేరకు విద్యుత్ బకాయిలు రూ.7 వేల కోట్లు ఇవ్వాలన్న ఏపీ
- కాదు మాకే రూ.26 వేల కోట్లు ఇవ్వాలంటున్న తెలంగాణ
- లేక్‌వ్యూతో పాటు మరికొన్ని భవనాలు కేటాయించాలంటున్న ఏపీ
- సాధ్యం కాదని, అవసరమైతే స్థలం కేటాయిస్తామని తెగేసి చెప్పిన తెలంగాణ
- ఇటీవల ఏమీ తేల్చకుండానే ముగిసిన ఉభయ రాష్ట్రాల సీఎస్‌ల సమావేశం
- ఇలాగైతే సమస్యల పరిష్కారం ఎప్పటికీ సాధ్యం కాదంటున్న అధికారులు



సాక్షి, అమరావతి : విభజన సమస్యల పరిష్కారానికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల నేతృత్వంలో ఇటీవల జరిగిన అధికారులతో కూడిన సమావేశం తీరు తెన్నూ లేకుండా సాగింది. దీంతో సమస్యల పరిష్కారం ఇప్పట్లో సాధ్యం కాదనే అభిప్రాయాన్ని అధికార వర్గాలు వ్యక్తం చేశాయి. కాలికేస్తే.. వేలికి, వేలి కేస్తే కాలుకన్న చందంగా ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు సాగాయని, ప్రధాన సమస్యల పరిష్కారంపై ఇరు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణికి భిన్నంగా సమస్యలను మరింత జటిలం చేశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. గ్రూప్–4, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల విషయంలో తప్ప మిగతా ప్రధాన అంశాలపై ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రాలేదని, ఎవరి వాదనలకు వారు కట్టుబడి ఉన్నారనే అభిప్రాయాన్ని ఉన్నతాధికారి ఒకరు వ్యక్తం చేశారు. ఈ ఏడాది మే 7వ తేదీన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమావేశమై విభజనకు సంబంధించి ఆస్తులు, నగదు పంపిణీ, బకాయిల చెల్లింపులపై చర్చించారు. ఆ సమావేశంలో సమస్యల పరిష్కారానికి ఇరు రాష్ట్రాల అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఇటీవల మంగళగిరిలో ఇరు రాష్ట్రాల అధికారుల కమిటీ సమావేశమై చర్చలు జరిపినప్పటికీ ఏ సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిసింది. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ డిస్కంలు.. ఆంధ్రప్రదేశ్ డిస్కంలకు చెల్లించాల్సిన విద్యుత్ సరఫరా బకాయిలు రూ.7,230 కోట్ల గురించి కూడా గట్టిగా అడగలేదని సమాచారం. వెంటనే ఈ బకాయిలు ఆంధ్రప్రదేశ్‌కు చెల్లించాల్సిందేనని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణకు ఆదేశాలు జారీ చేయించిన విషయం తెలిసిందే.

ఈ విషయంపై తెలంగాణ ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. పైగా ఈ బకాయిల ప్రస్తావన వచ్చినప్పుడు.. తెలంగాణకే రూ.26 వేల కోట్ల విద్యుత్ బకాయిలు ఏపీ చెల్లించాలనే వాదనను తెలంగాణ అధికారులు తెచ్చారని తెలిసింది.

అంగీకారం కుదిరిన వాటిపై ఎందుకు నిర్ణయం తీసుకోరు?

- 9, 10వ షెడ్యూల్‌లో మొత్తం 95 సంస్థలు ఉంటే.. 53 సంస్థలపై రెండు రాష్ట్రాలకు అంగీకారం ఉంది. మిగిలిన వాటిపై ఇరు రాష్ట్రాలకు అభ్యంతరాలున్నాయి. అయితే అంగీకారం కుదిరిన సంస్థల ఆస్తులు, నగదు పంపిణీపై ఇరు రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోకుండా, అన్ని సంస్థలకు చెందిన సమస్యలు పరిష్కారం అయ్యాకే తుది నిర్ణయాలు తీసుకోవాలనే ధోరణిలో అధికారులున్నారు.
- ఉమ్మడి రాష్ట్రంలోని ఆస్తుల వివాదంపై కేంద్రం నియమించిన షీలా బీడీ కమిటీ పలు సిఫార్సులు చేసింది. వాటిపై అనేక దఫాలుగా పదేళ్లుగా చర్చలు జరిగినా ఇరు రాష్ట్రాలు ఒక అభిప్రాయానికి రాలేకపోయాయి. 2014 విభజన చట్టం ప్రకారం కొన్ని భవనాలు ఏపీ కోసం హైదరాబాద్‌లో కేటాయించారని, అవి పదేళ్లపాటు వారి ఆధీనంలో కొనసాగుతాయని పేర్కొన్నారని, జూన్ 2వ తేదీతో ఆ గడువు ముగిసినందున గతంలో కేటాయించిన భవనాలు పూర్తిగా తెలంగాణకే వర్తిస్తాయని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు.
- అయితే లేక్‌వ్యూ అతిథి గృహం, లక్డీకాపూల్‌లోని పోలీసు భవనాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాల్సిందిగా ఏపీ అధికారులు చేసిన ప్రతిపాదనలను తెలంగాణ అధికారులు తిరస్కరించారు. భవనాలు కేటాయించడం సాధ్యం కాదని తేల్చి చెప్పినట్లు అధికార వర్గాలు తెలిపాయి. తెలంగాణలో భవనాలు నిర్మించుకోవాలంటే ఆంధ్రప్రదేశ్‌కు స్థలం కేటాయిస్తామని, భవనాలు కట్టుకోవాలని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు.
- గెజిటెడ్ ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు రావాలని కోరుకుంటున్నప్పటికీ తీసుకోవడం సాధ్యం కాదని తెలంగాణ అధికారులు స్పష్టం చేశారు. ఒకవేళ తీసుకుంటే తెలంగాణలో పని చేస్తున్న ఉద్యోగుల పదోన్నతులపై ప్రభావం పడుతుందని తెలిపారు. నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులను ఇరు రాష్ట్రాలు మార్చుకోవడానికి గతంలోనే నిర్ణయాలు తీసుకున్నా పూర్తి స్థాయిలో అమలు చేయలేదు.
- 'దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్'(దిల్)కు హైదరాబాద్ నగరం చుట్టుపక్కల దాదాపు నాలుగు వేల ఎకరాల భూములున్నాయి. ఆ భూముల్లో తమకు వాటా కావాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు ప్రతిపాదించారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి రాష్ట్రంలో ‘దిల్’ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైనందున అందులో తమకు వాటా రావాల్సిందేనని ఏపీ వాదిస్తోంది.

క్లుప్తంగా...

అర్హత లేనివారిని జేఎల్స్‌గా ఎలా నియమిస్తారు?

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

సాక్షి, అమరావతి: నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనలకు విరుద్ధంగా సర్వీసులో ఒక్కసారి కూడా పాఠాలు చెప్పని నాన్ టీచింగ్ సిబ్బందికి గెజిటెడ్ హోదా గల జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతులు ఎలా కల్పిస్తారని నవ్యాంధ్ర టీచర్స్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వెంటనే ఈ ప్రక్రియను నిలిపివేయాలని సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాగా, జీవో 302 ప్రకారం జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో 40 శాతం పదోన్నతులను ప్రభుత్వ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

పాఠశాల విద్య సిబ్బందినే ఏపీసీలుగా నియమించాలి

సాక్షి, అమరావతి: సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లుగా పాఠశాల విద్యాశాఖ సిబ్బందినే నియమించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాలకు ఏపీసీలను ప్రభుత్వం నియమించిందని, వారిలో ఒక్కరూ పాఠశాల విద్యకు చెందిన వారు లేకపోవడం శోచనీయమని సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎస్సీ ఫైనాన్స్ యాక్షన్ ప్లాన్ అమలుకు కమిటీలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ) లిమిటెడ్–పీఎం అజయ్ యాక్షన్‌ప్లాన్ అమలుకు పలు కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ–పీఎం అజయ్ యాక్షన్‌ప్లాన్ 2023–24, 2024–25కు సంబంధించిన ప్యాసింజర్ ఆటోలు, వ్యవసాయ యంత్ర పరికరాలు పవర్ స్ప్రేయర్, మోటార్ ఇంజన్లు, బోర్ డ్రిల్లర్లు, మోటార్ రివైండింగ్ మెషీన్ వంటి వాటిని ఇ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా సేకరించే విషయంలో కమిటీలు పర్యవేక్షించాల్సి ఉంది. ఈ ప్రొక్యూర్‌మెంట్ సంస్థల నుంచి వచ్చే టెండర్ల పరిశీలన (డ్రాఫ్ట్ ప్రిపరేషన్), ఆమోదం, మదింపు వంటి కేటగిరీ వారీగా ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్‌గా కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

బ్యాంకుకే టోకరా

సీతమ్మధార: ఒక ఘరానా మోసగాడు బ్యాంకుకే టోకరా వేశాడు. బ్యాంక్ లోన్ లేకుండానే ఉన్నట్లు నమ్మించి మరో బ్యాంక్ నుంచి డబ్బులు కాజేసిన ఘటన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపురం ప్రాంతానికి చెందిన తమరాన చిరంజీవి(40), మరో వ్యక్తితో కలిసి సోమవారం సీతంపేట ప్రాంతంలో ఉన్న సీఎస్‌బీ బ్యాంక్‌కు వెళ్లాడు. తనకు సుజాతనగర్‌లో ఉన్న ఫెడరల్ బ్యాంక్‌లో బంగారు ఆభరణాలు తాకట్టులో ఉన్నాయని, అది రిలీజ్ చేస్తే ఆ బంగారాన్ని సీఎస్‌బీ బ్యాంక్‌లో తాకట్టు పెడతానని సిబ్బందికి చెప్పాడు. దీంతో సీఎస్‌బీ బ్యాంక్ సిబ్బంది చిరంజీవికి సంబంధించిన ఫెడరల్ బ్యాంక్ అకౌంట్‌కు రూ.14.69 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో చిరంజీవి ఫెడరల్ బ్యాంక్‌కు వెళ్లి ఆ డబ్బు విత్‌డ్రా చేసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత తమను మోసం చేశాడని గ్రహించిన సీఎస్‌బీ బ్యాంక్ సిబ్బంది ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఫొటోలను రిలీజ్ చేసి ఆచూకీ తెలిస్తే ద్వారకా సీఐ 7995093604, ఎస్‌ఐ ధర్మేంద్ర 8555813894 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ప్రతి ఒక్కరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సామర్లకోట: మారుతున్న కాలంలో ప్రతి విద్యార్థి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు కేవీవీ సత్యనారాయణ అన్నారు. గణిత దినోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

చెరువుల్లోనూ సుస్థిర వ్యవసాయం చేయడం ద్వారా గిరి రైతులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా చింతూరు ఐటీడీఏ కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిలో భాగంగా ఉత్తర భారత దేశానికి మాత్రమే పరిమితమైన మఖానా సాగును ఈ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే సాధ్యాసాధ్యాలపై నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానాకు చెందిన శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు వారు ప్రాథమికంగా నిర్ధారించారు.



రైతులతో మాట్లాడుతున్న నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానా శాస్త్రవేత్తలు

గిరి చెంతన జల పంట

పైలట్ ప్రాజెక్ట్‌గా మఖానా సాగుకు చింతూరు ఐటీడీఏ కసరత్తు

- పూల్ మఖానాతో సుస్థిర సేద్యం
- గిరి రైతులకు అదనపు ఆదాయం
- చింతూరు ఐటీడీఏ ప్రణాళికలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానా శాస్త్రవేత్తలు
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- అనుకూలంగా వాతావరణ పరిస్థితులు
- మట్టి, నీటి శాంపిళ్ల సేకరణ
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన నిపుణులు

చింతూరు: నిరుపయోగంగా ఉన్న చెరువులు, కుంటలను వినియోగంలోకి తెచ్చి గిరి రైతులకు ఆదాయ వనరుగా మార్చేందుకు అల్లూరి జిల్లా చింతూరు ఐటీడీఏ అడుగులు వేస్తోంది. డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల్లో నిరుపయోగంగా ఉన్న చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి అనుబంధంగా పూల్ మఖానా సాగు చేపట్టేందుకు సంకల్పించింది. ఇప్పటికే చింతూరు డివిజన్లో మఖానా సాగు సాధ్యాసాధ్యాలను నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఇందుశేఖర్ సింగ్, డాక్టర్ పడాల వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సాగుకు కీలకమైన గాలి, ఉష్ణోగ్రత, వర్షపాతం అనుకూలంగా ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలను పరిశీలించారు. స్థానిక గిరిజన రైతులతో కూడా మాట్లాడారు. ఇక్కడి చెరువులు, కుంటల్లోని మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల నివేదిక ఆధారంగా ఈ ప్రాంతంలో మఖానా సాగు చేపట్టేందుకు వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థిరమైన శాశ్వత నీటి వనరుల్లో..

మఖానా అనేది జలపంట. దీనిని సాధారణంగా పూల్ మఖానా, గోర్గాన్ నట్ అని కూడా పిలుస్తుంటారు. ఇది సరస్సులు, చెరువులు, చిత్తడి నేలలు, కుంటల వంటి స్థిరమైన శాశ్వత నీటి వనరుల్లో పెరుగుతుంది. తేలియాడే ఆకులతో మెత్తని ఆకృతి, ప్రకాశవంతమైన నీలిరంగు, స్టార్చ్‌వైట్ గింజలతో ఉత్పత్తి చేస్తుంది. చూసేందుకు తామర ఆకులను పోలిఉండటంతో దీనిని అందరూ తామర పంటగానే భావిస్తారు. తామర ఆకు మృదువుగా ఉంటే మఖానా ఆకు మాత్రం పైకి ముళ్ల మాదిరిగా కనిపిస్తుంది. ప్రతి మొక్క 15 నుంచి 20 పండ్లను ఉత్పత్తి చేస్తుంది. ఇవి గుండ్రంగా మెత్తగా ఉంటాయి. ప్రతి పండులో 20 నుంచి 200 గింజల వరకు ఉంటాయి. మార్కెట్లో వీటి ధర కిలో రూ.800 నుంచి రూ.1200 వరకు ఉంటుంది. మఖానా పంట సగటు దిగుబడి హెక్టారుకు 1.4 నుంచి 1.6 టన్నుల వరకు ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మఖానాలో ఉన్న ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్, విటమిన్లు వల్ల జీర్ణవ్యవస్థ మెరుగు, బరువు తగ్గడం, మెదడు పనితీరు మెరుగు పరచడం, గుండె సంబంధిత వ్యాధులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. మఖానాను నేరుగా తినడంతో పాటు వంటకాల్లో ఉపయోగించడం వల్ల స్థానికంగా మార్కెటింగ్ అందుబాటులో ఉంటుంది.

ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు



దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మఖానా సాగును ప్రోత్సహిస్తున్నాం. దీనిలో భాగంగా ఇటీవల ఆంధ్రాలోని చింతూరు ఐటీడీఏ పరిధిలో పర్యటించాం. సాగులో కీలకమైన ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతుండాలి. మట్టి, నీరు కూడా పంట దిగుబడులపై ప్రభావం చూపిస్తాయి. చింతూరు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కావడాన్ని గుర్తించాం. సాగుకు అనుకూల పరిస్థితులపై కసరత్తు ప్రారంభించాం. దీనిలో భాగంగానే మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాం.

– డాక్టర్ ఇందుశేఖర్ సింగ్, శాస్త్రవేత్త, నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానా

ఆర్థిక పరిస్థితి మెరుగుకు దోహదం



మఖానా సాగు గిరి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుకు దోహదపడుతుందని భావిస్తున్నాం. చేపల పెంపకం చేపట్టే చెరువుల్లోనే వాటికి అనుబంధంగా మఖానాను కూడా సాగు చేయవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్రాంతంలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతలు సాగుకు అనుకూలిస్తాయని ఆశిస్తున్నాం. దీనిలో భాగంగానే శాస్త్రవేత్తలు ఇటీవల ఈప్రాంతంలో పర్యటించారు. ల్యాబ్ నివేదిక రాగానే వారు సాగుకు క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. రైతులకు అవగాహన కల్పించి తరువాత శిక్షణ ఇస్తాం.

– అపూర్వభరత్, ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ, చింతూరు







పూల్ మఖానా సాగు, దిగుబడి (ఫైల్)

ప్రభుత్వ నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌లని భాగస్వాముల్ని చెయ్యాలి

డీటీసీపీకి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ విజ్ఞప్తి



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో చేపడుతున్న ప్రభుత్వ పరమైన భవన నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌లను భాగస్వాములుగా చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్(ఐఐఏ) విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అదనపు డైరెక్టర్ బి.శ్రీనివాసుల్ని ఏపీ ఆర్కిటెక్ట్‌ల బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. భవన నిర్మాణాలపై త్వరలో రానున్న ప్రభుత్వ ఉత్తర్వుల ముసాయిదాకు సంబంధించి కొన్ని ముఖ్యమైన సూచనలు, అభ్యర్థనలను బృంద సభ్యులు సమర్పించారు. రాష్ట్రంలో సమాంతర అభివృద్ధి కోసం ఆర్కిటెక్ట్‌ల పాత్రను తప్పనిసరి చేయాలంటే గ్రూప్ హౌసింగ్, పారిశ్రామిక సముదాయాలు, హాస్పిటల్స్, పర్యాటక అభివృద్ధి వంటి నిర్మాణాల అనుమతుల ప్రక్రియలో ఆర్కిటెక్ట్‌లను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. 500 చ.మీటర్లు పైబడిన ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి, వాటి భద్రత, నాణ్యత, డిజైన్ సమగ్రతల దృష్ట్యా ఆర్కిటెక్ట్‌ల ప్రమేయం తప్పనిసరి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీటీసీపీ.. ఆర్కిటెక్ట్‌ల సూచనలు, సలహాల్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తాము చేసిన ప్రతిపాదనలు ఆర్కిటెక్ట్‌ల పాత్రను కాపాడటమే కాకుండా ఏపీలో సుస్థిరమైన పట్టణాభివృద్ధికి దోహదపడతాయని రాజేష్ అన్నారు. ఏకీకృత రిజిస్ట్రేషన్ విధానంతో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీవోఏ) రిజిస్ట్రేషన్ స్టేటస్‌తో అనుసంధానించిన ఎలాంటి ఇబ్బందుల్లేని లాగిన్ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఐఏ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

3 కిలోల గంజాయి స్వాధీనం, కారు సీజ్



గుంతకల్లుటౌన్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి రైలు ద్వారా అక్రమంగా గంజాయిని దిగుమతి చేసుకుని..దాన్ని కారులో బళ్లారికి తరలిస్తున్న నలుగురిని అనంతపురం జిల్లా గుంతకల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ బి.మనోహర్ వివరాలు వెల్లడించారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 08 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 77,260 మంది స్వామివారిని దర్శించుకోగా 24,223 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

భక్తిశ్రద్ధలతో కాలభైరవునికి పూజలు



సామర్లకోట: కాల భైరవ అష్టమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కాలభైరవ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసంలో వచ్చే తొలి అష్టమిని కాలభైరవ అష్టమిగా జరుపుకొంటున్నారు. ఈ మేరకు కాలభైరవ స్వామి ఆలయాన్ని పూలతో అలంకరించారు. శివుడిని దర్శించుకునే ముందుగా కాలభైరవ స్వామిని దర్శించుకోవాల్సిన ఉంటుంది. దీనిలో భాగంగానే ఆలయంలో ప్రవేశించగానే కాలభైరవ స్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం భక్తులు తీసుకొని వచ్చిన గారెలు, పూల దండలతోను పట్టు వస్త్రాలతోను అలంకరణ చేశారు.

సత్యదేవుని ఆలయం కిటకిట



అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని ఆలయానికి సోమవారం భారీగా భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్న నవదంపతులు, వారి బంధుమిత్రులతో కలిసి సత్యదేవుని ఆలయానికి వచ్చారు. వీరంతా స్వామివారి వ్రతాలాచరించి దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లు భక్తులతో నిండిపోయాయి. 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి.

విద్యా సమాచారం

ఉత్తమ ర్యాంక్ సాధనే లక్ష్యం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ జాతీయ స్థాయిలో 20225లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని వీసీ ప్రొఫెసర్ వీ.ఉమ పిలుపునిచ్చారు. సోమవారం వర్సిటీలో నేషనల్ ర్యాంకింగ్–2025 కీలక మార్పులు, సవాళ్లు అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

వ్యవసాయ రంగంపై మొగ్గు చూపాలి



తిరుపతి సిటీ: యువత వ్యవసాయ రంగంపై మొగ్గు చూపాలని వీసీ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్వీయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వర్సిటీ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన చౌదరిచరణ్‌సింగ్ జయంతిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చరణ్‌సింగ్ రైతులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని కేంద్రం జాతీయ రైతు దినోత్సవంగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యమకారుడు గంగాధర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, నాగలక్ష్మి, విజయ, కామాక్షి పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యతోనే లక్ష్యం సాధ్యం



తిరుపతి సిటీ: విద్యార్థులు నైపుణ్యంతో కూడిన విద్యను అందిపుచ్చుకున్నప్పుడే జీవిత లక్ష్యాన్ని సాధించొచ్చని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. సోమవారం వర్సిటీ సెనేట్ హాల్‌లో గిరిజన నవ సమాజ్ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్యా శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించడానికి రూ.1,215 కోట్లను ప్రభుత్వం వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఎస్వీయూ పరిధిలో కూడా 20వేల చదరపు అడుగుల స్థలాన్ని ఇందుకోసం సమకూర్చామన్నారు.

వింటర్ & వాటర్

బ్రెయిన్ ఫైన్



చలికాలంలో మామూలుగా ఇతర ఆరోగ్య సమస్యలు చాలానే వస్తుంటాయి. ఉదాహరణకు చర్మం పొడిబారే ఆటోపిక్ డర్మటైటిస్‌లూ-అలర్జీలు, దెబ్బ కొద్దిదే అయినా నొప్పి పెద్దదే అనిపించే బాధలు ఇవన్నీ కనిపిస్తాయి. ఇవన్నీ చాలా చిన్న సమస్యలు. కానీ మెదడుకు ఏదైనా సమస్య వస్తే అది చాలా పెద్దది. అలాంటి వాటిల్లో ఈ సీజన్‌లో వచ్చేది ఒకటుంది. అదే 'సెరెబ్రో వాస్కులార్ యాక్సిడెంట్', సంక్షిప్తంగా దీన్ని 'సీవీఏ'గా చెబుతారు. సెరిబ్రో వాస్కులార్ యాక్సిడెంట్ (సీవీఏ) అంటే ఏమిటీ, దాని పర్యవసానాలేమిటి, దాని నివారణ ఎలా, చికిత్సలేమిటి వంటి అనేక అంశాలను పరిశీలిద్దాం.

చలికాలంలో కొన్ని సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. ఉదాహరణకు ఈ సీజన్‌లో చిన్న దెబ్బ తగలగానే చర్మం ఉపరితలంలో రక్తనాళాలు కుంచించుకుపోయి రక్తప్రసరణ తగ్గడం (వాసో కన్‌స్ట్రిక్షన్) కారణంతోనూ అలాగే చర్మంలో ఉండే నాడీ కణాలు మరింత ఎక్కువగా పనిచేయాల్సి రావడంతో చిన్న దెబ్బకైనా నొప్పి తీవ్రంగా వస్తుంటుంది. కానీ ఇది ఎంతమాత్రమూ ప్రాణాపాయం కాదు... అయితే సెరెబ్రో వాస్కులార్ యాక్సిడెంట్స్ అనేవి పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్), మెదడులో రక్తస్రావం (బ్రెయిన్ హేమరేజ్) వంటి తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడతాయి. ఒక్కోసారి ప్రాణాంతకంగానూ మారవచ్చు.


సెరెబ్రో-వాస్కులార్ యాక్సిడెంట్స్ సమస్య ఎందుకొస్తుంది?

ఈ సీజన్‌లో వాతావరణంలో తేమ (హ్యూమిడిటీ) తగ్గిపోవడంతో దాన్ని భర్తీ చేసుకునేందుకు వాతావరణం... మన శరీరంలోని తేమను లాగేస్తుంది. నిజానికి ఈ కారణం వల్లనే చర్మంపొడిబారడం, గీరితే చారలు పడటం జరుగుతుంటాయి. వాతావరణం బాగా చల్లగా ఉండటంతో నీళ్ల తాగడమూ తగ్గిపోతుంది. ఇంకా సాయంత్రాలు, రాత్రుళ్లు, తెల్లవారుఝామున బాగా చల్లగా ఉండటంతో చర్మం వరకు సరఫరా అయ్యేందుకు రక్తం వేగంగా ప్రవహించాల్సి వస్తుంది. ఈ కారణాలతో దేహంలో రక్తపోటు పెరుగుతుంది. ఇలా రక్తం వేగంగా ప్రవహించడమనే అంశం మెదడులో రక్తస్రావానికి (బ్రెయిన్ హేమరేజ్)కి కారణం కావచ్చు. ఇక ముందుగా చెప్పుకున్నట్లు వింటర్‌లో వాతావరణం చల్లగా ఉండటం వల్ల నీళ్ల తాగడమూ తగ్గుతుంది. దాంతో రక్తంలో గాఢత పెరుగుతుంది. ఫలితంగా రక్తనాళాల్లో రక్తపు ఉండలు (క్లాట్స్) పెరుగుతాయి. ఈ క్లాట్స్ రక్తప్రవాహాన్ని అడ్డుకోవడంతో కొన్నిసార్లు మెదడులో రక్తస్రావం (బ్రెయిన్ హేమరేజ్), మరికొన్ని సార్లు మెదడులో కీలకమైన భాగాలకు రక్తం అందక పక్షవాతం రావచ్చు. (ఇవే క్లాట్స్ గుండెకు సరఫరా చేసే రక్తనాళాల్లో వస్తే గుండెపోటు వచ్చే ప్రమాదమూ ఉండనే ఉంటుంది). దీనికి తోడు 'సీవీఏ' ప్రమాదాన్ని మరింత పెంచడానికి డయాబెటిస్, హైబీపీ, హై కొలెస్ట్రాల్, మూత్రపిండాల జబ్బులు, పొగతాగే అలవాటు వంటి మరి కొన్ని అంశాలూ కారణమవుతాయి. వెరసి ఇవన్నీ మెదడుకు చేటు తెస్తాయి.

మెదడులో ఏయే ప్రాంతాల్లో అనర్థాలు, ఏ రకంగా వచ్చాయనే అంశం ఆధారంగా 'సీవీఏ'ని రెండు రకాలుగా చెప్పవచ్చు. మెదడులో రక్తనాళం చిట్లి రక్త

'సీవీఏ' అనర్థాలు రెండు విధాలు...

స్రావమైతే దాన్ని ఇంట్రాసెరెబ్రల్ హేమరేజ్ (ఐసీహెచ్) అని, మెదడులోని రక్తనాళాల్లో రక్తపు ఉండలు ఏర్పడటం వల్ల పక్షవాతం వస్తే దాన్ని ఇస్కిమిక్ స్ట్రోక్ అని అంటారు.



లక్షణాలు...

● తల తిరగడం (డిజ్జీనెస్), కొన్నిసార్లు వాంతులు ● తలలో తీవ్రమైన నొప్పి ● పూర్తిగా స్పృహ కోల్పోవడం

ఇవేగాక మరి కొన్ని లక్షణాలను (బీఈఎఫ్ఏఎస్‌టీ) అనే ఇంగ్లిష్ అక్షరాలతో సూచించవచ్చు. ఈ అక్షరాలను కలిపి తేలిగ్గా గుర్తుంచుకోడానికి వీలుగా 'బీఫాస్ట్' అని పేర్కొనవచ్చు. ఈ అక్షరాలు వరసగా ఈ కింద పేర్కొన్న లక్షణాలను కనబరుస్తాయి...

● బీ ఫర్ బ్యాలెన్స్ ... అంటే బ్యాలెన్స్ కోల్పోవడం వల్ల సరిగా నడవలేకపోవడం ● ఈ ఫర్ ఐస్ (కళ్లు) అంటే కళ్లు మసకలుగా కనిపించడం ● ఎఫ్ ఫర్ ఫేస్ అంటే... ముఖంలో ఏదో ఒక వైపు జారిపోయినట్లుగా కావడం (పక్షవాతం లక్షణాల్లో ఒకటి) ● ఏ ఫర్ ఆర్మ్స్ (భుజాలు) అంటే రెండు చేతుల్లో ఏదో ఒకటి బలహీనంగా మారడం లేదా పక్షవాతంలోలా చేతులు చచ్చుబడటం ● ఎస్ ఫర్ స్పీచ్ అంటే మాట్లాడలేకపోవడం లేదా మాట ముద్దగా రావడం లేదా మాటపడిపోవడం ● టీ ఫర్ టైమ్ అంటే... అది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాల్సిన అత్యవసరమైన 'టైమ్' అని తెలుసుకునేందుకు ఏర్పరచుకున్నదే ఈ 'బీ ఫాస్ట్'!

నివారణ / చికిత్స...

కొన్నిసార్లు దాదాపు ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టే ఈ 'సీవీఏ'ను నివారించడం చాలా తేలిక. ఈ సీజన్‌లో అన్నిటికంటే ముఖ్యంగా తరచు కొద్దికొద్దిగా నీళ్లు తాగుతూ ఉండాలి. దీనివల్ల శరీరానికి మంచి హైడ్రేషన్ సమకూరుతుంది. దీంతో పాటు...

● తాము ఉండే గది కాస్త వెచ్చగా ఉండేలా చూసుకోవడం ● అన్ని పోషకాలు ఉన్న సమతులాహారాన్ని తీసుకోవడం ● చక్కెరలు చాలా తక్కువగా తీసుకోవడం ● ఉప్పు చాలా పరిమితంగా వాడటం ● సమయానికి టాబ్లెట్లు (డయాబెటిస్, బీపీ, కొలెస్ట్రాల్, గుండెజబ్బుకు వాడే మందులు) తీసుకోవడం ● పొగతాగే అలవాటును పూర్తిగా మానేయడం ● క్రమం తప్పకుండా డాక్టర్ ఫాలో అప్‌కు వెళ్తుండటం.

ఈ సీజన్‌లో మెదడుకు సంబంధించిన ఏ లక్షణం కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా తక్షణం హాస్పిటల్‌కు వెళ్లాలి. అది ప్రాణరక్షణకు ఎంతగానో తోడ్పడుతుంది.



డా. ఎస్.పి. మాణిక్ ప్రభు,
సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్

ఫేస్‌కు గ్రేస్!



చలికాలంలో ముఖం బాగా పొడిబారడం దాంతో ముఖంపై ఉండే ముడతలు మరింత లోతుగా కనిపిస్తూ ఒక్కోసారి ముఖంపైనా పగుళ్లు కనిపించడం చాలా సాధారణంగా కనిపించే సమస్య. ఇక పెదవులు పగలడమైతే ఈ సీజన్‌లో దాదాపుగా అందరిలోనూ ఏదో ఒక సమయంలో కనిపించేదే. ఈ సీజన్‌లో అందరూ సాయంత్రాలు, రాత్రుళ్లు ముఖానికి వ్యాజలైన్ రాస్తూ ఈ సమస్యను అధిగమిస్తుంటారు. అయితే ఈ ఒక్క చిట్కా మాత్రమే కాకుండా ఈ సీజన్ పొడవునా ముఖం బాగా తేటగా, ఆరోగ్యంగా కనిపించడానికి ఏం చేయాలో చూద్దాం.

ఆహారపరమైన జాగ్రత్తలు...

● అన్ని రకాల పోషకాలు అందే సమతులాహారాన్ని రోజు తీసుకోవాలి. అయితే చలి వాతావరణం కారణంగా నీళ్ల తక్కువగా తాగుతుంటారు. ఇది సరికాదు. రోజూ తప్పనిసరిగా మూడు లీటర్లకు తగ్గకుండా నీళ్లు తాగుతుండాలి.

● తాజా ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో దొరికే పండ్లను తప్పక తీసుకోవాలి. ఇందులో ఉండే నీటి మోతాదులూ, పోషకాలూ, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచి ముఖాన్ని తేటగా కనిపించేలా చేస్తాయి.

● డ్రైఫ్రూట్స్ పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. అందులో జీడిపప్పు వంటి కొవ్వులు ఎక్కువగా ఉండే నట్స్ కంటే బాదం పప్పు వంటి కొవ్వులు తక్కువగా ఉండే నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.



తాజా ఆకు కూరలు, కూరగాయలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలి. ఈ సీజన్‌లో దొరికే పండ్లను తప్పక తీసుకోవాలి. ఇందులో ఉండే నీటి మోతాదులూ, పోషకాలూ, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మం ఆరోగ్యాన్ని మెరుగుపరచి ముఖాన్ని తేటగా కనిపించేలా చేస్తాయి. డ్రైఫ్రూట్స్ పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. అందులో జీడిపప్పు వంటి కొవ్వులు ఎక్కువగా ఉండే నట్స్ కంటే బాదం పప్పు వంటి కొవ్వులు తక్కువగా ఉండే నట్స్ ఎక్కువగా తీసుకోవాలి.

ఇతరత్రా జాగ్రత్తలు...

● చలికాలంలో ఉదయం, సాయంత్రం మంచుకురుస్తున్నప్పుడూ, మధ్యాహ్నపు ఎండ వేళలో ముఖానికి ఏదో తీక్షణంగా గుచ్చుతున్న ఫీలింగ్ ఉంటుంది. అందుకే ఇబ్బందికరమైన ఈ ఫీలింగ్‌ను అధిగమించడానికి చలివేళప్పుడు నేరుగా మంచుకు గానీ లేదా మధ్యాహ్నపు సమయంలో నేరుగా ఎండకు గానీ... ముఖం ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. ● ఈ సీజన్‌లో ఉదయపు వేళల్లో మంచూ ఇంకా పొగ ఈ రెండూ కలిసి దట్టమైన కాలుష్యంగా ఏర్పడతాయి. దీన్నే 'స్మాగ్' అంటారు. ఎవరైనా సరే... ఉదయం వేళల్లో స్మాగ్‌లోకి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఉదయమే వాకింగ్ చేసేవారు ఈ స్మాగ్ కాలుష్యం బారిన పడుతుండటం ఎక్కువగా జరుగుతుంటుంది. ● వ్యాయామం వల్ల ముఖానికి తగినంత రక్తప్రసరణ జరిగి ముఖం తేటగా మారుతుంది. అయితే వ్యాయామలు మంచులో చేయకుండా ఏదైనా పైకప్పు వంటి రక్షణ ఉన్నచోట చేయడం మంచిది. ● రోజుకి కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటలు పాటు కంటినిండా నిద్ర ఉంటే ముఖం తేటగా కనపడుతుంది.

బేబీ రిస్ట్



చాలామంది చిన్నారులను పైకి ఎగరేసి పట్టుకుంటున్నట్టుగా ఆడిస్తుంటారు. రెండేళ్లలోపు చిన్నారులైతే తేలిగ్గా ఉంటారు కాబట్టి వాళ్లను గాల్లోకి ఎగరేసినట్టుగా చేస్తూ వాళ్లను మళ్లీ పట్టుకుంటుంటారు తల్లిదండ్రులు. ఇలా చేసే సమయంలో కొందరికి ఓ చిత్రమైన సమస్య వస్తుంటుంది. దానిపేరే 'బేబీ రిస్ట్'!

బొటన వేలూ, చూపుడువేలు మధ్యన పిల్లలను ఎత్తుకుని ఎగరేసినట్లుగా చేసే సమయంలో అక్కడ పడే ఒత్తిడితో కొందరిలో మణికట్టు దగ్గరి టెండన్లు దెబ్బతినవచ్చు. అలా జరిగితే విపరీతమైన నొప్పి వస్తుంటుంది.

సాధారణ పరిభాషలో 'బేబీ రిస్ట్'గా చెప్పే ఈ సమస్యను వైద్య పరి భాషలో 'డి క్వెర్వెయిన్స్ టెనోసినోవైటిస్' లేదా 'డి క్వెర్వెయిన్స్ టెండనైటిస్' అని వ్యవహరిస్తారు. కాస్తంత విశ్రాంతితో తేలిగ్గానే తగ్గిపోయే తాత్కాలిక సమస్య ఇది. మరీ నొప్పి లేదా ఇన్‌ఫ్లమేషన్ ఎక్కువైతే తేలికపాటి నొప్పి నివారణ మందులతో వైద్యులు దీనికి చికిత్స అందిస్తారు. అయితే కొందరిలో దీనికి శస్త్రచికిత్స అవసరం పడవచ్చు. కానీ అలాంటి సందర్భాలు చాలా చాలా అరుదు.

వెయిట్ & డెలివరీస్



కొందరు గర్భవతులుగా ఉన్న టైమ్‌లో బరువు పెరుగుతుంటారు. మరింతగా లావెక్కుతారు. ఈ పరిణామం తల్లికీ, కడుపులోని బిడ్డకూ ప్రమాదం తెచ్చిపెట్టే అవకాశముంది. ఇద్దరిలోనూ ఆరోగ్య సంబంధమైన సమస్యలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఈ టైమ్‌లో మహిళల్లో స్రవించే కొన్ని హార్మోన్లు బిడ్డ పుట్టుకపైనా కొన్ని ప్రతికూల ప్రభావాలు చూపే అవకాశాలూ లేకపోలేదు.

గర్భవతుల్లో స్థూలకాయమంటే...

● పిల్లలు పుట్టే వయసు (చైల్డ్ బేరింగ్ ఏజ్)లో ఉండే మహిళల్లో దాదాపు 10 శాతం మంది సాధారణంగా అంతో ఇంతో స్థూలకాయం కలిగి ఉంటారు ● మామూలుగానైతే గర్భవతులు కాస్తంత బరువు పెరగడం సహజమే. అయితే పెరుగుతున్న కడుపుకు అనుగుణంగా కాకుండా... దానికంటే మరింత అదనంగా బరువు పెరుగుతుంటే మాత్రం దాన్ని స్థూలకాయంగా పరిగణించాలి ● వ్యక్తులు తమ ఎత్తుకు తగినట్లుగా ఉండాల్సిన బరువు కంటే 30 శాతం అదనంగా ఉంటే దాన్ని తప్పకుండా స్థూలకాయంగానే పరిగణించాలి

● ప్రసవం అయ్యాక క్రమంగా ఏడాది వ్యవధిలో బరువు తగ్గుతుంటారు. అలా తగ్గకపోతే అది ఆరోగ్యానికి అంత మంచిది కాదని గ్రహించాలి.

గర్భిణి బరువు పెరుగుతుంటే కనిపించే దుష్ప్రభావాలు...

● **సాధారణ సమస్యలు :** ఇతర మహిళలతో పోలిస్తే గర్భవతుల్లో బరువు పెరగడమనే కారణం వల్ల సాధారణ ఆరోగ్య సమస్యలైన తలనొప్పి, గుండె మంట, ఛాతీ ఇన్ఫెక్షన్ల వంటివి రావడం పది రెట్లు ఎక్కువ.

● **ప్రీక్లాంప్సియా :** మహిళల్లో అధిక రక్తపోటు (హైబీపీ) కలిగించే పరిస్థితిని ప్రీక్లాంప్సియా అంటారు. ఈ కండిషన్‌లో శరీరంలోని ద్రవాలు బయటకు వెళ్లక పోవడం, ఒంట్లో వాపు వంటి పరిస్థితులు కనిపిస్తాయి. ప్రీక్లాంప్సియా అనే సమస్యతో పిండానికి రక్తప్రసరణ తగ్గడం వంటి సమస్యలు పుట్టబోయే బిడ్డకు ప్రమాదకరంగా పరిణమించవచ్చు.

● **జెస్టేషనల్ డయాబెటిస్ :** గర్భవతిగా ఉన్న సమయంలో ఒంట్లో చక్కెర పాళ్లు పెరిగే కండిషన్ జెస్టేషనల్ డయాబెటిస్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు కడుపులోని పిండం ఉండాల్సినదానికంటే విపరీతమైన బరువు ఉండవచ్చు. సాధారణంగా ప్రసవం అయ్యాక తగ్గిపోయే ఈ జెస్టేషనల్ డయాబెటిస్ ఒక్కోసారి ఆ తర్వాత కూడా కొనసాగి మహిళలో శాశ్వత డయాబెటిస్‌కు కారణం కావచ్చు.

● **సిజేరియన్ అవకాశాలు :** గర్భవతిగా ఉన్నప్పుడు బరువు విపరీతంగా పెరిగిపోయిన మహిళల్లో సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలు తగ్గిపోతాయి. ప్రసవం నొప్పులు తక్కువగానూ, దీర్ఘకాలంపాటు వస్తాయి. దాంతో సిజేరియన్ చేయాల్సిన అవసరం కలగవచ్చు.

● **పోస్ట్‌పార్టమ్ ఇన్ఫెక్షన్స్ :** ప్రసూతి తర్వాత తిరిగి సాధారణంగా (నార్మల్‌గా) అయ్యేందుకు పట్టే వ్యవధి కూడా ఎక్కువే. ఇదే సమయంలో ఇక సిజేరియన్ అయితే ఈ వ్యవధి మరింత పెరుగుతుంది.

బిడ్డకు ఉండే ప్రమాదాలు...

గర్భవతిగా ఉన్న మహిళకేగాక కడుపులోని బిడ్డకు కూడా కొన్ని ప్రమాదకరమైన పరిస్థితులు వచ్చే అవకాశం ఉంది. అవి...

● **మ్యాక్రోసోమా :** కడుపులో బిడ్డ అనూహ్యంగా బరువు పెరగడంతో ప్రసవ మార్గం (బర్త్ కెనాల్) నుంచి ప్రసవం తేలిగ్గా అయ్యే అవకాశం తగ్గుతుంది. దాంతో ప్రసవ సమయంలో బిడ్డ భుజాలకు గాయం కావచ్చు. ఈ గాయాలను షోల్డర్ డిస్టోనియా అంటారు.

● **న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ :** బిడ్డలో తెలివితేటలు, వికాసానికి అడ్డంకిగా పరిణమించే న్యూరల్ ట్యూబ్ సమస్యలు రావచ్చు. సాధారణంగా బిడ్డలో న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్ అన్నవి సాధారణంగా గర్భధారణ సమయంలోని మొదటి మూడు నెలల పాటు ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల ఎక్కువగా వస్తాయి. ఈ సమస్యను మొదటి మూడు నెలల్లో సాధారణంగా అల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. అయితే స్థూలకాయం ఉన్న మహిళల్లో అల్ట్రాసౌండ్ పరీక్షలో కొన్ని సమస్యలు స్పష్టంగా కనిపించకపోవచ్చు. అల్ట్రాసౌండ్ పరీక్షకు ఉపయోగించే శబ్దతరంగాలు స్థూలకాయం ఉన్నవారిలో ఉండే కొవ్వు పొరల వల్ల ఎక్కువ దూరం ప్రసరించలేకపోవడం వల్లనే ఈ సమస్య. ఫలితంగా న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ వంటివి వచ్చినప్పుడు, దాన్ని గుర్తించడం కష్టమవుతుంది.

● **పిల్లల్లో స్థూలకాయం :** తల్లికి స్థూలకాయం ఉన్నప్పుడు అది బిడ్డలకూ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. చిన్నారికి నాలుగో ఏడు వచ్చే నాటికి బిడ్డలోనూ స్థూలకాయం కనిపించే అవకాశాలు ఎక్కువ.

● దీనికి తోడుగా పిల్లల్లో గుండెకు సంబంధించిన సమస్యలు, తలకు నీరు పట్టడం, గ్రహణం మొర్రి వంటి సమస్యలు కూడా ఎక్కువ.

నివారణ ఇలా...

● గర్భవతిగా ఉన్నవారు మరీ ఎక్కువ బరువు పెరగకుండా జాగ్రత్త తీసుకోవాలి. డాక్టర్ దగ్గరకు ఫాలో అప్‌కు వెళ్తుండాలి. అక్కడ తరచూ బరువు చూసుకుంటూ... బరువు తగ్గడానికి ఆ టైమ్‌లో తీసుకోవాల్సిన ఆహారం, చేయాల్సిన వ్యాయామాల గురించి తెలుసుకోవాలి. కొద్దిపాటి బరువు తగ్గినా అది ప్రెగ్నెన్సీ రిలేటెడ్ కాంప్లికేషన్స్‌ను చాలావరకు తగ్గిస్తుందనే అవగాహన కలిగి ఉండటం మంచిది.

● ఒకవేళ ముందునుంచీ బరువు ఎక్కువగానే ఉండేవారు గర్భధారణ జరిగాక అకస్మాత్తుగా బరువు తగ్గడం మంచిది కాదు. అలా ఒక్కసారిగా బరువు తగ్గితే దాని వల్ల బిడ్డకు అందాల్సిన క్యాలరీలు, పోషకాలు తగినట్లుగా అందకపోవచ్చు. అందుకే ఆ టైమ్‌లో పిండం ఎదుగుదలకు కావాల్సిన ఆహారం తీసుకుంటూ ఉండాలి.

పిల్లల్లో రే-చీకటిని పెద్దలే గుర్తించాలి!



పిల్లల్లో వచ్చే రేచీకటి సమస్య వారిని చీకట్లో నెట్టేసి వాళ్ల జీవితాల్ని పూర్తిగా అంధకారం చేయవచ్చు. చిన్నారులు తమ సమస్యను త్వరగా గుర్తించలేరు, చెప్పలేరు కాబట్టి పెద్దలే వారి ఆటలనూ, చేష్టలనూ నిశితంగా గమనిస్తూ ఉండాలి. ఈ క్రమంలో వారి చూపులో, దృష్టిజ్ఞానంలో ఏమైనా తేడాలు ఉన్నాయేమో పసిగట్టాలి.

రేచీకటి అనేది 'డిమినిషన్ ఆఫ్ విజన్ విత్ అర్లీ ఆన్‌సెట్ బ్లైండ్‌నెస్' కోవకు చెందిన సమస్య. పిల్లల్లో చూపు తగ్గడం లేదా మందగించడం అనే ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా మూడు శాతం చిన్నారుల్లో కనిపిస్తుంది.

రేచీకటికి 'విటమిన్-ఏ' లోపం ప్రధానమైనది. అయితే పెద్దవాళ్లతో పోలిస్తే పిల్లల్లో చూపుతగ్గడానికి జన్యుపరమైన కారణాలూ ముఖ్యమైనవే.

రే-చీకటితో పాటు... గర్భవతిగా ఉన్న సమయంలో తల్లికి వచ్చే ఇన్ఫెక్షన్స్, పుట్టిన తర్వాత పిల్లల్లోని బర్త్ ఇంజ్యూరీస్, మీజిల్స్, హఠాత్తుగా సంభవించే ప్రమాదాలతో చూపు మందగించవచ్చు. కొంతమంది పిల్లల్లో 'కంజెనిటల్ మ్యాక్యులోపతి' అనే కండిషన్ వల్ల కూడా చూపు తగ్గవచ్చు.

కారణం ఏదైనా చిన్నపిల్లల్లో చూపుకు సంబంధించిన సమస్య ఉన్నట్లు గుర్తిస్తే... తల్లిదండ్రులుగానీ లేదా ఇండ్లలోని పెద్దలుగానీ తక్షణం ఆ పిల్లలను కంటివైద్య నిపుణుల దగ్గరికి లేదా రెటీనా నిపుణుల దగ్గరికి తీసుకెళ్లి, వారిని సంప్రదించి తగిన సలహా, చికిత్స తీసుకోవాలి.

ఒకవేళ చిన్నారుల్లో దృష్టి సమస్య రేచీకటి వల్లనే అయితే అంధత్వ నివారణ కోసం చిన్నపిల్లలకు ఆహారంలో విటమిన్-ఏ ఎక్కువగా ఉండే ఆహారం ఇవ్వాలి. ముదురు ఆకుపచ్చరంగులో ఉండే అన్ని రకాల ఆకుకూరలు, రంగురంగుల కాయగూరలు, పసుపుపచ్చ రంగులో ఉండే పండ్లు... వీటన్నింటిలోనూ విటమిన్-ఏ సమృద్ధిగా ఉంటుంది. అది పిల్లల కంటి సమస్యలను నివారించి, వాళ్లలో అంధత్వం రాకుండా చూడటమే కాకుండా... చిన్నారుల సాధారణ ఆరోగ్యానికీ, వికాసానికీ మేలు చేస్తుందని పెద్దలు తెలుసుకోవాలి.

సాక్షి ప్లస్
మంగళవారం। 24-12-2024

బిజినెస్ రీల్

సోలార్91 క్లీన్‌టెక్ @ రూ. 185-195

- ఈ నెల 24-27 మధ్య ఐపీవో
- రూ. 106 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: ఈపీసీ సొల్యూషన్లు అందించే సోలార్91 క్లీన్‌టెక్ పబ్లిక్ ఇష్యూకి రూ. 185-195 ధరల శ్రేణిని ప్రకటించింది. ఐపీవో ఈ నెల 24న ప్రారంభమై 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా 54.36 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 106 కోట్లు సమీకరించాలని ఆశిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు నేడు(23న) షేర్లను విక్రయించనుంది. చిన్న, మధ్యతరహా కంపెనీల కోసం స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్ఈ ఏర్పాటు చేసిన ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టింగ్ కానుంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలో పెట్టుబడులకు వెచ్చించనుంది. ఈ నిధులను స్వతంత్ర విద్యుదుత్పత్తి సంస్థ(ఐపీపీ)గా సోలార్ ప్లాంట్ల అభివృద్ధిలో వినియోగించనుంది. అంతేకాకుండా వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం కేటాయించనుంది.

జీఎస్‌పీ క్రాప్ సైన్స్ ఐపీవో బాట

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఆగ్రో కెమికల్ కంపెనీ జీఎస్‌పీ క్రాప్ సైన్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 280 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 60 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 200 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మరికొంత సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. రీసెర్చ్‌పై ప్రధానంగా దృష్టిపెట్టిన కంపెనీ ఇన్‌సెక్టిసైడ్స్, హెర్బిసైడ్స్, ఫంగిసైడ్స్ అభివృద్ధి, తయారీలో ఉంది. తద్వారా పంటల సంరక్షణ సొల్యూషన్లు(ఫార్ములేషన్లు) అందిస్తోంది. వెరసి వ్యవసాయోత్పత్తిలో రైతులకు మద్దతిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-12-2024

విశాఖ	595-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	590-00
విజయవాడ	590-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580-00
వరంగల్	582-00
రిటైల్ ధర	6.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	939	2.36
ITC	474.5	2.12
HINDALCO	634.3	1.87
TRENT	6,950.00	1.73
HDFCBANK	1,802.00	1.72

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,275.00	-1.5
MARUTI	10,810.00	-0.84
HCLTECH	1,900.80	-0.55
HDFCLIFE	620.5	-0.53
BAJAJFINSV	1,562.95	-0.43

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,706
ఎన్ఎస్ఈ	82,922
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,81,920
ఎఫ్ఐఐ	- 169
డీఐఐ	+ 2,228

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.96	$ 69.46
బ్రెంట్	72.05	$ 72.56

నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ రేషియో క్షీణత

- 82.95 శాతం నుంచి 82.52 శాతానికి
- 2023-24 ఐఆర్‌డీఏఐ నివేదిక విడుదల
- జీవిత బీమా కవరేజీ విస్తరణలో వెనకడుగు



న్యూఢిల్లీ: నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రీమియంలో నికర చెల్లింపులు (క్లెయిమ్ రేషియో) 2023-24లో స్వల్పంగా తగ్గి 82.52 శాతంగా ఉన్నట్టు బీమారంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) నివేదిక ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 82.95 శాతంగా ఉంది. నాన్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు అన్నీ కలసి గత ఆర్థిక సంవత్సరంలో రూ.2.90 లక్షల కోట్ల ప్రీమియాన్ని నమోదు చేశాయి. 12.76 శాతం పెరిగింది. ప్రభుత్వరంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రీమియం 9 శాతం వరకు పెరిగి రూ.82,891 కోట్ల నుంచి రూ.90,252 కోట్లకు వృద్ధి చెందింది. ప్రైవేటు రంగ సాధారణ బీమా సంస్థల ప్రీమియం రూ.1.88 లక్షల కోట్లకు చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1.58 లక్షల కోట్లుగానే ఉంది. నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల లాభం రూ.10,119 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ రూ.2,556 కోట్ల మేర నష్టాలను నమోదు చేయడం గమనార్హం.

నివేదికలోని వివరాలు..

- 2023-24లో నెట్ ఇన్‌కర్డ్ (నికర) క్లెయిమ్‌లు 15.39 శాతం పెరిగి రూ.1.72 లక్షల కోట్లకు చేరాయి.
- ప్రభుత్వరంగ బీమా సంస్థల ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 2022-23లో 99.02 శాతంగా ఉంటే, 2023-24లో 97.23 శాతానికి తగ్గింది.
- ప్రైవేటు రంగ సాధారణ బీమా సంస్థల ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 76.49 శాతానికి మెరుగుపడింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 75.13 శాతంగా ఉంది.
- స్టాండలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 2022-23లో 61.44 శాతంగా ఉంటే, 2023-24లో 63.63 శాతానికి మెరుగుపడింది.
- స్పెషలైజ్డ్ ఇన్సూరెన్స్ కంపెనీల ఇన్‌కర్డ్ క్లెయిమ్ రేషియో 66.58 శాతంగా ఉంది. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఇది 73.71 శాతంగా ఉండడం గమనార్హం.
- జీవిత బీమా కంపెనీలు గత ఆర్థిక సంవత్సరంలో రూ.5.77 లక్షల కోట్లను పాలసీదారులకు చెల్లించాయి. పాలసీదారుల నుంచి వసూలు చేసిన మొత్తం ప్రీమియంలో చెల్లింపులు 70.22 శాతంగా ఉన్నాయి.
- పాలసీల సరెండర్‌లు/ఉపసంహరణలకు సంబంధించిన ప్రయోజనాలు 15 శాతం పెరిగి రూ.2.29 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థల వాటా 58 శాతంగా ఉంది.
- 2023-24లో 18 జీవిత బీమా కంపెనీలు నికర లాభాలను నమోదు చేశాయి. జీవిత బీమా కంపెనీల ఉమ్మడి లాభం 11 శాతం పెరిగి రూ.47,407 కోట్లకు చేరింది.
- ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థల (ఎల్ఐసీ) లాభం 11.75 శాతం పెరిగితే, ప్రైవేటు జీవిత బీమా కంపెనీల లాభంలో 5 శాతం వృద్ధి నమోదైంది.
- మొత్తం బీమా వ్యాప్తి 2022-23లో 4 శాతంగా ఉంటే 2023-24లో 3.7 శాతానికి పరిమితమైంది. జీవిత బీమా వ్యాప్తి 3 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గగా.. సాధారణ బీమా వ్యాప్తి (ఆరోగ్య బీమా సహా) ఒక శాతం వద్దే స్థిరంగా ఉంది.

షోరూంలోనే కారు కొనుగోలు

- మొగ్గుచూపుతున్న 90% మంది
- అర్బన్ సైన్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: మార్కెట్లో ఎలాంటి కార్లు ఉన్నాయి? బడ్జెట్ వివరాలతోపాటు మనకు కావాల్సిన ఫీచర్లు ఏ మోడళ్లలో ఉన్నాయి. ఒక ధరలో శ్రేణిలో లభిస్తున్న మోడళ్ల మధ్య ఉన్న వ్యత్యాసాలు ఏమిటి..? ఇలాంటి అంశాలన్నీ ఆన్‌లైన్‌లో తెలుసుకుంటున్నప్పటికీ అత్యధికులు షోరూంకు వెళ్లే కారు స్టీరింగ్ పడుతున్నారట. ప్రత్యక్షంగా ఔట్‌లెట్‌కు వెళ్లి పరిశీలించిన తర్వాతే వాహనాన్ని కొనుగోలు చేస్తున్నారని అర్బన్ సైన్స్ సర్వేలో తేలింది. భారత్‌తోపాటు యూఎస్, జర్మనీ, యూకే, చైనా, మెక్సికో నుంచి 9,000 పైచిలుకు మంది ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. భారత్‌లో 10 మంది కార్ల కొనుగోలుదార్లలో దాదాపు 9 మంది షోరూంను సందర్శించడానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారట. ఈ సర్వే ప్రకారం..

నమ్మదగిన విధానం..

ఇలా ఔట్‌లెట్‌కు వెళ్లడాన్ని ఒక ప్రధాన ఆర్థిక నిర్ణయం తీసుకోవడానికి నమ్మదగిన విధానంగా కస్టమర్లు భావిస్తున్నారు. కారును కొనుగోలు చేయడంలో కుటుంబ పాత్ర ఉంటుంది. షోరూంలతో వ్యక్తిగత సంబంధాలు ఉంటాయి. నేరుగా వెళ్లడం వల్ల కార్లను ప్రత్యక్షంగా చూడవచ్చు. ఇటువంటి అనుభవాన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఇవ్వలేవు. డీలర్‌షిప్‌లు నమ్మకాన్ని పెంపొందిస్తాయి, వ్యక్తిగతీకరించిన డీల్స్ ఉంటాయి. సంబంధాలు పెంపొందించబడతాయి. అమ్మకాల తర్వాత మద్దతు కూడా ఉంటుందన్నది కస్టమర్ల భావన. ఇందుకు అనుగుణంగా కస్టమర్లలో విశ్వాసాన్ని పెంపొందించేందుకు తయారీ సంస్థలు నెట్‌వర్క్‌లను విస్తరిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో బ్రౌజింగ్..

సంప్రదాయ డీలర్‌షిప్‌లు ప్రస్తుతం భారతదేశ ఆటోమోటివ్ వ్యవస్థలో ఆధిపత్యం చెలాయిస్తుండగా.. డిజిటల్ వేవ్ క్రమంగా ఊపందుకుంటోంది. యువకులు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వినియోగదారులు షోరూమ్‌లోకి అడుగుపెట్టే ముందు ఆన్‌లైన్‌లో బ్రౌజ్ చేస్తున్నారు. డీలర్‌షిప్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు రెండూ భవిష్యత్తులో కొనసాగుతాయి. సంప్రదాయ డీలర్‌షిప్‌లు ప్రత్యేకంగా అందించే నమ్మకాన్ని, వ్యక్తిగత సంబంధాలను కాపాడుకుంటూ.. అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల అంచనాలను అందుకోవడానికి సరైన సమతూకం సాధించడం చాలా అవసరం' అని సర్వేలో వెల్లడైంది.

పార్లే బిస్కెట్స్‌కు లాభాల వర్షం

న్యూఢిల్లీ: పార్లే ప్రొడక్ట్స్ అనుబంధ సంస్థ పార్లే బిస్కెట్స్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,607 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.743 కోట్లతో పోల్చి చూస్తే రెట్టింపునకు పైగా పెరిగింది. అదే సమయంలో ఆదాయం కేవలం 2 శాతం వృద్ధితో రూ.14,069 కోట్ల నుంచి రూ.14,349 కోట్లకు చేరింది. 1974లో ఏర్పాటైన పార్లే బిస్కెట్స్ ప్రముఖ బిస్కెట్లు, కన్ఫెక్షనరీ విక్రయాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రకటనల కోసం 3.23 శాతం అధికంగా రూ.443 కోట్లను పార్లే బిస్కెట్స్ గత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసింది. పన్ను వ్యయాలు రూ.499 కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 2.54 శాతం తగ్గి 12,979 కోట్లకు పరిమితమయ్యాయి. బిస్కెట్లు, కన్ఫెక్షనరీ విభాగంలో కొత్త అవకాశాలను పరిశీలిస్తూనే ఉంటామని పార్లే బిస్కెట్స్ ప్రకటించింది.

తెలుగు రాష్ట్రాల్లో ఎస్ఎంఈలపై శ్రీరామ్ ఫైనాన్స్ ఫోకస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శ్రీరామ్ గ్రూప్‌లో భాగమైన శ్రీరామ్ ఫైనాన్స్ తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణాలపై మరింతగా దృష్టి పెడుతోంది. 2024 సెప్టెంబర్ ఆఖరు నాటికి నిర్వహణలోని ఎంఎస్ఎంఈ అసెట్స్ (ఏయూఎం) పరిమాణం ఆంధ్రప్రదేశ్‌లో ర. 4,908 కోట్లకు, తెలంగాణలో రూ. 4,666 కోట్లకు చేరింది. శ్రీరామ్ ఫైనాన్స్ మొత్తం ఏయూఎంలో ఎంఎస్ఎంఈ రుణాల వాటా 13.29 శాతంగా (దాదాపు రూ. 32,300 కోట్లు) ఉన్నట్లు సంస్థ తెలిపింది. రుణాల అండర్‌రైటింగ్ ప్రక్రియలను మెరుగుపర్చుకోవడం, కొత్త మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడం మొదలైన అంశాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో వ్యాపారాన్ని పెంచుకోనున్నట్లు సంస్థ జేఎండీ కె. శ్రీనివాస్ తెలిపారు.

వారీ ఎనర్జీస్ పెట్టుబడులకు రెడీ

రూ. 850 కోట్లతో వ్యయ ప్రణాళికలు




న్యూఢిల్లీ: సోలార్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ వారీ ఎనర్జీస్ బోర్డు తాజాగా మూడు పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో భాగంగా ఎలక్ట్రోలైజర్ ఏర్పాటుసహా.. స్టోరేజీ సెల్ తయారీ యూనిట్‌కు తెరతీయనుంది. ఇందుకు మొత్తం రూ. 850 కోట్లు వెచ్చించనుంది. వీటితోపాటు సొంత అనుబంధ సంస్థ వారీ పవర్ ప్రయివేట్ ద్వారా ఇన్వెర్టర్ బిజినెస్‌పై రూ. 130 కోట్లను ఇన్వెస్ట్ చేసేందుకు బోర్డు అనుమతించింది. సీఈవో అమిత్ పైథంకాను అదనపు డైరెక్టర్‌గా బోర్డు ఎంపిక చేసినట్లు కంపెనీ పేర్కొంది. హోల్‌టైమ్ డైరెక్టరుగా అమిత్ 2024 డిసెంబర్ 23 నుంచి ఐదేళ్లపాటు బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

ఎన్ఎస్ఈలో వారీ ఎనర్జీస్ షేరు 2.4 శాతం ఎగసి రూ. 2,948 వద్ద ముగిసింది.

డేటా సెంటర్ సామర్థ్యాలు రెండేళ్లలో రెట్టింపు

- రూ.65,000 కోట్ల పెట్టుబడులు
- జెనరేషన్ ఏఐతో అధిక డిమాండ్
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: దేశంలో డేటా సెంటర్ల సామర్థ్యం 2026-27 ఆర్థిక సంవత్సరం చివరికి రెట్టింపై 2-2.3 గిగావాట్లకు చేరుకుంటుందని క్రిసిల్ రేటింగ్స్ తెలిపింది. ఇప్పటికే ఈ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థల విస్తరణ ప్రణాళికలకు తోడు కొత్త సంస్థల రాకతో డేటా సెంటర్ల సామర్థ్యం పెరగనున్నట్టు వెల్లడించింది. డిజిటలైజేషన్ పెరగడానికితోడు, క్లౌడ్ స్టోరేజీపై సంస్థల పెట్టుబడులు ఇనుమడిస్తుండడం డేటా సెంటర్ల డిమాండ్‌ను పెంచుతున్నట్టు తెలిపింది. జెనరేటివ్ ఏఐ వినియోగం వేగంగా విస్తరిస్తుండడం సైతం మధ్య కాలానికి ఈ డిమాండ్‌ను నడిపించనున్నట్టు పేర్కొంది. ఈ బలమైన డిమాండ్‌ను అందుకోవడానికి వీలుగా సంస్థలకు అదనపు మూలధన వ్యయాలు అవసరం అవుతాయని, ఇవి రుణాల రూపంలో ఉండొచ్చని పేర్కొంది. వ్యాపార సంస్థలు తమ వ్యాపారాల నిర్వహణ విషయంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు మొగ్గు చూపిస్తుండడం డేటా సెంటర్ల కంప్యూటింగ్, స్టోరేజ్ వసతుల డిమాండ్‌ను పెంచుతున్నట్టు వివరించింది. కరోనా తర్వాత ఈ ధోరణి పెరగడాన్ని గుర్తు చేసింది. అధిక వేగంతో కూడిన డేటా అందుబాటులోకి రావడం సోషల్ మీడియా, ఓటీటీ, డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని పెంచినట్టు తెలిపింది. గత ఐదు ఆర్థిక సంవత్సరాలుగా మొబైల్ డేటా ట్రాఫిక్ ఏటా 25 శాతం చొప్పున పెరగడాన్ని ప్రస్తావించింది. 2024 మార్చి నాటికి నెలవారీ డేటా వినియోగం 24 జీబీకి చేరిందని, 2026 మార్చి నాటికి 33-35జీబీకి ఇది పెరుగుతుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది.

భారీ పెట్టుబడులు..

''పెరుగుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌ను తీర్చేందుకు గాను వచ్చే ఐదు ఆర్థిక సంవత్సరాల్లో రూ.55,000-65,000 కోట్ల మేర పెట్టుబడులు అవసరం అవుతాయి. ప్రధానంగా భూమి, భవనాలు, విద్యుత్ ఎక్విప్‌మెంట్, కూలింగ్ పరిష్కారాల కోసం ఎక్కువ వ్యయం చేయాల్సి ఉంటుంది. భూమి, భవనం కోసమే డేటా సెంటర్ ఆపరేటర్లు మొత్తం మూలధన వ్యయాల్లో 25-30 శాతాన్ని వెచ్చించాల్సి వస్తుంది''అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ మనీష్ గుప్తా తెలిపారు. ఒక్కసారి ఒప్పందం కుదిరితే డేటా సెంటర్లకు స్థిరమైన నగదు ప్రవాహాలు వస్తుంటాయని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ ఆనంద్ కులకర్ణి వివరించారు. ''ఒక కేంద్రం నుంచి మరో కేంద్రానికి మారడం అన్నది అధిక వ్యయాలతో కూడుకున్నదే కాకుండా, వ్యాపార అవరోధాలకు దారితీస్తుంది. దీంతో క్లయింట్లను అట్టిపెట్టుకునే రేషియో ఎక్కువగా ఉంటుంది''అని తెలిపారు.

గిఫ్ట్ సిటీకి అర్థ గ్లోబల్ ఆపర్చ్యూనిటీస్ ఫండ్



ముంబై: మారిషస్ నుంచి ఇన్వెస్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న అర్థ గ్లోబల్ ఆపర్చ్యూనిటీస్ ఫండ్ తమ ప్రధాన కేంద్రాన్ని గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీకి మార్చుకుంటోంది. తద్వారా భారత్‌ను కేంద్రంగా మార్చుకున్న తొలి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల సంస్థ (ఎఫ్‌పీఐ) తమదే అవుతుందని ఫండ్ నిర్వహణ సంస్థ అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ వ్యవస్థాపకుడు సచిన్ సావ్రికర్ తెలిపారు. భారత్‌లోని అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు (ఏఆర్‌సీ) జారీ చేసే సెక్యూరిటీ రిసీట్స్‌లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుందని, దీని జీవితకాలం ఏడేళ్లు ఉంటుందని వివరించారు. వచ్చే ఏడాది మూడు వినూత్న ఫండ్స్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. హెడ్జ్ ఫండ్ (అమెరికా రిటైల్ రంగం), గ్లోబల్ ఆర్బిట్రేజ్ ఫండ్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్ వీటిలో ఉంటాయని సచిన్ తెలిపారు.

లోహియా ఆటో 'యుూధ'



ముంబై: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న లోహియా ఆటో యూధ పేరుతో కొత్త ఈవీ బ్రాండ్‌ను ప్రకటించింది. ఈ బ్రాండ్ కింద 2027 నాటికి 3 లక్షల ప్యాసింజర్, కార్గో ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసి విక్రయించాలని లక్ష్యంగా చేసుకుంది. 'యూధ పేరుతో కేవలం ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లను తయారు చేయడం మాత్రమే కాదు. భారతదేశపు నిజమైన యోధులను శక్తివంతం చేస్తున్నాము. వారి కుటుంబాల కోసం అవిశ్రాంతంగా పని చేసే వారిని గౌరవించడం, వారి కలలను సాధించడం కోసం అచంచల సంకల్పంతో ముందుకు సాగడం మా లక్ష్యం' అని యూధ సీఈవో ఆయుష్ లోహియా తెలిపారు. స్థలం, సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ5 ప్యాసింజర్ త్రీ-వీలర్‌ను అర్బన్, సెమీ-అర్బన్ కమ్యూటింగ్ కోసం రూపొందించామని చెప్పారు. ఈ5 కార్గో మోడల్ లాజిస్టిక్స్ కోసం నమ్మదగిన, స్థిర పరిష్కారాన్ని అందిస్తుందని వివరించారు. ప్యాసింజర్ ఈ-త్రీవీలర్ ప్రారంభ ధర ఎక్స్-షోరూమ్‌లో రూ.3.80 లక్షలు. 10-కిలోవాట్ అవర్ బ్యాటరీ పొందుపరిచారు. ఒకసారి ఛార్జింగ్‌తో 160 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది.

రిలయన్స్ జియోకు 37.6 లక్షల మంది దూరం



న్యూఢిల్లీ: టెలికం రంగ సంస్థ రిలయన్స్ జియో అక్టోబర్‌లో 37.6 లక్షల మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. టెల్కోలు కీలకంగా వ్యవహరించే క్రియాశీల మొబైల్ సబ్‌స్క్రైబర్స్ జియోకు 38.47 లక్షల మంది పెరిగారు. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ సోమవారం విడుదల చేసిన నెలవారీ డేటా ప్రకారం.. అక్టోబర్‌లో భారతీ ఎయిర్‌టెల్ 19.28 లక్షల మంది వైర్‌లెస్ చందాదార్లను కొత్తగా దక్కించుకుంది. యాక్టివ్ కస్టమర్లు దాదాపు 27.23 లక్షలు అధికం అయ్యారు. వొడాఫోన్ ఐడియా 19.77 లక్షల వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. క్రియాశీల చందాదార్లు 7.23 లక్షల మంది తగ్గారు. రిలయన్స్ జియో మొత్తం వైర్‌లెస్ వినియోగదార్ల సంఖ్య అక్టోబర్ నాటికి 46 కోట్లకు వచ్చి చేరింది. సెప్టెంబర్‌లో ఈ సంఖ్య 46.37 కోట్లుగా ఉంది. సెప్టెంబర్‌తో పోలిస్తే వొడాఫోన్ ఐడియా మొత్తం వైర్‌లెస్ యూజర్ బేస్ 21.24 కోట్ల నుండి అక్టోబర్‌లో 21.04 కోట్లకు పడిపోయింది. దేశవ్యాప్తంగా మొత్తం యాక్టివ్ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 106.6 కోట్లుగా ఉంది. మొత్తం బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు అక్టోబర్ 2024 చివరి నాటికి 0.31 శాతం తగ్గి 94.14 కోట్లుగా ఉన్నారు. మొత్తం టెలిఫోన్ చందాదారుల సంఖ్య 119.06 కోట్ల నుండి 0.21 శాతం తగ్గి 118.82 కోట్లకు క్షీణించింది.

తెలుగు రాష్ట్రాల వైర్‌లైన్‌లో జియో వృద్ధి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో (ఏపీ టెలికం సర్కిల్) వైర్‌లైన్ విభాగంలో అక్టోబర్‌లో గణనీయంగా వృద్ధి సాధించినట్లు రిలయన్స్ జియో తెలిపింది. ట్రాయ్ గణాంకాల ప్రకారం రెండు రాష్ట్రాల్లో నికరంగా 69,930 కనెక్షన్లు కొత్తగా జతయినట్లు వివరించింది. దీంతో సెప్టెంబర్‌లో 17,49,696గా ఉన్న సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య అక్టోబర్‌లో 18,19,626కి చేరినట్లు సంస్థ పేర్కొంది.

'ప్రాధాన్యతా' రుణాల విధానాల్లో సంస్కరణలు రావాలి

- వర్ధమాన రంగాలకు చోటివ్వాలి
- సీఐఐ ప్రతిపాదనలు



న్యూఢిల్లీ: ప్రాధాన్యతా రంగాల రుణాలకి (పీఎస్ఎల్) సంబంధించిన విధానాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని పరిశ్రమల సమాఖ్య సీఐఐ పేర్కొంది. డిజిటల్ మౌలిక సదుపాయాలు, పర్యావరణహిత ప్రాజెక్టులు, ఆరోగ్య సంరక్షణ, వినూత్న ఉత్పత్తుల తయారీ వంటి వర్ధమాన రంగాలు, అత్యధికంగా ప్రభావం చూపగలిగే పరిశ్రమలను కూడా ఈ విభాగంలో చేర్చాలని ప్రతిపాదించింది. ఇందుకోసం కొత్తగా డెవలప్‌మెంట్ ఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్ల (డీఎఫ్ఐ) ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టేందుకు అత్యున్నత స్థాయి కమిటీని వేసే అవకాశాలను పరిశీలించాలని పేర్కొంది. ఇప్పటికే నిర్దిష్ట రంగాల అవసరాలను ప్రస్తుతం ఉన్న సిడ్బి, నాబ్‌ఫిడ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్) మొదలైనవి తీరుస్తున్నాయని సీఐఐ వివరించింది. పీఎస్ఎల్ విధానం విజయవంతమైనప్పటికీ.. అది మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా దానికి తగు సవరణలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఉదాహరణకు స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా 30 శాతం పైగా ఉన్నప్పుడు పీఎస్ఎల్ కేటాయింపు 18 శాతంగా ఉండేదని.. ప్రస్తుతం సాగు రంగం వాటా 14 శాతానికి తగ్గిపోయినప్పుడు కూడా అదే తీరు కొనసాగుతోందని సీఐఐ పేర్కొంది. ఆర్థిక వృద్ధికి భారీగా తోడ్పడగలిగే సత్తా ఉన్నప్పటికీ మౌలిక రంగం, వినూత్న ఉత్పత్తుల తయారీకి పీఎస్ఎల్ పరంగా తగినంత ప్రాధాన్యం లభించడం లేదని వివరించింది. ఈ నేపథ్యంలో కొత్త పరిస్థితులు, జీడీపీలో నిర్దిష్ట రంగాల వాటా, వాటి వృద్ధి అవకాశాల ఆధారంగా పీఎస్ఎల్ విధానాన్ని ప్రతి 3-4 సంవత్సరాలకు ఒకసారి సవరించాలని సీఐఐ తెలిపింది.

స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్

- మ్యూచువల్ ఫండ్స్‌లో ప్రత్యేక సాధనం
- కనీస పెట్టుబడి రూ.10 లక్షలు



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) పేరుతో నూతన పెట్టుబడి సాధనాన్ని ప్రవేశపెట్టింది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్), ప్రస్తుత మ్యూచువల్ ఫండ్స్‌కు అదనంగా ఈ కొత్త సాధనం అందుబాటులోకి రానుంది. ఇందులో కనీసం రూ.10లక్షలు అంతకుమించిన పెట్టుబడులను అనుమతిస్తారు. అంతకంటే తక్కువ ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇక పీఎంఎస్ అన్నది కనీసం రూ.50 లక్షలు అంతకుమించిన పెట్టుబడులకు ఉద్దేశించిన సాధనం. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (మ్యూచువల్ ఫండ్స్) నిబంధనలు, 1996లో సవరణల అనంతరం ఎస్ఐఎఫ్‌ను ప్రవేశపెడుతూ సెబీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్ఐఎఫ్ అన్నది ఓపెన్ ఎండెడ్, క్లోజ్ ఎండెడ్ లేదా ఇంటర్వెల్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ రూపంలో ఉండొచ్చు. ఈ వివరాలను ఆఫర్ డాక్యుమెంట్లలో మ్యూచువల్ ఫండ్ సంస్థ వెల్లడించాల్సి ఉంటుంది. ఇక ఫీజులు, వ్యయాలు అనేవి ప్రస్తుత మ్యూచువల్ ఫండ్స్ నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయి. రిస్క్ నియంత్రణలో భాగంగా ఎస్ఐఎఫ్ కింద నిర్వహణలోని మొత్తం ఆస్తుల్లో 20 శాతానికి మించి ఒకే కంపెనీ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయరాదు. ఏదైనా ఒక కంపెనీ చెల్లించిన మూలధనంలో 15 శాతం మించి ఓటింగ్ హక్కులు కలిగి ఉండరాదని సెబీ తన నిబంధనల్లో నిర్దేశించింది. అలాగే, ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి లిబరలైజ్డ్ మ్యూచువల్ ఫండ్స్ లైట్ కార్యాచరణను సైతం సెబీ ప్రకటించింది. కేవలం ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్స్ సేవలను అందించేందుకు ముందుకొచ్చే సంస్థలకు సరళతర నిబంధనలు అమలు కానున్నాయి.



సెమీస్‌లో దబంగ్ ఢిల్లీ

పుణే: మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ జట్టు ఈ సీజన్ ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో ఎదురులేని విజయాలతో సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 41–35తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. వరుసగా గత 15 మ్యాచ్‌లుగా దబంగ్ ఢిల్లీ ఓటమి ఎరుగదు. ఈ వరుసలో 13 గెలుపొందగా, రెండు మ్యాచ్‌లు 'టై' అయ్యాయి. తద్వారా టాప్–2లో నిలిచి నేరుగా సెమీస్ బెర్తు సాధించింది. గుజరాత్‌తో జరిగిన పోరులో ఢిల్లీ కెప్టెన్, రెయిడర్ అశు మలిక్ 17 సార్లు కూతకెళ్లి 14 పాయింట్లు తెచ్చిపెట్టాడు. సహచరుల్లో ఆల్‌రౌండర్ ఆశిష్ 7, రెయిడర్ నవీన్ 6, డిఫెండర్ ఆశిష్ 4 పాయింట్లు సాధించారు. గుజరాత్ తరఫున ఆల్‌రౌండర్ జితేందర్ యాదవ్ (7) ఆకట్టుకోగా, కెప్టెన్ గుమన్ సింగ్ (5), హిమాన్షు (5) రాణించారు. ఇదివరకే టాప్‌లో నిలిచిన హరియాణా స్టీలర్స్‌తో పాటు ఇప్పుడు రెండో స్థానంలో నిలిచిన ఢిల్లీ నేరుగా సెమీస్‌కు అర్హత సంపాదించాయి. తర్వాత 3, 4, 5, 6వ స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌లో ఆడి ఇందులోంచి రెండు జట్లు నాకౌట్‌కు చేరుకుంటాయి. సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 42–32తో తమిళ్ తలైవాస్‌పై గెలిచింది. పుణేరి రెయిడర్లు ఆర్యవర్ధన్ నవలే (10), అజిత్ (7) అదరగొట్టారు. డిఫెండర్లలో గౌరవ్ ఖత్రి (5), అమన్ (4) రాణించారు. తలైవాస్ తరఫున ఆల్‌రౌండర్ హిమాన్షు (8), రెయిడర్ సచిన్ (7) పోరాడారు. కెప్టెన్, డిఫెండర్ నితేశ్ కుమార్ 5, అమిర్ హుస్సేన్ 4 పాయింట్లు చేశారు. నేడు జరిగే పోటీల్లో బెంగళూరు బుల్స్‌తో యూపీ యోధాస్, బెంగాల్ వారియర్స్‌తో యు ముంబా తలపడతాయి.

మరో విజయమే లక్ష్యంగా...

- నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో వన్డే
- నెగ్గితే సిరీస్ టీమిండియా సొంతం
- జోరుమీదున్న హర్మన్‌ప్రీత్ బృందం
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం



వడోదర: జోరుమీదున్న భారత మహిళలు మరో మ్యాచ్ మిగిలుండగానే వన్డే సిరీస్‌నూ కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. తొలి వన్డేలో భారీ పరుగుల తేడాతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ సేన ఆల్‌రౌండ్ ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తోంది. మరోవైపు తొలుత టి20 సిరీస్‌ను, తాజాగా మొదటి మ్యాచ్‌ను కోల్పోయిన వెస్టిండీస్ మహిళల జట్టు తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఇప్పుడు రెండో వన్డే ఓడితే సిరీస్‌నే సమర్పించుకుంటుంది. అలా కాకుండా టి20 సిరీస్‌లో రెండో మ్యాచ్ గెలిచి పుంజుకున్నట్లే ఈ 50 ఓవర్ల మ్యాచ్‌లోనూ సత్తా చాటి సిరీస్‌ను సమం చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య మంగళవారం ఆసక్తికర పోరు జరుగనుంది.

స్మృతిని ఆపతరమా!

భారత ఓపెనర్ స్మృతి మంధాన అసాధారణ ఫామ్‌లో ఉంది. ప్రతీ మ్యాచ్‌కు తన పరుగుల జోరు పెంచుతోంది. ముంబై జరిగిన పొట్టి సిరీస్‌లో వరుసగా 54, 62, 77 పరుగులు సాధించిన ఆమె వడోదరలో మరింత చెలరేగింది. మొదటి వన్డేలో 91 పరుగులు చేసిన స్మృతి జోరుకు సెంచరీ మాత్రమే బాకీ ఉంది. నేడు జరిగే పోరులో ఆ ముచ్చట తీరితే భారత్ సిరీస్ గెలవడం కష్టమేమి కాదు. ఉమా ఛెత్రి స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన ప్రతీక రావల్, హర్లీన్ టాపార్డర్‌లో రాణిస్తుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. ఫిట్‌నెస్ సాధించిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వేగంగా 30 పైచిలుకు పరుగులు చేయడంతో బ్యాటింగ్ విభాగానికి ఏ ఢోకా లేదు. రేణుక సింగ్, టిటాస్ సాధు, ప్రియా మిశ్రా, దీప్తి శర్మలతో బౌలింగ్ దళం కూడా పటిష్టంగా కనిపిస్తోంది.

సిరీస్‌లో నిలిచేందుకు...

మరోవైపు కరీబియన్ మహిళల బృందం వన్డే సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్ ఇది. దీంతో సర్వశక్తులు ఒడ్డేందుకు విండీస్ జట్టు సిద్ధమైంది. గత మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆల్‌రౌండ్ ప్రతాపానికి విలవిల్లాడిన జట్టు ఈసారి ఆ పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా ఆడాలని భావిస్తోంది. ఓపెనర్లు హేలీ మాథ్యూస్, క్వియానా జోసెఫ్‌ల డకౌట్ జట్టుకు ప్రతికూలమైంది. తప్పకగెలవాల్సి ఈ పోరులో వీరితో పాటు డియాండ్రా డాటిన్, రషద, షెమైన్‌లు బ్యాట్ ఝులిపిస్తే సిరీస్‌లో పుంజుకోవచ్చు.

జట్లు (అంచనా)

భారత మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, ప్రియా మిశ్రా, టిటాస్ సాధు, సైమా ఠాకూర్, రేణుక సింగ్.

వెస్టిండీస్ మహిళల జట్టు: హేలీ మాథ్యూస్ (కెప్టెన్), క్వియానా, రషద విలియమ్స్, డియాండ్రా డాటిన్, షెమైన్ క్యాంప్‌బెల్, ఆలియా అలెన్, షబిక, జైదా జేమ్స్, అఫీ ఫ్లెచర్, కరిష్మా రమ్హారక్, షమిలియా.

ఫైనల్లో శ్రియాంశి

మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ పోరుకు రుత్విక శివాని–రోహన్ జోడీ

బెంగళూరు: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన శ్రియాంశి వలిశెట్టి తన అద్భుత ఆటతీరును కొనసాగిస్తోంది. తొలిసారి ఈ మెగా ఈవెంట్‌లో ఆమె టైటిల్ పోరుకు చేరుకుంది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో 12వ సీడ్ శ్రియాంశి 25–23, 21–16తో 16వ సీడ్ తస్నీమ్ మీర్ (గుజరాత్)పై గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అన్‌మోల్ ఖరబ్ (హరియాణా)ను ఓడించిన శ్రియాంశి, క్వార్టర్ ఫైనల్లో సాక్షి ఫొగాట్ (రాజస్తాన్)పై నెగ్గింది. రెండో సెమీఫైనల్లో దేవిక సిహాగ్ (హరియాణా) 21–13, 21–10తో ఆదర్శిణి శ్రీ (తమిళనాడు)పై గెలిచి శ్రియాంశితో అమీతుమీకి సిద్ధమైంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని ఫైనల్లోకి అడుగుపెట్టింది. రుత్విక శివాని (పీఎస్‌పీబీ)–రోహన్ కపూర్ (ఢిల్లీ) ద్వయం సెమీఫైనల్లో 21–16, 21–17తో నాలుగో సీడ్ దీప్ రామ్‌భియా–అక్షయ (మహారాష్ట్ర) జంటపై విజయం సాధించింది.



ఆంధ్ర జట్టుకు నిరాశ

- రాజస్తాన్ చేతిలో పరాజయం
- రాణించిన భరత్, సందీప్, శశికాంత్



సందీప్

ముంబై: బ్యాటర్లు రాణించినా... బౌలర్ల వైఫల్యం ఆంధ్ర జట్టును దెబ్బ తీసింది. దాంతో విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. సోమవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టును ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లకు 262 పరుగులు సాధించింది. యారా సందీప్ (67 బంతుల్లో 80 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ (68 బంతుల్లో 64; 7 ఫోర్లు, 1 సిక్స్) కూడా అర్ధ సెంచరీ చేశాడు. అశ్విన్ హెబ్బర్ (31; 3 ఫోర్లు), రికీ భుయ్ (23; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. చివర్లో బౌలర్ శశికాంత్ (16 బంతుల్లో 39 నాటౌట్; 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో ఆంధ్ర స్కోరు 260 పరుగులు దాటింది. 261 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ జట్టుకు ఆంధ్ర బౌలర్లు ఎలాంటి ఇబ్బంది పెట్టలేకపోయారు. నాలుగో ఓవర్లో సత్యనారాయణరాజు బౌలింగ్ సుమిత్ (8) అవుటయ్యాడు. ఆ తర్వాత రామ్మోహన్ చౌహాన్ (133 బంతుల్లో 120 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మహిపాల్ లొమ్రోర్ (119 బంతుల్లో 134 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఆంధ్ర బౌలర్ల భరతం పట్టారు. బౌండరీలు, సిక్స్‌లతో చెలరేగిపోయారు. ఫలితంగా రాజస్తాన్ జట్టు 43.4 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి 266 పరుగులు సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది.



భరత్

హైదరాబాద్‌కు తొలి ఓటమి

- రాణించిన అవనీశ్, తన్మయ్
- ముంబైని గెలిపించిన తనుశ్, అయ్యర్



అవనీశ్

అహ్మదాబాద్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. సోమవారం జరిగిన గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌లో ముంబై జట్టు మూడు వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 38.1 ఓవర్లలో 169 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (74 బంతుల్లో 64; 9 ఫోర్లు, 1 సిక్స్), అభిరత్ రెడ్డి (58 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే అభిరత్ రెడ్డి అవుటయ్యాక హైదరాబాద్ వికెట్ల పతనం మొదలైంది. కెప్టెన్ తిలక్ వర్మ (0) ఖాతా తెరవకుండానే నిష్క్రమించగా...రోహిత్ రాయుడు (1), వరుణ్ (1), అజయ్‌దేవ్ గౌడ్ (7) కూడా క్రీజులో నిలువలేకపోయారు. స్కోరు 125 పరుగుల వద్ద తన్మయ్ కూడా అవుటయ్యాడు. సహచరులు వెనుదిరుగుతున్నా మరోవైపు వికెట్ కీపర్ అరవెల్లి అవనీశ్ రావు (47 బంతుల్లో 52; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో హైదరాబాద్ స్కోరు 160 పరుగులు దాటింది. హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో తన్మయ్, అభిరత్, అవనీశ్ మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. ముంబై బౌలర్లలో అథర్వ అంకోలేకర్ 55 పరుగులిచ్చి 4 వికెట్లు, ఆయుశ్ మాత్రే 17 పరుగులిచ్చి 3 వికెట్లు, తనుశ్ కొటియాన్ 38 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు. 170 పరుగుల విజయలక్ష్యాన్ని ముంబై జట్టు 25.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ముంబై టాప్ స్టార్స్ లోయర్ ఆర్డర్‌లోకి మారారు. ఈ ప్రయోగం కలిసిరాలేదు. ఒకదశలో ముంబై 67 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. తొమ్మిదో స్థానంలో వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (20 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఏడో స్థానంలో వచ్చిన తనుశ్ కొటియాన్ (37 బంతుల్లో 39 నాటౌట్; 6 ఫోర్లు) ఎనిమిదో వికెట్‌కు 70 పరుగులు జతచేసి ముంబై జట్టును విజయతీరాలకు చేర్చారు. హైదరాబాద్ బౌలర్లలో నిశాంత్ 3 వికెట్లు, ముదస్సర్ 2 వికెట్లు తీసుకున్నారు.

ధనుశ్‌కు రజతం



భోపాల్: జాతీయ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ రజత పతకాన్ని సాధించాడు. సోమవారం జరిగిన సీనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ధనుశ్ రెండో స్థానంలో నిలిచాడు. ధనుశ్ 252.2 పాయింట్లతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు. షాహు తుషార్ మానె (రైల్వేస్; 252.3 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

రుద్రాంక్ష్ ప్రపంచ రికార్డు

జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన రుద్రాంక్ష్ పాటిల్ కొత్త ప్రపంచ రికార్డు లిఖించి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో రుద్రాంక్ష్ 254.9 పాయింట్లు స్కోరు చేసి 254.4 పాయింట్లతో షెంగ్ లిహావో (చైనా) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు.

ఆస్పత్రిలో వినోద్ కాంబ్లీ



ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ ఆస్పత్రిలో చేరాడు. 52 ఏళ్ల కాంబ్లీ ఆరోగ్యం క్షీణించడంతో శనివారమే ముంబైలోని ప్రముఖ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ రోజు మూత్రనాళ ఇన్ఫెక్షన్ సమస్యలతో అడ్మిట్ చేయగా... తదనంతర వైద్యపరీక్షల్లో మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకడుతున్నట్లు తేలిందని డాక్టర్ వివేక్ త్రివేది వెల్లడించారు. దీంతో ఇన్సెంటివ్ క్రిటికల్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉంచి ప్రత్యేక వైద్యబృందం ఎప్పటికప్పుడు అతని ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. నేడు కూడా అవసరమైన వైద్యపరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆ వైద్య బృందం పేర్కొంది. ముంబైకి చెందిన ఈ మాజీ క్రికెటర్ చాన్నాళ్ల నుంచే అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఇటీవల దిగ్గజ కోచ్ రమాకాంత్ ఆచ్రేకర్ స్మారక కార్యక్రమంలో కాంబ్లీ పాల్గొన్నప్పటికీ కుర్చీకే పరిమితమయ్యాడు.



ఓటమితో తెలంగాణ ముగింపు

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టు పోరాటం లీగ్ దశలోనే ముగిసింది. డెక్కన్ ఎరీనాలో సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 1–3 గోల్స్ తేడాతో మణిపూర్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఆట 16వ నిమిషంలో కంగబం లంగాంబ సింగ్ గోల్‌తో మణిపూర్ ఖాతా తెరిచింది. 40వ నిమిషంలో సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్ గోల్‌తో తెలంగాణ స్కోరును 1–1తో సమం చేసింది. 85వ నిమిషంలో జహీర్ ఖాన్, 87వ నిమిషంలో సాగర్ సింగ్ ఒక్కో గోల్ చేయడంతో మణిపూర్ 3–1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఇతర మ్యాచ్‌ల్లో జమ్మూ కశ్మీర్ జట్టు 1–0తో రాజస్తాన్ జట్టుపై గెలుపొందగా... పశ్చిమ బెంగాల్ జట్టు 1–0తో డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్ జట్టును ఓడించింది. ఆరు జట్లున్న గ్రూప్ 'ఎ' నుంచి వరుసగా టాప్–4లో నిలిచిన పశ్చిమ బెంగాల్ (13 పాయింట్లు), మణిపూర్ (11 పాయింట్లు), సర్వీసెస్ (9 పాయింట్లు), జమ్మూ కశ్మీర్ (7 పాయింట్లు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఒక్కో పాయింట్ సాధించిన రాజస్తాన్, తెలంగాణ వరుసగా ఐదు, ఆరు స్థానాల్లో నిలిచాయి.

షమీ ఆస్ట్రేలియా వెళ్లడం లేదు

బీసీసీఐ అధికారిక ప్రకటన



న్యూఢిల్లీ: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ చివరి దశలో భారత పేసర్ మొహమ్మద్ షమీ జట్టుతో చేరవచ్చంటూ గత కొద్ది రోజులుగా వచ్చిన వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. అతను ఆస్ట్రేలియాకు వెళ్లడం లేదని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం అధికారికంగా ప్రకటించింది. గాయం నుంచి కోలుకొని రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడటంతో పాటు ముస్తాక్ అలీ టి20 టోర్నీలో కూడా అన్ని మ్యాచ్‌లు ఆడటంతో షమీ ఫిట్‌గా ఉన్నట్లు అనిపించింది. అతని అనుభవం ఆసీస్ గడ్డపై ఉపయోగపడుతుంది కాబట్టి చివరి రెండు టెస్టులకు అందుబాటులో ఉన్నా అది భారత్‌కు సానుకూలాంశంగా భావించారు. అయితే ఇప్పుడు అలాంటి అవకాశం లేదు. కాలి మడమ గాయం కారణంగా ఏడాది కాలంగా ఆటకు దూరమైన షమీ దానినుంచి కోలుకున్నా... కొత్తగా మోకాలి గాయంతో బాధపడుతున్నట్లు తేలింది. ఇటీవల ఇదే విషయాన్ని కెప్టెన్ రోహిత్ శర్మ కూడా వెల్లడించాడు. షమీ 200 శాతం ఫిట్‌గా ఉంటేనే అతడి పేరును ఆసీస్‌తో సిరీస్‌కు పరిశీలిస్తామని, అతని గాయం తీవ్రతపై బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) తగిన వివరాలు వెల్లడించాలని కూడా రోహిత్ కోరాడు. ఇప్పుడు దీనిపై సీఓఈ స్పష్టతనిచ్చింది. 'షమీ గాయం విషయంలో మా వైద్యబృందం అన్ని రకాలుగా పర్యవేక్షిస్తోంది. శస్త్రచికిత్స, రీహాబిలిటేషన్ తర్వాత అతను మడమ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. బెంగాల్ తరఫున ఆడిన ఏకైక రంజీ మ్యాచ్‌లో 43 ఓవర్లు బౌలింగ్ చేయడంతో పాటు ముస్తాక్ అలీ టి20 టోర్నీలో 9 మ్యాచ్‌లు కూడా ఆడాడు. అయితే సుదీర్ఘకాలం తర్వాత ఇంత ఎక్కువగా బౌలింగ్ చేయడం వల్ల ఊహించిన విధంగానే అతని మోకాలిలో వాపు వచ్చింది. తాజా పరిస్థితిని బట్టి చూస్తే అతను మోకాలి నొప్పి నుంచి కోలుకొని పూర్తి స్థాయిలో మళ్లీ బౌలింగ్ చేసేందుకు మరికొంత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో అతను బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో ఆడేందుకు ఫిట్‌గా లేడు. సీఓఈలో అతని స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ ఎక్సర్‌సైజ్‌లు కొనసాగుతాయి. గాయం నుంచి పూర్తిగా కోలుకోవడంపైనే విజయ్ హజారే ట్రోఫీలో అతను మ్యాచ్‌లు ఆడటం ఆధారపడి ఉంది' అని బీసీసీఐ పేర్కొంది. 2023 నవంబర్‌లో ఆస్ట్రేలియాపై వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత షమీ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడలేదు. ముస్తాక్ అలీ ట్రోఫీ తర్వాత ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో షమీ బరిలోకి దిగలేదు.

పాకిస్తాన్ చిరస్మరణీయ విజయం

దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్ 3–0తో క్లీన్‌స్వీప్

- ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు
- చివరి వన్డేలో 36 పరుగులతో గెలుపు
- సయీమ్ అయూబ్ సెంచరీ



జొహన్నెస్‌బర్గ్: సఫారీ గడ్డపై పాకిస్తాన్ చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికాను వారి సొంతగడ్డపై తొలిసారి క్లీన్‌స్వీప్ చేసిన జట్టుగా నిలిచింది. ఆదివారం రాత్రి జరిగిన ఆఖరి వన్డేలో పాక్ 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిలో 36 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది. మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుంది. వర్షం అంతరాయం పరచడంతో 47 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేపట్టిన పాకిస్తాన్ నిర్ణీత 47 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 308 పరుగుల భారీస్కోరు చేసింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్ సయీమ్ అయూబ్ (94 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఈ సిరీస్‌లో రెండో శతకాన్ని నమోదు చేశాడు. తొలి వన్డేలోనూ అతను 'శత'క్కొట్టాడు. వన్‌డౌన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (71 బంతుల్లో 52; 7 ఫోర్లు)తో రెండో వికెట్‌కు 114 పరుగులు జతచేసిన అయూబ్ తర్వాత రిజ్వాన్ (52 బంతుల్లో 53; 5 ఫోర్లు, 1 సిక్స్)తో మూడో వికెట్‌కు 93 పరుగులు జోడించాడు. 91 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాక నిష్క్రమించాడు. రిజ్వాన్, సల్మాన్ ఆఘా (33 బంతుల్లో 48; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) జోడీ కూడా ఆరో వికెట్‌కు 47 బంతుల్లోనే వేగంగా 74 పరుగులు జతచేయడంతో పాక్ వరుసగా ఈ మ్యాచ్‌లోనూ 300 పైచిలుకు స్కోరును సాధించింది. ఆతిథ్య బౌలర్లలో రబడ 3, జాన్సెన్, ఫోర్టిన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 42 ఓవర్లలోనే 271 పరుగుల వద్ద ఆలౌటైంది. క్లాసెన్ (43 బంతుల్లో 81; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే ధాటిగా ఆడాడు. మిగతా వారిలో కార్బిన్ బాష్ (44 బంతుల్లో 40 నాటౌట్; 5 ఫోర్లు), డసెన్ (52 బంతుల్లో 35; 4 ఫోర్లు, 1 సిక్స్) కాస్త మెరుగ్గా ఆడారంతే! అరంగేట్రం చేసిన వన్డేలోనే స్పిన్నర్ సూఫియాన్ ముఖీమ్ (4/52) అదరగొట్టాడు. షాహిన్ అఫ్రిది, నసీమ్ షా చెరో 2 వికెట్లు తీశారు. సఫారీ పర్యటనలో ముందుగా జరిగిన మూడు టి20ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2–0తో వశం చేసుకుంది. ఇందులో ఆఖరి పోరు వర్షంతో రద్దయ్యింది. ఇక మిగిలిన రెండు టెస్టుల సిరీస్ 'బాక్సింగ్ డే' రోజు 26న సెంచూరియన్‌లో మొదలవుతుంది. తాజా విజయంతో పాకిస్తాన్ వరుసగా ఐదో ద్వైపాక్షిక సిరీస్ గెలుచుకుంది.. ఇంతకుముందు న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, జింబాబ్వేలపై పాక్ వన్డే సిరీస్‌లను చేజిక్కించుకుంది.

వీళ్లు వ్యాక్సిన్ వేశారు.. వాళ్లు బాంబులు వేశారు!

తల్లిని కోల్పోయి.. కాళ్లను పోగొట్టుకుని • గాజాలో చిన్నారుల ఆవేదనభరిత వ్యధ



గాజాలోని.. ఓ ఆస్పత్రి. 22 నెలల వయసున్న చెల్లెలు మిస్కతో కలిసి నాలుగు నెలలుగా ఆస్పత్రిలోనే ఉంటోంది మూడేళ్ల హనన్. 'అమ్మేది?', 'కాళ్లెక్కడికి పోయాయి'పదే పదే అడిగే ఈ ప్రశ్న తప్ప వారి నోటినుంచి మరో మాటలేదు. 'నాలుగు నెలలుగా మనమో పీడకలలో ఉన్నాం'అని చెబుతోంది పక్కనే ఉన్న వారి అత్త. బాంబు దాడిలో అమ్మ చనిపోయిందని, ఆ దాడిలోనే ఇద్దరి కాళ్లూ పోయాయని వాళ్లకు చెప్పలేక కుమిలిపోతోంది. ఇది గాజాలోని ఆస్పత్రుల్లో కనిపించే నిత్య దృశ్యం. మనుషులు వేరు.. అడిగే ప్రశ్నలు వేరు.. కానీ ఎవ్వరి దగ్గరా సమాధానాలు ఉండవు. తమ ప్రమేయం ఏమాత్రం లేకపోయినా.. జరుగుతున్న మారణహోమంలో ప్రాణాలు పోగొట్టుకున్న చిన్నారులు వేలమంది. వైకల్యం పాలైనవారి లెక్కలు లేనేలేవు.

గాజాలో తొలి పోలియో కేసు నమోదు కావడంతో ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలకు టీకాలు ఇచ్చేందుకు యుద్ధానికి విరామం ప్రకటించాలని సూచించింది. ఇజ్రాయెల్, గాజా రెండూ ఈ విరామాన్ని అంగీకరించాయి. సెప్టెంబర్ 2న కార్యక్రమం మొదలైంది. డేర్ ఎల్ బలాహ్‌లో ఉంటున్న షైమా అల్ దఖీ... ఉదయాన్నే లేచి తన ఇద్దరు కుమార్తెలు హనన్, మిస్కను తీసుకెళ్లి టీకా ఇప్పించింది. మరుసటి రోజు కుటుంబం భోజనం చేసింది.. నిద్రించడానికి ఉపక్రమిస్తుండగా.. వాళ్ల ఇంటిపై బాంబు దాడి. ఈ ఘటనలో షైమా ప్రాణాలు కోల్పోయింది. భర్త మహ్మద్ అల్ దఖీతో సహా ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. హనన్ రెండు కాళ్లను కోల్పోయింది. ఆమె శరీరమంతా గాయాలే. చిన్నారి మిస్క ఎడమ కాలు కోల్పోయింది. తలలో తీవ్ర రక్తస్రావమవ్వడంతో మహమ్మద్ రెండు వారాలపాటు ఐసీయూలో ఉండాల్సి వచ్చింది.

భయానకంగా భవిష్యత్..

మహమ్మద్ సోదరి షెఫా.. ఇద్దరు అమ్మాయిలను ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది. ఇద్దరూ భయంతో వణికిపోతూ అత్తను పట్టుకునే ఉంటున్నారు. ఇప్పటికైతే ఏదో ఒకటి చెప్పి వారిని ఊరడిస్తోంది. కానీ.. భవిష్యత్‌లో పిల్లల పరిస్థితి ఏమిటి? తమ వయసులోని ఇతర పిల్లలను చూసి వీళ్లేమనుకుంటారు. లోకమంటే తెలియని మిస్కకు అంత కష్టం కాకపోయినా.. తన కుటుంబానికి ఏం జరిగిందో కొంచెం అర్థమైన హనన్‌కు మాత్రం ఇది కష్టంగా ఉంది. పెరుగుతున్న బాధితులతో చికిత్స అందించడానికే సమయం సరిపోని వైద్యులకు చిన్నారులకు మానసికంగా మద్దతు ఇచ్చే అవకాశం అసలే లేదు. షెఫాతోపాటు షైమా తల్లిదండ్రులు, షైమా సోదరుడు అహ్మద్ పిల్లలను చూసుకుంటున్నారు. పిల్లలు బొమ్మలు కావాలంటున్నారు.. కానీ రొట్టె ముక్క విలాసంగా మారిన చోట బొమ్మలు దొరకడం అసాధ్యం కదా! ఏచిన్న అవకాశం దొరికినా పిల్లలను సంతోషంగా ఉంచేందుకు కానుకలు తెస్తున్నారు.

ఇతర పిల్లల కాళ్ల వైపు చూస్తూ..

''గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమైన నాటి నుంచే షైమా బిడ్డల గురించి భయపడింది. వారికి పోషకాహారం అందించడానికి ఎంతో శ్రమించింది. వారితోనే సమయం గడిపింది. వాళ్లు కావాలన్నది ఇవ్వడానికి ప్రయత్నించింది. పోలియో వ్యాక్సిన్ల ప్రకటన రాగానే.. పోలియో నుంచి రక్షణ కోసం వ్యాక్సిన్స్ తన పిల్లలకు వేయించడమే కాదు.. బంధువులందరినీ ప్రోత్సహించింది. కానీ ఏం జరిగింది. పోలియో నుంచి రక్షణ లభించింది కానీ.. ఇజ్రాయెల్ వైమానిక దాడి వారి కాళ్లను తీసుకుంది. షైమాను పొట్టన పెట్టుకుంది. తల్లి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. హనన్‌ది నా కూతురు హలాది ఒకే వయసు. హలాను ఆస్పత్రికి తీసుకొచ్చినప్పుడు.. హనన్ భావాలను నేను ఎప్పటికీ మర్చిపోలేను. హలా కాళ్ల వైపు చూస్తూ, ఆ తర్వాత తన కాళ్లను చూసుకుంటూ ఉండిపోయింది. బాంబు దాడికి ముందు వాళ్లిద్దరూ కలిసి ఆడుకునేవారు. ఇప్పుడు ఆసుపత్రి మంచంపై ఆడుకుంటున్నారు''అంటూ కన్నీటి పర్యంతమవుతోంది షెఫా.

వైద్యం కోసం ఎదురుచూపులు

బాంబుదాడులతో గాజా ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైపోయింది. చిన్నారులిద్దరూ పూర్తిగా కోలుకోవాలంటే గాజాలో ఇచ్చే చికిత్స సరిపోదు. వాళ్లకు కేవలం ప్రోస్తెటిక్స్ అమరిస్తే సరిపోదు. పిల్లలిద్దరిదీ ఎదిగే వయసు. వయసుతో పాటు ఎముక పెరుగుదల కొత్త సమస్యలను తెచ్చిపెడుతుంది. అందుకే నిరంతర పర్యవేక్షణ, శస్త్రచికిత్సలు అవసరం. చికిత్స కోసం గాజాను విడిచిపెట్టాల్సిన వ్యక్తుల జాబితాలో వాళ్ల పేర్లను చేర్చారు. ఇజ్రాయెల్ ఆమోదిస్తే తప్ప వారిని విడిచిపెట్టలేరు. ఆమోదం కోసం మూడు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో 'నేను బూట్లెలా వేసుకోవాలి?', 'నేను ఆడుకోవడానికి పార్క్‌కు వెళ్లొద్దా?'అంటూ పిల్లలడిగే ప్రశ్నలకు బదులెవరు చెప్తారు? గాజాలో జరుగుతున్న మారణహోమాన్ని నిశ్శబ్దంగా చూస్తున్న ప్రపంచాన్ని భవిష్యత్‌లో ఆ చిన్నారులు ఎలా చూస్తారు? అంతటా సమాధానం లేని ప్రశ్నలే!

– సాక్షి, నేషనల్ డెస్క్



శాంటా క్లాజ్, రుదోల్ఫ్ మాదిరి దుస్తులు ధరించిన డైవర్లు నీటిలో నుంచి ఓ చిన్నారి క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్నట్లుగా ఉన్న ఈ దృశ్యం సోమవారం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని లొట్టె వరల్డ్ అక్వేరియం వద్ద కనిపించింది.



ఇదేదో వందేళ్ల క్రితం నాటి తెలుపునలుపు చిత్రమనుకుంటే పొరపాటుపడ్డట్లే. సోమవారం హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో మంచు కురుస్తుండగా సరదగా తిరుగుతున్న పర్యాటకులు వీరు.

పనామా వెనక్కి తీసుకుంటాం

మరోసారి ట్రంప్ కవ్వింపు ప్రకటన • తోసిపుచ్చిన పనామా అధ్యక్షుడు ములినో

ఫీనిక్స్: అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టకముందే ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ పొరుగుదేశాలపై కవ్వింపు చర్యలు మొదలుపెట్టారు. మిత్రదేశానికి తెలివితక్కువగా అప్పగించిన పనామా కాలువపై నియంత్రణను తిరిగి పొందడానికి తన కొత్త యంత్రాంగం ప్రయత్నిస్తుందని ట్రంప్ ప్రకటించారు. కీలకమైన ఈ రవాణా మార్గం గుండా వెళ్ళడానికి అత్యధిక రుసుము వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాగా, ట్రంప్ ప్రకటనను పనామా కన్జర్వేటివ్ అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో తోసిపుచ్చారు. ఇది తమ దేశ సార్వభౌమత్వానికి అవమానమని కొట్టిపారేశారు.



ఓవైపు ప్రభుత్వ షట్‌డౌన్‌ను నివారించడానికి కాంగ్రెస్ కృషి చేస్తుండగా.. ఫ్లోరిడాలోని తన రిసార్ట్ మార్–ఎ–లాగోలో ఉన్న ట్రంప్.. అక్కడినుంచే తేనెతుట్టలను కదుపుతున్నారు. అమెరికా ఫెస్ట్‌లో మద్దతుదారులను ఉద్దేశించి ఆదివారం ప్రసంగించారు. తాము అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్న ట్రంప్.. విశ్వాసాన్ని కోల్పోయిన డెమొక్రాట్లు తమ వైపు వస్తే స్వాగతిస్తామన్నారు. పనామా కాలువను తమ దేశం మూర్ఖంగా ఇచ్చేసిందని విచారం వ్యక్తం చేశారు. కాలువ విషయంలో అమెరికా పట్ల నైతిక, చట్టపరమైన సూత్రాలను పాటించకపోతే, కాలువను అమెరికాకు తిరిగి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తామన్నారు. తదనుగుణంగా అధికారులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అదెలా సాధ్యమనే విషయాన్ని ఆయన వివరించలేదు. అంతేకాదు.. పనామా అధ్యక్షుడు ములినోను కన్జర్వేటివ్ జనాకర్షకుడని, పలు విషయాల్లో తనతో ఏకీభవిస్తారని ట్రంప్ అభివర్ణించారు.

పనామా అంతా ఏకమవుతుంది: ములినో

ట్రంప్ ప్రకటనపై పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో స్పందించారు. ట్రంప్ ప్రసంగించిన కొద్దిసేపటికే 'ఆ కాలువలోని ప్రతి చదరపు మీటర్ పనామాకు చెందినదని, అది తమ దేశానికి చెందుతుందని ములినో ఓ వీడియోను విడుదల చేశారు. ట్రంప్ పేరును ప్రస్తావించకుండా, నిర్వహణ ఖర్చులు, సరఫరా, డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకుని నిపుణుల కమిటీ పన్నులను నిర్ణయిస్తుందని ములినో అన్నారు. సుంకాలు ఇష్టానుసారంగా నిర్ణయించలేదని ములినో చెప్పారు. షిప్ ట్రాఫిక్‌ను పెంచడానికి పనామా కొన్ని సంవత్సరాలపాటు కాలువను విస్తరించిందని, రుసుముల పెరుగుదల కాలువ అభివృద్ధికే ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాదు.. పనామావాసులు ఇతర అంశాలపై భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చని, కానీ కాలువ, సార్వభౌమాధికారం విషయానికి వస్తే... పనామా అంతా ఏకమవుతుందని స్పష్టం చేశారు.

పనామా కాలువపై ఎందుకీ వివాదం..

పనామా.. అమెరికాకు మిత్రదేశం. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ కాలువ కీలకమైనది. ఆ ప్రభుత్వ వార్షిక ఆదాయంలో ఐదోవంతు దీనినుంచే వస్తుంది. తన తీరాల మధ్య వాణిజ్య, సైనిక నౌకల రవాణాను సులభతరం చేయడంలో భాగంగా అమెరికా 1900ల ప్రారంభంలో ఈ కాలువను నిర్మించింది. 1977లో అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ సంతకం చేసిన ఒప్పందం ప్రకారం 1999 డిసెంబర్ 31న పనామా కాలువపై నియంత్రణను అమెరికా కోల్పోయింది. 2023లో మధ్య అమెరికా కరువుల వల్ల కాలువ తీవ్రంగా ప్రభావితమైంది. సరిపడా జలాలు లేక నౌకలు దాటే స్లాట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించాల్సి వచ్చింది. దీంతో కాలువ దాటేందుక వసూలు చేసే రుసుమును కూడా పెంచారు. ఈ ఏడాది చివరి నెలల్లో వాతావరణం సాధారణ స్థితికి చేరుకోవడంతో కాలువపై రాకపోకలు యథాస్థితికి చేరుకున్నాయి. రుసుములు యథాస్థితిలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ 'నియంత్రణ'వ్యాఖ్యలు చేశారు

యూపీఎస్సీ మోసం కేసు.. పూజా ఖేడ్కర్‌కు నో బెయిల్

న్యూఢిల్లీ: మాజీ ఐఏఎస్ ప్రొబేషనరీ అధికారి పూజా ఖేడ్కర్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. సివిల్స్‌కు ఎంపికయ్యేందుకు ఓబీసీ కేటగిరీ, అంగ వైకల్యానికి సంబంధించిన తప్పుడు సర్టిఫికెట్లను సమర్పించి, మోసం చేసినట్లు ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సోమవారం మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ చంద్ర ధారి సింగ్..ఆమెపై ఉన్న ఆరోపణలకు ప్రాథమికంగా తగు ఆధారాలున్నాయని పేర్కొన్నారు. వ్యవస్థను తప్పుదారి పట్టించేందుకు జరిగిన ప్రయత్నం వెనుక ఉన్న పెద్ద కుట్రను ఛేదించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పూజా ఖేడ్కర్ కుటుంబసభ్యులు ఉన్నత స్థానాల్లో ఉన్నందున అరెస్టుకు ముందుగానే బెయిలిస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటూ ఆయన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు. ఖేడ్కర్‌కు బెయిలివ్వరాదంటూ ఢిల్లీ పోలీసులతోపాటు, యూపీఎస్సీ తరఫు లాయర్లు వాదనలు వినిపించారు. ఆగస్టు 12వ తేదీ నుంచి ఢిల్లీ హైకోర్టు ఆమెకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ వస్తోంది.

గాజాలో 20 మంది మృత్యువాత

జెరూసలేం: గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి జరిగిన దాడుల్లో మరో 20 మంది మృతి చెందారు. మువాసి ప్రాంతంలో మానవతా జోన్‌లో శరణార్థులు తలదాచుకునే టెంట్లపై ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన దాడిలో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది ప్రాణాలు కోల్పోయారని నాసెర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మానవతా సాయం అందించే కాన్వాయ్‌కు రక్షణగా ఉంటున్న వారిపై జరిగిన దాడిలో ఆరుగురు, మువాసిలోని ఓ కారుపై దాడిలో ఇద్దరు, మరో చోట మరొకరు చనిపోయారని పేర్కొన్నాయి. నుసెయిరత్ శరణార్థుల క్యాంప్‌లోని స్కూలు భవనంపై జరిగిన దాడిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అల్–అక్సా ఆస్పత్రి తెలిపింది. కాగా, మానవతా జోన్‌లో దాగున్న హమాస్ శ్రేణులే లక్ష్యంగా ఆదివారం రాత్రి దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించుకోవడం గమనార్హం.

పథకాల రిజిస్ట్రేషన్లలో కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించిన 'మహిళా సమ్మాన్ యోజన', 'సంజీవని యోజన'రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. సోమవారం ముఖ్యమంత్రి ఆతిశీ, మాజీ మంత్రి మనీష్ సిసోడియాలతో కలిసి ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈస్ట్ కిద్వాయ్ నగర్‌లోని ఓ ఇంటికి వెళ్లిన కేజ్రీవాల్ మహిళా సమ్మాన్ యోజనకు మహిళల వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేశారు. జంగ్‌పురాలో సంజీవని యోజన రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. మహిళా సమాన్ యోజన కోసం పసుపు రంగు కార్డు, సంజీవని యోజన కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నీలి రంగు కార్డులు అందజేశారు. పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఈ రెండు పథకాలు ఢిల్లీ ఓటర్లకు మాత్రమే వర్తిస్తాయన్నారు. మహిళా సమ్మాన్ యోజనకు అర్హులైన లబ్ధి దారులకు నెలకు ముందుగా రూ.1000 ఇస్తారు. ఎన్నికల తర్వాత ఆప్ మళ్లీ అధికారంలోకి వస్తే ఈ మొత్తాన్ని రూ.21,00కు పెంచుతారు. సంజీవని యోజన కింద 60ఏళ్లు పైబడిన వృద్ధులకు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తామని కేజ్రీవాల్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఆస్పత్రి నుంచి బీజేపీ ఎంపీలు డిశ్చార్జ్

సాక్షి, న్యూఢిల్లీ: ఈనెల 19వ తేదీన కొత్త పార్లమెంట్ భవనం వద్ద జరిగిన ఘర్షణలో గాయపడిన బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్ సోమవారం ఉదయం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆ రోజు జరిగిన దాడిలో సారంగికి నుదురు, మోకాలికి గాయాలయ్యాయి. దీంతో రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలోని ఐసీయూలో చేర్చిన విషయం తెలిసిందే. సారంగికి గతంలోనే గుండె సమస్య ఉందని, స్టెంట్ వేశారని వైద్యులు తెలిపారు. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ పరీక్షలు జరిపినట్లు చెప్పారు. సారంగి నుదుటికి గట్టి దెబ్బ తగలడంతో రక్త స్రావమైందని, కుట్లు వేయాల్సి వచ్చిందని చెప్పారు. రాజ్‌పుత్ తలకు గాయమవడంతో వెంటనే స్పృహ కోల్పోయారని, బీపీ పెరిగిపోయిందని చెప్పారు. వైద్య చికిత్సలతో ఆయన ఆరోగ్యం యథాస్థితికి వచ్చిందన్నారు. గత ఐదు రోజులుగా చికిత్స తీసుకున్న ఇద్దరు ఎంపీలు పూర్తిగా కోలుకున్నారని, వారి ఆరోగ్యం మెరుగు పడిందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అజయ్ శుక్లా తెలిపారు.

దేశ నిర్మాణంలో పీవీ పాత్ర కీలకం

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: దేశ నిర్మాణంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పాత్ర కీలకమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. సోమవారం పీవీ వర్ధంతి సందర్భంగా 'ఎక్స్'వేదికగా ఆయన నివాళులర్పించారు. 'పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో దేశం అనేక మైలురాళ్లను అధిగమించింది. ఆయన సాహసోపేతమైన ఆర్థిక సరళీకరణ విధానం మధ్య తరగతి వృద్ధి, సంక్షేమానికి ఎంతగానో ఉపయోగపడింది. ఆయన పాలనలో మధ్య తరగతి రూపురేఖలను మారిపోయాయి. అణు రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారు. వినూత్న విదేశీ విధాన కార్యక్రమాలకు ఆయన నాయకత్వం వహించారు'అని పేర్కొన్నారు.

30న ఇస్రో స్పేడెక్స్ మిషన్ ప్రయోగం

బెంగళూరు: స్పేడెక్ మిషన్‌ను ఈ నెల 30న శ్రీహరి కోట నుంచి పీఎస్ఎల్వీ–సీ60 ద్వారా ప్రయోగించనున్నట్లు ఇస్రో సోమవారం తెలిపింది. అంతరిక్షంలో వ్యోమనౌకను స్థిరంగా నిలిపి ఉండటం, పరిభ్రమించేలా చేయడానికి అవసరమైన సాంకేతికతల అభివృద్ధికి ఈ ప్రయోగాన్ని ఉద్దేశించామంది. ఇందులో 220 కిలోల చొప్పున బరువుండే రెండు ఉపగ్రహాలుంటాయని వెల్లడించింది. చంద్రయాన్ యాత్ర విజయవంతానికి ఈ మిషన్ ప్రయోగం ఎంతో అవసరమని వెల్లడించింది. ఈ నెల 21న లంచ్ వెహికల్‌ను ఫస్ట్ లాంఛ్ ప్యాడ్‌కు తరలించి అనుసంధానం చేసినట్లు తెలిపింది. 30న చేపట్టే ప్రయోగాన్ని లాంఛ్ వ్యూ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా చూడొచ్చని, ఇందుకోసం సోమవారం నుంచి సందర్శకుల రిజిస్ట్రేషన్ మొదలైందని పేర్కొంది.

ఆప్‌పై బీజేపీ ఛార్జ్‌షీట్

- విడుదల చేసిన అనురాగ్ ఠాకూర్
- పాపాలు కడుగుతూ యమునా నది మైలపడిందంటూ విమర్శ
- కేజ్రీవాల్ అవినీతి కాలుష్యం నుంచి ఢిల్లీని రక్షించాలని పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయ వేడి పెరుగుతోంది. బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. కేజ్రీవాల్ అవినీతి కాలుష్యం నుంచి ఢిల్లీని రక్షించాలని బీజేపీ పిలుపునిచ్చింది. అన్నా హజారేను ముందు పెట్టి కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపిన కేజ్రీవాల్... అవినీతికి కొత్త ప్రమాణాలను తీసుకువచ్చారని బీజేపీ ఆరోపించింది. ఆప్‌తో పాటు ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌పై బీజేపీ సోమవారం ఢిల్లీలో పలు ఆరోపణలతో కూడిన ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఢిల్లీలో పాఠశాలలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తామని కేజ్రీవాల్ హామీ ఇస్తే.. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని బీజేపీ మండిపడింది. 24 గంటలు ఢిల్లీలో మంచినీరు సరఫరా చేస్తామని హామీ ఇస్తే.. ఢిల్లీ జనమంతా ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటూ డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తోందన్నారు. పదేళ్లలో ఢిల్లీ ప్రజలకు ఒక్క రేషన్‌కార్డు కూడా జారీ చేయలేదని విమర్శించింది. ఢిల్లీలో ప్రధాన మంత్రి ఆయుష్మాన్ యోజన అమలు కాని కారణంగా ప్రజలు రూ.5 లక్షల విలువైన వైద్య సదుపాయానికి దూరమయ్యారంది. అంతేగాక ఢిల్లీలో కాలుష్యం కారణంగా, ప్రజల ఆయుర్దాయం 17 ఏళ్ల వరకు తగ్గిందని.. పరిశుభ్రత లోపించడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో అందులో మునిగి విద్యార్థులు దుర్మరణం చెందారని ఆరోపించింది. వాటర్ బోర్డు కుంభకోణం, క్లాస్ రూమ్ కుంభకోణం, మొహల్లా క్లినిక్ కుంభకోణం, వక్ఫ్ కుంభకోణం, లిక్కర్ కుంభకోణం డీటీసీ కుంభకోణం ఇలా.. ఎన్నో అవకతవకలు కేజ్రీవాల్ హయాంలో జరిగాయని మండిపడింది. ఛార్జ్‌షీట్ విడుదల చేసిన సందర్భంగా బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్..ఆప్ ప్రభుత్వం యమునా నదిని ఎంతగానో కలుషితం చేసిందని, దుర్గంధం, నురగ, విష పూరితంగా నదీ జలాలను మార్చేసిందని ఆరోపించారు. 2022లో విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ వచ్చే ఎన్నికలకు ముందు, అంటే 2025 ఎన్నికలకు ముందు ప్రజలతో కలిసి యమునా నదిలో స్నానం చేస్తానని చెప్పినట్లు తనకు గుర్తుందని అనురాగ్ ఠాకూర్ అన్నారు. కేజ్రీవాల్‌కు ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ 10 ఏళ్లు గడిచిపోయాయని, 2025కి ఇంకా 10 రోజులు మాత్రమే మిగిలి ఉంది, యమునా శుభ్రం అయ్యిందా అని ప్రశ్నించారు. కేజ్రీవాల్‌తో పాటు ఢిల్లీ ప్రభుత్వంలోని పలువురు మంత్రులు, అనేకమంది ఎమ్మెల్యేలు జైలుకు వెళ్లారని ఆయన విమర్శించారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ.. ప్రజలకు విద్య, ఆరోగ్యం కలను చూపిన కేజ్రీవాల్ మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్ల మరక ప్రజల జ్ఞాపకాల నుంచి ఇంకా పోలేదని, ఈ అల్లర్లను కేజ్రీవాలే ప్రేరేపించారని ఆరోపించారు. అల్లర్లలో ఐబీ అధికారి అంకిత్ శర్మ మరణించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంకిత్ శర్మను హత్య చేశారని అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించిన తాహిర్ హుస్సేన్ ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన కౌన్సిలర్ అని తెలిపారు.

మృతదేహంపై అత్యాచారం.. రేప్ కాదు

- భారతీయ చట్టాల ప్రకారం అతడిని శిక్షించలేం
- కిడ్నాప్, హత్య సెక్షన్ల కింద మాత్రం దోషే
- ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టీకరణ

రాయ్‌పూర్: మృతదేహంపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని భారతీయ శిక్షా స్మృతి లేదా పోక్సో చట్టాల కింద నేరస్తుడిగా పరిగణించలేమని, ఐపీసీ 376 సెక్షన్‌ను ఈ కేసులో ఆపాదించలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టంచేసింది. కేవలం మృతదేహాల పట్ల కామవాంఛతో మృతశరీరాలను రేప్ చేసే భయంకరమైన చర్యను మన చట్టాలు ఇంతవరకు రేప్‌గా నిర్వచించలేదని, అందుకే ఈ చర్యను నేరంగా పరిగణించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ మేరకు నీలకాంత్ అలియాస్ నీలూ నగేష్‌ను నిర్దోషిగా పేర్కొంటూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. అయితే సాక్ష్యాధారాలను ధ్వంసంచేయడం, హత్య చేసిన వ్యక్తికి సాయపడటం వంటి నేరాల కింద మాత్రం అతడిని దోషిగా తేల్చింది. ''ఐపీసీ సెక్షన్ 376 ఈ కేసులో వర్తించదు. జీవించి ఉన్న వ్యక్తిపై రేప్ చేస్తేనే ఐపీసీ 363, 376(3) సెక్షన్లు, పోక్సో చట్టం,2012లోని ఆరో సెక్షన్, ఎస్సీ,ఎస్టీలపై అట్రాసిటీ చట్టం ,1989లోని 3(2)వీ సెక్షన్లు వర్తిస్తాయి''అని చీఫ్ జస్టిస్ రమేశ్ సిన్హా, జస్టిస్ బిభూ దత్త గురూల హైకోర్టు ధర్మాసనం వివరించింది. 2018 అక్టోబర్ 19న ఛత్తీస్‌గఢ్‌లో గరియాబంద్ జిల్లాలో తొమ్మిదేళ్ల ఎస్సీ మైనర్ బాలికను కిడ్నాప్‌చేసి, గొంతు నులిమి చంపి, పాతిపెట్టిన కేసులో తమకు పడిన శిక్షను సవాల్ చేస్తూ నగేష్, నితిన్ యాదవ్‌లు దాఖలుచేసిన పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు విచారించిన సందర్భంగా పై విధంగా స్పందించింది. మృతదేహంపై అత్యాచారఘోరానికి పాల్పడటం ద్వారా బాధితుల గౌరవప్రద మరణ హక్కుకు నేరస్థుడు భంగం కల్గించారన్న ప్రాసిక్యూషన్ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడిన ప్రధాన నిందితుడు నితిన్ యాదవ్ బాలికను రేప్ చేశాడు. కేకలు వేయడంతో గొంతును లిమి చంపేశాడు. హత్య విషయాన్ని తర్వాత నీలూ నగేష్‌కు చెప్పారు. ఆతర్వాత మృతదేహాన్ని నీలూ నగేష్ సాయంతో కొండ మీదకు తీసుకెళ్లాడు. పూడ్చడానికి ముందు మృతదేహంపై నగేష్ హేయమైన చర్యకు పాల్పడ్డారు. ఈ హత్యోదంతంలో నితిన్‌కు హైకోర్టు జీవితఖైదు విధించింది. నగేష్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

శత్రుఘ్న సిన్హాపై కుమార్ విశ్వాస్ 'రామాయణ' వ్యాఖ్యలు

ముంబై: సీనియర్ నటుడు, రాజకీయ నాయకుడు శత్రుఘ్న సిన్హా, ఆయన కుమార్తె నటి సోనాక్షి సిన్హాలను ఉద్దేశించి కవి కుమార్ విశ్వాస్ 'రామాయణ' అంటూ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారి తీశాయి. 'మీ ఇంటికి 'రామాయణ'అంటూ పేరు పెట్టుకుంటే సరిపోదు, మీ పిల్లలకు రామాయణం బోధించండి. లేదంటే మీ ఇంటి 'లక్ష్మి'ని ఎవరైనా తీసుకెళ్లగలరు'అంటూ యూపీలో జరిగిన ఓ కవితా గోష్టిలో విశ్వాస్ పేర్కొన్నారు. శత్రుఘ్న సిన్హా ముంబై నివాసం పేరు 'రామాయణ'కాగా, ఆయన కుమార్తె సోనాక్షి ఇటీవల నటుడు జహీర్ ఇక్బాల్‌ను వివాహమాడారు. ఈ మతాంతర వివాహాన్ని ఉద్దేశించి విశ్వాస్ ఈ వెక్కిరింపు వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. పలువురు ప్రముఖులు ఆన్‌లైన్‌లో విశ్వాస్ తీరును ఎండగట్టారు. తనకు ఇష్టమున్న వ్యక్తిని పెళ్లాడే స్వేచ్ఛ ఆమెకు లేదా? అంటూ కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాతె నిలదీశారు. ఇవి దిగజారిన కామెంట్లని విశ్వాస్‌పై ఆమె మండిపడ్డారు. రామాయణం చదివుంటే ప్రేమంటే ఏమిటో తెలిసేదన్నారు.

జమిలిపై జనవరి 8న పార్లమెంటరీ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జమిలీ ఎన్నికల సంబంధ బిల్లులను సమీక్షించేందుకు ఏర్పాటైన 39 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)జనవరి 8వ తేదీన తొలిసారిగా సమావేశం కానుంది. పార్లమెంట్‌లో బీజేపీ సభ్యుడు పీపీ చౌదరి నేతృత్వంలో ఈ ప్యానెల్ భేటీ కానుంది. తొలి భేటీలో బిల్లుల్లోని కీలక అంశాలను ప్యానెల్ సభ్యులకు అధికారులు విడమరిచి చెబుతారని పార్లమెంట్‌లోని విశ్వసనీయ వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాజ్యాంగ (129 సవరణ) బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల న్యాయ(సవరణ) బిల్లులను గత వారం లోక్‌సభలో ప్రవేశపెట్టగా శుక్రవారం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పరిశీలన కోసం సిఫార్సుచేసిన విషయం తెల్సిందే. రాష్ట్రాల అసెంబ్లీలు, లోక్‌సభకు ఏకకాల ఎన్నికలపై విస్తృత సమీక్షలో తామూ భాగం పంచుకుంటామని ఇంకొన్ని రాజకీయ పార్టీలు ఆసక్తి కనబరడంతో సభ్యుల సంఖ్యను తొలుత అనుకున్న 31 నుంచి 39కి పెంచడం విదితమే. మొత్తం ప్యానెల్‌లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులున్నారు.

రాజ్యాంగాన్ని రక్షించినందుకే సోమ్‌నాథ్‌ను చంపేశారు

- ఇది నూటికి నూరుపాళ్లు కస్టడీ మరణమే: రాహుల్ గాంధీ

పర్భనీ: మహారాష్ట్రలోని పర్భనీలో ఇటీవల జరిగిన అల్లర్ల సందర్భంగా అరెస్టయి ఆస్పత్రిలో చనిపోయిన సోమ్‌నాథ్ సూర్యవంశీ కుటుంబాన్ని సోమవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరామర్శించారు. దళితుడైనందునే రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రయత్నించిన అతడిని పోలీసులే చంపారని ఆయన ఆరోపించారు. ఇది నూటికి నూరుపాళ్లు లాకప్ డెత్ అని అన్నారు. పర్భనీ రైల్వే స్టేషన్ వెలుపల ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ ప్రతిని ఉంచిన గాజు పేటికను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 10న ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు 50 మందికి పైగా అదుపులోకి తీసుకుని స్థానిక సెంట్రల్ జైలులో ఉంచారు. వీరిలో సోమ్‌నాథ్ సూర్యవంశీ ఒకడు. ఛాతీ నొప్పితో బాధపడుతున్న ఇతడిని పోలీసులు ఈ నెల 15న ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 15న చనిపోయాడు.

సాక్షి ప్లస్
మంగళవారం : 24-12-2024

వికలాంగుల సంక్షేమం.. రాజ్యాంగ రక్షణలు!!

సమాజంలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం భారత రాజ్యాంగంలో ఎన్నో అధికరణలు పొందుపరిచారు. కానీ వికలాంగుల హక్కుల కోసం నేరుగా ఎలాంటి సూచనలు చేయలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం జాతి, మతం, కులం, లింగ, ప్రాంత వివక్షతలను నిషేధించినప్పటికీ.. వ్యక్తుల శారీరక వైకల్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. అయితే రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో అంగ వైకల్య అంశాలను హక్కుల కోణంలో కాకుండా.. సంక్షేమం, సహాయం అందించే కోణంలో పరిశీలించారని భావించడం సమంజసం అంటున్నారు నిపుణులు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ నేపథ్యంలో వికలాంగులకు సంక్షేమ పథకాలు, రాజ్యాంగ రక్షణలపై ప్రత్యేక కథనం...



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఆర్టికల్ 41 ప్రకారం- నిరుద్యోగం, వృద్ధాప్యం, అనారోగ్యం, అంగవైకల్యం, ఇతర అవాంఛనీయ సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంక్షేమం కోసం నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా కార్మిక చట్టాలు రూపొందాయి. ఉదాహరణకు కార్మిక రాజ్య బీమా చట్టం ప్రకారం.. పని ప్రదేశాల్లో ప్రమాదాలకు గురైనప్పుడు నష్ట పరిహారం చెల్లించాలి, వైద్య సహాయం అందించాలి. కార్మికుల కోసం ఇలాంటి సాంఘిక భద్రత చట్టాలను చేశారు. నిరుద్యోగులకు, ఉపాధివరమైన అవకాశాలను అందుకోలేని వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టింది. సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ విద్య, శిక్షణ, సదుపాయాల కల్పన పరంగా పలు పథకాలు అమలు చేస్తోంది.

పీడబ్ల్యూడీ చట్టం -1995

భారతదేశంలో వికలాంగుల సంక్షేమం కోసం మొదటిసారిగా పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ (సమాన అవకాశాలు, హక్కుల రక్షణ, సంపూర్ణ ప్రమేయం) చట్టం - 1995 తీసుకొచ్చారు. వికలాంగుల హక్కుల గుర్తింపు దిశగా దీన్ని ఓ మైలురాయిగా చెప్పొచ్చు. విద్య, ఉద్యోగం, బహిరంగ ప్రదేశాల్లో ప్రవేశించడం లాంటి సదుపాయాలను వికలాంగులకు కల్పించిన మొట్టమొదటి సమగ్ర చట్టంగా పీడబ్ల్యూడీ చట్టం - 1995 గుర్తింపు పొందింది. ఈ చట్టంలోని సెక్షన్ 33 ప్రకారం అంగ వైకల్యం ఉన్న వారు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందే హక్కును కలిగి ఉంటారు. సెక్షన్ 47 ప్రకారం వైకల్యానికి గురైన తర్వాత కూడా ఉద్యోగంలో కొనసాగవచ్చు. ఈ చట్టం అమల్లోకి రాక ముందు వికలాంగులకు కేవలం సదుపాయాల కల్పన లాంటి పరిమిత, నిరోధిత హక్కులు మాత్రమే ఉండేవి. పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ యాక్ట్ -1995 ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. అందులో భాగంగా సెక్షన్ 47 ప్రకారం- సర్వీస్‌లో ఉన్నప్పుడు వైకల్యానికి గురైన అభ్యర్థులను విధుల నుంచి తొలగించకుండా, వారి కేడర్ స్థాయిని తగ్గించకుండా కొనసాగించాలనే నిబంధనలను పొందుపర్చారు. ఒకవేళ వైకల్యం పొందిన అభ్యర్థి అప్పటి వరకు నిర్వహిస్తున్న బాధ్యతలు కొనసాగించలేని పరిస్థితిలో ఉంటే అదే వేతనం, అలవెన్సులతో వేరే ఉద్యోగానికి మార్చాలని చట్టంలో పేర్కొన్నారు. అలాంటి అవకాశం కూడా పొందలేని విధంగా వైకల్యం సంభవిస్తే.. సదరు వ్యక్తికి సరిపడే ఉద్యోగంలో ఖాళీ ఏర్పడే వరకు లేదా పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు అదనపు ఉద్యోగిగా ఉంచి అదే వేతన, సౌకర్యాలు కల్పించాలని చట్టంలో పొందుపర్చారు. వికలాంగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రైవేట్ రంగంలోని యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు అందించడం; విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర సచివాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా నేరుగా ప్రవేశించేందుకు అనువుగా సౌకర్యాలు కల్పించడం కోసం నిధులు సమకూర్చడం లాంటి మరికొన్ని చర్యలను సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ మంత్రిత్వశాఖ చేపడుతోంది.

పీడబ్ల్యూడీ నిర్వచనం ఇలా

పీడబ్ల్యూడీ చట్టంలో 'పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' అనే పదానికి సమగ్ర నిర్వచనం ఇచ్చారు. మెడికల్ అథారిటీ సర్టిఫికేషన్ ప్రకారం- ఏదైనా వైకల్యం 40 శాతం కంటే తక్కువ లేకుండా ఉంటే వికలాంగులుగా పరిగణించాలని చట్టంలోని సెక్షన్ 2(టి) పేర్కొంది. అంధత్వం, అల్పదృష్టి, కుష్టు బారిన పడి స్వస్థత పొందిన వారు (leprosy-cured), బధిరత్వం, చాలన వైకల్యం (locomotor disability), మానసిక వైకల్యం (mental retardation), మానసిక రుగ్మత (mental illness) మొదలైనవి అంగవైకల్యం కిందకు వస్తాయి. ఈ చట్టం అమల్లోకి రాకముందు సుప్రీం కోర్టు కూడా వైకల్యం ఉన్న వారి హక్కులను అర్థం చేసుకోవడంలో సవాళ్లు ఎదుర్కొంది. వికలాంగులను ఉద్యోగ అవకాశాలకు పరిగణించడం ద్వారా సమాన్వతపు హక్కు వారికి కూడా కల్పించినట్లయింది. వికలాంగుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండే పబ్లిక్ సర్వీసుల్లో వారి ప్రాతినిధ్యం పెరిగేలా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. వాస్తవానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం పొందని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే వీలుంది. ఇది వికలాంగులకు కూడా వర్తిస్తుంది. భారత ప్రభుత్వం 1985లో అంగ వైకల్యం ఉన్న అభ్యర్థుల కోసం ఉద్యోగాలను గుర్తించాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను స్టాండింగ్ కమిటీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగులకు సరిపడే ఉద్యోగాలను గుర్తించేందుకు ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో గ్రూపు ఎ,బి కేటగిరీల్లో 416 కేటగిరీల ఉద్యోగాలను గుర్తించింది. ఆయా ఉద్యోగం పనితీరు (జాబ్ డిస్క్రిప్షన్), దానికి కావలసిన శారీరక నియమ నిబంధనలు ఖరారు చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కోసం పలు సంక్షేమ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా అర్హులైన వికలాంగులకు ఆసరా పింఛను పథకం కింద నెలకు రూ.1500 జీవనభృతిని అందిస్తోంది.

యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత భావన

ఐక్య రాజ్య సమితి నేతృత్వంలో యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్(యూఎన్‌సీఆర్‌పీడీ) ఏర్పాటైంది. అంగ వైకల్యాన్ని పరిమిత నిర్వచనం నుంచి విస్తృత భావనగా మార్చడంలో మరో ముఖ్యమైన మైలురాయి. యూఎన్‌సీఆర్‌పీడీను భారతదేశం 2007లో ఆమోదించింది. ఈ కన్వెన్షన్‌తో అంగవైకల్యం లేదా వికలాంగులు అనే పదాల భావనలే పూర్తిగా మారిపోయాయి. దీని ప్రకారం - అంగ వైకల్యం అంటే కేవలం వైద్యపరమైన కోణంలోనే చూడటం అనే ధోరణి మారింది. అంటే.. నడవడం, మాట్లాడటం, వినడం, చూడటం లాంటివి చేయలేనివారు మాత్రమే వికలాంగులు కాదు. యూఎన్‌సీఆర్‌పీడీలోని ఆర్టికల్ 1 ప్రకారం- దీర్ఘకాలిక శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, మేధోపరమైన వైకల్యం, బుద్ధిమాంద్యం తదితర సమస్యలతో బాధపడుతూ, సామాజికంగా అన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకోలేని వారిని కూడా వైకల్యం ఉన్నవారిగా గుర్తించారు. ఈ విధంగా అంగ వైకల్యం భావన పరిధిని విస్తరించారు. విశాల దృక్పథం, సమ్మిళిత ఆలోచనలతో అంగ వైకల్యం నిర్వచనాన్ని మార్పు చేశారు. అంగ వైకల్యం అంటే కేవలం శారీరక వైకల్యమే కాదు ఇతర వైకల్యాలను కూడా పరిగణించాలనే భావనతో డిజేబిలిటీ అనే పదాన్ని విస్తృతం చేశారు. సామాజిక దృక్పథంలో.. వైకల్యం ఉన్న వారి విషయంలో న్యాయపరమైన విధానాలను, సామాజిక వ్యవస్థను సమూలంగా మార్పు చేయాలని యూఎన్‌సీఆర్‌పీడీ సూచించింది. యూఎన్‌సీఆర్‌పీడీ ఆర్టికల్ 23.. వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కుటుంబంతో కలిసి జీవించే హక్కు, సమాజంలో అందరితో కలిసి జీవించే హక్కులను, తనకు సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే హక్కులను ఉద్ఘాటించింది. ముఖ్యంగా బుద్ధి మాంద్యం లాంటి మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సంబంధించి న్యాయపరమైన సామర్థ్యాలు, హక్కుల గురించి ప్రస్తావించింది. దీనికి సంబంధించి ప్రత్యేక విధానాన్ని కూడా రూపొందించింది. వాస్తవానికి అప్పటి వరకు బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారిని నిర్ణయాలు తీసుకోలేని వారిగా పరిగణించేవారు. ఈ క్రమంలో వారి అనుమతి లేకుండానే మానసిక చికిత్స కేంద్రాల్లో చేర్పించడం, ఆ కేంద్రాల్లో అమానవీయ, అత్యంత హానికరమైన చికిత్సలను చేయించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూఎన్‌సీఆర్‌పీడీ వికలాంగులకు మరో ముఖ్యమైన హక్కును కల్పించింది. దీని ప్రకారం ఒప్పందాలు చేసుకోవడం, వివాహం, ఆస్తుల వ్యవహారాలకు సంబంధించి నిర్ణయం తీసుకునే హక్కులు వారికి లభించాయి. యూఎన్‌సీఆర్‌పీడీలోని ఆర్టికల్ 3, 6లలో వికలాంగ మహిళల హక్కులను పొందుపర్చారు. దీని ప్రకారం అప్పటి వరకు వికలాంగ మహిళలు తమ కుటుంబంలో, సమాజంలో ఎదుర్కొంటున్న పలు వివక్షలను గుర్తించి వాటి నుంచి విముక్తి పొందే హక్కు కలిగింది. యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత భావన నేపథ్యంలో.. దేశంలో ఇప్పటికే ఉన్న పీడబ్ల్యూడీ చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవానికి పీడబ్ల్యూడీ చట్టం అనేక వైకల్యాలను విస్మరించింది. వైకల్యం ఉన్న వ్యక్తులు తమకున్న సామర్థ్యాలకు అనుగుణంగా పనిచేయగల అవకాశాలు, వసతులు కల్పించే విధానాలు ఈ చట్టంలో లేవు. ముఖ్యంగా అవివక్ష అనే నిబంధన లేదు. ఇలా కొన్ని అసంపూర్ణ విధానాలతో ఉన్న పీడబ్ల్యూడీ చట్టాన్ని యూఎన్‌సీఆర్‌పీడీకి అనుగుణంగా మార్చాలని, నిబంధనల్లో మార్పులు చేయాలని లేదంటే కొత్త చట్టాన్ని సైతం రూపొందించాలని డిమాండ్లు, అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మారిన దృక్పథం


యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత నిర్వచనం నేపథ్యంలో.. అంగవైకల్యం ఉన్న వ్యక్తుల సంక్షేమం కోసం కొత్త బిల్లు రూపొందించేందుకు 2011 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కొత్త బిల్లులో అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు కల్పించే హక్కులను కేవలం వైద్య సంబంధంగానే చూడకుండా సామాజిక దృక్పథంతో చూసేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా వారు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షకు పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నారు. వైకల్యాన్ని వైద్యపరమైన కోణంలో చూస్తూ వైద్య సహకారం అవసరమని భావించే దృక్పథం నుంచి.. కొత్తగా సామాజిక కోణాన్ని కూడా స్పృశించడం వికలాంగులకు ఎదురవుతున్న వివక్షను దూరం చేస్తుందని భావించొచ్చు. యూఎన్‌సీఆర్‌పీడీ ఫలితంగా అంగవైకల్యం అనే భావన విషయంలో ఉన్న మార్పు వచ్చింది. వారిని కూడా ఇతరుల మాదిరిగానే చూడటం మొదలైంది. వారి సామర్థ్యాల మేరకు అవకాశాలు కల్పించే విధానం ఆరంభమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పలు పథకాల్లో సైతం ఇది ప్రతిబింబిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అంగవైకల్యం ఉన్న వారికి కూడా వర్తింపజేయడాన్ని దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. న్యాయస్థానాలు కూడా వికలాంగుల హక్కులను పరిరక్షించే విషయంలో యూఎన్‌సీఆర్‌పీడీ భావనలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఇలా వివిధ రకాల చర్యల ఫలితంగా ఇప్పుడు అంగవైకల్యం ఉన్న వ్యక్తుల హక్కుల పరిధి విస్తృతమైంది!!

గుర్తుంచుకోండి..

- విద్య, ఉద్యోగాలు, సామాజిక, రాజకీయ రంగాల్లో వికలాంగులకు ఎదురవుతున్న వివక్షతను నివారించే లక్ష్యంతో 1992 నుంచి ఏటా డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల సంక్షేమం దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.
- భారతదేశంలో 2001 నుంచి 2011 మధ్య కాలంలో వికలాంగుల సంఖ్య 22.4 శాతం పెరిగింది.
- 2001లో భారత్‌లో వికలాంగులు 2.19 కోట్లు ఉంటే.. 2011లో ఆ సంఖ్య 2.68 కోట్లకు పెరిగింది. వీరిలో 1.5 కోట్ల మంది పురుషులు కాగా, 1.18 కోట్ల మంది మహిళలు ఉన్నారు.
- పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది వికలాంగులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 69.4 శాతం మంది వికలాంగులు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 30.6 శాతం మంది ఉన్నారు.
- అంగవికలుర పెరుగుదల రేటు మాత్రం గ్రామాల్లో కంటే పట్టణాల్లో అధికంగా ఉంది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం- మొత్తం వికలాంగుల్లో.. 20.3 శాతం మంది చాలన వైకల్యం(మూమెంట్ డెజెబిలిటీ)తో, 18.9 శాతం మంది వినికిడి సమస్య(హియరింగ్ ఇంపేయిర్డ్)తో, 18.8 శాతం మంది దృష్టి సమస్య(విజువల్లీ ఇంపేయిర్డ్)తో, 5.6 శాతం మంది బుద్ధిమాంద్యం(మెంటల్లీ చాలెంజ్డ్)తో బాధపడుతున్నారు.
- గతంలో పోలియో కారణంగా ఎక్కువ మంది చాలన వైకల్యం బారిన పడితే.. 2001-2011 మధ్య కాలంలో రోడ్డు, పారిశ్రామిక ప్రమాదాలతో ఎక్కువ మంది చాలన వైకల్యానికి గురవడం గమనార్హం.

బయాలజీ - మెథడాలజీ (ఎస్‌ఏ)

ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్

- జీవశాస్త్ర బోధన లక్ష్యాలంటే విషయ పరిజ్ఞానం మాత్రమే కాదు. విద్యార్థుల్లో సామర్థ్యాలు, నైపుణ్యాలు, అభిరుచులు పెంపొందించడంతోపాటు సమస్యా పరిష్కారం, ప్రయోగాత్మక వివరణ మొదలైనవి కూడా లక్ష్యాలే. ఇవన్నీ ప్రయోగశాలలోనే సాధ్యమవుతాయి.
- ప్రయోగాలు చేయడం ద్వారా నేర్చుకోవడం సాధ్యమవుతుంది. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రయోగశాలలో ధ్రువీకరించుకోవచ్చు.
- **ఆవశ్యకత:** పరిశీలించేందుకు, పరీక్షించడానికి, మూఢ నమ్మకాలు తొలగించుకొని శాస్త్రీయ దృక్పథం ఏర్పర్చుకోవడం.
- పరిశీలించిన, పరీక్షించిన అంశాలు జీవితాంతం గుర్తుంచుకోవడం.
- అభిరుచులు, ఆసక్తి, కుతూహలం, ఆలోచన పెంపొందించుకోవడం.
- శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ.
- ప్రయోగాల్లో ఇబ్బందులు ఎదుర్కోవడం వల్ల నిజ జీవితంలో సమస్యా పరిష్కారం కోసం.
- సహకారం, ఓర్పు, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, నిర్భయత, నిష్పాక్షికత, వైఖరులు వంటి భావావేశ రంగ లక్ష్యాల సాధన.
- నైపుణ్యాల అభివృద్ధి.
- పరిశీలన అలవాట్ల అభివృద్ధి
- కష్టపడి పనిచేసే తత్వం, పనిపట్ల గౌరవం ఏర్పడటం
- సృజనాత్మకత పెరుగుదల.

ప్రయోగశాల: తరగతిలోని విద్యార్థులు వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రయోగాలు చేయడానికి ఉపకరించే ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద గదిని ప్రయోగశాల అంటారు.

ప్రయోగశాల రూపకల్పనలో పరిగణించే అంశాలు

- విద్యా జాతీయ లక్ష్యాలు - (దేశానికి ఉపయోగపడే ప్రయోగాలు చేయడం).
- పాఠ్యప్రణాళికా రకం
- ప్రయోగాలు చేసే విద్యార్థుల సంఖ్య
- ఒక్కొక్క విద్యార్థికి కనీస స్థలం
- తరగతి స్థాయి
- బోధన లక్ష్యాలు
- పొదుపును పాటించే విధం

ప్రయోగశాల రకాలు: నాలుగు రకాలైన ప్రయోగశాలలుంటాయి.

1. ఉపన్యాస గది - ప్రయోగశాల
2. సర్వప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస ప్రయోగశాల
4. సంచార ప్రయోగశాల

1. ఉపన్యాస గది - ప్రయోగశాల

- ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలు చేయడానికి పొదుపుతో కూడిన ఈ ప్రయోగశాలను డా॥ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించారు.
- $45' \times 25'$ కొలతలు కలిగి సగం ప్రయోగశాల, సగం తరగతి గది వేరు చేసి ఉంటాయి. 40 మంది తరగతి బోధన వినడానికి, 20 మంది ప్రయోగాలు చేయడానికి సరిపోతుంది.
- గోడలకు వెల్ల వేయడం కంటే పెయింట్ వేసి ఉండాలి.
- ప్రయోగశాల ఫ్లోరింగ్ కొంచెం ఏటవాలుగా ఉండి మూలాలు వంపు తిరిగి ఉండాలి. (దుమ్ము, ధూళి, బూజు నివారించడానికి)
- ప్రయోగశాలకు 2 తలుపులుండాలి.
- $6' \times 4'$ కొలతలో కిటికీలు, తలుపులు బయటకు తెరుచుకునేటట్లు ఉండాలి. కిటికీలకు వైర్‌గేజ్, తెరలు అమర్చాలి.
- $10' \times 4'$ కొలతలతో నల్లబల్ల
- $6 \times 2.5' \times 2.5'$ కొలతలతో ప్రదర్శనా బల్ల (ఉపాధ్యాయుడు ప్రయోగం చేసి చూపించడానికి)
- $3\frac{1}{2}' \times 1\frac{1}{2}' \times 1'$ కొలతలతో విద్యార్థుల బల్ల (ఇది ఇద్దరు విద్యార్థులకు)
- ప్రయోగ బల్లలు 10 ఉండాలి.
- ప్రదర్శన బల్లకు సీసపు పూత పూసి ఉండాలి.
- గోడలకు సింక్‌లుండాలి. వేయి గ్యాలన్ల నీరు నిల్వ చేసే ట్యాంక్ ఉండాలి.
- $6' \times 3\frac{1}{2}' \times 2'$ కొలతలతో విద్యార్థుల ప్రయోగ బల్ల ఉండాలి.

2. సర్వప్రయోజన ప్రయోగశాల

- సామాన్య విజ్ఞాన శాస్త్ర లక్ష్యాలకు అనుగుణంగా అధ్యయనం, అభ్యాసం రెండూ జరిగే విధంగా ఉండే ప్రయోగశాల.
- ప్రత్యేక సబ్జెక్టుల బోధనకు ఇది ఉపయోగపడదు.
- $47' \times 25'$ కొలతలు కలిగి $7' \times 25'$ కొలతలతో సామాన్ల నిల్వ గది వేరు చేసి ఉండాలి.
- 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- $6 \times 2 \times 2\frac{1}{2}$ విద్యార్థుల బల్ల $4' \times 1\frac{1}{2}' \times 3\frac{1}{2}'$ కొలతలతో ఉపాధ్యాయుని ప్రదర్శన బల్ల ఉంటాయి.
- గోడల మందం $1\frac{1}{2}$ అడుగులు ఉండి అల్మరాలు గోడలోనికి ఉంటాయి.
- సున్నితపు త్రాసు, ప్రమాదకర రసాయనాలు, అక్వేరియాలు 'రిసెస్‌షెల్ఫ్‌'లలో ఉంచుతారు.

3. ఉపన్యాస ప్రయోగశాల

- యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల మేరకు శాస్త్రీయ విద్యా ప్యానెల్ వారు మాధ్యమిక పాఠశాలల కోసం దీన్ని రూపొందించారు.
- ఉపన్యాసం, ప్రయోగం రెండూ ఒకే గదిలో జరుగుతాయి.
- ప్రయోగశాల.. పాఠశాలలో నేల అంతస్తులో ఉండాలి.
- ఒక మూలకు ఉండి ఉత్తర, దక్షిణాభిముఖంగా నిర్మితమై ఉండాలి. (గాలి, వెలుతురు వచ్చే విధంగా)
- జీవశాస్త్ర ప్రయోగశాల బడి తోటకి ఆనుకొని ఉండాలి.
- 825 చ.అ॥ ప్రయోగశాల 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- 42 మంది కంటే ఎక్కువ ఉంటే 490 చ॥అ కొలతలతో ల్యాబ్ - బి నిర్మించాలి.
- ల్యాబ్ - 'ఎ'లో రసాయన శాస్త్ర ప్రయోగాలు, ల్యాబ్ - 'బి'లో భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ప్రయోగాలు జరగాలి.
- యునెస్కో సూచనల మేరకు నల్లబల్లకు ఆకుపచ్చ లేదా ముదురు గోధుమ రంగు వేయాలి.

4. సంచార ప్రయోగశాల

- NCERT సూచనలతో నిర్మితమైంది. ప్రయోగశాలలు లేని ఒకటి కంటే ఎక్కువ పాఠశాలలకు ఉపయోగపడే ప్రయోగశాల.
- ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద మోటారు వాహనం వివిధ పాఠశాలలకు వెళ్లి ప్రయోగాలు చూపించే వీలుంటుంది.
- ఇందులో ప్రయోగ నైపుణ్యం కలిగిన నిపుణులు ప్రయోగం చేసి చూపెడతారు.

గత డీఎస్సీలలో అడిగిన ప్రశ్నలు

1. డా॥ ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ఉపన్యాస గది ప్రయోగశాల ప్లాన్ ప్రకారం డిమానిస్ట్రేషన్ టేబుల్‌తో కలిపి ప్రాక్టికల్ టేబుళ్ల సంఖ్య? (డీఎస్సీ-2012)
   1) 7 2) 4 3) 5 4) 6
2. 20 మంది విద్యార్థులకు అనువైన ప్రయోగశాల పరిమాణం? (డీఎస్సీ-2006)
   1) $35' \times 15'$ 2) $25' \times 10'$
   3) $20' \times 15'$ 4) $45' \times 25'$
3. జీవశాస్త్రానికి కుటీర పరిశ్రమలతో, సామాజిక, భౌతిక పర్యావరణంతో సహ సంబంధాన్ని కల్పించేది? (డీఎస్సీ-2006)
   1) ప్రయోగశాల సూచికలు
   2) బోధన సూచికలు
   3) జీవశాస్త్ర పాఠ్యపుస్తకం
   4) జీవశాస్త్ర ప్రయోగశాల
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమైక్య పాఠ్య ప్రణాళికను అనుసరించి జీవశాస్త్ర బోధనకు కావాల్సిన అక్వేరియాల సైజులు? (డీఎస్సీ-2004)
   1) $38'' \times 38'' \times 24''$, $44'' \times 32'' \times 20''$
   2) $8'' \times 8'' \times 2''$, $14'' \times 10'' \times 5''$
   3) $28'' \times 28'' \times 14''$, $34'' \times 22'' \times 10''$
   4) $18'' \times 18'' \times 12''$, $24'' \times 12'' \times 5''$
5. యునెస్కో ప్లానింగ్ కమిషన్ నిపుణుల నివేదికను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ విద్యాప్యానెల్ 1964లో రూపొందించిన సూచనల ప్రకారం మాధ్యమిక పాఠశాలల్లోని ప్రయోగశాలలో ఉపాధ్యాయుడి బల్ల పరిమాణం ఎంత ఉండాలి?
   1) $6' \times 2' \times 2'$ 2) $8' \times 4' \times 4'$
   3) $8' \times 2.6' \times 2.9'$ 4) $6 \times 2.6 \times 2.9$

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4; 4) 4; 5) 3.

మాదిరి ప్రశ్నలు

1. శాస్త్రం పట్ల నమ్మకం కలగడానికి విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడేది?
   1) ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడం
   2) గ్రంథాలయాలకు వెళ్లడం
   3) ప్రయోగాలు చేయడం
   4) విజ్ఞాన శాస్త్ర విషయాలు వల్లె వేయడం
2. ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ప్రయోగశాల రకం?
   1) ఉపన్యాస గది - ప్రయోగశాల
   2) సంచార ప్రయోగశాల
   3) జీవశాస్త్ర ప్రయోగశాల
   4) సర్వ ప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస గది - ప్రయోగశాల ఎంతమంది విద్యార్థుల ప్రయోగాచరణకు ఉపకరిస్తుంది?
   1) 40 2) 20 3) 30 4) 10
4. 2 నుంచి 3 శాతం చక్కెర ద్రావణంతో ఫార్మలిన్ కలిపి ప్రయోగశాలలో చల్లడం వల్ల వేటిని నివారించవచ్చు?
   1) దోమలు
   2) ఎలుకలు
   3) బొద్దింకలు
   4) ఈగలు
5. $47' \times 25'$ కొలతలు కలిగిన ప్రయోగశాల ఏ రకమైంది?
   1) సంచార ప్రయోగశాల
   2) ఉపన్యాస గది ప్రయోగశాల
   3) సర్వప్రయోజన ప్రయోగశాల
   4) ఉపన్యాస ప్రయోగశాల
6. ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?
   1) భవనంపై అంతస్తు
   2) 2వ అంతస్తుపైన
   3) పాఠశాల మధ్య గదిలో
   4) నేల అంతస్తులో ఒక చివర
7. ప్రయోగశాలలో ప్రతి విద్యార్థికి ఉండాల్సిన సగటు స్థలం
   1) 100 చ.అ. 2) 15 చ.అ.
   3) 60 చ.అ. 4) 30 చ.అ.
8. ఉపన్యాస ప్రయోగశాలలో $7' \times 25'$ కొలతలతో ఉండే గది ప్రయోజనం?
   1) ఉపన్యాస గది
   2) ప్రయోగ నిర్వహణ
   3) నిల్వ సన్నాహక గది
   4) ఉపాధ్యాయుడి విశ్రాంతి కోసం
9. ప్రయోగశాల రూపకల్పనలో పరిగణనలోనికి తీసుకోని అంశం?
   1) పొదుపు 2) పాఠ్యప్రణాళిక
   3) ఉపాధ్యాయుని అభీష్టం
   4) తరగతి స్థాయి
10. కింది వాటిలో ప్రయోగశాల కొలతలకు సంబంధించి సరికాని జత?
    i) ఉపన్యాస ప్రయోగశాల - $47' \times 25'$
    ii) సర్వ ప్రయోజన ప్రయోగశాల - $45' \times 25'$
    iii) ఉపన్యాస గది - ప్రయోగశాల - 825 చ.అ.
    iv) సన్నాహక నిల్వ గది - $7' \times 25'$
    1) i, iii 2) i, ii
    3) ii, iii 4) iii, iv
11. కిందివాటిలో ఏ ప్రయోగశాలను యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల నుంచి రూపొందించారు?
    1) సంచార ప్రయోగశాల
    2) ఉపన్యాస - గది ప్రయోగశాల
    3) ఉపన్యాస ప్రయోగశాల
    4) సర్వప్రయోజన ప్రయోగశాల
12. సాధారణంగా ప్రయోగశాలలో ఉండే నల్లబల్ల పరిమాణం?
    1) $6' \times 4'$ 2) $10' \times 4'$
    3) $4' \times 8'$ 4) $8' \times 6'$
13. నల్లబల్లకు ముదురు ఆకుపచ్చ రంగు వేయాలనేది వీరి సూచన?
    1) UNICEF
    2) NCERT
    3) SCERT
    4) UNESCO
14. ప్రయోగశాల కిటికీలకు తెరలు బిగించాలి. ఎందుకంటే?
    1) కీటకాలు రాకుండా
    2) ఇతరులు ప్రయోగాలు చూడకుండా
    3) అవసరమైనప్పుడు చీకటి గది చేసేందుకు
    4) విద్యార్థుల్లో ఏకాగ్రత కోసం
15. ప్రమాదకర రసాయనాలు ఉంచడానికి కేటాయించిన ప్రదేశం?
    1) నీటి ట్యాంక్ 2) సన్నాహక గది
    3) రిసెస్ షెల్ఫ్
    4) ఉపాధ్యాయుడి ప్రదర్శన బల్ల

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 3; 10) 2; 11) 3; 12) 2; 13) 4; 14) 3; 15) 3.

గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పు రేటును త్వరణం అంటారు. వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు. వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు. ఈ శాస్త్రానికి పితామహుడు అరిస్టాటిల్.

లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?

యాంత్రిక శాస్త్రం

- వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు.
- ఈ శాస్త్రానికి పితామహుడు అరిస్టాటిల్.
  రేఖీయ చలనం: ఒక వస్తువు సరళరేఖా మార్గంలో ప్రయాణిస్తే దాన్ని రేఖీయ చలనం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో కదులుతున్న బస్సు, రైలు రేఖీయ చలనాన్ని కలిగి ఉంటాయి.

ప్రాథమిక అంశాలు

దూరం: గమనంలో ఉన్న వస్తువు ప్రయాణించిన మార్గాన్ని దూరం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్

స్థానభ్రంశం: ఒక వస్తువు స్థానం, తుదిస్థానాలను కలిపే సరళరేఖను స్థానభ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్

- దూరం అనేది అదిశరాశి. ఎందుకంటే దూరం అనే భౌతిక రాశికి కేవలం పరిమాణం మాత్రమే ఉంటుంది. దిశ ఉండదు.
- స్థానభ్రంశం అనేది సదిశరాశి. ఈ భౌతికరాశికి పరిమాణం, దిశ ఉంటాయి.

దూరం, స్థానభ్రంశాల మధ్య సంబంధాలు

- ఒక వస్తువు వృత్తాకార మార్గంలో ఒక భ్రమణం పూర్తిచేసిన తర్వాత అది ప్రయాణించే దూరం వృత్త పరిధికి సమానం.
  $S = 2\pi r$
  కానీ స్థానభ్రంశం శూన్యంగా ఉంటుంది.
  $\therefore \overline{S} = 0$
- ఎందుకంటే ఈ సందర్భంలో వస్తువు తొలి, తుదిస్థానాలు ఒకదానితో మరొకటి ఏకీభవిస్తాయి.
- ఒకవేళ వస్తువు వృత్తాకార మార్గంలో అర్ధభ్రమణాన్ని పూర్తి చేసిన తర్వాత అది ప్రయాణించే దూరం $S = \pi r$, స్థానభ్రంశం $S = 2r$ వృత్త వ్యాసానికి సమానంగా ఉంటాయి.
- నిట్టనిలువుగా పైకి విసిరిన వస్తువు కొంత ఎత్తుకు వెళ్లి తిరిగి తన యథాస్థానానికి చేరుతుంది. అప్పుడు వస్తువు ప్రయాణించిన దూరం
  $S = 2h$; కానీ $\overline{S} = 0$
- ఒక వస్తువు సరళ రేఖా మార్గంలో ప్రయాణిస్తే.. అది ప్రయాణించే దూరం, పొందిన స్థానభ్రంశం పరస్పరం సమానంగా ఉంటాయి.

$S = \overline{S}$ (లేదా) $\frac{S}{\overline{S}} = 1$

- ఒక వస్తువు క్రమరహిత మార్గంలో చలిస్తే అది ప్రయాణించిన దూరం, స్థానభ్రంశం కంటే ఎక్కువగా ఉంటుంది.

$S > \overline{S}$

∴ ఒక వస్తువు ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశానికి సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకానీ వస్తువు ప్రయాణించిన దూరం స్థానభ్రంశం కంటే ఎట్టిపరిస్థితుల్లో తక్కువగా ఉండదు.

వడి: గమనంలో ఉన్న వస్తువు నిర్దేశిత కాలంలో ప్రయాణించిన దూరాన్ని వడి అంటారు.

వడి(V) $= \frac{S}{t}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ లేదా మీ./సెకన్

వడి అనేది అదిశరాశి

వేగం: గమనంలో ఉన్న ఒక వస్తువు నిర్దేశిత కాలంలో పొందిన స్థానభ్రంశాన్ని వేగం అంటారు.

వేగం $\vec{V} = \frac{\vec{S}}{t}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ (లేదా) మీ./సెకన్

వేగం అనేది సదిశరాశి

త్వరణం: గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పు రేటును త్వరణం అంటారు.

$\bar{a} = \frac{V_2 - V_1}{t_2 - t_1}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్^{2} (లేదా) మీ./సెకన్^{2}

త్వరణాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు

1. **ధన త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు పెరిగితే దాన్ని ధన త్వరణం అంటారు.
2. **రుణ త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు తగ్గితే దాన్ని రుణ త్వరణం అంటారు.

- ఒక వస్తువు విరామస్థితిలో ఉన్నప్పుడు
  $(\vec{V} = 0)$ లేదా
  సమాన వేగంతో కదులుతున్నప్పుడు
  $(\vec{V_1} = \vec{V_2} = \vec{V_3} = ...)$
  ఆ వస్తువు త్వరణం శూన్యం.

రేఖీయ ద్రవ్యవేగం: గమనంలో ఉన్న వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధాన్ని రేఖీయ ద్రవ్యవేగం అంటారు.

$\vec{P} = M \times V$

ప్రమాణాలు : గ్రామ్.సెం.మీ/సెకన్. లేదా కిలోగ్రామ్. మీటర్/సెకన్

- రేఖీయ ద్రవ్యవేగం సదిశరాశి.

బలం: ఒక వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించేదాన్ని బలం అంటారు.

బలం $\vec{F} = m\vec{a}$

m → ద్రవ్యరాశి

$\vec{a}$ → త్వరణం

ప్రమాణాలు : డైన్, న్యూటన్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

1 న్యూటన్ = 10^5 డైన్స్

- బలం గురించి న్యూటన్ అధ్యయనం చేసి దాన్ని రెండు రకాలుగా వర్గీకరించారు.

అంతర్గత బలం: ప్రతి వస్తువు లేదా వ్యవస్థ లోపల ఉన్న బలాలను అంతర్గత బలాలు అంటారు. ఈ బలం వల్ల వస్తువు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదని న్యూటన్ ప్రతిపాదించారు.

ఉదా : ఒక బస్సు లోపల ఉన్న ప్రయాణికులు తమ ఎదుటి సీట్లపై బలాలను ప్రయోగించినప్పుడు ఆ బస్సు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు.

బాహ్యబలం: ఒక వస్తువు మరో వస్తువుపై ప్రయోగించే బలాన్ని బాహ్యబలం అంటారు.

- ఈ బలం వల్ల వస్తువు స్థితిలో మార్పు రావచ్చు. లేదా మార్పు రావడానికి ప్రయత్నించవచ్చు.

న్యూటన్ గమన నియమాలు

వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు.

మొదటి నియమం లేదా జడత్వ నియమం

- బాహ్యబలాన్ని ప్రయోగించనంత వరకూ విరామ స్థితిలో ఉన్న వస్తువు విరామ స్థితిలో, గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో రుజు మార్గంలో కదులుతుంది.
- ప్రతి వస్తువుకు సహజసిద్ధంగా ఏర్పడే జడత్వం అనే ధర్మం ఉంటుందని మొదటి నియమం వల్ల తెలుస్తోంది. అందుకే ఈ నియమాన్ని జడత్వ నియమం అంటారు.

జడత్వం: ఒక వస్తువు తనంతట తానుగా తన స్థితిని మార్చుకోలేని అశక్తతను లేదా ధర్మాన్ని జడత్వం అంటారు. ఈ ధర్మం వస్తువుల ద్రవ్యరాశిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ద్రవ్యరాశి పెరిగితే జడత్వం కూడా పెరుగుతుంది.

ప్రమాణాలు : గ్రామ్ లేదా కిలోగ్రామ్



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

జడత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విరామ జడత్వం:** విరామస్థితిలో ఉన్న ఒక వస్తువు తనంతట తానుగా తన విరామ స్థితిని మార్చుకోలేని అశక్తతను విరామ జడత్వం అంటారు.
2. **గమన జడత్వం:** గమనంలో ఉన్న వస్తువు తనంతట తానుగా తన గమన స్థితిని మార్చుకోలేని అశక్తతను గమన జడత్వం అంటారు.

ఉదా : గమనంలో ఉన్న బస్సుకు అకస్మాత్తుగా బ్రేకులువేసి ఆపినప్పుడు దానిలోపల ఉన్న ప్రయాణికులు గమన జడత్వం వల్ల ముందుకు తూలుతారు.

3. **దిశా జడత్వం:** ఒక వస్తువు తనంతట తానుగా తన దిశను మార్చుకోలేని అశక్తతను దిశా జడత్వం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో ప్రయాణిస్తున్న బస్సు మలుపు తిరుగుతున్నప్పుడు అందులోని ప్రయాణికులు జడత్వం వల్ల పక్కకు తూలుతారు.

న్యూటన్ రెండో గమన నియమం

ఒక వస్తువుపై ప్రయోగించిన బలాన్ని లెక్కించడానికి కావలసిన సమీకరణాన్ని న్యూటన్ రెండో నియమం నుంచి పొందవచ్చు.

బలానికి సమీకరణం $F = ma$

- ఒక వస్తువు విరామ స్థితిలో ఉన్నప్పుడు లేదా సమవేగంతో కదులుతున్నప్పుడు దాని త్వరణం శూన్యం. కాబట్టి ఆ వస్తువుపై ఉన్న బలం $F = ma = m \times 0 = 0$ $(a = 0)$

న్యూటన్ మూడో గమన నియమం

చర్యకు సమానమైన వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది. చర్య= - ప్రతిచర్య

చర్య+ ప్రతిచర్య = 0

- ఈ నియమం ప్రకారం చర్య, ప్రతిచర్య అనేవి పరస్పరం సమానంగా ఉండి, వ్యతిరేక దిశలో ఎల్లప్పుడూ జంటగా ఉంటాయి.

ఉదా: రబ్బర్ బంతిని గోడకు విసిరితే, అది గోడపై కలుగజేసే బలాన్ని చర్య అంటారు. ప్రతిచర్యగా గోడ కూడా అంతే బలాన్ని బంతివైపు వ్యతిరేక దిశలో ప్రయోగిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. న్యూటన్ ఎన్నో గమన నియమాన్ని జడత్వ నియమం అంటారు?
   ఎ) మొదటి బి) రెండో
   సి) మూడో డి) పైవన్నీ
2. బైకు, కారు, బస్సుల్లో దేనికి జడత్వ ఎక్కువ?
   ఎ) బైకు బి) కారు
   సి) బస్సు డి) పైవన్నీ
3. గమనంలో ఉన్న వస్తువుకు ఏ భౌతిక రాశి ఉంటుంది?
   ఎ) వేగం బి) రేఖీయ ద్రవ్యవేగం
   సి) గతిజ శక్తి డి) పైవన్నీ
4. బాంబు విస్ఫోటం, తుపాకీ పని చేయడంలో ఏ నిత్యత్వనియమం ఇమిడి ఉంది?
   ఎ) న్యూటన్ మూడో గమన నియమం
   బి) రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
   సి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
   డి) కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
5. జడత్వం ప్రమాణం?
   ఎ) గ్రామ్ బి) కిలోగ్రామ్
   సి) పౌండ్ డి) పైవన్నీ
6. అంతర్గత బలం వల్ల గమనంలో ఉన్న వస్తువు వేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు డి) రెండింతలు అవుతుంది
7. ఏ ప్రక్షిప్త కోణం వద్ద ప్రక్షేపకం గరిష్ట వ్యాప్తిని పొందుతుంది?
   ఎ) 30° బి) 45° సి) 90° డి) 120°
8. 'బలం' అంతర్జాతీయ ప్రమాణం?
   ఎ) న్యూటన్ బి) డైన్
   సి) కి.గ్రా., మీ/సె^{2} డి) గ్రా., సెం.మీ/సె^{2}
9. కింది వాటిలో అత్యంత గరిష్ట బలం?
   ఎ) అయస్కాంత బలం బి) ఘర్షణ బలం
   సి) గురుత్వాకర్షణ బలం
   డి) కేంద్రక బలం
10. ఎక్కువ ప్రాధాన్యం ఉన్న న్యూటన్ గమన నియమం?
    ఎ) మొదటి బి) రెండో
    సి) మూడో డి) పైవన్నీ
11. ప్రక్షేపకం ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
    ఎ) రుజు బి) వృత్తాకార
    సి) పరావలయ డి) దీర్ఘవృత్తాకార
12. న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా పనిచేసేది?
    ఎ) రాకెట్ బి) క్షిపణి
    సి) యుద్ధ విమానం డి) పైవన్నీ
13. ఒక వస్తువుపై ఎక్కువ బలాన్ని అధిక కాలవ్యవధిలో ప్రయోగిస్తే దానిపై ప్రచోదన ప్రభావం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) శూన్యం డి) అనంతం
14. లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్ బి) రూథర్‌ఫర్డ్
    సి) పాస్కల్ డి) ఓటిస్
15. పైకి కదులుతున్న లిఫ్ట్‌లోని వ్యక్తి చర్య, ప్రతి చర్యలు అనేవి?
    ఎ) సమానం బి) చర్య ఎక్కువ
    సి) ప్రతిచర్య ఎక్కువ డి) ప్రతిచర్య శూన్యం

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) బి; 5) డి; 6) సి; 7) బి; 8) ఎ; 9) డి; 10) బి; 11) సి; 12) డి; 13) బి; 14) డి; 15) సి.

Education is a strong instrument..

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
1) play golf and other outdoor games
2) watch television and engage yourself
3) if outside choose a safe shelter
4) stay in water
5) stay on a hilltop

2. How should you react to a child's fright over lightning?
1) give strict warning to them
2) try to shout at them and control the things
3) try to hide in a secret place
4) ridicule them
5) calm them by telling a story

3. What kind of structures does lightning generally strike?
1) projections of some height
2) nature's fireworks
3) gambling joint
4) a low building protected by a grove of trees
5) indoors

4. The meaning of **scoot** is
1) crawl 2) creep
3) poke 4) hurry 5) haze

5. The synonym of **vulnerable** is
1) Inclination 2) week
3) experience 4) susceptible
5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
1) untreated, unsightly
2) artfully, dismal
3) openly, few
4) flagrantly, petty
5) hazy, cloudy

7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
1) ubiquitous, enjoyment
2) propitious, delight
3) sporadic, bliss
4) hedonistic, pleasure
5) omniscient, plain

8. The___of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
1) veracity, access
2) verbosity, entre
3) ambiguity, admission
4) validity, contact
5) opulence, grandeur



BANK EXAMS

GENERAL ENGLISH

9. Catching the earlier train will give us the _____ to do some shopping.
1) chance 2) luck
3) possibility 4) occasion
5) probable

10. David finally found the photographs, after hours spent _____ through drawers.
1) cavorting 2) haggling
3) rummaging 4) divagating
5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
1) are remain 2) will remained
3) will still remain
4) are remaining
5) No Correction required

12. It is ten years since I <u>have begun</u> living here.
1) begun 2) had begun
3) began 4) beginning
5) No Correction required

13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
1) striking 2) powerful
3) potent 4) proven
5) No Correction required

14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
1) appeared 2) took
3) undertook 4) prepared
5) No Correction required

15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
1) mind blank 2) eyes covered
3) hands full 4) hands tied
5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)

17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)

18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)

19. The man who is persistently hesitating (1)/ which of the two things (2)/ he will do first, (3)/ will do either. (4)/ No error (5)

20. The Manager (1)/ gave her his assurance (2)/ that the complaint (3)/ would be discharged. (4)/ No error (5)

21. Everyone felt (1) / that the big (2)/ glittering diamond (3) / was most unique. (4) / No error (5)

22. From all accounts (1) / I learn that (2) / he is the best and honest member (3) / of the new committee. (4) / No error (5)

23. A man entered the tavern (1) / and asked for (2)/ some bread and cheese (3) / with a decided foreign accent. (4) / No error (5)

24. A large scale exchange of nuclear weapons (1) / will produce (2)/ unprecedented amounts of radiation (3) / that can penetrate into the biological tissue. (4) / No error (5)

25. Several prominent figures (1) / involved in the scandal (2) / are required to appear (3) / to the investigation committee. (4) / No error (5)

Directions (Q. 26-30): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The meeting, the first such gathering in Iraq since the overthrow of Saddam Hussein four years ago, was intended to shore up support for the Iraq government.
B) The next one came six hours later.
C) Delegates from neighboring countries and elsewhere did not set a date for a second, higher-level gathering of foreign ministers and agreed only to establish working groups to focus on various issues.
D) When Iraq's chief delegate stood on a podium and ripped into US policy in Iraq
E) Clobbering hopes that the summit would prove an ice-breaker in the two countries chilly relations
F) On that front, it appeared to have been cordial but far from a resounding success.

26. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

27. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

28. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

29. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E

30. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A piece of writing, we have decided, _____ (31) from true forms of visual art in that you cannot respond to the effect of the _____ (32) in a single glance. In reading, the "viewer" has to work at seeing and understanding, for a page of print, _____ (33) at first apprehended by the eye, is fundamentally grasped by the mind _____ (34) the powers of interpretation, reasoning and analysis. But just as your vision can be educated so that _____ (35) respond more intelligently to a work of art, so your powers of interpretation, reasoning and analysis can be _____ (36) so that you respond more efficiently and _____ (37) rapidly to what a writer offers you on a page of print. This process _____ (38) refinement started years ago - when you first learned to read at the age of six or seven. It _____ (39) through elementary and high school and into your late adolescence. And then, possibly, it stopped, though there was _____ (40) much room for improvement.

31. 1) differs 2) vary 3) fluctuate
4) change 5) altered

32. 1) entire 2) whole 3) complete
4) total 5) intact

33. 1) while 2) how ever
3) though 4) still 5) despite

34. 1) during 2) from first
3) though 4) through 5) thorough

35. 1) yours 2) your' s
3) you are 4) your 5) you

36. 1) refined 2) superior 3) design
4) culture 5) experiences

37. 1) additional 2) more
3) extra 4) further 5) other

38. 1) off 2) from 3) of
4) offer 5) with

39. 1) continue 2) continues
3) continuing 4) continued
5) is continued

40. 1) very 2) silent 3) more
4) largely 5) still

Key

1) 3	2) 5	3) 1	4) 4	5) 4
6) 1	7) 4	8) 1	9) 1	10) 3
11) 3	12) 3	13) 2	14) 2	15) 5
16) 4	17) 5	18) 2	19) 4	20) 4
21) 4	22) 3	23) 4	24) 4	25) 4
26) 4	27) 5	28) 5	29) 1	30) 1
31) 1	32) 2	33) 3	34) 4	35) 5
36) 1	37) 2	38) 3	39) 4	40) 5